భారతి

మాసపత్రిక

*

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938-1972)

*

ఫిబ్రవరి 1977

సంపుటము : 54 సంచిక : 2

విడిపత్రిక వెల రూపాయిన్నర

*

విషయానుక్రమణిక

ఫిబ్రవరి 1977

ముత్యాల పంట

శ్రీ వెల్దుర్తి మాణిక్యరావు

సందె కసువులు
సల్లంగ దీసినాక
పడమటింటికి
భానుడు వెళ్ళినాక

ఆలమందలు
కొట్టాలు చేరినాక
ఇంటివారలు
అంబళ్ళు తాగినాక

నెగళ్ళ చుట్టు గూడి
పొగచుట్ట పీల్చినాక
తలపులు బిగించి
తలగడలమీద

తమ వారలెల్ల
తలలు వాల్చినాక
అదను గాచుక
అతివలు జారుకొనగ

*   *   *

కంచు గాగడా పెట్టి
వెదికినా దొరకనట్టి
అందగాడవని
రేరాజు నంచు

వలచి వచ్చిన
వలపు కన్నియ నరసి
పాలుపొంగెడి
వారి వయసుజాబి

పాలవెన్నెల
జలకమాడించి, నీవు
తెల్ల దుప్పటిరేకు
మెల్లంగ గప్పినావు

తిరిగివెళ్ళెడి
తరుణమ ఎన్నుగుత
మంచుముత్యాలు
తల[illegible]సినావు.

*   *

'ఉషా' బాలఊదెనో
ఉండబట్టలేక
'అరుణ'కోపాన
అందించెనో వార్త

చండకిరణుడు
మండిపడెను, అంత
కరిగిపోయెను
నీరుగారె మనసు

రాతిరంతగడిపి
సంతరించుకొన్న
చెలిమికలిమి
వలపు ముత్యాలపంట.

ఉషస్సు

శ్రీకృష్ణ

సమస్యల తోరణం

కాల ప్రవాహంలో
కవాటాల్ని తెఱ్చివేస్తూ
ఎన్నో యుగాలనించి
కళ్ళలో కాంతి లేక
కాళ్ళలో బలం రాక
నిర్విణ్ణంగా, నిర్వీర్యంగా
నిలబడిపోయిన ఈ తారలు
ఎన్నాళ్ళు
బ్రతుకుతాయి ?
కాలం చక్రాల్లో చితుకుతాయి ?
కాంతి మెరుపుల్ని వ్యర్థంగా వెతుకుతాయి ?

ఆశయాలు తీరక
ఆనందం లేక
జీవచ్ఛవాల్లా
నిరాశతో అలసి
కన్నీళ్ళలో తడిసినా
ఆరని ఈ జ్వాలలు
ఇంకా ఎన్నాళ్ళు
కుములుతాయి ?
బాధల తీవ్రతతో కములుతాయి ?
ఆవేదనతో నీళ్ళు నములుతాయి ?

కడుపు నిండక
కలలు పండక
ఆకలి అలవాటుగా
ఆశలు అవినీతిగా
మారి
అనుక్షణం రోదించే
అహర్నిశం శోషించే
గాలివాలు కాని
ఈ జీవితాలు
ఎన్నాళ్ళు సహిస్తాయి
ఆకలితో అలమటిస్తాయి
ప్రతిక్షణం చస్తాయి ?

ఆశాకిరణం

ఇవి పరిష్కారాలు లేని సమస్యలు కావు
ఇవి ఉషస్సు వికసించని రాత్రులు కావు
ఇవి ఆశకు తావులేని అమావాసలు కావు
ఇవి పాశం విడువలేని జీవితాలు కావు.

అనుభవం

సందర్శించే నేత్రం ఒకటే అయితే
సమస్యలకు పరిష్కారం ఒకటే.

పరిష్కారం

రోదించే ఈ తారలు
జ్వలించే రుద్ర నేత్రపు నెత్తుటి జీరలు
కుమిలే ఈ జ్వాలలు
రగిలే అరుణ వహ్నాగ్ని హేల
శోషించే జీవితాలు
శాసించే క్రాంతిపథ ప్రాభవాలు

అయినప్పుడు
ఉషస్సు ఉదయిస్తుంది
జీవితం వికసిస్తుంది.

సందేశం

బ్రతుకును భారంగా గడుపకు
నిరాశను నీ మదిలో నిలుపకు
వెలుగు చూసి కళ్ళు మూయకు
మెరుపును చూసి మోహపడకు

వెలుగుకోసం
ప్రాణం త్యజించు
ప్రశాంతంగా జ్వలించు
సమరంలో
విజృంభించు
దిగంతాలు దహించు.

నవ్వు

"సాంధ్యశ్రీ"

దినం అలసి సమీపించే
సాయం
సంధ్యకు నే
ప్రశాంతి తోటలా...
సంధ్య సమీరపు కదలికలోని
తొలి వెలుగులో
నా
బలోపేత భావాలనుండి
రొమ్ము చీల్చుకువచ్చిన
శకుంతాలు
కాంతి పయస్సులో
జలకాలాడే
తెలిమరుగు మేఘాల్ని దాటి
నీలిమలోని
చుక్కల్ని
ముక్కులతో పట్టుకొస్తాయి
నీ కోసం
పక్కల్లో, రెక్కల్లో పరుస్తాయి...!
శతాబ్దాలపాటు
పాడే
పికాన్ని
నీ ఊరోజాల మధ్య ఉంచే
చలి సాయంత్రం
వలపాన్ని నేస్తుంది
గాలితో...!

ఇంతలో...

మంచుతెల్లని
ఒక పావురం
వర్తమానం మోసుకొచ్చి
వర్తులాకారంగా
భ్రమించే
నా ఎదలో
ఒక చిత్రం గీస్తుంది
అది... నవ్వు...!

నిశ్శబ్ద మైత్రి

డా. ముకురాల రామారెడ్డి

ఎన్ని ఋతువులో నీరాక కెదిరిచూచి
మతిచెడితి నా దిరుసులను మార్చి మార్చి;
ఇపుడె కథ మొదలాయె, నాయికవు నీవు
లేవు—ముగియవు—ఇద్దరులేని కథలు.

రాత్రికే మచ్చుజల్లెడి రాజధాని
మిణుకువెలుగు తుఫానులో మనవిహారఘడియ,
అవె దాగుమూత చీకట్ల పొడలు,
కలియబడినవి నీచూపు వెలుగుతడలు,

తికమకెందుకు +
ఆ కాకరతీగ వెనికి గుడిసె వారిది,
పందిరి ఎడము చాలకనె సుమీ !
ఘరానాబాబుగారి 'శాంతిభవన' గాజుగోడకు
ఎక్కి పసుపువారె.

సమ్మెకసి, యజమానుల షరతు,
వెరసి ఏర్పడిన శిల్పమీ రాశి; ఎక్కిచూడు
ముసులబోకు,
శ్రీహరికోటనుండి మొగులుచూరు
కెగురగోరిన తెల్లచుక్కవుగద !

పాతది అంత భూతమయిపట్టెడిదే అని,
నాటుబాంబుతో జాతికి విద్యనేర్పుట పసందని;
కొత్తవి మంచినీళ్ళు మా పాతరలోనె ఉన్నవని;
పత్రికవేసిన గంటుశాస్త్ర నిర్నేతల,
వాదనిష్ఠల, ఘనిష్ఠల మూసిన ఉక్కుతల్పిదే.

మొగ్గతివె !
సిగలో మల్లెమొగ్గలు నను జిల్లుమని కొట్టినవి
వడగళ్ళవోలె

జేలుగోడల నడుమ బేడీలు విరుగు సవ్వడికె
సరిసరి ఇంత జడిసినావు !

రప్పమని ఆరిపోయిన లైటుబుడ్ల పుణ్యమా అని,
ఇప్పుడిప్పుడె తలెత్తి
పై ప్రకృతివైపు ఎగబడి
పట్నమంత హాయిగా కాస్త వెన్నెల ననుభవించె.

సేటు గోదాముల సిమిటి గోడలు
గుబగుబ పెళ్లగిల్లుచు కూలినట్లు;
నడికట్లతో, తుమ్మ బడితెలతో
కషరేగిన మోరలు సాగినట్లు;
డప్పులు, కొమ్ములు, ధాళ్ళు విల్లంబులు బట్టి
కోయలదండ్లు వాలినట్లు;
వాలుజెండాలు, గగ్గోలు డిప్పమొగాలువంచి
తుపాకులు దించినట్లు;
నడచు టాంకులట్లె ఆగినట్లు,
'మూసి' అలలపై నోట్ల కట్టలు కలిసి పారినట్లు,
బాలరూపులు నగినట్లు
చూడు పాలవెన్నెలలోని మేఘాల లీల,

అరె, చిత్రమె !
ఆకాశపు తెరపై ఈ బొమ్మలాట
తీరా సగమై తెరపి అయిపోయె,
చప్పున కరిగినదై, మగతలోని కలవంటిదియై

జిలజిలన వచ్చి మాయమై
జెగ్గుమన్న లైట్లలో చూచితివె వింతలాహిరి!

ఇదె 'ఉమరు ఖయ్యాము తోట'
ఈ ఒక్కచోట మాత్రమే నిషిద్ధము కుమత వివక్ష.

పొట్ట కొరకు నినాదాలు గొట్టి,
అరచి అరచి, అలసి సొలసి, గొంతులారి,
ముడిగి వాలి రెక్కడి కక్కడే
బేలప్రజకు కరకు కంకర దిబ్బలే పరుపుదిండ్లు.

ఆస్తులు మార్పువారికి తలా ఒక మేడయి
మళ్ళి కొత్తగా సిస్తయిపోయె రాజు నివసించిన కోటలు,
గబ్బిలాలు ఆ బస్తిని బాయలేనివయి
పాపము! సందులు చూచి
నాలుగంతస్తుల బంగ్లా లెక్కినవి
నమ్మిన స్వర్గము జన్మభూమియే.


గోరి పక్క స్వతంత్రుల గురకలు అవి?
బుసుతలే అంత;
మెడలపై తొడలు, కాలుగడుపుల సమైక్య మిచట;
ఊరడుగ బోయి తల్లి వచ్చునెప్పటికో సంతానలక్ష్మి-
పిక్కటపు పిల్లపిడుగు ఆ బిచ్చగాడు
పీడకలలోనె చూచెను 'మ్యాడయెత్తు గుడిశ'
పుట్టినట్లున్నది:
గుడిసె ప్రజల దశను మళ్ళించు భాగ్యవిధాత ఒకడు.

సిపలు సత్యమున్నది గుసగుసలనిండ,
ప్రగతి లక్ష్యమున్నది ప్రడయివర్లా వెనికి బాసలో.
ఇదిగో శస్త్ర వైద్యశాల నట
గిరాకిలో ఇక్కడున్నది అహింస.

కుదురుబాటు ముఠాది బొంకుల వ్యవస్థ
తిరుగుబాటు ముఠాది చిందర అవస్థ
ఏ ముఠా పాట నీ దంచె
ఇలకరచి 'కమ్యూచి' పాడేవు
ఏమి పరాచికమిది?

మనిషి మనిషిని నమ్మని మాయవేళ
మేజు వాణి మేళా?
మిడి మిడిగ నవ్వి పలుకవా?
ప్రస్తుతార్థము పలుకలేని శబ్దమట్లు +
ఏంతవరకు నిశ్శబ్దమైత్రి?

తమ బుక్కాశలు మట్టి తట లయినా
తర్వాతివారు +
అన్నగండముతో చావరటన్నపట్లు దలతోడై కట్టిరిచెవ్వ
గానము సారించుము,
వారి కంకితమిదే నా పాట,
నీ రాగమే సమత మేళకు ఆశ పట్టువును గా సౌభాగ్య
వాణీశ్వరీ !



సౌందర్యం

శ్రీ వై. శ్రీరాములు

సంద్రంలో తడిసిన నీలిమేఘాల మేలి ముసుగుల్ని
ఉరుములు పిండుతుంటే...వర్షం వస్తోంది
రా ! చినుకుల గొడుగులో దాక్కుందాం
చిరునామా లేని వీలునామాలాంటి నా జీవితంలో
ఓ దయామయీ...
ఎన్నిసారు నా అశాంతి అగ్నిగుండాన్ని నీ నగ్నశరీరంపై
పేర్చివేశాను

నీకు తెలుసా ! నీకు తెలుసా !
ఈ కొండలూ, కోనలూ, అడవులూ, అలలూ
నా ఊహల పిడికిట్లో దాసోహం చేస్తున్న బానిసలు
ఇంద్రధనస్సులోని రంగుల్ని
ఈ పచ్చికపై మెరిసే ఒకే ఒక మంచుబిందువులో
బిగించాలనే నా భావం
కిరణంలా తాకుతుంది నా హృదయాన్ని
మూగత్వంలో...నాలోని తన్మయత్వంలో
నీ రాక కోసం...నన్ను నేనే మరచి
చూపుల్ని, తలపుల్ని తలుపువైపే ఉంచితే...
నువ్వెప్పుడొచ్చావో నాకే తెలియదు ... నా కళ్ళను
కప్పేంతవరకు

పసుపు దుస్తులుగా ధరించిన
పసిపాపల లోపలి దీపాలను తుఫానులు ఊదకుండా
మన గుండెల గూళ్ళలో ఉంచుకుందాం
ఈ క్షణం మాత్రం కేవలం
అందని ఆకాశంలో ఎవరికీ చెందక
దూరంగా రాలిపోతున్న నక్షత్రాన్ని
పిచ్చిమొక్కపై రాలిపోయిన మంచుముక్కని
సమస్యల సంద్రపు అలల్ని
సాలె గూళ్ళలాం[illegible] కలల్లో బంధించాలనే
నా తాపత్రయంతో
లోకంలో ఆర[illegible] జ్వాలాశిఖలపై ఎన్నెన్ని మందార
మాలలు విరబూయింప చేశాను

మౌనంలోని క్షణాల్ని ద్రాక్షపళ్ళలా తిన్నా
హృదయాన్ని ఉదయమనే స్వర్ణపాత్రలో నింపుకున్నా
మాటలు గొంతులో మూగవోయిన వేళ
పాటలు గుండెలో రాగాలుపోయిన వేళ
ఈ ప్రకృతినుండి ఎన్నెన్ని మాటల్ని, పాటల్ని
పిండుకున్నా !
తులసి ఆకుల్లాంటి హృదయాలని
తుపాకులతో పేల్చివేసే లోకానికి
త్యాగమనే నెత్తుటి కన్నీటిని ధారవోసి
ఒక్కసారిగా శూన్యాన్ని గుండెనిండా నింపుకొని
దిక్కుల్ని నా రెక్కలుగా చేసుకొని
ఈ ప్రపంచాన్ని లేవదీసుకపోతా !

నిశ్శబ్దపు నిరీక్షణ

శ్రీ వై. శ్రీరాములు

సంధ్య, వింధ్య పర్వతాలపై కిరణాల కుచ్చెళ్ళు
ఊడుస్తూ పోతున్నప్పుడు
నిన్ను చూశాను—
శూన్యాన్ని, నిశ్శబ్దాన్ని నింపుకున్న నా దోసిళ్ళలో
పువ్వువై పడి రంగుల్ని పోశావు
నీ ఊపిరి ఈ సృష్టిలోనికి జారుతున్న వేళలో
వేణువునై పరుగెత్తాను నీ వెంట....
నీ కళ్ళు
నీలిమను దాచుకున్న పిడికిళ్ళు
పచ్చని చెట్లమధ్య పరుగులిడుతూ, చిరునగవుల నురగ
లిడుతూ
ఒళ్ళు విరుచుకొని పరుగెత్తుతున్న సెలయేటివి
జారిన నీ పైటతో పొలమంతా పచ్చగా పరచుకుంది
అందుకోసం నేను....
నాట్లువేసే ఆ మట్టిలో మొక్కనై మొలకెత్తాను
కత్తివేట్లు పడ్డ పూల గుత్తినై పైకెత్తాను
నీ కళ్ళు
నా చూపుల్ని నిర్దాక్షిణ్యంగా కోసే కొడవళ్ళు
నీ పదం
నిశ్శబ్దంలో చిటికెడు శబ్దం
అందుకే సుమా!
నీపై పిడుగులు పడకుండా
నా గుండెను చీల్చి గొడుగు పడతా!
ఫక్కున నువ్వొక్కసారి నవ్వితే చాలు
వెన్నెల తన కుచ్చిళ్ళను తన్ని [illegible] నా
మొహం మీదికి

నీ కోసం
నా చూపుల్ని నిశ్శబ్దంలో తడుపుతూ
నిరీక్షణలో ఆరబెడుతున్నా
రా! ఈ క్షణాలు మనకు శతాబ్దాలు
ఆ క్రూరమైన శతాబ్దాలు కప్పిన నిశ్శబ్దపు గనుల్ని
త్రవ్వి మణుల్ని తెద్దాం
రా! గులాబి గుండెలతో చెప్పి, పరిమళాల నోళ్ళువిప్పి
మధుర స్వరాలై, స్వప్నాలై, తోటల్లో, దిగంతాల్లో
పరుగెత్తుదాం
రా! సౌందర్య సింధువుల్ని నింపుకున్న మంచు
బిందువుల్లోని
రంగుల్లా కలిసి పోదాం.

శృంగారనైషధ సర్వంకష-2

కళాప్రపూర్ణ నిడుదవోలు వేంకటరావు

(1)

నలమహారాజు వర్ణన

సీ. తపనీయ దండైక ధవళాతపత్రితో
ద్దండ తేజః కీర్తిమండలుండు—
నిర్మల నిజకథానిమిష కల్లోలినీ
క్షాళితాఖిల జగత్కల్మషుండు
వితత నవద్వయ ద్వీప నానాజయా
శ్రీవధూటీ సమాశ్లిష్ట భుజుండు
నిఖిల విద్యానటీ నృత్యరంగస్థలా
యతకాయమాన జిహ్వాంచలుండు

గీ. ప్రస్తుతింపందగు సముద్భట కఠోర
చటుల గుణ టంక్రియా ఘనస్వనిత ఘోష
చాపనీరద భవశరాసారశమిత
బలవదహిత తేజోదవానలుండు నలుండు— (1-46)

నైషధ కథానాయకుడగు నలమహారాజ వర్ణన మూలమున (1-5) నైదుశ్లోకములలోనుండగా, శ్రీనాథ మహాకవి ఒక్క సీస పద్యమున నా కథానాయకుని మనకు సాక్షాత్కరింపజేసినాడు. కథా ప్రారంభ పద్యముననే, శ్రీనాథుడు ప్రదర్శించిన కవితా ప్రతిభ పంచముఖములుగా భాసించినది.

i

సంస్కృత ప్రౌఢిమ తెలుగునుడికారము

అనితర సాధ్యమైన హర్షనైషధ సంస్కృతమూలము తెలుగు చేయుటకు తన కధికారము గలదని చూపుటకు ప్రారంభ పద్యము— సంస్కృత సమాస బంధురముగా చేసియున్నాడు—ఇది తెలుగు కావ్యమని చూపుటకు—తెలుగు ప్రథమావిభక్తి ప్రత్యయము 'డు' చేర్చి, ఆ సంస్కృత సమాసము నంతటిని తెలుగు గావించినాడు—ఇట్లు చేయుటలో నొక విశేషమున్నది.

సాధారణముగా మనము కథను ప్రారంభించునపుడు—కథానాయకుని 'డు' ప్రత్యయము చేర్చియే వాడుదుము—"అయోధ్య యను పట్టణము గలదు. దానిని 'దశరథుడు' అను రాజేలుచుండెను. వాడుకలో కూడ "అనగా అనగా ఒక రాజు ఉండేవాడు—" అని 'డు' ప్రత్యయమే వాడుట మనకు పరిపాటి. ఇందింకొక విశేషము గలదు. శ్రీనాథుడు హర్షనైషధమున—కొన్ని శ్లోకములలోనున్న సంస్కృత సమాసములను, యథాతథముగా తెలుగు ప్రత్యయములను చేర్చి, తన కావ్యమున ననుసంధించినాడు—మూలములోనున్న సంస్కృత సమాసములను తెనుగులోనికి స్వస్వరూపముతో ననువదించు నేర్పు తనకు గలదని చూపుటకు కథా ప్రారంభ పద్యమును ప్రథమా విభక్తి 'డు' ప్రత్యయముతో ప్రారంభించినాడు. కథా ప్రారంభమున ప్రథమ పద్యము ప్రథమా విభక్తిలో నుండుట యెంతో యౌచితీ సంపాదకమై యున్నది.

ii

నాయకోత్కర్ష

నల శబ్దమున రెండు లఘువులు — కథానాయకుని పేరు లఘువే యైనను, దానికి గురుత్వము గలిగించి నాయకోత్కర్షను శ్రీనాథుడు ప్రకాశింపజేసినాడు. ఇచట శ్రీనాథుడు చూపిన కవితా శిల్పమనల్పమైనది కేవలముతెలుగు పదములతో నుత్కర్ష సిద్ధింపదు.

మహోన్నతుడును, మహానాయకుడును మహారాజునగు నలుని, లఘువులగు తెలుగు పదములతో తెలుపుట కలవి గాదని యెఱిగియే, ఆతడు—నలుని వర్ణన సమాస భూయిష్ఠముగా చేసినాడు. అట్లు చేసినగాని—నలుని లోకోత్తర వ్యక్తిత్వము మనము గ్రహింపలేము—కన్నులతో చూచినను, నా వ్యక్తిత్వోత్కర్ష మన మనసునకు పట్టదు.

సీసమున నాలుగు పాదములు నొక్కదాని నొక్కొక సమాసముగాచేసి; యా వెనుక గీతమున—"ప్రస్తుతింపగదగు అను క్రియ చేర్చినాడు. ఈ క్రియాపదము, సీసపద్యము నాలుగు పాదములకు గీతపద్యమున మిగిలిన మూడు పాదములను కలిపి సమన్వయము చేయుచున్నది.

"ప్రస్తుతింపంగదగు"— ఎవనిని? అని ప్రశ్న అధ్యాహారము.

దానికి జవాబు—

సముద్భట కఠోర

చటుల గుణ టంక్రియా ఘ నస్తనిత ఘోష
చాపనీరద భవశరాసార శమిత
బలివదహిత తేజోదవా నలుఁడు—" నలుడు.

నల శబ్దమును—"సముద్భట......తేజోదవా నలుఁడు" అను దీర్ఘ సమాసముతో ననుసంధించి దానికి గురుత్వము నుత్కర్ష నాపాదింప జేసినాడు.

న ల స్తు తి

పై పద్యమున కేవలము నలుని కీర్తి ప్రతాపాదిక వర్ణనమే గాక నలుసు కీర్తనమున్నది. "ప్రస్తుతింపఁగదగు" అను క్రియలోనే స్తుతి ధ్వనించుచున్నది. ఈ స్తుతియందు ప్రథమావిభక్తి యుదాహరింపబడినది. దీనినే "ఓజో పద బహుళముగా గౌడీరీతి నుండవలె నని యాలంకారికులు" చెప్పెదరు.

"క. ఓజఃపద బహుళము వి
భ్రాజిత పటుగౌడరీతి బంధురమును ని
చ్చాజాతరస విభావ విరాజితమును"గా

నాయక విభవము వర్ణింపవలెనని విన్నకోట పెద్దన చెప్పినాడు— (కావ్యాలంకార చూడామణి-4-22)

పై పద్యము ఓజోగుణ విలసితమై గౌడీరీతి నున్నది.

నైషధ కథారంభమున నలసంకీర్తన మన్వర్థము నల సంకీర్తనము కవి కల్మష నాశకము.

"కర్కోటకస్య నాగస్య దమయంత్యా నలస్యచ
ఋతుపర్ణస్య రాజర్షేః కీర్తనం కవినాశనమ్" అని సూక్తి.

నలస్తుతి సంస్కృత సాహిత్యమున నున్నను, తెనుగున శ్రీనాథుడు దానికొక ప్రత్యేకత పై రీతిగా నాపాదించినాడు శ్రీనాథుడు కథానాయికయగు దమయంతి స్వయంవర మంటపమునకు వచ్చునపుడు నిట్లే సమాసయుక్తముగా దమయంతిని వర్ణించినాడు. ఇది దమయంతి యుత్కర్ష తెలుపుటకేయని గ్రహింపవలెను.

సీ. అఖిల దిగ్దేశరాజాకర్షణ క్రియా
మహనీయతర సిద్ధమంత్ర విద్య
అకార రేఖా సముత్పత్తితానన్య
సాధారణాశ్చర్య జలధివేల
నేపథ్య హీరప్రభాపూర నిర్మల
వారి బింబిత నిజస్వచ్ఛ కాంతి
సంకల్ప భవదూత కల్పాకల్ప
కల్హార సౌరభాగత మదాళి

గీ. బహు విరోధిమణి ప్రభావల్లి వాగ
మల్లసం గ్రామ ఖురలికామండనాయ
మాన నానా పరిష్కార మహిమ గాత్రి
మనుజపతి పుత్రి యాస్థానమునకు వచ్చె. (5 5)

నాట్యారంభమున-తెరయెత్తగానే-రంగస్థలమున సామాజికులకు కన్నులు మిఱుమిట్లు గొనజేయు బిరుదు పాత్రవలె, దమయంతి మనకు సాక్షాత్కరించుచున్నది. నలుని వర్ణనలో – విశేషణములు పుల్లింగములుగా నుండుటయు, దమయంతి వర్ణనలో విశేషణములు స్త్రీలింగములుగా నుండుటయు గమనింపదగినది.

నాయకోత్కర్షను వర్ణించు నపుడు శ్రీనాథుని తరువాతి కవులు నాతని ననుసరించి సమాస యుక్తముగానే చేసినారు -

ఒక్క ఉదాహరణ చూపుచున్నాను.

సీ. పటు భుజాస్తంభాగ్రఘటిత విశ్వంభరా
భారలాఘవిత మహాఫణిఫణుండు
నవకీర్తి నర్తకీ నాట్యరంగావనీ
కృత చక్రవాళ ధాత్రీధరుండు
సంతతౌదార్య సిద్ధాంతార్థ పూర్వ వి
క్షిప్త భవత్కల్పక ప్రాభవుండు
బిరుదాంక రచిత గంభీర గీత ప్రసంగ
గా శాప సంజీవనాంతకుండు

తే. నిశిత నిరుపమ నిజకర నీరజాత
నిహిత నిస్త్రింశ నిర్భిన్న విష్వరారి
పటల నైవేద్య తృప్త శుంభత్ప్రతాప
ఘోరతర భైరవుండు పురూరవుండు —

కవిరాజ మనోరంజనము - (1 87)

iii

గూ ఢ చ తు ర్థి

పై పద్యమున గూఢచతుర్థి యను కవితాచమత్కారముగలదు – గూఢ చతుర్థియనగా సీసపద్యమున-గీతపద్యమున – నాల్గవ పాదము వచ్చువఱకును, నా పద్యమెవరికి సంబంధించినదో, తెలుపకుండ, నాల్గవ పాదమున నా సంబంధము దెలుపుట —

గూ ఢ చ తు ర్థి

సీ. వలపుల బొమలమై నిలుకడఁగన్నులఁ
బుష్ప చాపధ్వజ స్ఫూర్తి గలిగి
గాంతి గంధంబులఁగరములఁ దనువల్లి
కనక పంకజ దామ గరిమదాల్చి

కురులను బొద్దున బిఱుదునఁగుచమున
ఘన సరసీచక్రగతి వహించి
నేర్పున నగవున నిగ్గున మొగమున
శారదామృత భాను సమితినొంది

కౌను నభముల సొబగునుగల్గి చూపు
హరిమణి శ్రీ సమానత నతిశయిల్లి
రూప శుభలక్షణంబుల నేపు మిగిలి -

ఇంతవఱకు నిది స్త్రీవర్ణనయే యైనను, ఏస్త్రీకి సంబంధించినదో తెలియదు చివరి పాదమున

"వెలదు లమరుదు రవ్వీట వేడ్కతోడ-"

అని యుండుటచేత – అది వైకుంఠపుర స్త్రీవర్ణనమని మనము సందర్భమునుబట్టి తెలిసికొనవగలము.

(ప్రబంధరత్నావళి – 396 ప. పుట 117)

శ్రీనాథుడు పై పద్యమున నీ గూఢచతుర్థిని సూచించినాడు:-

సీ. తపనీయ ... ...మండలుఁడు
నిర్మల ... ... జగత్కల్మషుఁడు
వితత ... ... శ్లిష్టభుజుఁడు
నిఖిల ... ... జివ్వాంచలుండు

గీ. ప్రస్తుతింపఁగదగు సముద్భట
... ... శమిత ... కు
బలవదహిత తేజో దవానలుడు – వఱకుమనకు

పై పద్యమున ప్రస్తుతుడైన వాడెవడో తెలియదు – నాలుగవ పాదాంత మున నలుడని యుండుటచేత – పై పద్యమునగల విశేషణములన్నియు నలునకు సంబంధించినవి యని తెలియును - ఇదే గూఢచతుర్థి.

iv

శ్రీనాథుడు పై పద్యమును – పండితారాధ్య చరిత్రమునగల యీ క్రింది పండితుని వర్ణన ననుసరించి రచించినాడు.

ద్వి. మంగళ లింగ నిర్మాల్య ప్రసూన
సంగతోత్తంసోత్తమాంగ విభ్రముఁడు
సరసశశ్వత్ భక్తి సామ్రాజ్య రాజ్య
వరపట్టభద్ర భాస్వరఫాలతలుఁడు
దరహాస చంద్రికా దామాభిరామ
వరకళా సంపూర్ణ వదన చంద్రుడు
హరమహిమాంకనోద్యత్సుధాసార
పరిపూర్ణ కుంభ నిభశ్రోత్రయుగుఁడు
ఆనంద బాష్ప నిరంతర వర్ష
మానసేత్రాబ్జ యుగ్మ వికస్వరుండు
సరళ సంస్థిత దృగంచల నముద్భూత
కరుణామృత నిషిక్త గండస్థలుండు
స్ఫురిత ప్రసాద తాంబూలరాగాంశు
పరి కవితాధర భ్రాజమానుండు

(పండితారాధ్య చరిత్ర మహిమ ప్రకరణము)

ఇచటను కథానాయకుడగు పండితారాధ్యుని వర్ణన ప్రథమా విభక్తిలో నున్నది. శ్రీనాథుడు దీనిననుసరించి తనకథానాయకుని వర్ణన ప్రథమావిభక్తితో చేసినాడు.

పండితారాధ్య మహిమా ప్రకరణమున-23వ పుటలో పై పంక్తులున్నవి. ఇట్టిదే, మఱియొకటి 36వ పుటలో నున్నది. శ్రీనాథుని కృతులలో పండితారాధ్య చరిత్రాను కరణములను గూర్చి ప్రత్యేకము పరిశ్రమచేయవలెను.

V

శ్రీనాథుని పైపద్యమును ఎఱిఁగిన ప్పిజ్జన తన కుసూర నైషధ మున నిట్లనుసరించియున్నాడు:

సీ. లావణ్య రేఖావిలాస లీలా కళా
శాసిత సూన శరాసనుండు
కుంభినీ వహన విజృంభదోస్తంభ సం
భావితాశేష దంతావళుండు
ధారాళ దానంబుధౌత యాచక జాల
దుర్దమ దుర్విధ కర్దముండు
నీహార సురవాహినీ హారనారద
శారద నీరద స్వచ్ఛయశుడు

గీ. వినుతి సేయంగఁ దనుజ దిగ్విజయలటహ
పటల నిర్ఘుణ నిర్ఘాత పటల చటుల
ఘోర నిర్ఘోష వినమిత కుమత విమత
కులకరన్యస్త విస్తృత నలుఁడు నలుఁడు.

ప్రబంధ రత్నావళి 85 ప. పుట 27.

(2)

చ ఇతఁడు దరిద్రుఁడౌ ననుచు వేర్పడవర్ధి లలాట పట్టికన్
శతధృతి వ్రాసినట్టి లిపి జాల మవర్థము గానియట్లుగా
వితరణ కేళనావిభవ విభ్రమ నిర్జిత కల్పభూరుహాం
డతఁడు దరిద్రితా గుణమునందు దరిద్రుఁనిఁజేయు నాతనిన్
(1-57)

ఈ పద్యమును కనుపర్తి అబ్బయామాత్యుడు తన కవిరాజ మనో రంజనమున నిట్లనుసరించినాడు.

"లయమగ్నీజన" యుంచు యాచక లలాటాంతస్థలిన్, బహ్మని ర్ణ్ణయితన్ వాయ వహించునట్టి లిపి యర్థంబుల్ విశేషస్వయ క్రియగా నర్థము వారిగా నొసగి యర్థింజేయు వాగీశు వ్రాతయు నాత్మను విశీర్ణయున్ నిజముగా ధాత్రీశు వేర్వెట్టిదో
(కవి. రా.-1 98)

(3)

సీ పా నర్మించి యతనికే తగుదునో గనో యం
చించుకించుక సంశయింతు రాత్మ (1 70)

(అంచు + ఇంచుక=అంచించుక)

దర్శించియతనికే తగుదునో తగనోయ
నించుకించుక సంశయింతురాత్మ-

(అని + ఇంచుకెంచుక=అనించుకించుక)

కవి సంశయ విచ్ఛేద పాఠము.

అడిదము సూరకవి పై లక్షణ గ్రంథమున కార్యకారక ఇకార సంధికి లక్ష్యముల నిచ్చుచు పై నైషధ పద్యపాదము నుదాహరించి-యిట్లు లక్షణము చెప్పినాడు:

"ఇడగ వచ్చు నుల్యహపై నిత్య సంధి
మాత్ర మొక్కొక్క చోటను మట్టుమీఱ
కౌలుతు నఖముఖంగోరందు శేఖరు
నన్నుయిట్లు కవిజనానుమతిని..

ఈ లక్షణమునకు లక్ష్యములుగా నీ క్రిందివానిని యుదాహరించినాడు:

సూరకవి క్రీ. శ. 1720 80 ప్రాంతమువాడు. ఆత డిచ్చిన కార్యకారక సంధిలక్ష్యములు ముద్రణములో మారినవి.

సూరకవియుదాహృతులు	నేటి ముద్రిత పాఠములు
1) వెల్లపనులు నెటిగించిపుడే- (భార. ఉద్యో. 1 ఆ.)	నెటిగించి తగన్
2) అల్కా మాపి నకులుడు రాఘ 4-65	ద్వ్యక్షికావ్యము మార్పునకు వీలులేదు. లేవట్లే యున్నది.
3) యనించు కించుక సంశయింతు రాత్మ (నైష 1-70)	తగనో యంచించి కించుక అని ముద్రణమున మార్పు.
4) ఇచ్చునెడంబదార్ల మడి గిచ్చునో (విజయ 1 48)	ముద్రణమున మార్పులేదు.

5) సీ. పా. తమ పేరుసెప్పలో దయమీఱ విని చీరం
జించిచ్చువారి దీవించువారు
(ఆముక్త మాల్యద 6-85)

పై పద్య పాదమున-

చించి+యిచ్చు చించిచ్చు అని కార్యకారక సంధి యునుదని అది బాలవ్యాకరణము ప్రకారము సాధ్యము కాకపోవు. వే. వెంక ట్రాయ శాస్త్రిగారు తమ సంజీవనీ వ్యాఖ్యానమున నిటు మార్చినారు:

"తమ పేగి సెప్పలో దయమీఱ విని చీర
చించి యియ్యంగ దీవించువారు"
(ఆముక్త మాల్యద పుట 689)

ఇందేడాశ్వాసము లుండుటచేత- పై పద్యమందు 7 ఆ 21 పద్యముగా నున్నది.

1913లోనే నైషధమున వేదమువారు "అనించు కించుక" అన్న పాఠము. బాలవ్యాకరణానుసారిగా లేదని-

"తగుదునె తగనో యం
చించికించుక సంశయింతురాత్మ"

అని మార్చినవారు 1927లో ఆముక్త మాల్యదా పాఠమును మార్చి ప్రకటించుటలో వింతలేదు

పై సీసపద్యపాదమునకు మీది పాదములో ముద్రణమున నిట్లున్నది:

"వ్రాసి కన్యాత్య గౌరవము వీసరవోవ
దర్శింతు రనురాగ తరళదృష్టి"

కాని సూరకవి పాఠమిది-

"వ్రాసి కన్యాత్య గౌరవము వీసరవోవ
దర్శింతు రన్యోన్య తరళ దృష్టి-

(4)

సీ. సఖులుదాం బుష్ప్రస్తు సామ్రాజ్య పదవికి
నభిషేక మొనరించు నవనినాథు.

పాఠభేదములలో "జతపెట్టు పదమున" (1-78) "సామ్రాజ్య పదవికి"-అను పాఠము లీయబడి యున్నవి.

అప్పుడు తాళపత్ర ప్రతులలో పై పద్యపాద మిట్లుండ వలెను-

"సఖులు దా బుష్పాస్త్రు జతపెట్టు పదవికి
నభిషేక మొనరించు నవని నాథు"

పూర్వ ముద్రణములో-పాఠమిట్లే యుండగా వేదమువారు దానిని

"సఖులు దాంబుష్పాస్త్రు సామ్రాజ్య పదవికి
నభిషేక మొనరించు నవనినాథు"

అని సవరణ చేసినారు. వారిట్లు సవరణ చేసినట్లు "పూర్వ ముద్రణ దోషములకు ఇందలి సవరణలు" అను దానిలో 76 "జతపెట్టు" "సామ్రాజ్య" అని చూపినారు.

వ్యాఖ్యానములో

"నీరజ అక్షి=తామరస నేత్ర (దమయంతి) సఖులున్‌తాన్= చెలికత్తెలును తానును పుష్పాస్త్ర మన్మథునియొక్క; సామ్రాజ్య= దొరతనముయొక్క పదవికిన్=విభవమునకు అవని నాథున్ అభిషేకము ఒనరించున్=నలునకు పట్టాభిషేకము చేయును" అని కలదు.

వేదమువారు 'సఖులుఁదా' అనునప్పుడు దమయంతి, చెలులు కలిసి యభిషేకము చేసినట్లు వ్యాఖ్యానించినను—ఆ పద్యమున తరువాతి పాదములన్నియు దమయంతికే సంబంధించినవి గాని-సఖులకు సంబంధించినవిగావు—

2వ పాదము—ఆమె "వలనామ ధేయమైన తృణంబు వినఁ బడ్డ నధిపతి పేర్విన్నయట్లు" అలరును.

3వ పాదము—నిషధ దేశపు విప్ర నికరంబు బూజించి యల యక ప్రియునుది. యడుగఁ దలఁచు

4వ పాదము—అభ్యాస వశమున ప్రాణేశ్వరునిమీఁది యుంచు గీతములు వాయించు వీణ—

ఆ తృతీ గీతి

సీ. నేర్పుగల చిత్ర కరులచే నిలయబిత్తి
భువన మోహనాకారత బొలుపు మిగుల
మగని మగువను వ్రాయించి మది దలంచు
నిషధ రాజును దన్నుగా నీరజాక్షి.

ఈ పద్యమునందు—

2 వ పాదమున — అలరుట.

3 వ పాదమున — తలచుట.

4 వ పాదమున — వాయించుట

గీత పద్యమున — వ్రాయించి
మది దలంచుట —

ఇటియన్నియు ఏక కర్తృకములు — దమయంతి కర్త — అట్టి సందర్భమున —

సఖులు — చెలికత్తెలు తానును — అభిషేక మొనరించు అను ద్వికర్తృక క్రియ కాస్కారము లేదు — అభిషేక మొనరించినది — దమయంతియేయని — నేను పైని చూపిన తరువాతి పాదములు — అలరు, తలచు, వాయించు, వ్రాయించు క్రియలు స్పష్టపఱచు చున్నవి — ఇందువలన మొదటి పాదములో - సఖులకు — అభిషేకము నకు సంబంధ మేమాత్రమును లేదు.

ఇంకొక వివ్యాఖ్యానము. 'సఖులు' అన్నది బహువచనమునై యున్నది - అప్పుడు చేయును అను ఏకవచన క్రియ ఎట్లు సమన్వయ మగును — ? అప్పుడు — "అభిషేక మొనరించి రవనినాథు" అని యుండవలెను - కాని యుందు ఏకవచనముగానే యున్నది — తక్కిన క్రియలు ఏకవచనముగానే యున్నవి. దీని కంతటికి హేతువు—ముద్రణ ముందున్న "జతపెట్టు" అను పాఠమును సవరించి—"సామ్రాజ్య"— అని యప పాఠమిచ్చుటచేతనే యని యెఱుగనగును —

"సఖులుఁదాఁ బుష్పాస్త్ర జతపెట్టు పదమున
నభిషేక మొనరించునవని నాథు"—

అని ఆనంద ముద్రణ పాఠము —

ఇది సరియైన పాఠము —

సఖులు, పుష్పాస్త్ర పదమున (అవనినాథుని) నిలుపుటకు— "జతపెట్టు" సిద్ధము చేయగా, తాన్-తాను (దమయంతి) ఆతనికి అభిషేకము చేసినది"—

మన్మథుని స్థానమున నలుని నిలుపుటకు—చెలికత్తెలు సర్వము సిద్ధముచేయగా దమయంతి నలుని మన్మథ స్థానమున నాతని నభిషేకించినదని యర్థము —

"జతపెట్టు" అనగా సిద్ధము చేయుట - ఈ క్రియ ఇప్పటికి, "ఆ కార్యానికి కావలసిన వస్తువులన్నీ జతపెట్టేరా" అని వాడుకలోనున్నది —

శ్రీనాథ మహాకవి యీ క్రియను గ్రంథస్థము చేసినాడు—

ముద్రణలో లేకపోవుటచే నిది నిఘంటువుల కెక్కలేదు—

దీనికే — "సఖులుఁదా పుష్పాస్త్ర చాపట్లు పదవికి" అని యొక పాఠాంతరము కలదు - కాని అది అర్థరహితము అందుచే త్యాజ్యము-ఆనంద ముద్రణమున నిది చూపబడినది.

"జతపెట్టు పదము" సరియైన పాఠము.

(5)

విశ్వాది కారణంబుగ మహీపతి యంచిత ధైర్యకంచుకం
బయ్యెత నుండు సించె వలరమ్ములచే నదికారణంబుగాఁ
దొయ్యలి రాజనందనుని తోడన గూర్పందలంచుచున్నయా
దయ్యము నెత్తికోలు తుదిదాఁకుటగానఁగనయ్యెనయ్యెడన్— 26

ఇందు మూడవ పాదమునకు —

"దొయ్యలి రాజనందనునితో నెడగూర్పఁదలంచియున్న యా దయ్యము నెత్తికోలు"

అని తిమ్మకవి పాఠము —

రాజనందనునితో "గెడగూర్చు" అనునది సరియైనపాఠము. 'గెడగూర్చు' అనునది క్రియ.

రతికూడు. జతపడు: కవియు అని దీని కర్థములు..తిక్కన యందు రెండవ యర్థము గలదు.

క. గెడగూడ దీని నీతని యొడలివియుంబెటి భార. విరా 3-12.

శ్రీనాథుడే నైషధమున రతికూడు అనునర్థమున

"పవలొ రా తియొ గెడగూడ నవసరమని" 7-187 లో దీనిని ప్రయోగించినాడు.

దయ ము నెత్తికోలు తుది దాకుట—

ఇది శ్రీనాథుడు తిక్కననుండి గ్రహించినాడు.

దయ్యమునెతి కోలు తుది దాకుటగాదె

భుజంగ భంజనా ఉద్యో. 3-67

హర విలాసమున దీనిని వాడినాడు

దయ్యము నెత్తి ల తుది దాకగ హర 2-24

(6)

క. తెలువ పులకాంకురంబులు

....

....

గిటికొన్న మనోజ ఖురళికిం బతినిధియై (6 6)

వ్యాఖ్య. 'ఖురళి'కి 'శరధి' అని యుపలబ్ధ పాఠము అమ్ములపొది యర్థము. 'ఖురళి' అనగా గరిడి మల్లులు సాముచేయు స్థలము. ఇచ్చట 'ఖురళి' పాఠమున కాస్కారమేలేదు. పై పద్యమున-'తెలువ' 'ప్రతినిధి' అని పదములున్నవి. ఇవి సార్థకములు-మూలమున- "శరవ్యదండైః శ్రిత మండనశ్రీ" అని దమయంతి శరవ్యము- అమ్ములపొది-గానే వర్ణితమైనది.

దమయంతి నలుని మెడలో దండవేచినది—ఆ నలుని మెడలో ఆ దండ వేయగానే-ఆమెకు పులకాంకురములు గలిగినవి-అవి శరీర మెల్ల వ్యాపించినవి ఆ పులకాంకురములు మొనలదేరి యుండుటచేత నవి మన్మథ బాణములవలె నున్నవి-దమయంతి శరీర మందంతట ఆ బాణములే యుండుటచేత ఆమె మన్మథ బాణములుగల్ల మదనుని యమ్ములపొదికి ప్రతినిధిగా నున్నది-అని శ్రీనాథుడీ వట్టున మూలమునకు మెఱుగు పెట్టినాడు. మూలములో ప్రతినిధి పదమును నర్థమిచ్చు పదమేలేదు-ఇంతేకాక వ్యాఖ్యయందు.

"శరధి శబ్దమునకు శరవ్యార్థము ఎచటనుం

గానంబడలేదు"—

శరధి శబ్దము. శరవ్యార్థమున అమ్ముల పొదిగా శ్రీనాథుడే హర విలాసమున వాడి యున్నాడు-

క. శరధులు యుగాంతవేళా

శరధుల నుం బోలెనయ్యె శరశూన్యంబుల్

సురపతి సూతికిఁ బరమే

శ్వర మాయాశక్తి నపుడు సమరాగ్రమునన్ (7-74)

ఇది పాశుపతాస్త్ర కథన సందర్భమున అర్జున పరమేశ్వర యుద్ధ ఘట్టమున గలదు-

అర్జునుని అమ్ములపొది ఎన్నడును నింకిపోవునది. అనగా బాణము లేకుండ నుండునది కాదు. అమ్ముల పొదినుండి బాణములు తీసిన కొలది అవి వచ్చుచునే యుండును. కావుననే వానికి అక్షయ తూణీరములు అని పేరు వచ్చినది. కాని శివునితో యుద్ధము చేయు నపుడది బాణములులేని అమ్ములపొదియైనది. దానినే శ్రీనాథుడు-పై విధముగా శ్లేషలో చక్కగా సూచించినాడు. శరధి యనగా సముద్రము-అమ్ములపొది యను రెండర్థములు గలవు. దానినే శ్రీనాథుడు పై పద్యమున వివరించినాడు సముద్రములు-యుగాంతవేళ-ప్రళయ కాలమునందు తప్ప ఇంకిపోవు ఇచట శివమాహాత్మ్యముచే ఇంకిపోయినవి.

శరధి శరవ్యార్థమందున్నది గాన 475వ పుట యంతయు ననావశ్యకము.

(7)

క. చలివాలు నవ్వు లడ్డువ

ములు చన్నులు పనస తొలలు మోవులు మండెం

గలు చిరలుగ భుజి కియ

వలపించెం బెండ్లివారి వనితయుఁ బోలెన్-6-134

వ్యాఖ్య—చలివాలు=ఆనవాలు "పయస్మితాన్" అని మూ. ఇచ్చట పదము 'చలివాలు' కాదు. అది "చిలువాలు" పాఠభేదములలో 134 చలివాలు. తెలిపాలు"—అని పాఠభేదము చూపబడినది. కాని వ్రాత ప్రతులలోను, ఉత్తరాత కవిప్రయోగముల మూలమున— "చిలువాలు" అనునది స్థిరపడినది.

ద్వి—ఫలవిశేషంబులు పాయసాన్నములు

చిలువాలు వెన్నలు చీని చక్కెరలు—

రం. రా. బాల 53 పుట

శ. ర. సూ. ని రెండు నిఘంటువులును దీనిని చూపినవి. (సూ. ని 3 సం. 173 పుట)

ఇంకొక విశేషము. సూ. ని...'చిలువాలు' అను పదము చూపియు, తిరిగి "చలివాలు" అనుపదము గ్రహించినది.

చలివాలు వి. (చలి+పాలు) ఆనవాలు. ఇగురఁగాచిన పాలు.

క. చలివాలు నవ్వులడ్డువములు చన్నులు.

"శ్లో. పయస్మితా... సం. నైష నైష. 6. 134. 16-107. (శం. వేదం వ్యాఖ్య)

సూ. ని. లో వేదము వారి వ్యాఖ్య ననుసరించి ''చలివాలు'' అని యీయబడినది.

చిలువాలుకు - చిఱువాలు—అని రూపాంతరము గేదు.
అనవాలనఁ జిఱువాలు నా నెసగు. ఆం. భా.
చిఱువాలు వెన్నలును అ. పు. క. 1.23
చిఱువాలు వెల్లువలు ఆము. 1-82 (3సం. పుట 166)

కాని యీ ప్రయోగము లొకటియు—'చిఱు' శబ్దము ప్రాసలో లేవు - కావున చిలువాలు అయినది సరియైన రూపము.

(8)

అర్ఘ్య పాద్యములు

సీ. పా. చదలేఱు వీచి హస్తముల నిర్మల వారి
నంఘ్రుల కర్ఘ్యపాద్యంబు లొసగ — (3-9)

వ్యాఖ్య ''చదవేఱు=ఆకాశగంగ, వీచిహస్తములన్ - అలలనెడి చేతులతో (రూపకము, నిర్మలవారిన్=పరిశుద్ధమైన నీళ్లతో అంఘ్రులకున్= పాదములకు అర్ఘ్యపాద్యంబులు - పూజార్థమును పాదార్థమును అయిన జలములను, ఒసంగన్ - సమర్పింపఁగా (అర్ఘ్యమర్ఘార్హే పాద్యం పాదాయ వారిణి'' అమ) పాద్య అనుటచే-అంఘ్రులకు అనావశ్యకము కావున నిది శ్రీనాథ పాఠము కాదని తలంచి మూలాను సారముగా నిర్మల వారిజాంబులన్=పరిశుద్ధమైన తామరలతోను అట్టి జలముఁతోను, అర్ఘ్య=పూజార్హ ద్రవ్యములను — పాద్యంబుఁన్=పాదోదకము ను'' అని పాఠార్థములు, మార్పదగునని తెలుపుచున్నాఁడ మూలము

విష్టరంతట కుశాభిరద్భిః పాద్య
మర్ఘ్యమథ కచ్ఛరుహాభిః
పద్మబృంద మధుభి ర్మధుపర్కం
స్వర్గ సింధు రది తాతిథయే స్మై॥ (5-7)

శ్రీనాథుఁడీ యర్ఘ్య పాద్యమను పదమును నైషధమునందే వేఱొకచో ప్రయోగించినాడు.

సీ. పా. ప్రణతమౌళి మణిప్రభాని కాయంబుతో
బానీయమున నర్ఘ్యపాద్యమీఁగి— (4-5)

ఇచట వ్యాఖ్య పానీయమునన్=నీటితో, అర్ఘ్యపాద్యము అర్ఘ్య=పూజాదికమైన జలమును — అర్ఘ్యమర్ఘార్థే పాద్యం పాదాయవారిణి అమ. అర్ఘార్థే జలే'' అని రామాశ్రమీయము పాద్యము — పాదప్రక్షాళనార్థ జలమును - ఈఁగి — హస్తపాదములను కడుగుకొనుటకు) ఒసంగుట (పుట 291).

తృతీయాశ్వాసమున (3 6)లో ''అంఘ్రులకర్ఘ్య పాద్యంబు లొసగ-'' అని-పాద్యముతోపాటు, శ్రీనాథుడు అంఘ్రి శబ్దము చేర్చుటవలన-నిది పునరుక్తమై - వ్యాఖ్యాతల విమర్శనకు గురియైనది. కాని చతుర్థాశ్వాసమున (4-5) పానీయమున నర్ఘ్యపాద్యమీఁగి అని యుండుటచేత నిచ్చట నది విమర్శితము కాలేదు —

శ్రీనాథుడు

''అంఘ్రుల కర్ఘ్య పాద్యంబులొసగ'' అని ప్రత్యేకముగా అంఘ్రిశబ్దము (పాదము) చేర్చుటలో నెంతో విశేషమున్నది - అది ఆరాధ్య శైవ సంప్రదాయికమైన అతిథిపూజ మూలమునగా అతిథి పూజ వైదిక సంప్రదాయికము — శ్రీనాథుడు వర్ణించినది శైవ సంప్రదాయికము.

అతిథి

	వైదిక సంప్రదాయము	శైవ సంప్రదాయము
1.	కుశాసనము వేయుట— అనగా దర్భాసనము—	ఈ మూడును శైవ సంప్రదాయమున నుండవు
2.	తామర పూవుల నర్పించుట -	
3.	మధుపర్కము సమర్పించుట	
4.	పాద్యము=పాదములు కడుగు కొనుటకు జలము	ఇది శైవములోనున్నది.

వైదికమున కేవలము పాదములు కడుగుకొనుటకు జలము—అని అర్థము కాని—శైవమునందట్లు కాదు — శైవమున - అతిథి తక్కిన వారివలె, కేవలము మానవ స్వరూపుడు కాడు — అతడు జంగమము— అనగా చరించుచున్న శివుడు- శివుడే జంగమ స్వరూపమున నున్నవాడు గావున ఆతడు వచ్చినపుడు — ఆతని కాళ్ళు — గృహస్థు కడుగును ఆ వైదికమున—వచ్చిన యతిథి తాను స్వయముగా కాళ్ళు కడుగుకొనును, శైవమున నట్లుగాదు. గృహస్థు ఆతడు శైవుడే — ఆతడు వచ్చిన జంగమమునకు కాళ్లు కడుగుటకు — ఒక పళ్లెము నుంచి — ఆ పళ్లెములో నాతని కాళ్ళు కడిగి — ఆ పాదములను కడిగిన నీళ్ళను తాను— పాశించును — అనగా గ్రహించి — త్రాగును — శైవమున దీనికి ''పాదోదకము'' అని సాంకేతికము —

పాల్కురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్ర — ప్రారంభమున — దీక్షా ప్రకరణమున- శైవమత సిద్ధాంతములను దెలుపుచు.

1) విభూతి మహిమ —

2) రుద్రాక్షమహిమలను శ్రుతిస్మృతి పురాణేతిహాసములచే ప్రమాణీకరించి —

3) పాదోదక మహిమ — ను నట్లే - పై ప్రమాణములచే నిరూపించినాడు — ఇందు 55 ద్విపద పాదములలో పాదోదక మహిమ గలదు —

ఈ ప్రకరణమునందే సూరసానమ్మ కథలో పై పాదోదక సంప్రదాయమునిట్లు తెలిపినాడు —

సూర సానమ్మ మాదిగవాని వేషముతో వచ్చిన శివుని (జంగమము)

"పాదములు గడుగ యర్ఘ్యపాదకంబు

లొదట ప్రాశించి." అని స్పష్టము చేసినాడు (పుట 119)

వైదికమున. జలము పాద ప్రక్షాళనమునకు మాత్రమే — యుపయుక్తము— శైవమునవట్లుగాదు — అపాద ప్రక్షాళన జలమున కొక-పవిత్రత యున్నది — అది ప్రాశింపదగినది. శ్రీనాథుడారాధ్య శైవ సంప్రదాయములను — జీర్ణించుకొన్నవాడేగాక — పండితారాధ్య చరిత్ర పద్యకావ్యముగా చేసినవాడగుటచేత — "అర్ఘ్య పాద్యములను' చోట మూలములో లేని—అంఘ్రులకు (పాదములకు) అని చేర్చినాడు.

శ్రీనాథుడే హర విలాసమున చిఱుతొండనంబి కథలో

క. "శ్రీపాదంబులు గడిగెను-
శ్రీపాదోదకము గొనియెంజెలువయు దాసున్"
వ్యాపారి సార్యభాముడు— (2-125)

అని యీ సంప్రదాయము తెలిపినాడు —

అర్ఘ్యపాద్యములు ఇది నిఘంటువుల కెక్కలేదు.

బ్రౌను తన నిఘంటువున దీని నిచ్చినాడు -

"అర్ఘ్యము ... ... పూజార్థ జలాదికము.

అర్ఘ్యపాద్యాదులు - The same with the addition of water for the feet.

అర్ఘ్యపాత్ర - A vessal for this — బ్రౌణ్య నిఘంటువు. పుట - 67.

'అర్ఘ్యపాద్యములు' నాచన సోముడు ప్రయోగించినాడు.

సీ. పా. ఆకాశగంగ నీయడుగుఁ గడుగుచు నీ
కిట్టి ర్ఘ్యపాద్యంబులిచ్చె నెంత - 2-115

శైవులు పాదములను కడుగునప్పుడు పళ్లెములోనుంచి కడుగుదురు — అప్పిని ఆ పళ్లెములోనే భోజనము చేయుదురు — దీనికి 'అర్ఘ్యపళ్లెరము' అని పేరు.

క. అని భోజ్యంబులు శీఘ్రం
బునఁనిడి తన "యర్ఘ్యపళ్యమున" నిడ్డ బొ
త్తు నంగుడువఁజాచి" కేయూరబాహుచరిత్ర 3-242

ఈ అర్ఘ్యపళ్యము నిఘంటువుల కెక్కలేదు.

పిచ్చివాడు

శ్రీ కె. ప్రభాకర్ స్వామి

పిచ్చివాడు పరుగెత్తు కొస్తున్నాడు
కోటి భావాలతో,
కోటి రత్నాలకు నిలయమైన
సేతువు లెంపుకున్న సంద్రంలా.
రత్నాలకై తిరిగి చూడడు
స్వప్నాల్లో వస్తూ ఉంటాడు.
వలగురిలో నవ్వులసాలు;
ఆ నవ్వులన్నీ పువ్వులు కాదంటాడు.
పువ్వులన్నీ నవ్వులే అంటాడు.
కదిలినాయి కవుల కలాలు
పిచ్చివాని భావాల కోటకు
పిచ్చివాడు నవ్వుతున్నాడు
అలనాటి శ్రీకృష్ణునిలా;
తన్నిందట తన ప్రేయసి
చెప్పకుంటే క్షమాపణ.
పడుచువాళ్ళ పరువాలు—
పడిలేచే కెరటాలవి.
కెరటాలను కలతపరచే
రవి కిరణాలే వాళ్ళకు పిడిబాకులు.

పిచ్చివాడు నడుస్తున్నాడు
అహంలేని మహర్షిలా.
గమ్యం లేని పయనం వానిది
వలపులు, పిలుపులు లేని
జీవిత మది.
వలపులేని బతుకు—
నోచుకోని అమృతం అది.
పిలుపులేని బతుకు
దాచుకున్న విషం అది.
పిచ్చివాడు మండిపడుతున్నాడు
వెలుగుతున్న సూర్యునిలా.
వాని మదిలోన చలిమంట;
ఆ మంటలోన తన ప్రేయసి.
ఆ మంటే
లోకాన్ని నవ్వించే చలిమంట.
గాయపడిన హృదయాలు—
మబ్బు మాటుని రవి కిరణాలవి.
ఆ మబ్బే తొలిగాదో—
చలిమంటల హృదయాల్లో సైతం
మంటలు పుట్టుతాయి.

వైర భక్తి

జమదగ్ని

ప్రథమాశ్వాసము

౧

శైత్యము, నౌష్ణ్యమున్; వెలుగు; జాయయు; దెల్పుచు, రంగు నెందు సాం
గత్యము లేక భిన్నములుగా గన వచ్చియు, మూడు జంటలున్,
వ్యత్యయ మేమిలేక యొక వహ్ని వికారము లైనయట్లు, సా
ధిత్యము లేనటుల్ తనరు వస్తువు లన్నియు నాత్మయే యగున్॥

భక్తియు వైరమన్న కనవచ్చును భిన్నము గాగ, భావ ము
ద్రిక్తత నంది లక్ష్యముఖ తీవ్రగతిం గని సిద్ధి నందుచో
నుక్త విభేదమంతయును నుద్ధృతమై చను, దైవ వైరమున్
భక్తిగ సత్ఫలం బిడును, భాగవతోక్తి ప్రసిద్ధ మైయ్యెడిన్॥

అటు నిటుగాక యూగిసల యాటగ సాగెడి జీవితంబె యే
మిటు కొఱగానిదై చనును, మేలి మనుష్య శరీర మబ్బి, య
ప్పటు మగు దైవభక్తి గను వానిది భాగ్యము, వైరమైననున్
పటుతర మైన వానికి నవశ్యము తత్ఫలసిద్ధి యయ్యెడిన్॥

వైరము భక్తి యౌటయును, భక్తి యొకప్పుడు వైరమౌటయున్
సారవిహీన మౌ జగతి సాధ్యమె, యంతయు లీల, యాశ్రయం
బేరికి నెట్టు లీ బ్రదుకు లిచ్చునొ నేర మెఱుంగ మీ తయున్;
పార రహస్యరూప నిజసర్గ విలాసికి కేలు మోడ్చెదన్॥

స్వర్ణరంభా పరివృఢపాళి నావృతం
బై నెట్టు కుడ్యంబు లాక్రమింప
స్థగిత రత్నచ్ఛటా ధాళధళ్యంబు క
న్నులను మాయించి లో వెలుగు దెలుప
శిఖరస్థ కలశ రోచిస్సు రోదసి
యంత శ్రీదాకాశముట్టు వెలుగ
క్రాంత కక్ష్యాసేక శాతలిదాయక మహా
ద్వార్స్థ మానంద వసతి గాగ

తమ్ము తా మెఱుంగని దివ్య తన్మయమున
నచటి కరుదెంచి నట్టి దిగంబరులను
జయు విజయు లడ్డగొనగ హస్తములు చాచి
యాత్మదేహాళి నాటంకమగుట కదరె॥

సనక సనందన ప్రముఖ సారస సంభవ మానసోద్భవుల్
కినిసి, "జనింపుడింక భువి, కిల్బిష మూర్తులుగాగ" నంచు నా
డిన, సహా నెల్ల గుంకి, గరుడింగను పన్నగు లట్లు చుట్టలై
కొనిన పదాబ్జముల్ విడని కూళల పై, దయ సూపకుండిరన్॥

వెలువడి శ్రీ ప్రభుండపుడు, విశ్రుత కీర్తుల దేవమౌనులన్
గొలిచి, యను గ్రహింపుడని, కోరికతో గొనిపోయి లోనికిన్;
నిలిచిన ద్వారపాలకుల నిద్దర కారుణికత్వ మొప్పగ
గ్గొని గని, "మౌనివర్యు లదనుంగని యాడిన మాట తప్పునే?

తెచ్చిన ఘోర్యమంతయును దీఱినవేళ సహమ్మహెచ్చి, నే
మెచ్చెదనంచు, మీ రిటు లమేయ మహాత్ముల సద్గ్రంచి యీ
హెచ్చు తెచ్చికొంటిరి, రిక బొందుడు మహీస్థలి, కందుమీకునై
వచ్చెద మూడుమారు, పిదపన్ గనవత్తురు మీరె నన్ను" నన్॥

అది సంపూర్ణ దయా మతిన్ బలుకు మాటయ్యాన్, భవిష్యన్మహో
పద బీజంబుగ వారి డెందముల నా వాక్యంబుగా, వైర భా
వద దేహంబుల దాల్ప జేసినది, సర్వద్వంద్వ సంపీడనా
స్పదులై వహ్నులు సోదర ద్వయము చే వారంత భ్రష్టాత్ములై॥

అంతట దాని భక్తియును, యప్పటినుండియు వైర మౌట, తా
నెంత విచిత్రమయ్యె, నదియే సహజంబగు ప్రకృతి చూపిన్;
సుంత విలంబ మోర్వ నటు చూచుచు నుండగ వారు జారి వి
భ్రాంత మనస్కులై కనిరి రాక్షస దేహములన్ మహాధ్వనిన్॥

శాప మిచ్చిన మునుల కెంజాయ కనులు
తెల్లబడలేదు, విష్ణువే తేర్చె వారి;
దానగా దయదలచి వాగ్దాన మొసగె,
నిదియె వైరహేతు వగుట దెంత వింత!

మునులకు నడ్డు నిలిచి తిమిపో యిటులాడునె సాధువుండు? వా
రిని దగాడి శాపమును దిపఁగఁ గోరఁడు, మూడు పుట్టువుల్
చన వలెనంచు జెప్ప, గడ చన్న దినంబుల నెల్ల విస్మృతిం
గని, యిటు నూతనాగతుల గౌరవముం బొనరించు టొప్పునే?

కని కని మేము గుమ్మమున గాపయి చేసిన సేవయెల్ల వా
ర్ధిని బడిపోయెఁ గంట నెదిరింగనకుండ యథేచ్ఛనేల న
మ్మును వెనలేని గౌరవము పొందిరి. మాధవు చిత్తమేమియో
కనవలెఁగాక, వ్యర్థముగఁ గాలము నీదృతమె తిట్టు నందియున్॥

పనివడి దాసభావమున వాలిన దంతయు వమ్ముగాగ మే
దిని జని యేమిసేయువలెఁ? దెన్నులు చూచుచు నూరకుండగాఁ
జనునె? యనర్థమయ్యెనని, సాగి తనంతగ వచ్చునట్లు చే
యను వలె, నప్పుడాని చరితార్థత కల్గదు జన్మజన్మకున్॥

వటి పుణ్యాంబోయి స్వరాసమందు
వార లింతశ మించి తత్త్వమ్ము కనరు
జయ విజయు లట్టి యూహలు చాల పెంచి
కనిన జన్మంబు లవి త్రి జగమ్ము లెఱుఁగు॥

మునుపటి జన్మమం దనుజ మూర్ఖుఁడు, భూమిని చాపచుట్టి వా
ర్ధిని దిగ ద్రొక్కి జీవతతి దిమ్మెర వోవఁగఁజేయు, వాని వెం
టనె చని కోలమై విభుఁడ డంచెను. మేదిని నుద్ధరించెఁ; ద
మ్ముని మృతిఁగాంచి యన్న కను ముందయినన్ వధియింతునే ననన్॥

ఏడా విష్ణువు? లేఁడు లేఁడు కనరాఁడే యున్నచో నంచు, ను
న్నాఁడ న్నేను, నుతేనుగా కెవఁడురా నాథుండు నశ్యాని కం
చాడన్ జంకని తం డికిన్, సుతుఁడుగా నా యయ్యయే సర్వమం
చాడన్ జాలిన భక్తశేఖరుఁడు ప్రహ్లాదుండు జన్మించినన్॥

చూపుము చూపు చూపు మెట చూపుమటంచును తండ్రి,రక్కసుం
డై పసివాఁడటన్న దయమైనను బూనక, కన్నబిడ్డనిన్
రాపిడి, చెప్పరానిదగు కౌర్యము చూపగ, నారసింహమౌ
రూపు ధరించి సర్వగుఁడు రూపడగించెను వానినంతటన్॥

నోచేని యుగంబులయ్యెఁ, గనరాఁ డిమ్మాడ్కి నవ్విష్ణు, వీ
మున్నంటన్ సరి, వట్టి [illegible]య బదుకై మాయించుచున్నాఁడు,మా
కన్మారమ్ముల కేమిటన్ గొఱత? మాయన్ మాయలో గెల్వ, మిం
కన్నాళ్లెట్లు సహింను చూతమని యా యన్నయ్యయున్ దమ్ముఁడున్॥

నిద్రాగ మొద్దొకఁడగుచు, నిద్ర నెఱుంగని వాఁడొకండునై,
యుద్ధులు లోకకంటకత నేచి, త్రిలోకము లొక్క పెట్ట నా
పద్దశనుంది, 'హే భువన పాలక! రావణ కుంభకర్ణులన్
గద్దరులిన్ వధించి మము కాపుమటంచును గోలపెట గా॥

దుష్కృత మూన, వారికయి తోయజనేత్రుఁడు రామమూర్తియై,
శిష్టజనావన ప్రణయసింధువు, దైవవిరోధ భావనా
దుష్టజనాంతక ప్రళయతోయధియౌచు, భువిన్ జనించు నోఁ,
గష్టుఁడు రావణుండు పరకాంతను దల్లిని దొంగిలించఁగన్॥

భావమదెంత చిత్రముగఁ బాఱెనొ రావణు మానసంబు సం
భావన సేయఁ దెల్లమగు. వారిజ నేత్రుఁడు నమ్మకమ్ముతోఁ
గావలికాయు తన్ను పెడగానిడి, మౌనుల నాదరించెనన్
భావన పుట్టఁజేసె మునివాచ్య వినాశన ఘోరభావనన్॥

ఋషిపుత్త్రం జనుఁడన్న దానికయి, యా మూర్ఖుండు తద్స్వామి ను
ద్ధవిడిన్ మాయము చేయఁబోయి మడియున్. దద్భ్రాతృ మోహమ్ముచే
నెవఁడైనన్ సరె వాని జంపుదునటం చీమేటి తాఁ జచ్చె, రెం
డవ జన్మంబిది యైన సత్వరము వీడంగోరు నా తమ్ముతోఁ॥

శివభక్తిన్ ప్రకటించి, చావఁడను వాసింగాంచి యన్విష్ణు వె
య్యా వినచ్చున్ మఱి వాని నన్నిటిని మాయం జేసెదన్, రాక యే
మవు నంచున్ దెగఁజాలి, యప్పటికి రాఁడాయెన్ [illegible]దాయంచుఁ, ద
క్కొవియున్ గాదు, హరింతుఁ జేయసీని కెట్టో వచ్చు నంచెంచెడిన్॥

ఏమ్మఁడెట్లైన వచ్చి నిజవృత్తిని మున్నటు నిల్పుపాటి, నీ
మన్నగు దేహమూడ్యవలె, మాయను మాయము చేసియైన నే
గన్న జయంబు, నా యదియకాదె పరాక్రమమంచు పొంగెడిన్;
మన్నగు మానసంబు చనుమార్గము లిట్టివి, దాని నమ్మటా?

నమ్మిన రావణుం డపుడు నాశనమందెను, కాని వైరమే
యిమ్మడు గౌచు భూమి ప్రభవించెను సాత్త్వతి చెడ్డబిడ్డగా,
నమ్మహనీయురాలు తన యయ్యకు చెల్లెలుగాగ, బావ భూ
తమ్మును స్వామి యోర్చె నరుదారగ నూఱును నిండునంతకున్

ఎప్పటి కప్పుడే యెగడి హెచ్చిన పంతము పూను నన్నకై,
యప్పటి కప్పుడా యెగయు టంతయుఁ దగ్గుచువచ్చు తమ్ములున్,
జెప్పక చెప్పుచుందురొక చిక్కని సత్యము, దేహ మెప్పుడం
దొప్పిన జీవునిం బడియె యుండును, బంధుతలేదు దేహికిన్॥

ప్రథమ భవంబు నందుననె బంగరు కన్నుల రాక్షసుండు ని
ర్మథనమునంది, వ్యర్థమని మానియుఁ, బూనెను వైరమన్నకై;
ప్రథిత సుషుప్తి కోరికొని, బంధుర దేహము భ్రాతృపోషణన్
విధిగ వహింపఁగా నయి, ప్రవృత్తి విహీనతనందె లోపలన్॥

ఆ యుధ మాత్రుఁడై నిలిచె నాతఁడు రెండవ జన్మమందు, లా
రీయమునందు శాపమది తీరున దెప్పఁడటంచు వేచె నం
తే, యటు కాక యా ఘనుఁడు తేపకు తేపకు రెచ్చిపోయె, నాఁ
డాయన భార్యఁ దెచ్చితినహా! యది సత్ఫల మీయలేదహో!

ఏయమ యా మహాత్ము వరియించునొ యా యమ నేను భార్యగా
జేయుదు, రాక యేమగును? చిత్తజబారికి నగ్గమై సుధీ
ధ్యేయుఁడు క్రోధమూర్తియయి తీగ్వెద వీని నటంచువచ్చు, రా
డా? యపుడేమి చేయువలె నయ్యది యప్పుడె చూడగావలెన్॥

అతఁడంతఁ దలంచి విభునందు మహత్తర వైరమూన, శ్రీ
లా తను నెత్తి, వాని వ్యథలన్ హరియుం గని హాస్యశీలియై
యా తను వచ్చె, బంధుతయు నిచ్చెను, సన్నిహితత్వముప్ప, నా
చేతనె ముక్తి నీకనెడు చింత మనంగూర్చెను చిన్నవాఁడవే!

దైవ మదేమి చేసినను దప్పక జీవుల మేలుగూర్చ యే
భావనచేసి చేయు. తన భావము నట్టిదయైన జీవుఁడా
దైవము నాజ్ఞ శీర్షమున దాలిచి భక్తుఁడు గాఁగ నిల్చుఁ; గా
దా విపరీతబుద్ధిగని యందును వైరము, రెండు నొక్కటౌ॥

భేదము జీవుఁడందనగు వేదన యందగు, భక్తుఁడైన య
న్వేదన స్వాదువై విభుని ప్రీతికిఁ బాత్రునిజేయు, వైరియై
చే దగు వేదనం బడి, యసీయుని సర్వజగంబుతిట్ట, నా
గాదిలి బిడ్డనెట్లొ యటుగా జగదీశుఁడనుగ్రహింపనా॥

పదితల లిర్వదౌ కనులు బాహువు లిర్వది సంకుచించి వాఁ
డుదయమునందె, బాహు యుగ ముజ్జ్వల నై తమ దొక్క డెక్కునై,
యదనునఁదానె విష్ణువును త్ర్యంబకుఁడంచు వచింపనెంచెనో?
పొదలిన తొందరై మరుగు పొందుటలో నవి విస్మరించెనో?

> కడుపు పగిలించుకొని తాను గన్న కొడుకు
> నిట్టు లతి బాహు నేత్రుఁడై యెదుట పడగ
> నమ్మ సాత్వతి వాని ముద్దాడ వెఱచె,
> నాయువుండున యంచు విహ్వలతఁగనియె॥

ఎవ్వరు వీని నెత్తికొన నెక్కుడు చేతులు పెచ్చుకన్న లే
వవ్వని మాయ పోనొ మహిమాఢ్యుఁ డతఁడు వధించు వీని నం
చ వ్వగ నొందు తల్లికయి యంబరవాణి నిజమ్ముచెప్పె. నా
యవ్వ కుమారు నెత్తికొన నందఱ కాత్రత నంది యీయఁగన్॥

తమ మేనత్తకు పుత్త్రుఁడొక్కఁడిటు నింతై పుట్టెనన్ వార్తకున్
దమ వారందఱు విడ్డూరం బనుచు బాధం బొందగాఁ, జూచి వ
త్తుము మే మంచు బుజాలపై ధనువులున్ దూణీరముల్ దాల్చి, పూ
ర్వము తా మట్టులె యుంటి మన్నటులు తోపన్ రామకృష్ణుల్ చనన్॥

వచ్చిన యన్న బిడ్డలను వత్సలతన్ గని, పుట్టినింటి వౌ
ముచ్చట లన్నియుం దెలిసి, మోదము నందుచు, 'రండురండు! మీ
నచ్చిన బావఁజూతు'రని నవ్వుల కుప్పగ నున్న బాలునిన్
మెచ్చి యొసంగె రామునకు, మేకొని యాతఁడు తల్లికీయఁగన్॥

రాముని చేతులన్ నిలువ రాని శిశుంగొని తల్లి 'అల్లుఁడా!
యీ మొగ మొల్క పుట్టెనని యెంత ముదంపడియుంటినో పరం
ధాముని వింత చేతలకుఁ దల్లడ మందుదు నంతకంటె. వీఁ
డే మెయి బట్టకట్టి బ్రదుకెటు నయించునా నేరకుండెదన్॥

పుట్టిన దాది యీ దిగులె పుట్టెఁడు దుఃఖము నెత్తికెత్తి నా
కట్టెడి దైవ, మీ తను వికారము కల్గిన బిడ్డనిచ్చి, యా
గుట్టుగంగనైన, యది గుడియకుంపటి. యెంత పాపమో
యిట్టి నిసుంగు నిచ్చెఁ బరమేశ్వరుఁ డంచును స్మరించుచో

> ఏమి రా బావ నీ వింత యేడ్పుగొట్టు
> వాఁడవైతివి, రామ శబ్దంబె పడద?
> యన్న చేతుల గిలగిల లాడినావు
> రమ్ము నిన్నేమి చేయను రా యటంచు॥

> అత్త చేతులనుండి తా నందుకొనియె
> నంతలో బెమ్ము కను చేతు లస్తమించి
> సుందరుండయి బిడ్డ సుషుప్తినందఁ
> గృష్ణుకై పూని తల్లి ప్రార్థించెనిటులు॥

అన్నా! అన్న కుమార! దైవమున కీ యత్తయ్య పై కొద్దిగా
నున్నట్లున్న దయా దయామతి, వధానోద్దేశ మేమె నమున్,
నిన్నున్ నా సుతు మారకున్ బొనరిచెన్. నిర్వ్యాజ కారుణ్యమై
యున్నింపందగు వీని నా కొఱకుగా, మాతండ్రి రక్షింపవే!

> వీఁడు సామాన్యుఁడెన్నఁడున్ కాఁడు కాఁడు
> కన్న చేతులు నీ వెత్తికొన్న యంత
> మాయమయ్యె, యయ్యొ నిపుడు సామాన్యుఁడుగను,
> వీని పాలిటి మృత్యు వీవేనటయ్య!

అంబరవాణి చెప్పినది యర్భకుఁడీ భువిఁబడ్డ నాఁడె, యీ
త్ర్యంబకుఁడున్ జతుర్భుజుఁడు దారకుఁడౌ టదియే మట దుః
ఖంబును దీర్చఁ, బెక్కులగు కన్నును చేతులు వేరి వల్ల కా
నంబడవో మఱౌతఁడె యఱఁచును వీనిని తప్పదంచునున్॥

అది మొద లీ దినంబు వఱ కల్లుఁడ నే పడుచున్న బాధకున్
దుది కనరాదు; మృత్యువును ద్రోయగ నెవ్వరు చాలువారు?
దియును మేలె, శస్త్ర మృతినే వరియించును క్షతి యుండు
యెద పరితాపమందు నది యెంత విరుద్ధుఁడౌ వీఁడటంచునే!

కడుపునఁబడ్డ వాఁడగుటఁ గాంక్ష యొనరును వీనికైన, మీ
చెడు గొనరించు తప్పక యసీ యని పించుచు నెన్నొ దోహముల్
కడు కొని నీవు నా కొఱకు గా క్షమియింపుము నాటిదాక, య
ప్పుడు మఱి నూఱు నిండినను పొందగఁబో నెటువంటి దుఃఖమున్॥

> నాయనా! కృష్ణ! నీవు కన్నావు వీని,
> వీఁడు కన్నాఁడు నిన్ను, కన్పించె భేద;
> మెంత భిన్నంబుగా నున్న యీ జగంబు
> సర్వ సమతను గూర్చెడి సాధనమ్మె॥

నాకును మాట యిమ్మనుచు నాయన వేల్పులు పట్టుఁబట
తే కరణిన్ బొనర్ప గలఁడెవ్వఁడుగాని, నరేయటన్న కృ
ష్ణాకృతి వాని యాని మధురానుభవంబును పొందు పాత్రతిన్
జేకొని, రెండు నాళ్ళచట శ్రీయుతు లిద్దఱు నుండి పిమ్మటన్

ద్వారక కేగి, రప్పున శిశుపాలుఁడు బాలుఁడు, వత్సరంబు విం
డారెనొ లేదొ, తల్లి తనకై యిటు లాయువుకూర్చెనన్న మా
టా రయఁ గల్గునే? పయిగ హాయిగ నిద్దురపోయె, గాక ని
ద్రా రతి వంచన క్రియగఁ దాల్చెనొ లో నభిమాన వంతుఁడై॥

తెచ్చిన మానసంబునకు దీటుగ దేహము వృద్ధికాఁగ, ని
ప్పచ్చరమైన బుద్ధి శిశుపాలుఁడు, బాలుర నెల్లఁజీరి, తా
నచ్చపు జ్ఞాన మందిన మహాత్ముని పోలిక నూరిపోయు, మీ
రిచ్చఁ జరింపగా వలయు, నెందులకీ కొఱగాని ధర్మముల్॥

వచ్చిన యీ శరీరమును వ్యర్థము చేయకుఁ డెందు కట్టిలై,
యిచ్చకు వచ్చి నట్లనుభవింపుఁడు, గిట్టుట తప్ప, దందుచే
మెచ్చుగ భోగముల్ బడసి మేల్ బ్రదుకీయ్యఁగటన్న తృప్తితోఁ
జచ్చుట మేలు, పౌరుషము సాగుచునుండిన సాగు నప్పియున్॥

పుట్టిన బుద్ధి కార్యమయి పొల్పుగ లక్ష్యము, దాని కోసమై
యెట్టు చరించినన్ దొసఁగదేమియులేదు, క్షణంబు వ్యర్థమై
నెట్టుట, భోగసాధనము నిష్ఫలమున్ బొనరించుటే యగున్;
గట్టిగఁ బట్టఁబట నవు కార్యము లీభువి, మర్మమింతియే॥

తనకుం దోడుగఁ గొందఱుండ వలెనన్ దాత్పర్య ముంబూని చె
ప్పిన యీ మాటలు వించు బాలకులు, భావింగూర్చి చింతింప, కా
తని వెంటంబడి స్వేచ్ఛమై తిరుగుచున్, దత్ప్రబోధంబులన్
విని యుత్సాహముతోఁ బ్రవర్తిలగ, నా బృందంబు వర్ధిల్లగన్

చెప్పెడి వానిబట్టి జన చిత్తము లూగుట మానవాళి యం
దెప్పుడు నున్నదే, యతఁడహీన మహామతియైన జాతికిం
గొప్పను గూర్చు: హీనుఁడయి కూల్చు ప్రపాతమునందు, ముందు మా
పెప్పుడు నుండ దంపలకు. నెవ్వఁడొ నాయకుఁడుండు రెంటికిన్॥

శిశులకు, స్వీయ బుద్ధినిడి శేయ మదేదియొ తేల్చి వర్తిలన్
పస యొక యింత లేని కడు బాలుర, కెవ్వరు నేమి చెప్పినన్
వశమయి ము దనందు తడి వాలుక వంటి మనస్సుగల్గు బా
లిశులకు: నాయకుండయి మలిమ్లుచుఁడాతఁడు పాలకుండుఁగాన్.

శిశుపాలుండని సార్థకాఖ్యుఁడయి వాపింగాంచె వానాఁడు, మా
దృశుఁడన్యుం డెవఁడంచు వాఁడు పరితృప్తిన్ గండఁడై మించె, తా
ని శకం బేర్పడె, క్షత్రియ ప్రభుత దుర్నీతిన్ సమర్థింప స
ర్వశ ఉన్మార్గమె మార్గమైన యది ధర్మ భ్రష్టమౌ జాతికిన్॥

పెద్దల శక్తులై తెలిసి వీరల యాటలు సాగనీయ, నాఁ
డెద్దెస చూచినన్ నియమ హీనత పెక్కొనె, వ్యక్తి వ్యక్తితోఁ
బెద్దయి చెప్పసాగె, నది విందురు కొందఱు, వారి నంఖ్యపై
పెన్నరికంబు నిల్పినది, విజ్ఞతకున్ మరియాద శూన్యమై॥

చేది యొకండె యిట్లగుట చెల్లెను బో శిశుపాలు చేత, నా
చేదె సమస్త దేశములఁ జెందగ సాగెను, దేశ దేశ మ
ర్యాదలు మాసి యెల్లెడల నాతని వర్గము వృద్ధినందుటన్;
న్యాయవు ధర్మమూను పరిపాలకుఁడే కననౌట కష్టమై॥

తొలుతటి పోలె రూపమునఁ దోపరు రాక్షసులట్లు, చేతముల్
చెలగును వారి మించి, యొక సిగ్గని యెగ్గని యెంచ రెవ్వరున్,
దలఁపుల వెంట సాగుటయె ధర్మము. కాదనువాఁడెవండు? వి
చ్చలవిడి సంచరించి యటు సాగిరి సాగిన యంతకాలమున్॥

ఉరిత్రాడు మిగుల పొడవయి
యురి బిగియక చుట్టుకొనుచు నుండగఁ దమతో
మురిసెడి శిక్షితులం బలె
పర మెఱుఁగక దురిత పరత వర్తిలుచుండన్.

తుది బిగియు కాల మయ్యది
కదియక పోదన్నయటు కంసుఁడు చచ్చెన్,
వెదకించు కొనియు దొరకక
విదితాప మ గర్భజుండె వెల్వడి చనెన్.

దమఘోషుం బలె నుగ్ర సేనుఁడును వ్యర్థ ప్రజ్ఞుఁడై, వృత్తుచే
నమితార్తింగని, మోక్షకాలమునకై యాక్రోశముంజేయఁ, బు
ణ్యము వండెన్; దన కన్న వారలనె కారావాస మందుంచి దు
ర్గముఁడై సోదర వర్గమున్ దునుము నద్దైత్యున్ విమర్శింపఁగన్॥

చని రా తుల్వరు, మేనమామ పిలుపన్ సంతోషమై, దారి వెం
ట నసంఖ్యాక వినోదముల్ సలుపు చాడం బోయి రన్నల్పుల
డ్డిన యొక్కొక్కరి నక్కడక్కడనె గుండెల్ వ్రయ్యగాఁ జంపుచున్,
బెనుభీతిన్ మును మున్నె చచ్చు నతనిన్ విఖ్యాత వీరాగ్రణిన్॥

ఘన సింహాసనమందు నిండుకొలువై, గర్వాంధుఁడై, మట్టునె
న్నిన వీరుల్ తన వారు హెచ్చరికతో నిల్వన్, గరీంద్రము క
న్నానగా దూకు మృగేంద్రముల్ బలెనె చేకోవచ్చు నవ్వారి క
న్నానుచున్ విచ్చిన కన్నులన్ విలువ నుగ్రుల్ రామకృష్ణుల్ వెసన్॥

మడియం జేసెరి, తా నెఱుంగునిది దుర్మార్గుండు, కంసాంతకుం
డడగించున్ దను నన్నమాట తెలియున్, హానిన్ విచారింప కె
ప్పుడు తద్ద్రోహ మొనర్చుటే పనిగ నుద్యాత క్రుధామూర్తియై
పెడదారింబడు శైద్యుఁడాత్మహననా శీఘ్రమ్ము సిద్ధింపఁగన్.

(శాంతకాంతి)

కృష్ణశాస్త్రి - రొమాంటిసిజం

[చర్చావేదిక]

శ్రీ సర్దేశాయి తిరుమలరావు

డిసెంబరు 1976 "భారతి"లో శ్రీ ఇస్మాయిల్‌గారు శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి కవిత్వం రొమాంటిసిజం అని రుజువు చేసేందుకు ప్రయత్నించిరి:

స్వప్నసుందరిపై విరహగీతాలల్లుతూ, గిరజాలు పెంచుకొని గ్లాస్కో లాల్చీలు తొడుక్కొని, ఒక ప్రత్యేకంగా నడుస్తూ, బద్ధకం కలిగిన వ్యక్తిగా శ్రీకృష్ణశాస్త్రి రూపింపబడ్డాడు ఇస్మాయిల్ గారి చేత - ఇట్లా ఉండటమే రొమాంటిసిజం అనిపించేటట్లు - షెల్లీ, బైరను, కీట్సులు సుందరాకారులు కావడం, అల్పాయువులోనే విషాద పరిస్థితుల్లో అసువులు బాయడం, జీవితంలో "తాలిక్కు" పోకడలు పోవడం వారి రొమాంటిసిజానికి వన్నె పెట్టినవి. ఈ వన్నెను దీర్ఘాయువుకలిగి గొప్పహోదా అనుభవించి, ప్రశాంతంగా (simple living, high thinking) కాలం వెళ్ళబుచ్చిన వర్డ్స్‌వర్త్ రొమాంటిసిజానికి లేదు.

ఐరోపీయ సంస్కృతికి గీటురాళ్ళ నదగిన వర్డ్స్‌వర్త్, కోల్‌రిడ్జి, బైరను, కీట్సు, షెల్లి, బ్లేకు, యూగో, హీను వంటి రొమాంటిసిస్టుల కవిత్వాలతో కృష్ణశాస్త్రిగారి "కృష్ణపక్షం"లోని కవిత్వం ఎలాతూగుతుందో ఆలోచిస్తాం.

ఇస్మాయిల్‌గారే ఇచ్చిన రొమాంటిక్ కవిత్వ లక్షణాలను ఉదాహరిస్తూ, అవి కృష్ణశాస్త్రి కవిత్వానికెట్లు అన్వయిస్తాయో పరిశీలిద్దాం.

"రొమాంటిసిజం సంప్రదాయవాదంపై తిరుగుబాటు" ఇది ఇంగ్లీషు రొమాంటిసిజం విషయంలో నిజం. డ్రైడెను, పోపు యుగం అగస్టన్ యుగం అనబడుతుంది. ఇది భావంలో, ఛందస్సులో చాలా గిరిగీసుకొని ఇరుకుత్రోవలో పోతూవుండే సంప్రదాయం. దీనిపై తిరుగుబాటుగా ఇంగ్లండులో రొమాంటిక్ ఉద్యమం వచ్చింది. ఇచట కృష్ణశాస్త్రి సంప్రదాయబద్ధుడే. ఇతనికంటె ముందే కందుకూరి, గురజాడ, రాయప్రోలు, కట్టమంచి ఆంధ్ర సాహిత్యంలో పెద్ద మార్పులు తెచ్చిరి. అంటే అర్థమేమి? ఇంగ్లండులో రొమాంటిసిజం మూలకంగా భావసాహిత్య విప్లవం వస్తే ఇచట భావసాహిత్య మూలకంగా రొమాంటిసిజం అవతరించింది అని. రొమాంటిసిజం అచట కారణం, ఇచట ఫలితం.

"సంప్రదాయ వాదం నస్వాశ్రయమైతే ఇది (రొమాంటిసిజం) ఆత్మాశ్రయం."

ఇది సరికాదు ఈ సందర్భంలో ఇస్మాయిల్‌గారే ఉదాహరించిన కీట్సు "Ode on a Grecian Urn"ను పరిశీలిస్తాం. గ్రీకు కలశంలో కీట్సు కవి సత్యసుందరాలను దర్శించినాడు ఆ పాత్ర లేకుంటే ఈ కవిత్వం లేదు కావున కీట్సు కవిత్వం నస్వాశ్రయమే కాని ఆత్మాశ్రయంకాదు. కృష్ణశాస్త్రి కవిత్వంలో "నేను" (ఉత్తమ పురుషం) ఉంటుంది. కాన అది ఆత్మాశ్రయం కావచ్చును కోల్‌రిడ్జి షెల్లీ, బైరను కవిత్వాలలో ఆత్మాశ్రయత లేదు. John Donne కవిత్వం ఆత్మాశ్రయం ఐనా అతడు రొమాంటిక్ కవి కాదు.

"భావనాబలంచేత మనకు పరిచయంలేని కొత్తలోకాలు తెరవచ్చునంటారు" (రొమాంటిసిస్టులు)

భావనాబలం లేకపోతే రొమాంటిక్ కవేకాదుకదా కవే లేడు అందుకే పోతన సరస్వతిని "భావాంబర వీథివిశ్రుత విహారిణి" అని సంబోధించాడు.

"ఇంద్రియానుభూతిద్వారానే అదృశ్యశక్తుల్ని అందుకోగలం" శ్రీ ఇస్మాయిల్‌గారు ఒక కొత్త Metaphysics సిద్ధాంతం ప్రతిపాదించకపోతే, ఇది స్వవచో విఘాతం అనిపిస్తుంది. రొమాంటిక్ కవులు అందుకొన్న అదృశ్యశక్తులేవీ లేవు.

మెడూసా అనే రాక్షసి తలను షెల్లి 'Loveliness of terror' అని వర్ణించడంవల్ల, ఒక సుందర ... అసహ్యమైన దాంతో మలినం చేసినందువల్ల ఒక కొత్త సౌందర్యం కలుగుతుందంటారు ఇస్మాయిల్‌గారు. ఇది నిజం కావచ్చును. అయితే ఇది కేవలం రొమాంటిక్ కవిత్వ లక్షణం కాదు. తిక్కన చేసిన యుద్ధ వర్ణనలు చదవండి. యుద్ధభూమిని ఉద్యానవనంగా, సరోవరంగా వర్ణించడం కనబడుతుంది. "జుగుప్సా సుందర" "భయంకర రమ్య" వంటి సమాస గ్రథనం ఉన్నది. ఇట్టి ప్రక్రియ అదొక కవిత్వపు టెక్కికే కాని కవితాతత్వం కాదు

"రొమాంటిసిజానికి వ్యక్తివాదమూ వ్యక్తి స్వేచ్ఛాప్రవృత్తులు" స్వేచ్ఛవద్దని ఎవడూ అనడు నిరంకుశాః కవయః అని ప్రాచీనులే

కవిత్వంలో ఆత్మాశయత ("నేను", "మేము") ప్రవేశపెట్టింది భారతదేశంలో వైదికర్షులు. ఒమర్‌ఖయ్యాం ఆత్మాశ్రయ కవిత వ్రాసినాడు.

కృష్ణశాస్త్రి వ్రాసిన

"ఏననంత శోకభీకర తిమిరలోకైక పతిని",

"జగమునిండ స్వేచ్ఛాగాన ఝరుల నింతు"

"నేను ప్రళయ ఝంఝా ప్రభంజన స్వామి"

వంటివి కాజీనజ్రుల్ ఇస్లాం, వాల్ట్ విట్మన్ కవిత్వాలలో కన్పిస్తాయి. ఈ భావవీచికలు రాజకీయార్థిక స్వాతంత్ర్యాలనుకోరే కవులు వ్రాసేవి కాని, రొమాంటిసిస్టులవి కాలేవు. ప్రపంచాన్నంతా వలసలుగా మార్చుకొనిన రవి అస్తమించని సామ్రాజ్యమునకు కేంద్రమయిన ఇంగ్లాండులోని రొమాంటిసిస్టు కవులిట్లెందుకు వ్రాస్తారు?

కృష్ణశాస్త్రి కవనంలో విషాదం అంతర్వాహినిగాను, ఒక్కొక్కప్పుడు కట్టలు తెంచుకొని ప్రవహిస్తూ ఉంటుంది. ఇట్టి విషాదం గ్రీకు నాటకకర్త యురిపిడిస్, భవభూతి, ఫ్రెంచికవి బాడ్లార్ (Baudelaire), జర్మనుకవి హోల్డర్లిన్ (Holderlin) లలో కన్పిస్తుంది. ఈ విషాదమే బాడ్లార్ హోల్డర్లినులను ఉన్మత్తులనుగా చేసింది. కృష్ణశాస్త్రిని వైష్ణవ ఆధ్యాత్మికతవైపు తీసికొనిపోయింది. రొమాంటిక్ కవిత్వంలోని ధ్యేయరాహిత్యం వర్డ్స్‌వర్త్‌చేత Ecclesiastical Sonnets వ్రాయించింది. షెల్లీ, కీట్సులను Hellenism (గ్రీకు నాగరికత)వైపు కొనిపోయింది. రొమాంటిక్ రివోల్టు తెచ్చిన "చలం" అరుణాచలంలో ఉన్నాడు.

"శాస్త్రిగారి పద్యాలు ఇంచుమించు అన్నీ ప్రేమగురించే... ప్రేమలో అన్ని దశలున్నా ఆయన్ని ఆకర్షించింది విరహంమాత్రమే"

కృష్ణశాస్త్రి విరహగీతాలే వ్రాసివుండవచ్చు. విరహగీతాలు రొమాంటిసిజంకాదు. ప్రసిద్ధ రొమాంటిక్ కవులు విరహగీతాలు వ్రాయలేదు. ఆధ్యాత్మిక విరహగీతాలు పవిత్ర బైబిలులో Solomon songs లోను, భాగవతంలో "భ్రమర గీతాలు" లోను, టాగూరు "గీతాంజలి" లోను ఉన్నాయి. వేంకట పార్వతీశ్వర కవుల "ఏకాంత సేవ"లో వున్నాయి. ఇట్టి విరహం ఆళ్వారుల పాశురములలో ఉన్నాయి. వారి పాశురములలో కవి ప్రేయసి. భగవంతుడు స్వామి ("నీవు") కృష్ణశాస్త్రి early poetry లో అతనే "నేను", ఊహా ప్రేయసి "నీవు". కృష్ణశాస్త్రి శ్రీ వైష్ణవం మోజులోపడ్డ తర్వాత ఇదంతా తారుమారయింది

"ఆయన ఊర్వశి ఊహాలోకంలోనేతప్ప లభ్యంకాని ఆదర్శ ప్రేయసి."

ఊర్వశి వేదంలో వేఉంది. ప్రేమ Platonic మరియు Sensual అని రెండు విధాలు. మన ప్రబంధకవులు Sensual love నే వర్ణించిరి. కృష్ణశాస్త్రి ప్రభృతులు Platnic love ను పోషించిరి భావకవులు తెలుగు కవిత్వంలో తెచ్చిన ముఖ్యమైన విప్లవం ఇదే కృష్ణశాస్త్రి "ఊర్వశి", కీట్సుయొక్క Endymion, షెల్లీయొక్క Epipsychidion, బాపిరాజు "శశికళ"లు motif లు. వీటి ఆధారంగా కవులు సత్యసుందరాలని దర్శిస్తారు, దర్శింపజేస్తారు.

ఇంతవరకు రొమాంటిక్ లక్షణమదికాదు ఇదికాదు అని వ్రాసితిని. ఇక రొమాంటిక్ కవితా లక్షణాలను సకారాత్మకంగా ఉటంకిస్తాను.

అద్భుతములైన, అతిలోక విషయాలు కావ్యవిషయాలు కావడం - కోలిరిడ్జి Ancient Mariner లో వలె. జనశ్రుతులు పాతగాథలు వర్ణించడం - బైరను Childe Harold, మాక్ఫర్సన్ Ossian లలోవలె. వీర భయానక చరితలు వ్రాయడం - స్కాటు నవలలు, షెల్లీ 'Prometheus Unbound', కీట్సు "Isabella" అనంతభావనాకాశంలో విహారం (Unrestricted flight of imagination) కోలిరిడ్జి Kubla Khan, షెల్లీ "QueenMab", కీట్సు "Hyperion".

ఆలోచనా సరణిలో ప్రతిదాంట్లోను అనంగీకారం (dissent) చూపిస్తూ, గత్యంతరమేమో మాత్రం చెప్పక తప్పించుక తిరుగుట రొమాంటిసిస్టుల ముఖ్య లక్షణం. ఈ మొండి వైఖరే రొమాంటిసిస్టులను అటు సంప్రదాయ వాదులనుండీ (Classicists) ఇటు యథార్థవాదుల (Realists) నుండీ వేరుచేయు లక్షణం. సంకేతం myth లను కవిత్వ శైలిలో భాగంచేయుట రొమాంటిసిజం లక్షణం.

ఈ రొమాంటిసిజం లక్షణాలు కృష్ణశాస్త్రి కవిత్వంలో ఎంతవరకున్నాయో సహృదయులు ఆలోచించండి. కృష్ణశాస్త్రి గొప్ప కవి అగుటకు రొమాంటిసిస్టే కానవసరంలేదు. కృష్ణశాస్త్రిపై A. E. Houseman ప్రభావం ఉన్నదేమో ఆలోచించినామా? కృష్ణపక్షంలో కృష్ణశాస్త్రి కవిత్వం ("కృష్ణపక్షం") చదివితే కొత్త తెలివిడి (Newer sensibility) కల్గుతుంది. అందుకే కృష్ణశాస్త్రి గొప్పకవి.

కృష్ణశాస్త్రి ప్రభృతి భావకవులు, సమకాలీన రాజకీయ సమస్యలను పట్టించుకొనలేదని భూమికి ఎత్తుగా భావవీధుల్లో విహరించేవాళ్ళు అని అనడానికి మూలం "దిగిరాను దిగిరాను దివినుండి భువికి" వంటివి. కవిత్వం వ్రాయడం ఎలా కళో, కవిత్వం అర్థంచేసుకోవడంకూడా కళే. ఈ అవగాహనాకళ అబ్బేవరకూ కృష్ణశాస్త్రి వంటి కవుల కవితాలపార్థం అవుతూ ఉంటాయి. రాజకీయాల్లో పాల్గొనే కృష్ణశాస్త్రులు (ఇది కేవలం ఉపహాసమే కాని ఏకవచనానికి గౌరవ విహ్నం కాదు) కం టెకవిత్వం వ్రాసే కృష్ణశాస్త్రే మనకు కావలె.

అవిరి అపారే కావ్య సంసారే కవిరేవ ప్రజాపతి అని అగ్నిపురాణం ఘోషించింది. ఆనందవర్ధనుడూ ఇదే అన్నాడు.

మంచన, పోతనవంటి కవుల స్వేచ్ఛా ప్రియాళుత ప్రసిద్ధం. కవికి స్వాతంత్ర్యం ప్రాణవాయువు అని అందరూ అన్ని కాలాల్లోనూ ఒప్పుకొనిందే.

"యాంత్రికమైన పారిశ్రామిక నాగరికతని కూడా వీళ్ళు నిరసించారు."

పాశ్చాత్య రొమాంటిక్ కవులు పారిశ్రామిక నాగరికతని నిరసించినమాట నిజమే. నిరసించి ఏమి చేసిరి? ఆ నాగరికతా పరిసరములను వర్జించిరి. ఏప్పటో పారిశ్రామిక ప్రభావంలేని ప్రాంతాల్లో జీవితాలను గడిపిరి. షెల్లీ, బైరనులు ఇటలీ గ్రీసులలో నివసించిరి. వర్డ్స్‌వర్త్, కోల్ రిడ్జులు పల్లె ప్రాంతాల్లోని చెరువుగట్లమీద బతికిరి. వీరికి Lake poets ("సరోవరకవులు") అని పేరు. డేవిడ్ థోరూ ఒక చెఱువు (Walden) దగ్గర కాలం గడిపెను. పారిస్ మహానగర క్లబ్బుల్లో తిరిగే సింజ్ (J.M. Synge), ఐర్లాండు గ్రామాల్లో నివాసం ఏర్పరచుకొన్నాడు. రొమాంటిక్ కవి కాని ఆలివరు గోల్డుస్మిత్తు "Deserted Village" అను హృదయ విదారక పద్యంలో పారిశ్రామిక నాగరికతయొక్క ఘోరాన్ని వర్ణించినాడు. పారిశ్రామిక నాగరికతని గర్హించే మన రొమాంటిక్ కవులు చేస్తున్నదేమి? పట్నణాల్లో నివసించుట, పల్లెల్ని పొగడుట. ఇది విభజిత వ్యక్తిత్వం కాక మరేమి? కృష్ణశాస్త్రి రొమాంటిక్ కవిత్వం వ్రాసేనాటికి, ఆంధ్రలో, అసహ్యించుకో దగినన్ని పరిశ్రమలు లేవని ప్రభుత్వ పరిశ్రమ శాఖలో పనిజేస్తున్న నేను తెలియజేస్తున్నాను. మన రొమాంటిక్ కవులు పారిశ్రామిక నాగరికతను నిరసించినట్లు దాఖలా లేదు. కృష్ణశాస్త్రి అనాడు ధరించే గ్లాస్కో మల్లు ఎక్కడనుంచి వచ్చింది? పారిశ్రామిక నాగరికతను నిరసించింది రొమాంటికేతర కవులగు దువ్వూరి, తుమ్మలలు.

"రొమాంటిసిస్టులకి మరో సామాన్య లక్షణ మేమంటే సంఘాన్నించి పరిత్యక్తులమనేభావం... ఈ వెలికి వీళ్ల విప్లవవాదం కూడా తోడ్పడింది. ఏ కారణాలవల్లనైతేనేమి బైరను, షెల్లీ ఇంగ్లాండులో ఉండలేక జీవితశేషం యూరపులో గడిపారు."

సంఘాన్నుంచి పరిత్యక్తులమనేభావం రొమాంటిసిస్టుల సామాన్య లక్షణంకాదు. విశేష లక్షణం. కొందరి రొమాంటిసిస్టుల విశేష లక్షణం. అలాకాకుంటే రొమాంటిక్ ప్రముఖుడయిన వర్డ్స్‌వర్త్ అత్యంత గౌరవనీయమైన ఆస్థానకవి (Poet Laureate) పదవి నెలా అలంకరించినాడు? కొందరు రొమాంటిక్ కవుల వెలికి వాళ్ళ విప్లవ వాదానికి సంబంధంలేదు. వీళ్ళు తెచ్చింది కవిత్వంలో విప్లవమే, కాని కవిత్వంతో విప్లవం కాదు. షెల్లీ, బైరనులను సంఘం వెలి వెయ్యలేదు వారే సంఘాన్ని వెలివేసిరి. వారు యూరోపులో జీవితశేషం గడపడానికి కారణం తమ సంఘంనుంచి దూరంగా ఉండాలనికాదు అటు అయితే యూరపు (ఫ్రాన్సు జర్మని)లోవుండే రొమాంటిసిస్టులు ఎక్కడకు పోవలె? షెల్లీ, బైరనులు యూరపులో ఏందుకు జీవితం గడిపినారంటే వీరికి ప్రాచీన రోమన్, గ్రీకు నాగరికతలంటే వల్లమాలిన అభిమానం. ఆ దేశాలలో ప్రాచీన ప్రాభవం కల ప్రదేశాలలో శిల్పాలను చూస్తూ ఆనందిస్తూ ఉండేవారు. వీరు ఏక్కువ కాలం కూడా బతుకలేదు. బైరను 36 ఏళ్ళు, షెల్లీ 30 ఏళ్ళు బతికినారు. వీరికే దీర్ఘాయుస్సు ఉంటే తమ దేశానికి తిరిగి వచ్చేవారే. Nostalgia ఎవరికైనా తప్పదుకదా! బైరను, షెల్లీలు తమను తామే వెలివేసుకొన్నవారు Self-exiles అనగా తమ సంఘాన్ని పరిత్యజించినవారు. వీరిని నాటి ఆస్థానకవి సదే (Southey) సైతాను శిష్యులనీ, అవినీతి పరులనీ, కుళ్ళిన హృదయాలను అసహ్యపు ఆలోచనాలను కలిగినవారని తిట్టిపోసినాడు. శ్రీ కృష్ణశాస్త్రికి వచ్చిన వెలి ఇస్మాయిల్‌గారు చెప్పినట్లు హరిజనులకి చదువు చెబుతూండడంవల్ల అయితే, చిలకమర్తి లక్ష్మీనరసింహం, గాంధివంటి సంఘసంస్కర్తలకు సంభవించిన దశే అని అర్థంకాని, అది రొమాంటిక్ వెలికాదు. రొమాంటిసిస్టు సంఘసంస్కర్త కాలేడు. శ్రీ.కృష్ణశాస్త్రికి నాడూ నేడూ కూడా సంఘంలో చాలా గౌరవస్థానం వుంది. అట్టి ఆయన వెలి అంటే నమ్మడమెలా?

"ఇంగ్లీషు రొమాంటిసిస్టులు హీరోయిక్ కప్లెట్‌వంటి పాత ఛందస్సుల విడిచి పెట్టి కొత్త ప్రయోగాలు చేసినట్లు, మన తెలుగు రొమాంటిసిస్టులు కూడా మార్గ ఛందస్సులను నిరాకరించి దేశీ ఛందస్సువేపే మొగ్గు చూపారు కృష్ణశాస్త్రిగారు బహుకొద్ది వృత్తాలు రచించారు. ఎక్కువగా తేటగీతిలోనే కవిత్వం నడిపారు. ఇంకా ధైర్యంగా జానపదగేయ ఛందస్సులో చక్కటి పాటలు రాశారు."

హీరోయిక్ కప్లెటులు మన ద్విపదలవంటివి. ఇంగ్లీషు రొమాంటిసిస్టులు చేసిందల్లా ఏమంటే తమకు పూర్వులైన డ్రైడెన్, పోపువంటి Augustom కవులనుసరించిన ద్విపదలను వదలి, వారికి పూర్వం ఎలిజబెత్తు యుగంలోని Sonnet లు అను షట్, అష్ట, దశపదులను అనుసరించుటయే. అంటే ఇంగ్లీషు రొమాంటిసిస్టులు వెనక్కి, ఇంకా వెనక్కి పోయారన్నమాట. ఇంగ్లీషులో ఛందః ప్రయోగాలు చేసింది రొమాంటిసిస్టులుకాని టెనిసను, హాప్కిన్సు, బ్రిడ్జెస్ అనే తర్వాతి కవులు. తెలుగులో దేశీ ఛందస్సును ప్రాచీన కాలంలో నన్నయ, నవీన యుగంలో గురజాడ ప్రవేశపెట్టినారు. మల్లీశ్వరి తర్వాతి కవిత్వం రొమాంటిసిజానికి చెందింది కాదు కాన కృష్ణశాస్త్రి వ్రాసిన పాటలకు రొమాంటిసిజ్మ్ వాసనలేదు. జానపదుడు కాకుండానే జానపదగేయాలు వ్రాసింది కవికొండల. సినిమాలకని కాక ఆత్మప్రత్యయంతో గేయాలు వ్రాసింది బసవరాజు అప్పారావు.

"ఈయనిది (కృష్ణశాస్త్రిది) ఆత్మాశ్రయ వైఖరి."

ఆత్మాశ్రయత రొమాంటిక్ కవిత్వ లక్షణం కాదని ఇదివరకే అన్నాను. ఆ మాటకువస్తే సింబాలిస్టు కవులగు వెర్లేన్, రింబాడ్, మాలార్మేల కవితలలోనే ఈ ఆత్మాశ్రయత, ఛందో చంక్రమణం, గేయఫణితి, సంకేతాలు, పదచిత్రాలు, Mysticism కన్పిస్తాయి.

తెలుగు మాస్టారు (నవలిక)

శ్రీ ఇచ్ఛాపురపు రామచంద్రం

(గత సంచిక తరువాయి)

5

తెలుగు మాస్టారనగానే చిన్నచూపు చూస్తారుకానీ ఒక్కొక్కసారి మా మాస్టారెంత హుందాతనం ప్రదర్శించేవారు!

అవసరార్థం ఆంగ్లభాషని గుర్తించేవారు,

ఎ. సి. సి లో ఉండే విద్యార్థులు మొదటి పిరియడు మధ్యలో రావచ్చు. అది కన్సెషన్.

సాధారణంగా మా మొదటి పిరియడు తెలుగు మాస్టారిదే.

ఎ. సి. సి. కుర్రాళ్ళు పాఠం మధ్యలో రాబోతే—

"ఆగండి" అరిచేవారు మాస్టారు.

"ఫ్రయాన్ ఎసిసి—" అనేవారు కుర్రాళ్ళు.

"యు యూజెన్ యే సి సి ఆర్ బి. సి. సి. అయామ్ నాట్ కేర్. చుట్టూ తిరిగిరా." గద్దించేవారు.

ఎదురు తిరగడానికి వీలేదు.

అలాగే ప్రదక్షిణం చేసి మరీ వచ్చేవారు కుర్రాళ్ళు.

మాస్టారి మాటంటే రామాజ్ఞే.

అదేమిటోకాని నోటీసులూ, సర్క్యులర్లూ తెలుగు మాస్టారి పన్నుకు వచ్చేవాడు బంట్రోతు.

మొదట చూడనట్లు నటించేవారు.

ఎవరో హెచ్చరిస్తే నోటీసందుకుని గడగడ చదివేసేవారు.

రో యీజ్ సన్‌డే ఆన్ అకౌంటాఫ్ హాలీడే."

గొల్లున నవ్వేవారు కుర్రాళ్ళు.

"అ[illegible]గా చదివాననా? ఆంగ్ల భాష అంటే అస్తవ్యమే. పి యు టి పుట్. బియుటి బట్. నీతీ నియమమూలేని భాష. మనుషుల బట్టి భాష బావకీ, అన్నకీ కజినే. ఆ మనుషుల వాళ్ళ వరుసలే కలగాపులగం. ఇంగ్లీషులో—పతివ్రతకు సరయిన పదం ఉండదు.

ఆ భాషకి అంతకంటె గౌరవం యివ్వకూడదు."

ఆవేశంగా చెప్పేవారు.

తెలుగు మాస్టారు—ఇంగ్లీషు భాషమీద తనకెందుకు సదభిప్రాయం లేదో సోదాహరణంగా నిరూపిస్తూంటే—శ్రోతలు శిలలు కావలసిందే.

మరీ విసుగ్గా ఉంటే ప్యూన్‌తో చెప్పేసేవారు నోటీసులో విషయాన్ని.

ఒకసారేం జరిగిందంటే...

విలువిద్య గురించి చెప్తున్నారు తెలుగు మాస్టారు.

చెప్పడం అంటే—ప్రత్యక్ష పురాణమే. నారి సారించడం, బాణం వదలడం—మాకు ప్రత్యక్షంగా చూపుతున్నారు మాస్టారు. విశ్వామిత్రుడు—రామలక్ష్మణులకు విలువిద్యా, శస్త్రాస్త్ర ప్రయోగమూ నేర్పుతున్నాడు పాఠంలో.

తెలుగు మాస్టారు విశ్వామిత్రుడే ఐపోయారు.

హెడ్‌మాస్టరు విజిట్స్‌కి వస్తూ—ఏం జరుగుతూందో చూద్దామని కాబోలు గుమ్మంవరకూ వచ్చి ఆగారు.

ఉద్రేకంలో—"నో నోటీస్ నౌ—" అని కేకవేశారు తెలుగు మాస్టారు. హెడ్‌మాస్టారు ముఖం దించుకుని వెళ్ళిపోయారు.

పాఠం చెప్పడంలో అంత ఏకాగ్రత, నిమగ్నత.

తెలుగు మాస్టారికి ఆంగ్లభాషంటే ఎంత చుక్కెదురో చెప్పలేను.

ఓసారి—ఆయన నోటీసుకి చేసిన అనువాదం గమ్మత్తుగా తన్నేసింది. ప్యూన్‌ని చూస్తూ—"రేపు శలవు—" వెళ్ళమన్నట్టు చెయ్యి విదిలించారు—పాఠం సాగనివ్వలేదన్న కోపంకొద్దీ.

మర్నాడు మాతోపాటు మాస్టారూ స్కూలుకి రాలేదు.

తీరా చూస్తే ఆ నోటీసుకూస్తా మర్నాడు జరగబోయే ఏదో మీటింగ్ గురించిట!

హెడ్ మాస్టరు కేకలేశాడు—అంత బొత్తిగా ఇంగ్లీషు రాక పోతే ఎలా అని.

దానికి మాస్టారు చెప్పిన సమాధానం—

"ఇంగ్లీషు రానందుకు విచారించనవసరంలేదు. తెలుగు మరచి పోతున్నందుకే చింతించాలి. సిగ్గుపడాలి. అన్యకాంతలకై వెంపరలాడే విటుడిలా—పరస్త్రీనంటి పరభాషమీద వ్యామోహం దేనికి? నోటీసు తెలుగులోనే వ్రాసి పంపరాదూ? నోటీసులకి తెలుగుభాష పనికిరాదా? మన భాష విలువనిమనమే గ్రహించకపోతే—అంతకంటే సిగ్గుపడవల సిన విషయం మరేమిటుంటుంది?" పలక ఝళిపించి మరీ అడిగే శారు తెలుగు మాస్టారు.

మాటలతో సమాధానం చెప్పలేక—కసినంతటినీ కాగితంమీద కక్కేశాడు హెడ్ మాస్టరు. ఫలితం—తెలుగు మాస్టారికి బదిలీ పర్యవసానం ఐంది. తరువాత నలుగురూ కలిసి—మనపూసి మాటసాయం చేసి బదిలీ రద్దు చేయించారు. అది వేరే విషయం. ఎందుకో—ఇంగ్లీషూ, తెలుగు మాస్టారు బద్ధవైరులు. అందుకే అయామె లెస్, యు ఆరె క్లాస్ వంటి వాక్యాలుపయోగిస్తూ ఇంగ్లీషుని హేళన చేసేవారు.

6

సర్వసాధారణంగా తెలుగు మాస్టార్ల నిజ జీవితంలో శృంగారం తక్కువ. శృంగారమంటే పిల్లల్ని కనడం కాదని, అంతకంటె చాలా అందమైనదని తెలుగు మాస్టార్లకి తెలుసు. దురదృష్టమేమిటంటే నిజజీవితంలో వారికి శృంగారం లభించదు. సౌందర్యం గురించీ, రసికత గురించీ ఎంతో తెలిసిన తెలుగుమాస్టారు—పెళ్ళి విషయంలో అన్నీ మరచిపోతారేమో! ఎక్కడో ఎప్పుడో తప్ప తెలుగు మాస్టారి భార్య అందంగా ఉండదు.

లేక—తెలుగు మాస్టారి విశాల హృదయమూ, రసపిపాసా—బాహ్యసౌందర్యాన్ని అధిగమించి అంతఃసౌందర్యాన్నవలోకించడాని కల వాటు పడతాయేమో! అందంగాలేని అర్ధాంగితో కూడా హాయిగా జీవించేవారు.

మా గురువుగారి భార్య నోటిదురుసు మనిషి.

మాస్టారంటే తేలిక అభిప్రాయం.

ఐతేనేం—ఆయన కొంచమయినా ఉత్సాహాన్ని కోల్పోలేదు.

శ్రీనాథుని శృంగారవైభవం చెప్పడం మొదలుపెట్టారంటే, మంత్రముగ్ధులమైపోయామన్నమాటే.

ఎంత చక్కని శృంగారం చెప్పేవారని!

శృంగారమంటే బూతుకాదు. నీతి.

శృంగార రసంలేని జీవితం—వట్టి చెఱకుపిప్పి.

సృష్టి సాగేందుకు ఆలంబనం శృంగారం.

ఎన్నిరకాల నాయికల గురించి చెప్పేవారో మాస్టారు!

విప్రలబ్ధ...వాసవసజ్జిక...అభిసారిక...

ఒక్కొక్కరి గురించీ ఎంత విపులంగా చెప్పేవారు!

మొద్దుబుర్ర—మరచిపోయాను.

అంగాంగ వర్ణనలను అతి సౌందర్యవంతంగా వివరించే తెలుగు మాస్టారు చవకబారు సెక్స్ పుస్తకమని భ్రమించేరు?...ఎంత మాత్రమూ కాదు.

శృంగార పాఠాలను ఎలా ముగించేవారో తెలుసా?

"శృంగారం అత్యున్నతమైన అనుభూతి. ఈ అనుభూతిని అర్ధాంగినుంచి పొందడమే న్యాయమూ, ధర్మమూ. మనిషి—మాటకి కట్టుబడి ఉండాలి. వివాహవేళ, నాతి చరామి—అని వాగ్దానంచేస్తాం. ఆ మాటను మీరకూడదు. తాను సుఖపడుతూ, భార్యని సుఖ పెడుతూ ఉండాలి. అది మగవాడి కర్తవ్యం. భార్య అంటే కేవలం ఆడది మాత్రమే కాదు. జీవితంలో సగభాగం. నువ్వు సుఖంగా ఉన్నప్పుడే నిన్ను చూస్తుంది వెలయాలు. నువ్వెలా ఉన్నా జీవితాంతమూ నీకోసం తపించేది భార్య. అందుకే—పరకాంతలెందరైనను, కుల కాంతకు సాటిరారు గువ్వలచెన్నా అన్నది.

వెలయాలి పొందులో లభించేది నిజంగా సుఖంకాదు. ఆ అను భవాలలో తృప్తి ఉండదు. అది వట్టి నటన. వేడి నీళ్ళతో దాహం తీర్చుకున్నట్లే. వ్యభిచారం నిషిద్ధమ్.

నమ్మినవారిని వంచన చేయకూడదు.

నీ శరీరంమీదా, జీవితంమీదా అనురాగ పూరితమైన హక్కు అర్ధాంగిది. ఆమెనాహక్కునుంచి వంచింపబోవడం ఆత్మవంచనే. ఆత్మ వంచన అధమాధమమ్. ఆ పాపానికి ఒడిగట్టకండి.

సంసారమనేది—సుమధుర మధు కలశమ్.

వెతుక్కో గలగాలికాని—సంసార సాగరంలో వెలలేని రత్నాలూ మాణిక్యాలూ లభిస్తాయి.

ధర్మపత్నిని మాని పరస్త్రీకై ప్రాకులాడమని—వాగ్దానం చెయ్యండి."

బొత్తిగా పరిచయం కాకపోతే—యీ మనుష్యులమీదా మాట మీదా అంత నమ్మకమేమిటి తెలుగు మాస్టారికి!

చెప్పవచ్చేదేమిటంటే—

తెలుగు మాస్టారు కవి చౌడప్ప శతకంకాదు.

పెద్ద బాలశిక్ష.

బూతు పుస్తకం కాదు.

నీతి శతకం.

ఆదర్శంగా జీవించడం ఎలాగో తెలుగు మాస్టారినుంచే తెలుసుకుంటాం మనం.

ఆదర్శ జీవితానికి బాటలువేసే ప్రయత్నాలు చేసేది తెలుగు మాస్టారే. నవరసాలూ జీవితాలలో నింపాలని మనస్ఫూర్తిగా కృషి చేసే మాస్టారు మరెవరు? తెలుగు మాస్టారు తప్ప.

"మాస్టారూ మీరెవరినయినా ప్రేమించారా?" అంటూ అడిగాడొక చిలిపి కుర్రాడు—మాస్టారు చెప్పిన శృంగారం విని.

"ప్రేమించకేం? అప్పటికీ, యిప్పటికి, ఎప్పటికీ ప్రేమిస్తూనే ఉంటాను—" అన్నారు మాస్టారతి సిన్సియరుగా.

"ఎవరిని?"

"నా పెళ్లాన్ని —" టక్కున చెప్పారు మాస్టారు.

కిసుక్కున నవ్వాడు చిలిపి కుర్రాడు. "పెళ్లాన్ని ప్రేమించరు మాస్టారూ!—" అంటూ.

"పరెవరినేనా అయితే-అది ప్రేమ అనిపించుకోదురా కుర్రవాడా!—" ఈసారి తెల్లబోయాడు చిలిపి కుర్రాడు.

"ప్రేమకి వెలుగుని చూసి భయపడవలసిన కర్మ ఉండదు. చీకటిలోనే సాగేది ప్రేమ కాదురా. కామం. ప్రేమలోంచి ఉద్భవించే కామం సర్వజనామోదం. అది నీతిబాహ్యంకాదు. కేవలం కామం—అవినీతి. బలహీనత. ప్రేమించగలగడానికి హృదయం పరిపక్వం కావాలి. ప్రేమ—కేవలం శరీరాశ్రయంకాదు" అంటూ ఘాటుగా చివాట్లు పెట్టి నోరు మూయించారు తెలుగు మాస్టారు.

చాలా లోతుగా పరిశీలించి—ప్రతి విషయాన్నీ పరిశోధించి—అరటిపండు వొలిచి చేతిలో పెట్టినట్లే చెప్పడం తెలుగు మాస్టారికే తగును.

దాంపత్య జీవితంలో ఉండే ఔన్నత్యమూ—

వ్యభిచారంలో ఉండే అల్పత్వమూ—

ఎంత చక్కగా విశదపరచి చెప్పేవారో!

తెలుగు మాస్టారు చెప్పిన విషయాలే వంటబట్టించుకో గలిగితే—విద్యావంతులలో యింత శాతం వ్యభిచారులుండేవారు కారనే నా ప్రగాఢ విశ్వాసం.

పెద్దలు చెప్పని సంసార సూత్రాలెన్నో చెప్పేవారు తెలుగు మాస్టారు. నిజంగా ఆ సూత్రాల ననుసరిస్తే—సుఖసంసారమే ఔతుంది. కాని-అన్నీ తెలిసిన మాస్టారు మాత్రం తన సంసారాన్ని సుఖమయం చేసుకోలేకపోయారేమో!

ఎవరో అబ్బాయి అదే ప్రశ్నవేయగా—

"నేను చెప్పినట్లు చెయ్యి. చేసినట్లుకాదు—" అని కొంచం ఆగి ఓ పిట్టకథ చెప్పారు.

"ఒక పల్లెపక్కన—చిన్నకొండ ఉండేది. ఆ కొండమీద వినాయకుడి రాతిబొమ్మ ఉండేది. ఏడాదికోసారి-ఆ వినాయకుడి విగ్రహానికి నమస్కరించి—ఆ విగ్రహం తాలూకు బొడ్డులో చూపుడువేలు పెట్టి తిప్పితే సకల శుభాలూ కలుగుతాయని అక్కడి ప్రజల విశ్వాసం.

ఆ యేడు—ఒక్కొక్కరూ వేలు వినాయకుడి బొడ్డులో పెట్టడం-వెంటనే వెనక్కి లాగేసుకుని-బలవంతంగా చిరునవ్వు నవ్వుతూ వెనకవాడికి చోటివ్వడం.

అందరూ అలాగే చేశారు.

ఒక్కొక్కళ్లకి కన్నీళ్లాగడంలేదు.

"బాధ."

"ఎందుకని మాస్టారూ? వినాయకుడి బొడ్డు కరిచిందా?"

"ఆఁ అతని బొడ్డులో ఒక తేలు యిల్లు కట్టుకుంది. వేలు పెట్టినవారికి బహుమతిచ్చింది."

"కాటు తిన్నాక వెనకవాళ్లకి చెప్పొచ్చుగా కాటుతిన్నవాళ్ళు"

మాస్టారు—అమాయకత్వానికి నవ్వారు. "అలా చెప్పినందుకేగా ఎదురు ప్రశ్న వేశావు నువ్వు?"

"నిశ్శబ్దం"

తెలుగు మాస్టారంటే—పిట్టకథలు!

7

పండిత పుత్రః పరమశుంఠః.

నిజమే అనిపించేదు తెలుగుమాస్టారి పెద్దబ్బాయి.

తెలుగుమాస్టారి పెద్దబ్బాయి—వట్టి మొద్దబ్బాయే.

తెలుగుమాస్టారి జీవితం—చిక్కులు పడిన దారపుండ.

పెద్దబ్బాయితో గట్టి చిక్కొచ్చిపడింది మాస్టారికి.

ప్రయోజకుడు కాని కొడుకు—తల్లిదండ్రులకి కంటకమే.

స్కూలు ఫైనలువరకూ ఏలాగో దేకుతూ వచ్చాడు.

వచ్చాడంటే-తాను వచ్చాడనికాదు.

మాస్టారు తెచ్చారు!

నిజం అంతే.

తెలుసు మాస్టారి ముఖంచూసి—నలుగురు మాస్టర్లూ నాలుగు మార్కులువేసి మెల్లగా స్కూలుఫైనల్ వరకూ లాక్కొచ్చారు.

ఇక—అక్కడినుంచి కదలనని మొరాయించాడు సుపుత్రుడు.

మాస్టారు శాయ శక్తులా ప్రయత్నించారు.

ఒక్కసారికాదు.

నాలుగుసార్లు.

పుస్తకంలో పేజీలయితే అరిగిపోయాయికాని అతగాడు పాసవలేదు.

ఒట్టి బండ నాలిక.

సంస్కృతం ముక్కలు వంటపడతాయా ?

తద్దినం మంత్రాలకేనా పనికిరాలేదని వాపోయేవారు మాస్టారు.

మాస్టారిని చాలా దుఃఖపెట్టేశాడు జ్యేష్ఠ పుత్రుడు.

పదవు ప్రతిష్టలు కోరుకునేవాళ్ళలో మొదటివారు తెలుగు మాస్టారు.

అదేమిటో—అటువంటివారికే అన్ని ఆశాభంగాలూ !

అయ్యవారిని చేయబోతే—కోతి అయినట్లు —

ఆఫీసరుని చేద్దామనుకుంటే, అతగాడు కాస్తా వంటవాడై కూర్చున్నాడు. అదీ—ఊరుకాని ఊరిలో.

"గుడ్డిలో మెల్ల అని సంతోషించేదా ? కొడుకు దూర మయ్యాడని కుమిలిపోయేదా ?" అని కన్నీరు పెట్టుకున్నారు తెలుగు మాస్టారు.

ఆయన నేమని ఓదార్చగలం పిల్లలం ?

అదేమిటో—విచిత్రంగా, తెలుగుమాస్టారి సంతానం ఎక్కడో తప్ప ప్రయోజకులు కారు.

తెలుసుమాస్టారికి గర్భశోకం వ్రాసిపెట్టి ఉంటుంది కాబోలు!

బాలారిష్టాలు తీరకుండా పోయిన పిల్లలు ముగ్గురో నలుగురో.

నేనన్నాననికాదు...తెలుగుమాస్టారికి సంతాననష్టం — తప్పని శాపం. విషాదకరమయిన అనుభవాలన్నీ తెలుగుమాస్టారిని వరించి వదులుతాయికాబోలు !

కష్టాలకికూడా సరదాయే తెలుగుమాస్టారంటే.

చేతికందివస్తాడనుకున్నకొడుకు — పత్తాలేకుండా దేశాలుపట్టి పోయాడు.

ముద్దూ ముచ్చటా మాడకుండానే—ముత్యాల్లాంటి ముగ్గురు పిల్లలని మృత్యువెత్తుకుపోయింది.

సరే.

అయినదేదో అయింది.

అర్ధాంగినికూడా తీసుకుపోవాలా ?

ఆమెనుకూడా లాక్కుపోతే మాస్టారేమయిపోవాలని ?

ముందువెనుక లాలోచించలేదు విధి.

అర్ధాంగినికూడా కరువు చేసింది మాయదారికాలం.

ఆరోజు — మాస్టారిగుండెలు పగిలిపోతాయనే భయపడ్డాం — చూసిన పిల్లలం అందరమూ.

భార్య కళేబరం మీద పడి—ఎంత హృదయవిదారకంగా రోదించారు మాస్టారు!

మాకూ ఏడుపు వచ్చేసింది.

ఇక ఆయన్ని మేమేం ఓదార్చగలం ?

ఆమె నెంత ప్రాణాధికంగా ప్రేమించారో తెలుగుమాస్టారు!

"నోరు కాస్త పెద్దది ... కాని—హృదయం ఎంత విశాలం! నాలాటి మనిషితో ఆవిడ కనుక కాపరం చెయ్యగలిగింది! ఆవిడ తన మానాన తాను వెళ్ళిపోయింది నన్ను ఒంటరివాడినిచేసి. అన్నపూర్ణా! నన్నెందుకు వదిలిపోయావ్ ?

నేనూ నీతో వచ్చేస్తాను —"

నలుగురూ ముక్కున వేలేసుకున్నారు.

సతీసహగమనమే గతంలోకి జారిపోయి-కథలుగా మారిపోయింది.

పతీ సహగమనమా !

అందులోనూ, శాస్త్రాలూ వేదాలూ పఠించిన—తెలుగు మాస్టారువంటి విజ్ఞాని—భార్యతోపాటు మరణించబోడమా !

ఎంత ఉన్నతమైన ప్రేమ!

అర్ధాంగికి—జీవితంలో ఎంత చక్కని స్థానం!!

ఎవరన్నారు తెలుగు మాస్టారిని ఛాదస్తుడని ?

స్త్రీని ఆయనంతగా గౌరవించే ఆదర్శ పురుషు లెవరు?

వట్టిమాటలు కాకుండా—హృదయాంతరాలలోకూడా స్త్రీకి విలువ యివ్వగలిగే తెలుగుమాస్టారు!

ఎంతమంది వారిలా అర్ధాంగిని ప్రేమించగలరు ?

"మీరలా అంటే పిల్లలేమైపోవాలి మాస్టారు ?"

ఎవరో అన్నారు.

మాస్టారు—పిల్లల ముఖాలు చూశారు.

ఒక క్షణం...

ఏదో నిర్ణయానికివచ్చినట్లు ముఖంలో మార్పు.

నలుగురు పిల్లల్నీ దగ్గరకి తీసుకున్నారు.

దుఃఖాన్నీ దైన్యాన్నీ దూరంగా తరిమేశారు.

పిల్లలంటే ప్రేమ.

వారి జీవితమంటే ప్రేమ.

ఒకరికోసం — తాను దహించుకుందుకు కూడా సిద్ధమయ్యే కొవ్వొత్తి - తెలుగుమాస్టారు.

భార్యా వియోగంతో ఆయన బ్రతుకు శూన్యమైనమాట అతి వాస్తవం. పగిలిన గుండెతో—పిల్లలకోసం జీవించడానికే సంకల్పించుకున్నారు. నిజాని కాయనకు మిగిలిందేమిటి ?

8

తెలుగుమాస్టారికి స్థిరమయిన విశ్వాసాలుంటాయి.

వాటిని— కాలగమనం మార్చలేదు.

పరిస్థితులు—చెదరగొట్టలేవు.

ఎందుచేతనంటే —

వారి విశ్వాసాల వెనుక బలమైన సిద్ధాంతాలుంటాయి.

ఎంతో అనుభవం ఉంటుంది.

ఎన్నెన్నో ఆలోచనలుంటాయి.

అందుకే వారి విశ్వాసాలచంచలాలు.

కళలంటే వారికి గౌరవం తక్కువనికాదు.

స్త్రీలపై దురభిప్రాయం అంతకంటెకాదు.

కాని - రేడియోవాళ్ళు స్వయంగా ఆహ్వానించినా — పెద్దమ్మాయి విజయవాడ పంప నిరాకరించారు.

ఆమెపేరు శారద.

కొందరిపట్ల నామధేయాలు సార్థకత నంతరించుకుంటాయి.

ఆ కోవకి చెందినదే శారద.

కంఠం—కోయిలకంఠమే.

గళమెత్తి గానంచేస్తే—వసంతం తొంగిచూడవలసిందే.

తీయని కంఠంతో త్యాగరాయకృతి అందుకుంటే—తెరతీసి—రావలసిందే.

అతిశయోక్తి కాదు

అంత చక్కని స్వరమే.

"మీ అమ్మాయిచేతరేడియోలో పాడించేందుకు అనుమతించం"డంటూ అభ్యర్థించారు రేడియో అధికారి.

నమ్రంగా చెప్పారు తెలుగు మాస్టారు. "మీ ఆదరాభిమానాలకు అమిత కృతజ్ఞతలు. అమ్మాయి బాగానే పాడుతుంది. కాదనను. కాని—కచేరీలు చేయించే ఆలోచన నాకులేదు—క్షమించండి."

"కళని—దాచివెయ్యడం—ద్రోహం అవుతుందేమో ! అందరూ విని ముగ్ధులు కావలసిన గానమాధుర్యాన్ని—మీయింట బంధించబోవడం—న్యాయమే అంటారా ? కళాకారిణిగా తన ప్రతిభను దశదిశలా వ్యాప్తి చెయ్యగలిగిన అమ్మాయిని..."

"మీ మాట కాదనను. కాని—కళకంటె జీవితం ముఖ్యం. శారద వయస్సు పదహారు. పెళ్ళిచేస్తే — కలకలలాడుతూ కాపురం చేసుకోవలసిన అమ్మాయి కళపేరిట—దాని సౌఖ్యాన్ని నాశనంచేసేదా? నామీద అభిమానంకొద్దీ — నా మాట కాదనలేక — తన కళని వ్యాపారంగా మార్చడానికంగీకరించినా తరువాత విచారించదూ? యౌవనం వృథాగా గడిచిపోయిందని ? గడచినకాలమూ, చేజారిన జీవితమూ తిరిగి రావుకదా ?

నన్ను మరోలా భావించకండి.

పదిమందిలో పాడటానికి అమ్మాయి అట్టే సుముఖంగా లేదు. వత్తిడి చేయడం నాకిష్టంలేదు."

"రేడియోలో పాడటానికీ, కచేరి చేయడానికీ తేడా ఉంది మాస్టారూ ?"

"ఔను. తెలుసు. కాని... కీర్తి అనేది కర్పూరపు ముద్ద వంటిది. అగ్నిశిఖ సోకితే-పరిమళాలను వ్యాప్తి చేసుకుంటూ పోతుంది. వాటి నాపడం అసాధ్యం."

మాస్టారి దూరదృష్టిని ఎదుర్కోలేకపోయారు రేడియో అధికారి. మాస్టారి ఆలోచనావైఖరి నాకూ అవగతంకాలేదు.

ఆయనకు ఆర్థికమైన ఇబ్బందులు లేకపోలేదు.

సంగీతంపట్ల తక్కువ అభిప్రాయాలూ లేవు.

మరి—శారద నెందుకు రేడియోలో పాడనీయలేదు ?

సంప్రదాయాలు అడ్డుపడుతున్నాయా ?

శారదమీద నమ్మకం తక్కువా ?

ఏదో సందర్భం చూసుకుని యీ విషయం కదిపాను.

"ఎంతో చక్కని అవకాశాన్నెందుకు జారవిడుచుకున్నారు మాస్టారూ ?"

"శారద—పెద్దమ్మాయి. అన్నపూర్ణ ఆత్మ శాంతించాలంటే శారద పెళ్ళి చెయ్యాలి. అదీకాక — కాపురానికి పంపవలసిన అమ్మాయిని—కళపేరిట – ఆ సౌఖ్యంనుంచి దూరం చెయ్యడం న్యాయమనిపించడంలేదు."

జీవితమంటే ఎంత ఉన్నతమైన అభిప్రాయం !

"సంబంధాలు చూస్తున్నారా మాస్టారూ ?"

"మా అమ్మాయి-శారద — కోసం—సంబంధాలు అవే వస్తున్నాయి!—"

"ఎవరు మాస్టారూ?"

"మేనరికం..." గర్వంగా చెప్పారు తెలుగు మాస్టారు. "రేడియోవాళ్ళు వచ్చి వెళ్ళిన మూడోనాడే మా బావగారు వచ్చారు. కట్నం అక్కర్లేదట. నేడో రేపో తాంబూలాలు పుచ్చుకుంటాం-"

"పెళ్ళికి కావలసిన సాయం మేం చేస్తాం మాస్టారూ!-" ఎంత హాయిగా నవ్వారు మాస్టారు!

"అలాగే. మీందరు సాయం చెయ్యకపోతే జరుగుతుందా!... అందులో మా అర్ధాంగి తెలివాడినాయె!..."

మాస్టారి వియ్యంకుడు మహా గడుసువాడు.

కట్నం అక్కరలేదనగానే పొంగిపోయారు మాస్టారు!

కానుకల రూపంలో అంతకి రెట్టింపు వసూలు చేశారు-మగ పెళ్ళివారు.

మెత్తని వాళ్ళనిచూస్తే ఎవరికయినా మొత్తబుద్ధే కాబోలు! అయినా మాస్టారి అమాయకత్వం కాకపోతే మేనరికం గురించి ఎందు కంత పట్టింపు?

అదే అలుసు తీసుకున్నారు అవతలివాళ్ళు.

తెలుగు మాస్టారికి-బంధుప్రీతి అధికం.

కాకపోతే-ఎలిమెంటరీ స్కూలు పంతులికి-ఏమాత్రమూ భవిష్యత్తు లేనివాడికి-శారదలాటి చక్కని చుక్కను-కట్టబెట్టేస్తారా!

అతగాడేం చేశాడు?

ఇలా పెళ్ళయిందో లేదో పెళ్ళాన్ని రేడియో స్టేషనులో పాడించాడు.

గానకచేరీలు చేయించసాగాడు.

ఏతావతా-జరిగిందేమిటి?

శారద సంగీతాన్ని సొమ్ము చేసుకోడం!

పైగా-మామగారిని నిష్ఠూరం ఆడాడట కూడా!-శారదకి చిన్నప్పటినుంచే కచేరీలు చేయడం అలవాటు చేయలేదని.

మాస్టారి ఆశలేమయ్యాయి?

అమ్మాయి ఆనందంగా కాపురం చేసుకోవాలని కలలు కన్నారు.

అతను ఆమెనుంచి డబ్బు పిండుకోసాగాడు!

తెలుగు మాస్టారికి మిగిలింది ప్రావిడెంట్‌ఫండ్ లోను!

అల్లుడు—శారదని కొడతాడు కూడా!...ఆ మాట చెప్పుకుని—ఆ దెబ్బలు తనకే తగిలినంత బాధపడిపోయారు మాస్టారు.

ఆయన దృష్టిలో-సంసారమంటే తీయటిగానం.

అపశ్రుతులకి తావే ఉండకూడదు.

9

దిగి రాను దిగిరాను దివినుండి భువికి...

దిగిరావాలి మాస్టారూ...మీరెంత తెలుగు మాస్టారయినా దివినుండి భువికి దిగి రావలసిందే. తప్పదు.

ఇది-జీవితం మాస్టారూ. జీవితం.

ఊహాలోకంనుంచి చూడకండి.

ఈ కాలపు కుర్రాళ్ళు మీ ఊహల కందరు.

అంచనాలకి దొరకరు.

మీ రెండో అబ్బాయి ఏం చేశాడు?

మిమ్మల్ని బాధ పెట్టాలని కాదు మాస్టారూ.

జీవితంలో రాజీ పడటం నేర్చుకోక తప్పదని.

మీకూ మాకూ ఓ తరం అంతరం.

ఈ తరాల అంతరాలలో...

నైతిక విలువలు కొత్త ముసుగులు వేసుకుంటున్నయ్.

నీతి సూత్రాలు రూపు మార్చుకుంటున్నాయ్.

కాలం చేసే గారడీలు తెలుగు మాస్టారూ!

ఛందస్సు కందవు.

యతిప్రాసలకు లొంగవు.

గణవిభజన-వృథామాస్టారూ. వృథా, వృథా.

సంప్రదాయాలు అంతరించిపోతూంటే- మీరేం చెయ్యగలరు?

పై వూళ్ళో చదువు.

మూడువేలు ఖర్చుచేశారు.

రెక్కలు ముక్కలు చేసుకున్నారు.

నెలకి నెలకీ మనియార్డర్లు పంపారు.

డిగ్రీహోల్డరుని చేశారు. కాని-

ఉద్యోగం వేయించలేకపోయారు.

అదేగా మీరు చెయ్యలేకపోయారు!

గడ్డురోజులు.

గడ్డి కరవనిదే పనులయ్యే కాలం కాదు.

లంచాలివ్వడానికి జంకితే ఎలా మాస్టారూ?

ఆ పరాత్పరుడు సర్వాంతర్యామి ఔనో కాదో ?

లంచంమాత్రం సర్వాంతర్యామి సుమండీ!

చిన్న నిజం—గుర్తించలేకపోయారు.

కొడుకుని దూరం చేసుకున్నారు.

జాలేస్తోంది మాస్టారూ.

మిమ్మల్నిచూస్తే అపరిమితమైన జాలేస్తోంది.

అందివస్తాడని ఆశించిన అబ్బాయి దూరమైతే భరించడం ఏ తండ్రితరం? అందులోనూ మీరు తెలుగు మాస్టారు. ప్రేమాభిమానాలపాలెక్కువ.

ఫర్లేదు మాస్టారూ. ఫర్లేదు.

మీ అబ్బాయి ఎక్కడో సురక్షితంగానే ఉంటాడు.

మీకు చెప్పకుండుకు వీల్లేని ఏదో ఉద్యోగం చేస్తూ ఉంటాడు.

నేడో రేపో మీకు ఆ వర్తమానమూ వస్తుంది.

ధైర్యం తెచ్చుకోండి మాస్టారూ. మా అందరికీ ఎలా ధైర్యం చెప్పేవారో మరచిపోయారా?

లంచంయిచ్చి ఉద్యోగం వేయించి కొడుకుని దక్కించుకోలేక పోయినందుకేగా మీ బెంగ ?

అన్నీ చేసి ఉద్యోగం వేయించినా మీ అబ్బాయి మీ దగ్గరుండేవాడు కాదేమో! రోజులు మాస్టారూ. రోజులు.

కురతనం వెర్రితలలు వేస్తున్న రోజులివి.

చింతించకండి.

మనదేశం అమెరికా అడుగు జాడలలో నడవాలని విశ్వప్రయత్నం చేస్తోంది. సంస్కృతీ, సంప్రదాయమూ అంటారా! అవన్నీ ఎక్కడో మీవంటి వాళ్లకి. ప్రజాస్వామ్యంలో మీవంటి వారి ఉద్దేశాలకు డిపాజిట్ దక్కదు. మీరే చెప్పేవారు—'పదుగురాడుమాట పాడియై ఒప్ప'నని.

అమెరికా అంటే—పేరెంట్ హోమ్స్ వగైరా హంగులతో—వాత్సల్యాభిమానాలను తగ్గించడానికికృషిచేస్తోంది. నాగరికతలో—అనుబంధాల విలువలు అల్పం ఔతాయి మాస్టారూ. ఈ చిన్న చేదునిజం అంగీకరించారో—మీ మనసు తేలికపడి తీరుతుంది. వెల్లువ నెదిరించడం అతికష్టం. ఎంత గొప్పవాళ్లయినా-మంచివాళ్లయినా—కాలానికెదురు నిలవలేరు మాస్టారూ.

ఏమిటలా ఆశ్చర్యపోతారు ?

గుడ్డొచ్చి పిల్లను వెక్కిరిస్తోందనా?

నీతి సూత్రాలు రూపు మార్చుకున్నాయి మరి.

అందుకే—పిల్లలు చెప్పడమూ, పెద్దలు వినవలసి రావడమూ.

కాలం తిరగబడింది మాస్టారూ! తిరగబడింది.

అందుకే మీ రెండో అబ్బాయీ మీకు దూరం ఐపోయాడు.

మారుతున్న వ్యవస్థలో మారలేకపోతున్న మనుషులు మీరు.

అందుకే మీ హృదయంలో ఈమంటలు...మారణహోమం.

మారండి మాస్టారూ...మారండి...మారండి.

మీకోసం...మాకోసం...మారండి, మారండి.

మారగలిగే మనుషులకే ఈ సమాజం.

మారలేనివారికి-మనుగడ సమస్యామయం.

మీ అబ్బాయిలు మారలేదూ ?
మీ అమ్మాయి మారలేదూ?
మీ సంప్రదాయాలు వాళ్లేం నిలుపుతున్నారు?
ఆలోచించండి మాస్టారూ. ఆలోచించండి.

[ఇంకా వుంది]





పసి బిడ్డకు
జీర్ణసంబంధమైన
బాధలు కలిగినప్పుడు...

సౌమ్యంగా పనిచేసే

అమృతాంజన్ గ్రైప్ మిక్స్‌చర్

బాధను అతి త్వరగా తగ్గిస్తుంది

గృహౌషధములు
తయారుచేయుటలో
తరతరాలుగా
నమ్మికకు పాత్రమైన
అమృతాంజన్‌వారి
తయారీ.



కడుపునొప్పి, అజీర్ణము, వాయువు, పళ్ళు వచ్చేటప్పుడు కలిగేబాధలు మొదలైన వాటిలో దేనితోనైనా సరే, మీ పసిబిడ్డ బాధ పడుతూంటె అమృతాంజన్ గ్రైప్ మిక్స్‌చర్‌తో అతి త్వరగా ఉపశమనం కల్గించండి త్వరగా సులభంగా తిరిగి మీ పసిబిడ్డ ఆనందంగా నవ్వుతుంది.

అమృతాంజన్ లిమిటెడ్

OBM 3410/1 TG

తొలి తెలుఁగు జంటకవుల వెలుగుల కవిత

"సుచంద్ర"

ప్రాచీనాంధ్ర పురాణేతిహాస సాహిత్యమున జంటకవితాధోరణులు స్వల్పము. రంగనాథ రామాయణకర్తలను నుద్దేశ్యపడు కాచవిభుడు, విఠలరాజు వివాదాస్పదులు గనుక అసలైన, సిసలైన జంట కవిత్వఝరి ప్రాదుర్భవించి, ప్రవహించినది శ్రీనాథయుగముననే. ఎన్నికగన్న యా తొలి తెలుగు జంటకవులే నందిమల్లయ, ఘంట సింగయ. ఇరువురి పొత్తు, శరీర ప్రాణ సదృశమైనట్టిది; వాగర్థముల కలయిక వంటిది. ఇరువురును మేనమామయును, మేనల్లుడు. అందు ఘంట సింగయ్య మలయమారుత బిరుదాంకితుడు. ఇరువురును అఘోర శివాచార్యునకు శిష్యులు. వేదుపలబ్ధమగు వీరికృతులు ప్రబోధ చంద్రోదయము, వరాహపురాణము. ప్రస్తుత మతత్కావ్య పరామర్శ నొకింత గావింతము.

ప్రబోధ చంద్రోదయము

కృష్ణమిశ్రుని సంస్కృత ప్రబోధ చంద్రోదయ నాటకమునకు ప్రబంధరూప పరివర్తనము. విచిత్రమైన సాంకేతిక నిరూపణ గలదీ నాటకము. అంతకన్న విచిత్రము. ఆధునిక కవితలోని సింబాలిక్ ధోరణులకిది యాలవట్టు. అనగా ప్రతీకవాదమనాడేయుండెనేమో!

వస్తువు

మాహేశ్వరునకు సంగము లేకయే మనస్సను పుత్రుడు జన్మించెను. ఆ మనస్సునకు ప్రవృత్తి, నివృత్తులను నిరువురు భార్యలు. ప్రవృత్తియందు మోహలోభాదులును అరిషడ్వర్గమును, నివృత్తియందు విచార వివేకసంతోషాది గుణములు ద్భూతమైనవి. వారికిని,వీరికిని కురుపాండవులవలె తుముల యుద్ధముజరుగగా,"యతోధర్మస్తతోజయః" యన్నట్లు వివేకాదులకు విజయము లభించినది. శ్రద్ధాసమానీతయగు ఉపనిషద్దేవితో వివేకునకు వివాహము జరుగుటతో, నా దంపతులకు విద్యా ప్రబోధ చంద్రు లుదయింతురు.

ఏకావ్యమైనను వస్తు ప్రాధాన్యమునకన్న, వస్తు నిర్వహణ రీతికెక్కువ గణన లభించును. కాని యిందు వస్తువులోనే అనన్యానాతిశయ శోభ గలదు. వివేకియై అంతశ్శత్రువులను, అసలు మనస్సునే జయించినచో, జీవాత్మ పరమాత్మ స్వరూపమగు అఖండ సచ్చిదానందము ప్రాప్తించునను యుపదేశమిందు కాంతాసమ్మితముగా జరిగినది. భావములకు రూపకల్పన జరిగి జీవుని గుణాగుణములే పాత్రలై, ఆ పాత్రలకు మూర్తిమత్వము జరిగి, తత్త్వము కవిత్వమై, కావ్యమద్వైత జ్ఞాన ప్రబోధాత్మకమై, శాంతరస ప్రతిష్ఠతో నామసార్థక్యముగడించుకొన్నది. దీని మానసిక పుత్రికయే తరువాతి వేదాంత దేశికుల విశిష్టాద్వైత ప్రతిపాదకమగు "సంకల్ప సూర్యోదయము". ఈ తెలుగు ప్రబోధ చంద్రోదయము పెసరువాడ గంగనామాత్యునకంకితము. ఇతడే దుగ్గన నాసికేతో పాఖ్యానమునకును కృతిపతి.

తమ కవితాదర్శముఁగూర్చి చెప్పుదు రీ కవులు -

"పొరిపొరి నొప్పు శలాకల, నొరసిన కుందనపు గూరెయున్ బోలంగన్
సరసుల సంఘర్షణమున, వరకవి కావ్యంబు మిగుల వన్నెకు నెక్కున్."

"కరభములకు పుష్పిత రసాల వాటిక, తిరుగ కంటకంబు దొరుకునట్టు
కుకవి కీటకములకు సుకవి కావ్యములోన, నెమక వినుమంత నెరసులేదు."

అని చెప్పుటంబట్టి తమది నిర్దుష్టమైనట్టిదియు, సరసుల తరచిన కొలది వన్నెకు, వాసికి నెక్కునట్టిదియునైన, సత్కావ్యమును తాము రచించితిమను నాత్మ ప్రత్యయము వారికున్నట్లు స్పష్టము. ఆనాటి భావ సంపద కృష్ణమిశ్రుని భాండారము. తెలుగు సొగసులు వీరివి. ఆ మహానుభావునకతి విధేయులు వీరు. అది వీరి వ్యుత్పత్తిలోపము. మూలగత సౌందర్య స్థాపనోద్దేశ్యము మాత్రమే. అట్టి వీరి యా విధేయతను బరికింతము.

మూలము :

"రమ్యాన్ హర్మ్యతలాన్ నవాస్సునయనాః గుంజద్విరేఫాలతాః
ప్రోన్మీలన్నవ మల్లికాసురభయో వాతాః సచంద్రాః క్షపాః
యద్యేతాని జయంతి హంత పరితశ్శస్త్రాణ్యమోఘాని మే
తద్భోః కీదృగసౌ వివేక విభవః కీదృక్ ప్రబోధోదయః"

అనువాదము :

"అళిగీతంబులతోడి పుష్పలతలుం హర్మ్యంబులున్ చంద్రికా
పలి మందానిల కందళంబులును వాసంతంబులున్ పండు వె
న్నెలలున్ కాంతలు నాకు నమ్మిన పరానీకంబులై యుండగా
నిలనుండంగ వివేకమెట్లొదవు పుట్టున్ బోధమెట్టుంగులన్—

మాధుర్య గుణముతోగూడిన యనూనాతి రిక్తానువాదమిది.

మూలము :

"సమ్మోదయన్తి, రమయన్తి, విషాదయన్తి
నిర్భర్త్సయన్తి, మదయన్తి, విడమ్బయన్తి
ఏతాః ప్రవిశ్య సదయమ్ హృదయమ్ నరాణామ్
కిమ్నామ వామ నయనానసమాచరన్తి."

అనువాదము :

సీ. వన్నెలు పచరించి, కన్ను సన్నలుచేసి,
వెడమాటలను ప్రేమగడలు కొలిసి,
తరితీపునటు నల తమకంబు పుట్టించి,
పట్టి ప్రియంబుల గుట్టుతెలిసి,
కలికి తనమ్మున కాకలు గావించి,
తోడి నీడల పోలెకూడియాడి,
అలుకల నలయించి, కలయిక వలపించి,
బాసల నడియూస పాదుకొల్పి

గీ. మనసు కరగించి, భ్రమయించి, మస్తరించి
మిగుల చొక్కించి యెంతయు తగులపరచి
పాసి యెడబాసి తమబంటు చేసికొనరె
వామలోచన లెంతటివారినైన,

మూల ప్రపంచీకరణముతోగూడిన చక్కని, చిక్కని ప్రజ్ఞా విలాసిత వ్యాఖ్యానువాదమిది. "భుజని పీడిత బాహుమూల భగ్నోన్నతిస్తన మనోహర మాయతాక్ష్యః" అను మూలపంక్తికి

"భుజనిష్పీడిత బాహుమూల యుగళీ భుగ్నస్తనాభోగ నీ
రజ నేత్రాపరిరంభసంభవ సుఖారంభాంశమున్"—

అను యనువాదమున ప్రతిపాదిత వస్తు స్వరూప గాఢత్వమునకు దగిన ప్రౌఢశయ్యా విలసనము గలదు.

అట్లే,

"క్షేత్రగ్రామ వనాద్రి పత్తన పురద్వీపక్షమామండలి
ప్రత్యాశాఘన సూత్రబద్ధ మనసామ్ లబ్ధాధికమ్ఛాయసామ్"

అను పంక్తికి యనువాదమున

"పుడమిలోన మాన్యంబు మఱికొంత, గలవాడు గ్రామ మెల్లను నేలగా దలంచు" అను పద్యము విపుల భావ వైశద్య పూరితము.

మూలము :

"కాంతే త్యుత్పలలోచనేతి విపుల శ్రోణీభరేత్యున్నమత్
పీనోత్తుంగ పయోధరేతి సుముఖాంభోజేతి సుభ్రూరితి

దృష్ట్వా మాద్యతి మోదతేఽభిరమతే ప్రస్తౌతి విద్యానపి
ప్రత్యక్షా శుచిభస్త్రికాం స్త్రియమహో! మోహస్య దుశ్చేష్టితమ్॥

అనువాదము:

"సవరనిదంచు, నిబ్బరపుచన్నులదంచు సుధాంశుమండలీ
సువదనయంచు, బిత్తరపు చూపులదంచు లతాంగియంచు మో
హవశతపొంది చొక్కి కొనియాడి రమించు బుధుండు కామినిన్
శివశివ ప్రాతిగామి అశుచి ప్రతియౌట యెఱింగెఱింగియున్"

ఇందనువాదము గంగా నిర్ఝరీ సదృశము. విశేషము లించుక మారినను మూలకర్త భావమునకు ముడుపు గట్టినట్లే యున్నది. సర్వసాధారణముగా అనువాదమున తెలుఁగు పాలును వైశద్యమును యెక్కువ.

"కటి తటీ కటదాన గంధ భ్రమద్భృంగ, భీకర కరిఘటా బృంహితముల" అను నీ సీసపద్యమున మూలప్రపంచనముతోబాటు చక్కని శయ్యానైగ నిగ్యమున్నది. కాని చతుర్థాశ్వాసమున నమూలకముగా మనోజ మందిర వర్ణనాత్మకముగనున్న సీసపద్య చిత్రణము జాత్యలంకార మనోజ్ఞమేగాని, వీరి కవితా సుస్వరములలో నొక యపశ్రుతి. సరసులు హర్షింప నట్టిది. మొత్తముమీద శాస్త్ర వస్తువును, కళాసౌందర్య సన్నికర్షము గావించి, ఉత్తమోన్నత శ్రవ్య ప్రబంధ ప్రసిద్ధులైనారీ జంటకవులు.

వరాహపురాణం

వాగీశ్వరీ మంత్రసిద్ధులైన పిమ్మట నీ కవులు వరాహ పురాణమును రచించిరి. గ్రంథ మధ్యమున నొక్క చక్కని వాగీశ్వరీ స్తోత్రము గాననగును. క్షేత్రమహిమాను వర్ణనోర్మనాదమైన వరాహ పురాణమునుగూర్చి తెనిగించుచు దానిని స్వతంత్రించి కావ్య మార్గానుకూలములుకాని విషయముల నుజ్జగించియు, కొన్ని కావ్యోచితమైన మార్పులు గావించియు, సారకల్పనాధారాళముగా, ప్రౌఢ శయ్యా పరిపాక హేరాళముగా తమ గ్రంథము నొక మహాప్రబంధముగా తీర్చిదిద్దిరి. ఇది శ్రీకృష్ణదేవరాయల తండ్రియగు తుళువ నరస నాయకున కంకితము నిజమునకిది పురాణ ధర్మము గౌణమై, కథా కథన రక్తియు. రచనాచణత్వము గండరించిన నొక పబంధ మండలియని చెప్పనొప్పును. వ్యాసవిస్తరభీతి నిందలి విశేషముల సంక్షిప్తముగా నుటంకింతును.

ఈ గ్రంథము నందలి దుర్జయోపాఖ్యానమొక చిన్నారి పొన్నారి పదునారవ శతాబ్దపు ప్రబంధమువలె నున్నది. వరాహ పురాణమున భావనయందును, శయ్యయందును, ప్రౌఢయందును అనేక చమత్కార వైచిత్రులు ప్రదర్శింపబడినవి. నాయికా నాయకుల ప్రణయ వృత్తాంతములు, విరహ విశేషములు రేఖామాత్రములుగ నుండి యనంతర ప్రబంధములకు మార్గదర్శకములైనవి. పుష్పాపచయ ఘట్టమున "రగడ" రచించుటయు నిట్టిదే.

అర్థగత చమత్కారమునకు చంద్రోపాలంభనమొక తార్కాణము "వీని చంద్రికలు త్రావిన చకోరములకు, ద్రిమ్మగుట భారమే ఇంగలంబు" - ఇత్యాదిగా సాగినదా సందర్భము.

శబ్దగత చమత్కారమునకు మలయానిలో పాలంభనమొక దృష్టాంతము.

"ఫణికన్యా ముఖఫేన చందనవిరి ప్రత్యగ్ర సంభూత భీ
షణ దావానల కీల పాంథరమణీ సంఘాత చేతోవిదా
రణ పంచాశుక శస్త్రి విషధారా భస్త్రి సంతాపకా
రణమీ మందసమీరణంబు సఖులారా! మమ్ము మన్నించునే"

ఇందలి రచనా విన్యాస గత నైపుణ్యమీ గ్రంథమున బహు సందర్భ సాధారణమైన దగుటయేగాక కవి సార్వభౌముని శృంగార నైషధ "కాలాంతరఃపుర కామినీ కుచతటీ శ్రీచందనాలేపకము" పద్యమును స్ఫురణకు దెచ్చుచున్నది. యుగకర్తయగు శ్రీనాథుని ప్రభావమిందుండుట సహజము, సమంజసము కూడ.

కల్పనాగత చమత్కారము కిందలి లక్ష్యము లవిరళములు. ధరిత్రీకాంతను కోఱకొమ్మున ధరించిన వరాహమూర్తి "జల దాశ్వైక శృంగోన్నమత్ కైలాసము బోలెనున్న జగదేకస్వామి"యట. చంద్రోదయ వర్ణనా సందర్భము కూడ యిందుల కుచితలక్ష్యమే.

"తోచె హరిణాంక బింబంబు నాచుతోడ; దొరువుగతి నంబ,
రముచుడి కరణినుండె
నమప మొక్కలవలె చుక్కలమరె చిలువ, చిలుపనీరు విధాన
వెన్నెలలు మొనసె"
మిను కల్పము తారలుచి; క్కిన గింజలు పూర్ణతు హిమకరుడు
తూర్పె;
త్రిన కొలుచు రాశిలాం; ఛనము మషీరచిత ము దవంనము
దాల్చెన్"

వర్ణనాగత చమత్కారము.

"మిన్నులపై పొరువెల్లి ముత్యపుజల్లి, చలువలబువ్వు: చెంగలువకచ్చు" అను నిత్యాది అను ప్రాసాదితయుక్త అర్ధనారీశ్వర వర్ణన సందర్భమునను, భద్రవటువృక్షవర్ణనమునను చక్కని పోకడలు పోయిరి.

ఇక వైచిత్రీ విశేషమున వీరు పలు పోకలు పోయిరి. అనేక విశేష వృత్తములు దండకములు, రగడలు రచించిరి. కోరి మహా దుష్కర ప్రాసలు సైతము రచించిరి. పాద భ్రమకయమకములను, మాత్రాసమతాళమును, నిరోష్ఠ్య ప్రతిలోమానులోమ మకరందమును గూడ రచించిరి. కందగర్భిత మణిగణ నికరము, కందద్వయ గర్భిత భాస్కర విలసిత వృత్తము, ఖడ్గబంధము, ఏకాక్షర ద్వ్యక్షర కందములు మున్నగు బహువిధ విచిత్రబంధ గర్భచిత్ర కవితా రీతులను కవిత్వపు గరిడీ సాములను దక్షతతో ప్రదర్శించిరి.

తొలి తెలుఁగు జంటకవిత లేబ్రాయపుదే యైనను వీరి చేతుల నది ప్రౌఢరత్న మంజూషయైనది. ఇట్టి కవితలోని మృల్లారవములు భారతీపద మంజీర శింజితములై భావ ధ్వనులకు శ్రుతి వేయుచుండును. తొలి తెలుఁగు వెలుగుల జంటకవిత తెలుగు వారికొక కాదంబరీ సమారాధనము; స్వచ్ఛంద కచ్ఛపీ శ్రుతి. అట్టివారి కథా ప్రశస్త్యము సర్వదా, సర్వథా మన కభినందనీయము, అనుసరణీయము కూడ.

"వన్ద్యాసా సాహితీ విద్యా భావార్థ పదనాదినీ
లభ్యతి యత్కటాక్షేణ వివేకానంద వాహినీ"

సమకాలీన భారతీయ ఆంగ్లకవిత

శ్రీ ఎమ్. శివరామకృష్ణ

ఆధునిక భారతీయ కవిత్వం - అన్ని భాషలలోను - ఇంచుమించు సమానమైన సంప్రదాయాలను శిల్పాలను ప్రతిబింబిస్తుంది అనటం సత్యదూరంకాదు. కాని భారతీయులు ఆంగ్లభాషలో రచించే కవిత్వానికి మాత్రం కొన్ని విలక్షణాలు స్పష్టంగా కనిపిస్తాయి. ఈలక్షణాలు వివిధ భారతీయ భాషలలో వెలువడే కవిత్వంలోకూడా కొంత పొడగట్టినా, వాటిని వ్యక్తీకరించే తీరు, వాటి వైయక్తిక ప్రతిభ, భారతీయ ఆంగ్ల కవితలో మరింత స్ఫుటంగా కనిపిస్తాయి. ఈ మౌలికమైన లక్షణాలను తెలుసుకోవలెనంటే భారతీయ ఆంగ్లకవితయొక్క ఆవిర్భావం, వికాసం స్థూలంగానైనా పరిశీలించుకోవాలి.

"భారతీయ ఆంగ్లకవిత" అన్న పదం ఆంగ్లభాషలో భారతీయులు చేసిన, చేస్తున్న మౌలికమైన రచనలకే పరిమితం. దీనివల్ల వివిధ భారతీయ భాషలనుంచి ఆంగ్లంలోకి అనువాదం చేయబడిన కవితా రచనలు దీనిలో చేరవని స్పష్టం. సూక్ష్మంగా చెప్పవలెనంటే భారతీయులు ఆంగ్లభాషలో చేసిన సృజనాత్మక కవిత ఇది. ఇందువల్ల రెండు విషయాలు విశదమవుతాయి: ఆంగ్లభాషను ఈ కవులు కేవలం సాధారణ జీవితావసరాలకు, తత్సంబంధించిన లౌకిక ప్రయోజనాలకుగాక, సృజనాత్మకంగా (creative) వాడారన్నమాట. కాగా, ఈ కవులు భారతీయ సాంస్కృతిక, సాహిత్య పరిధినిదాటి ఆంగ్లభాషలో కవిత్వం సృజించిన వారందరిలోను — అంటే ఆంగ్లభాషను ఉపయోగించే కామన్వెల్తు రాజ్యాలలోని కవులతో—తులనాత్మక పరిశీలనకు అర్హులు. అంటే ఈ కవిత్వ విమర్శ రెండు ముఖ్యమైన దృక్పథాలనుండి జరుపవలసి వస్తుంది.

1) ఈ కవిత ఎంతవరకు 'భారతీయత'ను, భారతీయ సాంస్కృతిక విలువలను, ప్రతిబింబింప చేస్తున్నది?

2) ఈ కవిత ఆంగ్లభాషలో ఇప్పటికేఉన్న సాహితీ సంప్రదాయం, శిల్పందృష్ట్యా ఎంతమేరకు విలువైనదని చెప్పవచ్చును?

ఈ ప్రశ్నలు సాహిత్య విమర్శ దృష్ట్యా చాలా క్లిష్టమైనవి. వీటి సమాధానాలు తెలుసుకొనేందుకు చారిత్రకదృష్టి అవసరం. భారతీయ ఆంగ్లకవిత ఒక సాంస్కృతిక, చారిత్రక సంఘటన యొక్క ప్రతీక. పంథొమ్మిదో శతాబ్దిలో భారతదేశంలో ఆంగ్లభాషను బోధన భాషగా ప్రవేశపెట్టడం, దానివలన ఉత్పన్నమైన విస్తృత సాంఘిక, సాంస్కృతిక, మతపరమైన పరిణామాలూ అందరకూ సువిదితం కాగా, ఈ ఆంగ్లభాషా సంపర్కంద్వారా ఒక చిత్రమైన అభిలాష—లేదా అనుభూతి- మాత్రం చాలామంది భారతీయ మేధావులలో, ప్రత్యేకంగా వంగీయులలో, కలిగింది. ఆంగ్లభాషను కేవలం భావవ్యక్తీకరణకేగాక, సృజనాత్మకంగా గూడా తమ స్వంతంచేసుకొని తద్వారా ఆ భాషలో మౌలికమైన రచనలుచేయాలన్న భావన విస్తృతంగా కలిగింది. ఈ ఉద్దీపనయొక్క ఫలితమే భారతీయ ఆంగ్లభాషా కవిత.

దీనివల్ల ఒక సమస్య ఉత్పన్నమై, దానికి ఏదోవిధంగా సమాధానం చెప్పవలసివస్తుంది. ఇంచుమించు భారతీయ భాషలన్నిటిలోనూ—భాషదృష్ట్యా, సాహిత్యందృష్ట్యా — పరిపుష్టమైన సంప్రదాయాలు, సాహితీ ప్రతిభఉన్నవి. ఈ శిల్పాలను, సంప్రదాయాలను త్యజించి, ఆంగ్లభాషలో- ఒకవైదేశిక పరాయిభాషలో—సాహిత్య సృష్టి చేసే ప్రయత్నం చేయటం ఒకరకమైన సాంస్కృతిక నిర్వీర్యతకు, బానిసత్వానికీ సంకేతమా? ఇది నిజమయితే, ఈ కవులందరూ 'సాహిత్యకాందిశీకులే'గదా? (literary exiles)

కనుక ఆంగ్లభాషలో కవిత్వం వ్రాసే రచయితలు ఏ ప్రయోజనాలను ఆశించి — ఆ ప్రయోజనాలు తమ తమ స్వంత భాషలలో దుర్లభ్యమని తలచి—ఆంగ్లభాషను తమ రచనాఉపాధి (literary mode)గా స్వీకరిస్తున్నారన్న వాస్తవాన్ని విపులీకరించవలసి ఉంటుంది వారు ఆంగ్లభాషను తమ సాహిత్య భాషగా ఎన్నుకోవడం ఈ క్రింది కారణాలవల్ల—కనీసం స్థూలంగా—కావచ్చు.

1) 'భారతీయత' (Indianness)ను, దానికి సంబంధించిన వైయక్తిక సాంస్కృతిక ప్రతిభను ఆంగ్లభాషా సంపర్కంగల-భారతీయ జనతతో పోల్చిచూసినప్పుడు — విస్తృత జనావళికి తెలియచెప్పడం. అంటే కేవలం సృజనాత్మకమైన వ్యక్తీకరణకుగాక, భారతీయుల ఆచారవ్యవహారాలను, నమ్మకాలను గురించిన సమాచారాన్ని విస్తృతంగా అందజేయడానికి, అంతర్జాతీయంగా సౌలభ్యంగల ఆంగ్లభాషను స్వీకరించడం, ఇటువంటి రచనలు స్థూలంగా సాహిత్యపు సువాసనలు గుబాళించినా, ఇవి కేవలం వ్యాపార ప్రకటనల విలువను అధఃకరించవు. ఒక పాఠకుణ్ణి - జాతీయ లేదా అంతర్జాతీయ- దృష్టిలో ఉంచుకొని ఆతనికి ఆకర్షణీయంగాఉండే మూసలోపోసి తయారుచేసిన నకిలీ బంగారం ఇది.

2) పోతే, మరొక బలమైన ప్రేరణకూడా ఇంగ్లీషును ఎంపికచేయడానికి కారణంగా కనిపిస్తుంది. భారతీయ సంప్రదాయాలు వాటిమీద పాశ్చాత్య సామాజిక సాంస్కృతిక విలువల ప్రభావం, ఈ రెంటి సంఘర్షణను సమన్వయం చేయలేని సంకటస్థితి ఆంగ్లభాషా వాఙ్మయంద్వారా, చలనచిత్రాలు, పత్రికలద్వారా, పాశ్చాత్యసంస్కృతి

యొక్క బలమైన ముద్రపడి, సంప్రదాయానికి పూర్తిగా కట్టుబడ లేక, పూర్తిగా త్యజించనూలేక ఒకరకమైన ద్వంద్వ స్థితిలోపడి, క్రమక్రమంగా వ్యజాతీయ ప్రాచుర్యంనుంచి ఛేదింపబడి, ఆ సంఘర్షణయొక్క వ్యక్తీకరణకోసం, ఏ భాష, సాహిత్యం ఈస్థితిని కలిగించాయో వాటినే ఎన్నుకొనటం. ఇది చిత్రమైనా నిజం.

దీనివల్ల ఒకవిషయం స్పష్టమౌతుంది. ఆంగ్లంలో కవిత్వం వ్రాసే రచయితలు–వారు పత్రికా రచయితలుగాక నిజంగా కవులే అయితే–కేవలం వ్యాపారదృష్టితో (అంటే మరికొన్ని ప్రతులు అమ్ముకొని మరింత ఖ్యాతిని ఆర్జించాలని) ఆంగ్లభాషను తమ భాషగా ఎన్నుకోలేదు. ప్రాచ్య, పాశ్చాత్య సంస్కృతులమధ్య ఉత్పన్నమైన సంఘర్షణ వారిలో కలిగించిన అంతరంగమథనం వారు జన్మించిన భాషా, సాంస్కృతిక పరిధులనుదాటిసమన్వయానికి లొంగక ఒకానొక నైరాశ్యాన్ని కలిగించింది. ఈ నైరాశ్యాన్ని సృజనాత్మకంగా అధఃకరించే ఉపాధి ఆంగ్లకవిత. ఇది భారతీయ ఆంగ్ల కవిత్వం యొక్క విలక్షణత.

II

సమకాలీన భారతీయ ఆంగ్లకవిత లక్షణాలు తెలుసుకోడానికి, ఇతఃపూర్వపు అంటే పంతొమ్మిదవ శతాబ్ది–కవిత్వంయొక్క స్థూలమైన పరిచయం అవసరం. ఆంగ్లభాషలో కవిత్వం వ్రాయ ప్రయత్నించిన మొదటి భారతీయులలో హెన్రీ డెరోజియో (1807–1831) ముఖ్యుడు. పోర్చుగీస్–భారతీయ మాతాపితలకు జన్మించిన డిరోజియో, తాను కవియేగాక, కలకత్తాలోని హిందూకళాశాలలో ఆంగ్లభాషాచార్యుడుగా కూడా తన విద్యార్థులలో ఆంగ్లభాషా సాహిత్యాలపట్ల ఉత్సుకత కలిగించాడు. ఇతని కవిత్వం బైరన్, స్కాట్ మొదలైన ఆంగ్ల కాల్పనిక కవులవల్ల ప్రభావితమైనా, భారతీయతను ప్రస్ఫుటంగా ప్రతిబింబించింది. గత వైభవాన్ని, ప్రస్తుత దాస్య శృంఖలాలను తులనాత్మకంగా పరిశీలించి ఆనాటి భారతదేశాన్ని మూగవోయిన వీణగా చిత్రీకరించాడు.

Thy music once was sweet. who hears it now?
Why doth the breeze sigh over thee in vain?
Silence hath bound thee with her fatal chain;
Neglected, mute and desolate art thou,
Like ruined monument on desert plain.

డెరోజియోకాక, గణనీయమైన కవితా ప్రతిభ వ్యక్తపరచిన ఇతర కవులలో ముఖ్యులు కాశీప్రసాద్‌ఘోష్, మైకేల్ మధుసూదన దత్, రమేశ్చంద్రదత్ మొదలైనవారు. అయితే భారతీయతను అందంగా, ఏరకమైన వెరపు లేకుండా వ్యక్తీకరించిన వారిలో అగ్రగణ్యులు తోరుదత్, మన్‌మోహన్‌ఘోష్ మొదలైనవారు. తోరుదత్ వర్ణనా కవిత్వంలోనేగాక భారతీయ ఇతిహాసాలలో కొన్ని ఘట్టాలను కవితా రూపంలో పునఃసృష్టి చేయడంలో అపారమైన ప్రతిభ చూపినది. ప్రహ్లాదుడు, లక్ష్మణుడు ఆదిగాగల పురాణ ప్రసిద్ధ వ్యక్తుల జీవిత ఘట్టాలనుండి కొన్ని సంఘటనలను తోరుదత్ తన కవిత్వంలో చక్కగా మలిచింది.

కాని, ప్రసిద్ధులైనా, వీరందరూ ఒకరకంగా 'ఆంగ్ల మానస పుత్రులు' అని చెప్పవచ్చు. వస్తువైవిధ్యమున్నా, వీరి కవిత చాలావరకు వర్ణనాత్మకమైన ప్రతిభ కనబరిచింది గాని నిజమైన కావ్యలక్షణాలు తక్కువ. శిల్పానుకరణతోబాటు భావదాస్యం కూడా వీరి కవితలో గోచరమౌతుంది.

ఈ దృష్టితో పరిశీలిస్తే కావ్య కళాదృష్ట్యా కొన్ని లోపాలు కనిపించినా భారతీయతకు నిర్ద్వంద్వంగా, సగర్వంగా కావ్యగౌరవాన్ని కలిగించి – ఆయా మానసిక ఆధ్యాత్మిక లక్షణాలను నిర్దుష్టంగా వ్యక్తీకరించిన మూర్తిత్రయం రవీంద్రనాథటాగోర్, శ్రీఅరవిందులు, సరోజినీ నాయుడు అని నిస్సందేహంగా చెప్పవచ్చు. టాగోర్ మానవతావాదియేగాక, దాదాపు అన్ని భారతీయ భాషలలోను ఆధునిక కవితా పునరుజ్జీవనానికి నాంది పలికినాడని చెప్పవచ్చు. అలాగే శ్రీఅరవిందులు ఆంగ్లకవితతోనేగాక, లాటిన్, గ్రీక్ వాఙ్మయాలతో అపార పరిచయంఉన్న పండితుడు. ఆ కవితా సౌలభ్యాన్ని తన ఆధ్యాత్మిక చింతనకు సునాయసంగా మలచుకొన్న కవిద్రష్ట. ఆధునికులు కొందరు ఎందుకో నిరసించినా ఆయన రచనలలో అన్నివిధాల ఉత్తమమైన కావ్యం సావిత్రి. భారతంలోఉన్న ఆఖ్యానాన్ని ప్రాతిపదికగా స్వీకరించి, దానిని తన యోగసిద్ధాంత నిరూపణకు ప్రతీకగా రూపొందించి, తన ఆధ్యాత్మికానుభూతులను 'సావిత్రి' ద్వారా వ్యక్తం చేశారు శ్రీ అరవిందులు.

III

స్వాతంత్ర్యోదయానంతరం, అన్ని భారతీయ భాషలలోవలెనే, భారతీయ ఆంగ్ల కవితలోగూడా అనూహ్యమైన మార్పులు వచ్చాయి. వీటిని మూడు విధాలుగా పరిశీలించవచ్చు.

1) వస్తువిషయంలో మరింత వైవిధ్యం, సమకాలీన సామాజిక, ఆర్థిక, రాజకీయస్థితుల బలమైన ప్రేరణ, వాటిపట్ల శ్రద్ధ. ''ఆధ్యాత్మిక'' విషయాలపట్ల ఉదాసీనత.

2) భారతీయతపట్ల–తత్సంబంధించిన సాంస్కృతిక, సామాజిక విలువలపట్ల, నానాటికి మరింత బలపడుతున్న నమ్మకం, గౌరవం.

3) శిల్పందృష్ట్యా, భాషదృష్ట్యా వర్ణనకంటె ధ్వని, వాచ్యంకంటె వ్యంగ్యానికి మరింత ప్రాచుర్యం. అలాగే కావ్యభాషను నిజజీవిత గతులకు దగ్గరగా తీసుక రావడానికి మరింత ప్రయత్నం.

ఈ లక్షణాలన్నీ ప్రస్ఫుటంగా కనిపించే సమకాలీన భారతీయ ఆంగ్లకవులలో ముఖ్యులు, నిస్సిమ్ ఎజికేల్, ఏ. కె. రామానుజన్, ఆర్. పార్థసారథి, కమలాదాస్, కె. ఎన్. దారువాలా, జయంత మహాపాత్రా, శివ్. కె కుమార్‌లు. వైయక్తికమైన వారి వాటి

ప్రతిభను కనబరచినా, వీరందరి కవితలో ప్రగాఢంగా కనిపించే ఒక లక్షణం 'భారతీయత' పట్ల అసందిగ్ధమైన అనురక్తి. పందొమ్మిదవ శతాబ్దపు కవులతో తులనాత్మక పరిశీలనచేస్తే ఈ కవులలో ఒక విషయం సుస్పష్టమౌతుంది. వీరందరూ ఆంగ్లభాషను సృజనాత్మక ప్రక్రియగా ఎన్నుకున్నా, దానివల్ల భారతీయతను ఆత్మసంస్కారాన్ని త్యజించలేదు. మన్ మోహన్ ఘోష్ మొదలైన పందొమ్మిదవ శతాబ్దపు కవులు భారతీయాత్మను ఒక రకంగా చిన్నచూపు చూశారనే చెప్పవచ్చును. భారతీయ జీవన విధానాన్ని విలువలను పరిశీలించినా, ఆ పరిశీలనలో వారు వాడినవి పాశ్చాత్య సులోచనాలే. అంటే మన జాతి జీవన విధానాన్ని, సంస్కృతిని దార్శనిక దృక్పథాన్ని, పౌరాణిక దృష్టిని, సాహిత్యరీతులను అవగాహన చేసుకొనడంలో, ఇవన్నీ ఆంగ్ల సాహితీ సంస్కృతులకు ఈసికట్లు అనేవారు స్థూలంగా – వివేచనా రహితంగా – నమ్మారు. ఈ రకమైన "సాంస్కృతిక కాందిశీకత" (literary exile) బలంగా భాసించేవారిలో ముఖ్యుడు మన్‌మోహన్ ఘోష్.

ఈనాటి భారతీయ ఆంగ్లకవులు ఈ విషయంలో పూర్తిగా విభిన్నం. తాము ఆంగ్లంలో కవిత్వం వ్రాస్తున్నను వాస్తవాన్ని, దానికి సంబంధించిన లక్షణాల్ని కప్పిపుచ్చరు. పైగా దీనిని, సాంస్కృతిక బానిసత్వానికి ప్రతీకగా అంగీకరించరు. ఉదాహరణకు తన మాతృభాష మలయాళం ఉండగా, ఆంగ్లంలో ఎందుకు పద్యరచన చేయాలి అన్న ప్రశ్నకు కమలాదాస్ చాలా చక్కగా సమాధానం ఇస్తుంది:

Don't write in English, they said, English is not your mother tongue. Why not leave me alone, critics, friends, visiting cousins, Every one of you? The language I speak becomes mine, its distortions, its queernesses, All mine, mine alone. It is half English, half Indian, funny perhaps, but it is honest, It is as human as I am human, don't you see? It voices my joys, my longings, my Hopes, and it is useful to me as cawing is to crows or roaring to the lions, it is human speech......

కమలాదాస్ చెప్పే సారాంశం ఒకటే. కాకి అరుపు కాకికి ముద్దు అయినట్లుగా, సింహానికి గర్జన ఇంపయినట్లుగా ఆ భారతీయ ఆంగ్లకవికి తన ఆంగ్లకవిత్వం–మిగత ఆంగ్లకవితలో తూగలేక పోయినా–అపురూపం. అది తన సంతోషాన్ని, తన మనోవేదనను, తన తపనను, తన కోర్కెలను వ్యక్తీకరించే ఉపాధి. స్పష్టంగా అది సజీవ మానవగీతం, కనుక భారతీయభాష కాకపోయినా భారతీయాత్మను భాసింపచేస్తుంది.

దీనివలన ఒక విషయం స్పష్టమౌతుంది. ఏ కవికి - నిజంగా సృజనాత్మక ప్రతిభ ఉన్నవాడయితే - తనఅనుభవాన్ని వ్యక్తీకరించడానికి భాషకూడా ప్రతిబంధకంకాదు. ఆ భాష తను జన్మించిన సంస్కృతి నుంచి ఉద్భవించవచ్చు, లేదా సమకాలీన అంతర్జాతీయ సాంస్కృతిక సాహిత్యసంపర్కాలదృష్ట్యా తను నేర్చిన భాష కావచ్చు. ఏది ఏమైనా ఈ భారతీయ కవులందరూ తమ భారతీయాత్మను నిర్ద్వంద్వంగా చాటుతారు. కమలాదాస్ అదే కవితలో అన్నట్లు:

I am Indian, very brown, born in
Malabar I speak three languages, write in
Two, dream in one.

అంటే సమస్త మానవాళి కనే కలల భాష ఒక్కటే: భావాలూ, ఉద్వేగాలూ.

ఇల్లాగే ఎ. కె. రామానుజన్ కూడా తన భారతీయతలోనే తన్ను తాను వెతుక్కుంటానంటాడు.

I must seek and will find
my particular hell only in my Hindu mind.

ఆర్. పార్థసారథికూడా తన గతంలోనే తన వర్తమానం ఇమిడి ఉందంటాడు. ఈ గతం తన సంస్కృతి అంతదీను :

Scrape the bottom of your past
Ransack the cupboard
for skeletons
of your Brahmin childhood
... ...

నిస్సీమ్ ఎజికెల్ కూడా ఇదేవిధంగా భారతీయతపట్లగల తన గాఢమైన తాదాత్మ్యాన్ని, దాని ద్వారా ప్రతిబింబించిన అనురక్తిని వ్యక్తీకరిస్తూ అంటాడు :

I have made my commitments now,
This is one: to stay where I am.

ఎజికెల్, కవికి తన స్వజాతితో తాదాత్మ్యం అవసరం అని ప్రవచిస్తే, మరొక భారతీయాంగ్లకవి–దారువాలా–తన దేశమే ఆర్థిక పరమైన సమస్యలద్వారా నిర్వేదాన్ని, నిస్సహాయతను వ్యక్తీకరిస్తే, ఈ సమస్యలను ధైర్యంగా ఎదుర్కొంటుంటే, దీనినే తన కావ్యానికి ఉద్దీపనగా భావించక, పాశ్చాత్యులను–ముఖ్యంగా టి. ఎస్. ఎలియట్ మహాకవి వ్రాసిన "మరుభూమి", కాఫ్కా వ్రాసిన కావ్యా నుకరించవలసిన అవసర మేమిటంటాడు :

...Why should I tread the kafka beat
or the waste land
When Mother you ar near at hand
one vast, sprawling defeat.

IV

ఈ గాఢమైన భారతీయతను గుర్తించందే సమకాలీన భారతీయ కవుల సాహిత్య సృష్టిని పరిశీలించడానికి సవ్యమైన దృక్కోణం దొరకదు. దీనివలన ఒక విషయం విశదమౌతుంది: ఈ కవులు తమ రచనలలో కేవలం కాల్పనికమైన తమ తమ వ్యక్తిత్వాలకే పరిమితమైన భావోద్వేగాన్నిగాక, సామాజిక దృక్పథం అవసరమని నొక్కి వక్కా

ణిస్తారు. అంటే స్థూలంగా, భావంగాని, ఒక సంఘటనగాని వ్యక్తి పరమైనా, వాటి విలువను సామాజిక దర్పణం ద్వారానే ప్రతిఫలింప జేయడానికి ప్రయత్నిస్తారు. ఈ విధంగా వ్యక్తికీ, సంఘానికీ ఉన్న బలమైన సాన్నిహిత్యాన్ని-వ్యక్తి విలువలు ఎట్లా సామాజిక ఆదరణ పొందవలసి ఉంటుందో-తన కవిత్వంద్వారా అద్వితీయ ప్రతిభతో తెలియజెప్పిన భారతీయాంగ్ల రచయితలలో నిస్సిమ్ ఎజికేల్ చక్కటి దృష్టాంతం. తన తల్లిని ఒక తేలు అంట పొడవడం అన్న చాలా సామాన్యమైన సంఘటనను వస్తువుగా స్వీకరించి "The Night ot the Scorpion" అన్న తన కవితలో, గ్రామీణ వాతావరణాన్నేగాక, సంపూర్ణమైన సమకాలీన భారతీయాత్మను ప్రదర్శిస్తాడు.

I remember the night my mother·
was stung by a scorpion

అని తన జ్ఞాపకాన్ని నెమరువేస్తున్నట్లు ప్రారంభించి, తన తల్లి బాధను పోగొట్టటానికి చేసిన ప్రయత్నాలను వివరిస్తూ, గ్రామీణులను వర్ణిస్తాడు. దీపాలు పుచ్చుకొని, మిడతలదండువలె ఈ గ్రామీణులు వచ్చి తన తల్లిని ఆవరించిన క్లేశమనే భూతాన్ని పార ద్రోలడానికి ప్రయత్నించారంటాడు.

The peasants came like swarms of flies
and buzzed the Name ot God a hundred times
... ...
with candles and with lauterns
throwing giant scorpion shadows
on the mud.baked walls
they searched for him: he was not found.

కాని తల్లిబాధ తగ్గదు. తన తండ్రి హేతువాది: కాని నిస్సహాయుడై అన్ని పయత్నాలు చేస్తాడు.

My father sceptic, rationalist
trying every curse and blessing.
Powder, mixture, herb and hybrid.

జాగ్రత్తగా పరిశీలిస్తే ఈ కవిత సమకాలీన భారతీయ జీవితానికి విభిన్న సంస్కృతుల సంఘర్షణకు-ప్రతిబింబమని చెప్పడం ఏమాత్రం అతిశయోక్తికాదు. అమిత శాంతంగా, ధీరోదాత్తంగా తన బాధను భరించి-చివరకు తనను అంటపొడిచి తద్వారా తన పిల్లలను రక్షించింది అనే భావనలో తన వ్యక్తిపరమైన బాధను అధిగమించిన మాతృమూర్తి

My mother only said
Thank God the scorpion picked on me
and spared my children

ఈమె భారతీయతకు ఒక ప్రతీక అయితే, ఆమెబాధను తగ్గించడానికి అన్ని ప్రయత్నాలుచేస్తూ, దీనివల్ల జనించిన ఆవేదన ద్వారా చివరకు తన హేతువాదాన్ని, తన తార్కిక దృష్టినిసైతం విడనాడి మూలికలను, భస్మాలను వాడ డానికి సిద్ధపడిన ఆమెభర్త మరొక ప్రతీక. భిన్న సంస్కృతుల బలమైన ముద్రపడి దీనిని పూర్తిగా సమన్వయం చేసుకోలేకపోయినందువల్ల ఉత్పన్నమైన సంకట స్థితి ఈ భర్తస్థితి, అతనితోపాటు మనందరిదీను. ఈరెంటి దృక్పథాలమధ్య మిగతావ్యక్తులు. అన్ని మంత్ర తంత్రాలలోను నిర్హేతుకంగా నమ్మకంగల గ్రామీణులు, ఈ రకపు విపత్కరస్థితిని ఆలంబన చేసుకొని తమ "ఆధ్యాత్మిక" ఆధిపత్యాన్ని చూపించాలనుకొనే "స్వాములు".

I watched the holy man perform his rites.
to tame ıhe poison with an incantation

ఈ వ్యక్తుల చిత్రణేగాక, ఎజికేల్ ఇంకొక విషయం ధ్వనింప చేస్తాడు. బలమైన శారీరక మానసిక క్లేశాల ముంగట నిలిచినప్పుడు మానవుడు ఏకాకి, నిర్వీర్యుడు, ఏమంటే ఇన్ని పయత్నాలు చేసినా తల్లిబాధ తగ్గటానికి ఇరవైగంటలు పట్టిందంటాడు.

After twenty hours
it losts its sting.

అంటే మంత్ర తంత్రాలవల్లకాక, ప్రకృతి సిద్ధంగా అది తగ్గింది. దీనివల్ల ఆయన సూచించినధ్వని విస్పష్టం. మానవు లందరూ-తండ్రివలె హేతువాదులు కావచ్చు తల్లివలె శాంత గంభీర మూర్తులు కావచ్చు, లేదా గ్రామీణులవలె అమాయకులు నిరక్షరాస్యులు కావచ్చు-ప్రకృతిసిద్ధమైన క్లేశాలముందు నిస్సహాయులే. ఈ అర్థాన్ని ధ్వనింపచేయడంతో ఈ కవిత భారతీయ నైసర్గిక, సాంస్కృతిక పరిధులను అధిగమించి సమస్త మానవాళికి సమానమైన, సహజమైన అనుభూతిని కలిగించడంలో కృతకృత్యమయింది, అంటే వస్తుదృష్ట్యా ఇది భారతీయ జానపద జీవితానికి సంబంధించినా, కావ్యరీత్యా దానినుండి జాలువారే రసార్ద్రత పరిధులు లేనిది.

సాంఘిక జీవనంలో మానవాత్మను దర్శించాలన్న నమ్మకం నిస్సిమ్ ఎజికేల్ కవిత్వానికి వెన్నుపూస అయితే, ఎ.కె రామానుజన్ కవిత్వానికి అంతరంగ మథనం ముఖ్య ఆలంబన. ఎజికేల్ బొంబాయి విశ్వవిద్యాలయంలో ఆంగ్లభాషాచార్యుడుగా ఉంటే రామానుజన్ అమెరికాలోని చికాగో విశ్వవిద్యాలయంలో ద్రావిడ భాషా విభాగంలో ఆచార్యుడు. ఇతని కవిత్వంలో ప్రస్ఫుటంగా కనిపించే లక్షణాలు వ్యంగ్యం, వక్రోక్తి. ఆంగ్లభాషను విలక్షణంగా వాడి, సామాన్యవాడుక భాషకు దగ్గరగాతెచ్చినా, దాని కావ్యరీతులను ఇసుమంతకూడా తగ్గనివ్వక పోవడం అతని ప్రత్యేకత. సంప్రదాయం అంటే గౌరవం, తను బ్రాహ్మణుణ్ణని విశిష్టభావం; కాని ఆ సంప్రదాయాన్ని సరిగా అర్థంచేసుకొని తన వ్యక్తిత్వాన్ని మలచుకొనే అవకాశం చేజార్చుకున్నామేమో అన్న తపన; వీటిద్వారా ఏర్పడిన ద్వైదీభావం అతని కవితలో స్పష్టంగా గోచరిస్తాయి. దీనివల్ల ఏర్పడిన సందిగ్ధస్థితిని రామానుజన్ 'self portrait'' అన్న తన కవితలో తెలుపుతాడు.

I resemble every one
but mysel , and ometimes see
in shop-windows
despite the well-know laws
of optics
the portrait of a stranger,
date unknown,
often signed in a corner
by my father

ఈ కవితలో ప్రస్ఫుటమయ్యే ప్రధానానుభూతి తన వ్యక్తిత్వాన్ని కోల్పోయాననే విస్పృహ. ఈ భావాన్ని వ్యంజింపచేసే ప్రతీక అద్దం. అద్దంలో సామాన్యంగా మన ప్రతిబింబమే కన్పిస్తుంది. కాని ఈ అద్దం మాత్రం చిత్రమైనది. కవి తన ప్రతిబింబాన్నికాక ఎవరో అజ్ఞాత వ్యక్తిని చూడ ప్రయత్నిస్తాడు. అంటే తన వ్యక్తిత్వానికి అద్దంపట్టే ఉపాధులను కోల్పోయాడు. కాని, ఈ వ్యక్తిత్వాన్ని తిరిగి పొందటం కష్టమైనా అసాధ్యంకాదు. తన వ్యక్తిని తన సంప్రదాయాన్ని కలిపే బలమైన బంధం తండ్రి.

ఈ దృష్ట్యా రామానుజన్ ఒక్కడిలోనేగాక మిగతా సమకాలీనులందరిలోనూ తండ్రియొక్క బలమైన ముద్రఉంది. తండ్రి మూఢ సంప్రదాయానికి ప్రతీక కావచ్చు, లేక తాను వెతుకుతున్న సంప్రదాయానికి ప్రతినిధి కావచ్చు. ఇంకొక రకంగా చెప్పాలంటే, భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు ఒక ముఖ్యమైన ప్రాతిపదిక కుటుంబం, దాని విలువలు. ఈ ప్రాతిపదికకు మూల విరాట్టులు తల్లిదండ్రులు. అంటే తండ్రిని పోగొట్టుకొనడం ధ్వన్యనుసారం సంప్రదాయానికి తనను కలిపివుంచే ఒక బంధాన్ని పోగొట్టుకున్నట్టు. కుటుంబపు విలువలు, వాటి విదగ్ధంవల్ల వ్యక్తికివచ్చేవి పరిణామాలు ఈ రకంగా కవితా వస్తువు లౌతాయి.

మధ్యతరగతి కుటుంబంలో తండ్రిమృతివల్ల ఏర్పడే వికతులను వ్యంగ్యంగా, రసార్ద్రంగా చిత్రిస్తా రామానుజన్ అంటాడు.

Father, when he passed on
left dust
on a table full of papers,
left debts and daugaters,
a bedwetting grandson ...
a house that leaned
slowly through our growing
years on a bent coconut
tree in the yard
... ...

తండ్రిమృతిని కావ్యవస్తువుగా స్వీకరించి, దానివల్ల ఏర్పడ సందర్భోచిత, వ్యక్తిపరమైన శోకాన్ని అధిగమించి, దానిద్వారావే తన శోకాన్ని సాధారణీకరించడం సామాన్య విషయంకాదు. కాగా, ఈ అధిగమించడానికి ప్రధాన ఉపాధులు వాక్య నిర్మాణ వైచిత్రి, ప్రతీకలను కూర్చడంలో ప్రావీణ్యం. వెరసి ఇవన్నీ ఆలంకారికులు చెప్పే వక్రోక్తికి దగ్గరగా వస్తాయి. తండ్రి పోతూపోతూ మిగిల్చిన స్థిర చరాస్తుల్ని పట్టికవేస్తా, తండ్రి తన బల్లమీద వదిలిన దుమ్ముని, ఋణాన్ని, ఆడపిల్లలను మనదేశంలో మరొక రకమైన ఋణానికి సంకేతాలు-పక్కపక్కల్ని చేరుస్తాడు. అల్లాగే తండ్రి వదిలిన ఇల్లు తన ప్రాయంలో ఒంగింది అంటాడు మన సంప్రదాయంలాగే. ఈ వొంగటం అన్న భావాన్ని బలపరుస్తా ఇంకొక సామీప్యమైన చిహ్నాన్ని ఉపయోగిస్తాడు, ఒంగిన కొబ్బరి చెట్టులాగేఅని. (రామానుజన్ చాలా చక్కటి అనువాదకుడుకూడా. కన్నడంనుంచిచేసిన అనువాదాలు speaking of siva అన్న పేరుతో వెలువడ్డాయి.)

ఈ రకంగా, అతి సామాన్యమైన-భారతీయ జీవన విధానానికి చాలా దగ్గరగాఉన్న వస్తువులు, చిహ్నాలద్వారా, భారతీయతను సూక్ష్మంగా, అందంగా చిత్రీకరించటమేగాక వాటిని అనన్య సామాన్యంగా సాధారణీకరించిన భారతీయ ఆంగ్లకవులలో చెప్పుకోదగ్గ మరొక ప్రతిభాశాలి ఆర్. పార్థసారధి. ఈయన ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ ప్రెస్, మద్రాసు శాఖలో ప్రాంతీయ సంపాదకుడు. ఈయన కవిత్వం Rough Passage అన్న పేరుతో ఈమధ్యనే వెలువడింది, ఈ కవి కూడా తండ్రిమృతిని స్మరిస్తా అంటాడు.

An unexpected November
shut the door in my face,

I crashed, a glass house
hit by the stone of father's death.

చావు అన్నది ఎప్పుడు ఎట్లా కాటువేస్తుందో చెప్పలేమన్న అనిశ్చితాన్ని 'unexpected November'' అని వ్యంగ్యంగా సూచిస్తాడు. చావుపుట్టుకల అనిత్యతను సూచించడానికి ''గాజుమేడ'' అన్న సంకేతాన్ని చక్కగా వాడాడు. తన జీవితమనే గాజుమేడంటికి తండ్రి మృతి అనే రాయి తగిలి తాను నేలకూలానంటాడు. ''గాజుమేడ'' అన్న చిహ్నంవల్ల జీవితంయొక్క అనిశ్చితత్వాన్ని, రాయివల్ల మృత్యువుయొక్క శాశ్వతత్వాన్ని ఏకకాలాన ధ్వనింపచేయడంలో ఈరకంగా అసామాన్య ప్రతిభ చూపాడు. పైగా తండ్రిమృతితో ఒక తరం ముగిసింది అన్నదాన్ని ధ్వనిస్తో, ఆ నవంబరుమాసం నా ముఖంమీద భళ్ళున తలుపుమూసింది అంటాడు. ఇది ఇక తిరిగి తెరిచే వీలులేని తలుపు.

ఇట్లా చిన్న చిన్న మాటలతో, వచనమించు గద్యానికి దగ్గరగా వచ్చే పదాలతో భావగర్భితమైన కవితను వ్రాసేవారిలో పార్థసారథి చాలా చతురుడు. ఈతని కవితలో ప్రధాన లక్షణం అపురూపమైన శిల్పం. పదాలను కూర్చడంలో సహజమైన సందర్భోచితమైన ప్రతీకలను, సంకేతాలను ప్రతిభావంతంగా ఉపయోగించటంలో ఈయనలో చాలా తక్కువమంది తూగగలరు. సమకాలీన తమిళభాష-తన మాతృభాష ఏవిధంగా తన ఔన్నత్యాన్ని కోల్పోయిందో చెపుతూ దాన్ని నమ్మాళ్వార్ లొంగదీసిన ఒకానొకప్పటి వృషభంగా వర్ణించి, ఈనాటి కోడంబాకంలోని ఈగలచే పీక్కుతినబడుతున్న గుర్తింపులేని కళేబరంగా అభివర్ణిస్తాడు.

the language
the bull Nammalvar took by the horns
is now an unrecognizable carcass
Quick with the fleas of Kodambakkam.

జాగ్రత్తగా పరిశీలిస్తే ఈ వాక్యాలలో ఇంకొక సొగసు కనిపిస్తుంది. కోడంబాకం మద్రాసులో సినిమా వాతావరణం ఎక్కువగా కల ప్రాంతం. అంటే నమ్మాళ్వార్‌వంటి యోగిపుంగవునిచే ఉపయోగింపబడి పునీతమైన తమిళభాష ఈనాటి సినిమా కవుల చేతులలో పడడంతో, ఆ సినిమా కవులే ఆ కళేబరాన్ని పీక్కుతింటున్న ఈగలుగా భావిస్తారు. ఇలాగే ఒకచోట ''Rice and pickle afternoons'' అని చక్కటి విలక్షణమైన ప్రయోగంచేశాడు. తన చుట్టాలను చాలా కాలం తర్వాత కలుసుకొన్న ఘట్టాన్ని వర్ణనచేస్తో, ఆ స్మృతులను నెమరువేయడం అన్న భావానికి we ''pulled familiar coconuts'' అన్న ఉపమానం వాడతాడు. కొబ్బరికాయ ఉపమానం స్థూలంగా చూస్తే సామాన్యమే, కాని, కొబ్బరికాయను పైపీచు తీస్తే, లోపలి నీళ్ళు తడిగా ఉంచినట్లే, కాలమెంత గడిచినా ఆ జ్ఞాపకాల ఆర్ద్రత సజీవమే అన్న సూక్ష్మమైన ధ్వనిని దానిలో ఇమిడ్చాడు.

ఇక మిగతా వారిలో కె. ఎన్. దారువాలా కూడా పేర్నదగిన కవి. ఇతని విలక్షణత వృత్తిరీత్యా, ప్రవృత్తిరీత్యా ఉన్న విభిన్నత. ఉద్యోగం పోలీసు శాఖలో. కాని అభిరుచి కావ్యవస్తువులపట్ల. పోలీసు అధికారిగా హింసాకాండ, నేరం, కఠినమైన మానవ ప్రవృత్తితో గాఢ పరిచయం. మూఢాచారాలపట్ల ఉదాసీనతకాక గాఢమైన విముఖత. కాని సామాన్య జనావళిపట్ల ఆర్ద్రత ఈ లక్షణాల సమన్వయమే ఈతని కవిత. ఒక లాఠీచార్జిని ఊరేగింపును ఎంత నిర్వేదంగా వర్ణిస్తాడో, ప్రకృతిశక్తుల్ని అంత అనురక్తితో వర్ణిస్తాడు.

ఈతని కవితా సంపుటాలలో ''Crossing the Rivers' అన్న సంకలనం చాలా ముఖ్యమైనది. ఈ రకమైనవర్ణనా శిల్పం. భారతీయతపట్ల గౌరవం వ్యక్తీకరించే మరొక ప్రసిద్ధ కవి శివ్ కె. కుమార్. ఈయన వ్రాసిన కవితలో An Indian Mango vendor అన్న కవిత అన్నివిధాలా ఎన్నతగ్గది.

ఇక తెలుగువారిలో ఆంగ్లకవితను చక్కటి ప్రావీణ్యంతో, శిల్పంతో రచించిన వారిలో శ్రీనివాస్ రాయప్రోల్ ముఖ్యుడు. క్లుప్తంగా, ముఖ్యంగా ప్రతీకలద్వారా భావాన్ని వ్యక్తీకరించడంలో ఈయన చాలా ప్రావీణ్యం చూపుతాడు. ''oranges on a Table'' అన్న కవిత ఈ విషయంలో చెప్పతగ్గది. అలాగే కుటుంబ సభ్యుల మధ్య నిజమైన ప్రేమానుభూతుల మృగ్యతను ''Married Love'' అన్న కవితలో చిత్రించాడు.

భారతీయ ఆంగ్లకవయిత్రులలో గౌరీదేశ్‌పాండే, కమలాదాస్, మమతా కాలియా ముఖ్యులు. కమలాదాస్ కవిత్వానికి ప్రధాన లక్షణం వ్యక్తిపరమైన భావోద్వేగంవల్ల వచ్చే తీవ్రత, తపన. ఏ కవిత వ్రాసినా కమలాదాస్ వస్తువు ఒక్కటే; ప్రేమ, దాని ఆస్వాదన; లేక అది కోల్పోతే దానివల్ల ఉత్పన్నమయ్యే ఆవేదన. దీనివల్ల స్త్రీ పురుష సంబంధాలద్వారా జనించే భావాలను వివిధమైన దృక్కోణాలనుంచి వ్యక్తీకరించడంలో కమలాదాస్ అనితర సాధ్యమైన-ప్రత్యేకించి సంప్రదాయపు మూసలో మగ్గిన భారతీయ స్త్రీకి దుస్సాధ్యమైన-ఉద్వేగాన్ని చూపిస్తుంది.

మమతాకాలియా యువతరంయొక్క నిష్ప్రహని, పెద్దలని చెప్పబడేవారు ప్రదర్శించే ద్వంద్వ విలువలను చాలా సునిశితంగా విమర్శించడంలో చాతుర్యం చూపిస్తుంది. తండ్రిని సంబోధిస్తూ నిర్మొహమాటంగా అంటుంది.

Who cares for you, papa?
Who cares for your clean thoughts, clean words,
clean teeth?

... ...
You are an unsuccessful man, papa
... ...
I wish you had guts.

వాడుక భాషను అందంగా కావ్యపరంగా మలచడంలో మమతా కాలియ చాలా ప్రావీణ్యాన్ని చూపిస్తుంది.

సమకాలీన భారతీయ ఆంగ్లకవితయొక్క ఈ స్థూలమైన పరిచయంవల్ల ఒక విషయం సుస్పష్టమౌతుంది. ఈ కవిత ఆంగ్ల మానస పుత్రులవల్ల జనించిన కలుపుమొక్క కాదు. వేళ్ళు కుదుర్చుకొని, ఇపుడిపుడే చిగురిస్తో, పుష్పిస్తూ, మహావృక్షమయ్యే స్థాపన లున్న సృజనాత్మక కవితా ప్రతిభ ఇది.

జనాభా సమస్యలు? సమాధానాలు? విధానాలు?

డా. బి. ఆర్. కె. రావు

జనాభా విధానం ప్రజాసంక్షేమ విధానం. జనాభా విధానమంటే సంతానం కలగకుండా ఆపరేషన్లు చేయడం మాత్రమే కాదు. శిశువు కడుపున పడినప్పటినుండి పుట్టి, పెరిగి, చనిపోయేవరకు, అతని జీవితానికి కావలసిన గ్రాస, వాస, విద్యా, ఉద్యోగ, వినోద, సాంఘిక భీమా, స్వేచ్ఛాది సౌకర్యాలను కల్పించడము. అందరికి సమానహక్కుల్ని ఏర్పర్చడమేగాక చనిపోయిన తరువాత స్మృతి మిగిలేందుకు కూడా చర్యలు తీసుకోవాలి. ఇటువంటి కార్యక్రమాల్లో స్త్రీ పురుషు లిద్దరూ పాల్గొనాలి.

ప్రపంచ జనాభా జామితీయ వేగంతో (1 2, 4, 8, 16, 32) వృద్ధిచెందుతుందని, ఆహారంమాత్రం అంకగణిత వేగంతో (1, 2, 3, 4) మాత్రమే వృద్ధిచెందుతుందని, అందు వల్ల ఆహారం చాలక ఆకలిబాధలు, అనారోగ్యాలు, మృత్యువులు, యుద్ధం వల్ల చావులు రావడం తప్పదు కాబట్టి, బ్రహ్మచర్యాన్ని, ఆలస్యంగా వివాహం చేసుకోవడాన్ని, సంభోగం మానుకోవడాన్ని, సంభోగించినా సంతానం కల్గని రీతిలో సంభోగించడాన్ని అనుసరించి జనాభా పెరుగుదలను అదుపులోవుంచి, అవాంఛనీయమైన ఆకలిని, అనారోగ్యాన్ని, కొరతను, యుద్ధాన్ని రానివ్వకుండాచేసి జనాభా బాధ పడకుండా చేయవలసి వుంటుందని మహామేధావి మాల్థస్ చెప్పాడు. 1947 లో 30 కోట్లున్న భారత జనాభా 1975 నాటికి 60 కోట్లకు పెరిగి, 25 సంవత్సరాల్లో జనాభా రెట్టింపవుతుందని, ఆహార కొరత ఏర్పడుతుందని మాల్థస్ చెప్పిన మాటలను యదార్థమని రుజువుచేసింది. అందువల్ల జనాభా నియంత్రణ ప్రపంచమంతా తప్పక జరగవలసినపని అని చెప్పక తప్పదు.

ప్రపంచజనాభా 1 వ సంవత్సరం (క్రీ. శ.) నుండి 1650 (క్రీ. శ.) వ సంవత్సరానికి 250 మిలియన్లనుండి 500 మిలియన్లకు అనగా 250 మిలియన్లు పెరిగింది. అయితే యీ 500 మిలియన్లు 1000 మిలియన్లు కావడానికి 200 సంవత్సరాలు (1650–1850) మాత్రమే పట్టింది. జనసంఖ్య పెరుగుదల రేటు మరింత తీవ్రంకాగా మరొక 1000 మిలియన్లు లేక 1 బిలియన్ పెరగడానికి 80 సంవత్సరాలు (1850-1930) మాత్రమే పట్టింది. మరొక బిలియన్ (మూడవ వెయ్యి మిలియన్లు) కావడానికి 30 సంవత్సరాలు (1930–1960) మాత్రమే పట్టింది. అయితే నాల్గవ బిలియను జనాభా పెరుగుదలకు 15 సంవత్సరాలు (1960–1975) మాత్రమే సరిపోయింది. ప్రపంచ జనాభావృద్ధి రేటు నేటి తీవ్రజామితీయ (ఘాతవృద్ధి) రేటుతో కొనసాగినట్లయితే మరో 28 సంవత్సరాల్లో ప్రపంచ జనాభా (2000 వ సంవత్సరం నాటికి) నాల్గు బిలియన్లనుండి ఏడు బిలియన్లకు (7000 మిలియన్లకు అనగా 700 కోట్లకు) పెరిగి ఆహారకొరత, నీటికొరత, భూమికొరత, వనరుల కొరత, కాలుష్యవృద్ధి ఏర్పడి ప్రపంచ జనాభా అతి ప్రమాద స్థితిలోపడి విలయతుల్యమైన పరిస్థితి వస్తుందని "మెసచూసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ" వారు రోమ్‌క్లబ్ ద్వారా- తమ 'లిమిట్స్ టు గ్రోత్' అనే పుస్తకంద్వారా- ప్రపంచానికి తెలియజేసారు.

ఈ పరిస్థితుల్లో జనాభావృద్ధివల్ల ఏర్పడిన సమస్యల్ని పరిష్కరించడానికి మిత్రరాజ్యసమితి (U. N. O.) ప్రపంచ జనాభా మహాసభలను 1954 లోను, 1965 లోను, 1974 లోను జరిపింది. ఇంతకుముందు 1927 లో కూడా ఒక ప్రపంచజనాభామహాసభ జరిగింది. 1974 లో రుమేనియా రాజధాని బుఖారెస్టులో జరిగిన ప్రపంచ జనాభా మహాసభకు 136 దేశాలనుండి ప్రభుత్వ ప్రతినిధులుగా 1200 మంది డిలిగేట్లు హాజరైనారు. 60 జనాభా కమిషన్లు నియమించబడి సమస్యలకు సమాధానాలను ఏర్పర్చడానికి ప్రయత్నించినవి. ఈ ప్రపంచ జనాభా మహాసభతోపాటు ప్రపంచ "జనాభా ట్రిబ్యూన్" అనే పేరుతో వివిధ దేశాల ప్రభుత్వేతర ప్రతినిధులైన జనాభా నిపుణుల మహాసభ బుఖారెస్ట్‌లో మరో భవనంలో (ఒక సభా భవనంనుండి మరొక సభా భవనానికి 20 నిముషాల నడక పడుతుంది) జరిగింది. ఈ రెండు మహాసభలు ప్రపంచ జనాభా సమస్యలయెడ చూపెట్టిన దృక్పథాన్ని, వాటి పరిష్కారానికి వెలువరించిన సమాధానాలను యిక్కడ సంక్షిప్తంగా పొందుపరుద్దాము.

ప్రపంచ జనాభా మహాసభ

ఈ మహాసభలో ప్రపంచ జనాభా కార్యాచరణ ప్రణాళిక తయారుచేయబడింది. ప్రణాళిక ప్రథమాధ్యాయం యిలా చెబుతోంది: ప్రపంచ జనాభావృద్ధి ప్రవృత్తికి ఆర్థిక సాంఘికాభివృద్ధి ప్రవృత్తికి, యీ ప్రణాళిక, అనుసంధానం ఏర్పాటు చేస్తుంది.

సాంఘిక-ఆర్థిక పరిణామం జనాభా సమస్యలను సమర్థవంతంగా పరిష్కరిస్తుందని యీ ప్రణాళిక అభిప్రాయపడుతోంది. జనాభా విధానం సాంఘిక-ఆర్థికాభివృద్ధి ప్రణాళికలో భాగమైనపుడే విజయవంతమౌతుంది. అందుచేత యీ జనాభా ప్రణాళిక అంతర్జాతీయ వ్యూహాల వ్యవస్థలో ఒక భాగమౌతుంది. సాంఘిక, ఆర్థిక, పరిసరాలకు జనాభావృద్ధి, పంపక చట్రాల ప్రవృత్తి అనుగుణ్యంగా లేనట్లయితే కొన్ని అభివృద్ధి దశల్లో, వృద్ధి ధారావాహికంగా సాగటానికి, ఆ అనుగుణ్యంగాలేని ప్రవృత్తులు ఆటంకమౌతాయి. జనాభా సమస్యలపై జరిగే ఆలోచనను జనాభావృద్ధి ప్రవృత్తికి మాత్రమే పరిమితం చెయ్యరాదు. తక్కువ అభివృద్ధి చెందిన దేశాల్లో మరణరేటు తగ్గినప్పటికి ఆ ప్రాంతాలన్నింటా ఒకేవిధంగా తగ్గలేదు అందుచేత తక్కువ అభివృద్ధి చెందిన చాలా దేశాలు మరణరేటును తగ్గించడము అత్యవసరంగా సాధించవలసిన గమ్యంగా పెట్టుకున్నవి. యువతి యువకులు పల్లెలనుండి పట్టణాలకు ప్రవాసం పోవడం ఆర్థికాభివృద్ధికి ఆటంకంగా వున్నది. కాబట్టి గ్రామీణ ప్రాంతాలను పునరుజ్జీవింపజేయడము ప్రాధాన్యతగల గమ్యంగా ఎంచబడాలి. ఈ శతాబ్దం చివరికి యీ తక్కువ అభివృద్ధిగల దేశాల జనాభాలో పిల్లలసంఖ్య, అనుపాతంగా తగ్గినప్పటికి మొత్తం సంఖ్యగా మాత్రం పెరుగుతుంది. అందువల్ల ఆర్థిక వృద్ధిరేటు హెచ్చుస్థాయిలో సాగితే మినహా యీ శతాబ్దం చివరివరకు అదనంగా వచ్చే ఆటంకాలను నివారించడం కష్టమౌతుంది. తక్కువ అభివృద్ధి చెందిన దేశాల్లో ముసలివారి సంఖ్య అనుపాతం కూడా పెరుగుతుంది కాబట్టి వారికొరకు సాంఘిక భీమా, ఆరోగ్య పథకాలను ఏర్పర్చి అమలు జరపాలి. జనాభా జీవన ప్రమాణాల్లో చెప్పదగ్గ పెరుగుదల రావడానికి సాంఘిక-ఆర్థికవృద్ధి వేగంగా నడవాలి. తక్కువ వృద్ధి చెందిన దేశాల ఆర్థికవృద్ధి వేగాన్ని పెంచడానికి జరిగే ప్రయత్నాలను ప్రపంచ ప్రజల జీవనాన్ని గుణాత్మకంగా మెరుగుపర్చే ప్రయత్నాలుగా భావించడం, ప్రపంచ ప్రజలకు అవసరము. ఈ భావన అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి తోడ్పడేందుకుగాను ప్రపంచ సంపదను, వనరుల్ని, సాంకేతిక విజ్ఞానాన్ని న్యాయసమ్మతంగా ఉపయోగించడము అవసరము.

ప్రణాళిక ద్వితీయాధ్యాయం యిలా చెబుతోంది: ప్రణాళికకు యీ సూత్రాలు ఆధారాలు (1) జనాభా జీవన ప్రమాణాన్ని, గుణాత్మకాభివృద్ధిని ఏర్పర్చడం అభివృద్ధి ప్రధాన లక్షణం. (2) జాతీయ స్వాతంత్ర్యం లేకుండా నిజమైన అభివృద్ధి జరగదు. నిజమైన అభివృద్ధికి అంతర్జాతీయ సహకారము, వ్యక్తి గౌరవాన్ని గుర్తించడము; ప్రకృతి సిద్ధంగా వచ్చే వినాశనాల ఫలితాలను నివారించడము, మానవులమధ్య వివిధ రూపాల్లో పాక్షిక దృక్పథంవల్ల ఏర్పడిన తేడాల ఫలితాలను నివారించడము అవసరము. (3) జనాభా, అభివృద్ధి—యీ రెంటికి ఒకదానితో మరొక దానికి అంతః సంబంధం ఉన్నది. (4) జనాభా విధానాలు సాంఘిక-ఆర్థిక ఆశయాల అంతఃభాగాలు. (5) ఈ ఆశయాలతో సంబంధం లేకుండానే మానవ జీవితానికి గౌరవం యివ్వడము వివిధ సమాజాలకు ప్రాతిపదిక. (6) వ్యక్తులందరికి, దంపతులందరికి స్వేచ్ఛగా బాధ్యతతో సంతానం సంఖ్యను, ఒక బిడ్డకు మరొక బిడ్డకు మధ్యనున్న జనన కాలవ్యవధిని నిర్ణయించుకునే హక్కు ఆ విధంగా చేయడానికి కావలసిన విద్య, సమాచారము, మాధ్యమము పొందేహక్కు ఉన్నది. (7) సమాజానికి కుటుంబము ప్రాతిపదిక యూనిట్ అయినందువల్ల కుటుంబాన్ని శాసనంద్వారాను, పోలీసుద్వారాను రక్షించవలసి ఉన్నది. (8) విద్యా, సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ జీవితంలో పూర్తిగా పాల్గొని సమగ్రాభివృద్ధిని సాధించే హక్కు స్త్రీలకున్నది, (9) ఒకో దేశంలోపల, వివిధ దేశాలమధ్య పరిస్థితుల్లో తేడా వున్నదని గుర్తిస్తున్నాము. (10) జనాభా విధానాలను గురించి తెలియజేసేటప్పుడు సహజ వనరుల్ని, పరిసరాలను, ఆహార సరఫరాకు సంబంధించిన వివిధ విషయాలను గుర్తుంచుకోవడమేగాక, వనరులను న్యాయంగా పంచడంమీద, అవి వృధాకావడాన్ని కనిష్ఠ స్థాయికి దించడంమీద దృష్టిని కేంద్రీకరించాలి. (11) అభివృద్ధికి, జనాభాకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి అంతర్జాతీయ చర్యలు తీసుకోవడానికి ప్రాముఖ్యత పెరుగుతూనే ఉన్నది. అవకాశాలు లేక బాధపడేవారి జీవన పరిస్థితులు మెరుగుపడితే మినహా యీ అంతర్జాతీయ చర్యలు జయప్రదం కానేరవు. (12) మారుతూన్న పరిస్థితుల కనుగుణ్యంగా జనాభా ప్రణాళికను మార్చడము ప్రణాళిక విజయం పొందడానికి అవసరము. (13) జనాభా ప్రణాళిక మిత్రరాజ్య సమితి ఆశయాలకు, మానవ హక్కుల ముసాయిదాకు, మిత్రరాజ్య సమితి రెండవ అభివృద్ధి దశాబ్దం ఆశయాలకు అనుగుణ్యంగా ఉండాలి. జనాభా సమస్యల్ని పరిష్కరించడానికి వివిధ దేశాల శక్తిస్తోమతలను పెంపొందించడము, వారి అవసరాలను తీర్చడానికి కావలసిన అంతర్జాతీయ సహకారం సులభంగా అందేటట్లు చేయడము జనాభా ప్రణాళిక ప్రధాన ఆశయము.

మూడవ అధ్యాయం యిలా చెబుతోంది: 1985 నుండి ప్రపంచ జనాభావృద్ధిరేటు సాలీనా 2 శాతంనుండి 1.7 శాతానికి తగ్గుతుంది; కాని దీన్ని లక్ష్యంగా ఏర్పాటు చేసుకోలేదు. తమ జనాభా వృద్ధిరేటు తమ గమ్యాల సాధనకు అడ్డు తగులుతున్నదని భావించే దేశాలు తమ అభివృద్ధి కార్యక్రమాల చట్రంలో భాగంగాజనాభా విధానాన్ని ఏర్పర్చే విషయాన్ని ఆలోచించవలసిందిగా ఆహ్వానిస్తున్నాము. అత్యధిక మరణరేటుగల దేశాలు, 1985 నాటికి "పుట్టినప్పటి నుండి 50 సంవత్సరాలు బ్రదికే ఆయుర్దాయ ప్రమాణాన్ని"; ప్రాణంతో పుట్టిన శిశువుల్లో వెయ్యికి నూట ఇరవైమందికి మించి చనిపోకుండా వుండేస్థితిని నూట ఇరవైకంటె తక్కువమంది మాత్రమే చనిపోయేస్థితిని-ఏర్పర్చుకోవాలి. కుటుంబం సైజును గురించి ఏమీ చెప్పలేదుగాని, తమ జనసాంఖ్యక లక్ష్యాలు ఏమైనప్పటికి వివిధ దేశాల ప్రజలకు తమకు కావలసిన సంతానపు సంఖ్యను స్వేచ్ఛగా, అందువల్ల కలిగే లాభనష్టాలను తెలిసికొని, నిర్ణయించుకునేహక్కు, బిడ్డకు బిడ్డకుమధ్య జనన కాలవ్యవధిని నిర్ణయించుకునే హక్కు ఉండాలి. బాధ్యతగల తల్లిదండ్రులు కావడానికి వీలయిన విద్య అందచేయబడాలి. ఈ లక్ష్యాలు సాధించడానికి తోడ్పడే సలహా, మాధ్యమాలు ప్రజలకు లభ్యమయ్యేట్లు చెయ్యాలి. కుటుంబనియంత్రణ పథకాలు, అందుకు సంబంధించిన సేవలు అవాంఛనీయమైన

గర్భధారణలను రాకుండా చేయడానికేగాక, వ్యక్తి అభీష్టాన్ని పొంద కుండా జరిపే వంధ్యత్వకారక ఆపరేషన్లను, హీనగర్భాదానశక్తిని ఏర్పాటు చేసే కార్యక్రమాలను నివారించాలి. జనాభా విధానం తక్కువ సంతాన ఫలత్వాన్ని ఆశయంగా పెట్టుకున్నప్పుడుకూడా సంతాన సంఖ్య (కుటుంబ సైజు)లో తేడాలు వుండడానికి అనుమతించాలి కుటుంబ నియంత్రణ సేవలను అందించడానికి తగినంత శిక్షణ పొందిన వైద్యులు, తత్సహాయక బృందము, సాంఘిక కార్యకర్తలు కావాలి. శిక్షణ పొందినవారి సంఖ్యలో కొరత ఏర్పడకుండా వుండేం దుకుగాను ఆరోగ్య కార్యకర్తల విధులను వివిధస్థాయిలకు తగినట్లుగా నిర్ణయించి పునఃపంపిణీ చేయవలెను. కుటుంబ నియంత్రణకు సంబంధించిన సమాచారము అంగీకరించబడిన శాస్త్రీయ విజ్ఞానానికి అనుగుణ్యంగా వుండాలి. ఆరోగ్య కుటుంబ నియంత్రణ సేవలను సమర్థవంతంగా పర్యవేక్షిస్తూ వుండాలి. గర్భనిరోధ సాధనాలను ఉపయోగించడంవల్ల, ఉపయోగించకపోవడంవల్ల కల్గే నష్టాల వివరాలు కుటుంబ నియంత్రణ సమాచారంలో ప్రముఖభాగంగా అందించబడాలి. సాంఘిక భీమాపథకాల్లో భాగంగా కుటుంబ నియంత్రణ పథకాలను చేర్చాలని ప్రభుత్వాలు కోరబడినవి.

అభివృద్ధి కార్యక్రమాల్లో స్త్రీలు పాల్గొనడం చాలా అవసరము. పురుషులతోపాటు సమాన ప్రాతిపదికమీద స్త్రీలు విద్యా, సాంఘిక, రాజకీయ జీవితాల్లో పాల్గొనే సౌకర్యాన్ని ప్రభుత్వాలు ఏర్పాటు చెయ్యాలి. స్త్రీల హక్కుల విషయంలో ఆచరణ మిత్ర రాజ్య సమితి హక్కుల ముసాయిదాలోని సూత్రాలకు అనుగుణ్యంగా వుండునట్లు చేయవలెను. స్త్రీలహోదా పెరగడం కుటుంబ సైజు తగ్గడానికి తోడ్పడుతుంది. శిశుజన్మ నియంత్రణావకాశం కల్గడం వల్ల స్త్రీల హోదా పెరుగుతుంది.

ఒక దేశంలోపల వివిధ ప్రాంతాల్లో ప్రజల సాంద్రత సక్రమంగా పంపిణీ కావడానికి గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక, సాంఘిక మెరుగుదల జరగాలి; గ్రామీణ, పట్టణ జీవనానికి ప్రత్యామ్నాయంగా చిన్నసైజులోను, మధ్యరకం సైజులోను పట్టణాల నిర్మాణం జరగాలి. స్వేచ్ఛాయుతమైన అంతర్జాతీయ ప్రవాసం జరగడానికి ప్రభుత్వాలు వీల్లు కలుగ చెయ్యాలి. అటువంటి ప్రవాసపు కదలికలు, స్థానిక జనాభాల ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేసే జాతి తారతమ్య దృష్టి మీద ఆధారపడి ఉండకూడదు. ప్రవాస విధానాల మధ్య సామరస్యం ఏర్పడేందుకు ప్రభుత్వాలు సంప్రదింపులు జరపాలి. ఒక దేశంలోపలికి వచ్చిన ప్రవాసులను స్థిరపర్చడానికి అంతర్జాతీయ సంస్థలు సహాయపడాలి. మేధావుల నిష్క్రమణను-ఒక దేశం మేధావులు ఆ దేశాన్ని వదలి మరొక దేశానికి పోవడాన్ని-ఆపేటందుకుగాను తక్కువ అభివృద్ధి చెందిన దేశాల్లో విద్య, ఉద్యోగాలు సంప్రాప్తింప చేయడానికి వివిధ దేశాలు తోడ్పడాలి. అభివృద్ధిచెందుతున్న దేశాల్లో సంతాన ఫలితస్థాయి పెరగడంవల్ల ఏర్పడే ఫలితాలను గురించి, వ్యవసాయంనుండి వ్యవసాయేతర పరిశ్రమల్లోకి ప్రజలు ప్రవాసంకావడం వల్ల వచ్చే ఫలితాలను గురించి బాగా ఆలోచించాలి. హీనఫలత్వంగల దేశాల్లో జనాభాలో ముసలుల సంఖ్య పెరగడంవల్ల వచ్చేఫలితాలను గురించి ఆలోచించి, వారికొరకు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా సాంఘిక భద్రత కార్యక్రమాలను ఏర్పాటు చెయ్యాలి. అంతర్జాతీయంగా ప్రజలంతా తక్కువ అభివృద్ధి చెందిన దేశాల సాంఘిక - ఆర్థిక కార్యక్రమాలు విజయవంతం కావడానికి తోడ్పడాలి. మిత్ర రాజ్య సమితి పథకాలను అమలు జరిపినట్లయితే అభివృద్ధిచెందిన దేశాలకు, తక్కువ అభివృద్ధి చెందిన దేశాలకు మధ్యనున్న అంతరం తొలగి పోవడమేగాక జనాభాల వృద్ధిరేట్లు తగ్గుతాయి.

జనాభా వృద్ధి ప్రవృత్తికి, సాంఘిక - ఆర్థిక పరిణామానికి మధ్య సామరస్యాన్ని ఏర్పర్చేటప్పుడు మానవుల్ని వినియోగదార్లుగానే గాక, ఉత్పత్తిదార్లుగాకూడా పరిగణించాలి. ఆరోగ్యము, విద్య అభివృద్ధి చెందడంవల్ల శ్రామికుని ఉత్పాదకత తగినంతగా పెరుగుతుంది కాబట్టి, అభివృద్ధి పథకాలు, అంతర్జాతీయ ఆర్థిక సహాయము ఆరోగ్య విద్యాభివృద్ధిమీద దృష్టిని కేంద్రీకరించాలి. తక్కువమంది శ్రామికులతో పనిచేసే ఉత్పాదన ప్రక్రియలను ప్రవేశపెట్టేందుకు ఆలోచించేటప్పుడు, భౌతిక వనరులకంటె సాపేక్ష్యంగా హెచ్చుగా వున్న మానవ వనరులకు పని కల్పించడాన్ని గురించి శ్రద్ధగా ఆలోచించాలి. వివిధ దేశాలు, వాటిలోని సాంఘిక రంగాలు సహజ వనరుల్ని మరింత సహేతుకంగా ఉపయోగించి, కొంతమంది వృధాచేయడంవల్ల మరికొంత మందికి లభ్యంకాకుండావుండే పరిస్థితిని నివారించాలి. ఆహారోత్పాదనను, నూతన ఆహార మూలాలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వాలు అత్యధిక ప్రాధాన్యత నివ్వాలి. అంతర్జాతీయ సహకారం వివిధదేశాలకు తగినంత రసాయనిక ఎరువులను, ఇంధనాలను ఆహారాన్ని సమకూర్చాలి.

ప్రతిదేశము 1975–1985 మధ్య జనాభా లెక్కలు తీసికొని జన సాంఖ్యక అధ్యయనం చెయ్యాలి. జనాభా గణాంకాలను ప్రోగుచేసి, విశ్లేషించి, ఫలితాలను ప్రజల కందించడానికి ప్రభుత్వాలు ఉద్యోగుల సేవలను ఏర్పాటు చెయ్యాలి. ప్రతి జాతీయస్థాయి పరిపాలనా చట్టంలోను 'జనాభా యూనిట్'ను ఏర్పాటు చెయ్యాలి. జనాభాకు సంబంధించిన విషయాల్లో విజ్ఞానానికి సంబంధించిన లోపాలను భర్తీచేసేందుకు పరిశోధన జరపడానికి పదిహేడు విషయాలు ఎన్నిక చేయబడినవి. జనాభా చరాంకాలు, జనాభా కార్యక్రమాల్లో పాల్గొనేవారి ఉద్దేశ్యము, అభివృద్ధి కార్యక్రమాల్లో జనాభా కార్యక్రమాలను మిళితం చేయడము వాటిలో ఉన్నవి సారవత్వా (ఫలవత్వము)న్ని క్రమబద్ధంచేసే నేటి పద్ధతులలోను, నూతన పద్ధతులలోను, యీ పద్ధతులు ఆరోగ్య, సాంస్కృతిక విలువలమీద ఏర్పడే ప్రభావంలోను, ఐచ్ఛికముగాని వంధ్యత్వమునకు కారణాలు, దాని నివారణ రీతిలోను కూడా పరిశోధన జరగాలి.

సమాజ ప్రగతిమీద ఫలవత్వస్థాయిమీద విద్యకు ప్రభావమున్న కారణంగా వివిధ దేశాలు తమ నిరక్షరాస్యతా స్థితులను తొలగించేందుకు కార్యక్రమాల నేర్పర్చడమేగాక తమ బోధనా విషయాల్లో 'జనాభా' విషయాలను చేర్చాలి. మగపిల్లలకే గాక, ఆడపిల్లలందరికి కూడా వివిధ విషయాల్లో విద్య నందించాలి. జనాభా విషయాల్లో ప్రవీణుల్ని తయారుచేయడానికి అంతర్జాతీయస్థాయి బోధనా కార్యక్రమాలు, జాతీయ, స్థానిక పరిస్థితులకు అనుగుణ్యంగావుండే కార్యక్రమాలు కూడా అవసరము. ఈ కార్యక్రమాలు జనాభాకు సంబం

ధించిన అనేక విషయ సమన్వితంగా వుండాలి. అతి ఎక్కువగా ప్రత్యేకీకరణ పొందివుండకూడదు. ఈ శిక్షణ కార్మిక, సాంఘిక, గ్రూపునాయకులకు, ప్రభుత్వోద్యోగులకు లభ్యంకావాలి.

ఇక నాల్గవ అధ్యాయం. జనాభా అవసరాలను, సమస్యలను మదింపు చేయడంలో ప్రభుత్వాలు ప్రముఖ పాత్ర నిర్వహించాలి. సహేతుకమైన నిర్ణయాలు చెయ్యడానికి ఉపయోగపడటానికి యీ మదింపు నిర్ణీతకాలవ్యవధులలో క్రమబద్ధంగా జరగాలి. పరిశోధనకు, వివిధ విషయాలను మోనిటర్ చెయ్యడానికి, సమాచారాలను ఒకరి కొకరు అందించుకోవడానికి అంతర్జాతీయ సహకారము అందుబాటు కావాలి. ప్రభుత్వాలు యీ విషయాల్లో ప్రభుత్వేతర, అంతర్జాతీయ సంస్థల సహాయాన్ని ఉపయోగించుకోవాలి. జనాభా ప్రణాళికపై బాగా ఆలోచనచేసి దాన్ని అమలు జరపడానికి మిత్రరాజ్యసమితి ఉద్యోగులు బాగా తోడ్పడాలి. జనాభా సంబంధ విషయాల్లో శిక్షణ యివ్వవలసిన ప్రత్యేక అవసరాన్ని గుర్తించి, అందుకు తగిన ఏర్పాట్లను మిత్రరాజ్యసమితి, ప్రభుత్వాలు, ప్రభుత్వేతర సంస్థలు చెయ్యాలి.

మిత్రరాజ్య సమితి రెండవ అభివృద్ధి దశాబ్దం ఆశయాల కనుగుణ్యంగా తక్కువ అభివృద్ధి చెందిన దేశాలను అభివృద్ధి చేయడానికి తగినంతగా ఆర్థికాది సహాయాలను పెంచాలి. మిత్రరాజ్యసమితి జనాభావృద్ధిలో వచ్చిన నూతన ప్రవృత్తులను, జనాభావిధానాలను నిరవధికంగా మోనిటర్ చేస్తూ 1977 తో ప్రారంభించి రెండు సంవత్సరాలకొకసారి సమీక్షిస్తూ ఉండాలి. 1979 తో ప్రారంభించి అయిదు సంవత్సరాలకొకసారి మిత్రరాజ్య సమితి యీ విషయాలపై సంపూర్ణమైన సమీక్ష చెయ్యడం అవసరం.

జనాభా ట్రిబ్యూన్

మిత్రరాజ్య సమితి జనాభా కాన్ఫరెన్సుతోపాటు 1974 ఆగస్టులో రుమేనియా రాజధాని బుఖారెస్టులో ప్రభుత్వేతర సంస్థల ప్రతినిధులు జనాభాకాన్ఫరెన్సులో పాల్గొంటూనే జనాభా ట్రిబ్యూన్‌ను నిర్వహించారు. ప్రపంచ జనాభా అవసరాలకు, ప్రపంచ వనరులకు మధ్య అనుసంధాన సామరస్యాన్ని ఏర్పర్చడానికి తోడ్పడే విధానాలను ఏర్పర్చి అమలు జరపడానికి తోడ్పడేందుకు కీ క్రింది సూత్రాలను తయారుచేసి ప్రకటించారు.

(1) ప్రపంచ పరిస్థితి ప్రమాదంతో నిండుకుని ఉన్నది. వందల మిలియన్ల జనాభా పేదరికంతో, ఆకలితో, బాధలుపెట్టబడడంతో, వ్యాధితో, నిరక్షరాస్యతతో బాధపడుతున్నారు. ఇదివరకెన్నడూలేని విధంగా జనాభారేటు పెరగడము, ఒకేతరంలో జనాభా 3 మిలియన్ల నుండి 6 మిలియన్లకు పెరగడము పరిసరాల వాతావరణంమీద, సాంఘిక, రాజకీయ, ఆర్థిక సంస్థలమీద ప్రమాదం సంభవించేంతగా భారాన్ని పెంచగలవు. ఈ ఛాలెంజిని ఎదుర్కొనేందుకు కార్యాచరణ అవసరము.

(2) ఈ సమస్యల్ని ప్రాణివ్యవస్థలు. తప్పనిసరిగా కావలసిన పరిసరాలు, న్యాయము, సమత్వము ఏర్పాటుచేయడంద్వారాను, మానవ హోదాను గుర్తించడంద్వారాను పరిష్కరించాలి. నైతిక కారణాలవల్ల ప్రపంచ సాంఘిక, రాజకీయ, ఆర్థికచట్టంలో రావలసిన తీవ్రమైన మార్పులు నేటికి అందలేదు. కాని నేడు మార్పులు పరిసరాలకు సంబంధించిన కారణాలమీద తప్పక అవసరమౌతున్నవి.

(3) ప్రపంచ వనరుల్ని పంపిణీచేసి వినియోగించేటప్పుడు వివిధ సాంఘిక, జాతులకు చెందిన ప్రజాసమూహాల అవసరాలను, గణనలోకి తీసుకోవాలి. కేవలం జాతీయ దృక్పథంతో కూడిన విధానాలను వినాశనకరమైనవిగా భావించి మేము తిరస్కరిస్తున్నాము. ప్రతి దేశము తన జనాభా ప్రత్యేక సమస్యల్ని తన జనాభా ఆరోగ్య, సంక్షేమ దృష్ట్యా పరిష్కరిస్తూ, యితర దేశాల ప్రజల అవసరాలకు దెబ్బ తగలకుండా పరిష్కరించాలి. కొన్ని దేశాలు తమ భూమినుండి లభించే వనరుల్ని ముందు కొనసాగడానికి వీలులేనంత వేగంగా రేటులో వినియోగించడమేగాక, వృధా చేస్తున్నవి. మరికొన్ని దేశాల్లో జనాభా సాలీనా వృద్ధిరేటు 2 శాతము, 3 శాతము వరకు వచ్చి జనసాంద్రత పెరిగి యితరదేశాల వనరులనుండి సహాయం పొందవలసిన అవసరమున్నా ఆ సహాయం అందే అవకాశం కన్పించడంలేదు. జాతీయాభివృద్ధి ఆశలు ప్రపంచ సంకటాల్ని విస్మరించడం గాని, కప్పిపుచ్చడం గాని తగదు.

(4) కాలుష్యాన్ని నివారించడానికి పునరుత్పాదన చేయడానికి వీలున్న, వీలులేని వనరులను, ముఖ్యంగా ఆహారాన్ని వృధాకాకుండా చేయడానికి వివిధ దేశాలు కఠినమైన సురక్షణ చర్యలను అమలు చెయ్యాలి. విలాస వస్తువుల్ని, ఖరీదైన వస్తువుల్ని వినియోగించడము, భౌతిక విలువలకు కాకుండా సాంఘిక విలువలకు ప్రాధాన్యతనిచ్చే జీవన పద్ధతుల్ని బాగా తగ్గించాలి.

(5) జనాభా విధానాలు ప్రజలందరికి జీవితంలో గుణాత్మకమైన మెరుగుదలను చేర్చాలి. నూతన ఆర్థిక వ్యవస్థా నిర్మాణంలో ప్రపంచం ముందుకు సాగుతున్నప్పుడు, వివిధ దేశాల్లోను, దేశాల మధ్య వున్న సాంఘిక ఆర్థిక అన్యాయాన్ని తొలగించేందుకు అమలు జరిపే మొత్తం ఆర్థిక సాంఘిక విధానాల చట్టంలో జనాభా విధానాలకు భాగంగా వుండేట్లు ఏర్పాటు చెయ్యాలి. జనాభా విధానాలను ఏర్పాటు చెయ్యడంలో దేశీయ ప్రజాసమూహాలకు, మైనారిటీలకు హక్కున్నదని ప్రత్యేకంగా గుర్తిస్తూ, వివిధ సాంఘిక, తెగల సమూహాల అవసరాల కనుగుణ్యంగా ఆ జనాభా విధానాలను ఏర్పాటు చెయ్యాలి.

సాంఘిక ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలతో సంబంధం లేకుండా జనాభా సమస్యలు పరిష్కారం కావు. మరొకవైపున జనాభా సమస్యలను రాకుండా నివారించడానికి కేవలం ఆర్థికాభివృద్ధిమీదనే ఆధారపడటానికి వీలులేదు.

(6) పిల్లల సంఖ్యను, పిల్లల జననాల మధ్యవుండే కాలవ్యవధిని నిర్ణయించుకోవడాని కవసరమైన సమాచారాన్ని పొందడానికి ప్రాథమికహక్కు, అవకాశము, వ్యక్తులందరికి వున్నదని గుర్తించి

వాటిని ప్రభుత్వం గౌరవించాలి. 1985 నాటికి యీ హక్కు, జనాభా గతి గమనం గురించిన విద్య అందరికి తప్పక లభ్యమయ్యేందుకు తోడ్పడే సమాచారాన్ని ప్రభుత్వాలు అందరికి అందించాలి.

(7) ఇప్పుడు అభివృద్ధి చెందుతున్న దేశాలకు షరతులు లేకుండా ఆర్థిక సహాయం చెయ్యడానికి, న్యాయసమ్మతము, వాస్తవికముగా వుండే అంతర్జాతీయ వ్యాపారాన్ని ఏర్పర్చడానికి శక్తిస్తోమతలు గల్గిన ఉన్నత పారిశ్రామికాభివృద్ధి పొందిన దేశాలు ముందుకు రావాలని ఆహ్వానిస్తున్నాము. ప్రపంచ వ్యాపారంలోను, అంతర్జాతీయ సంబంధాల్లోను ఆహార, రసాయనిక ఎరువుల్ని ఆర్థిక, రాజకీయ సాధనాలుగా ఉపయోగించకూడదు.

(8) జనాభా విధానాల విజయం వాటిని అమలు జరపడంలో స్త్రీలు పూర్తిగా పాల్గొనడంపైన ఆధారపడి వుంటుంది. వ్యక్తులుగా తమకు కావలసిన వాటిని బాధ్యతతో ఎంచుకునేందుకు అవసరమైన మానవహోదా స్త్రీలకు లభ్యమయ్యే అవకాశాలు యివ్వబడాలి. మిత్రరాజ్య సమితి ద్వితీయ అభివృద్ధి దశాబ్దం అభివృద్ధి ప్రక్రియల్లో ప్రతిదశలోను స్త్రీలు పాల్గొనే అవకాశాన్ని కలుగజెయ్యడానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో తల్లులుగాను, ఆహారాన్ని అందించేవారుగాను స్త్రీలకున్న ఆర్థిక ప్రాముఖ్యతను, శక్తిని పూర్తిగా గుర్తించాలి.

(9) పుట్టిన ప్రతి శిశువుకు తనలోనున్న శక్తిసామర్థ్యాల్ని వృద్ధి చేసుకుని లాభంపొందేందుకు అవసరమైన పరిస్థితుల్ని కల్పించాలి. మిలియన్ల సంఖ్యలో శిశువులు తగిన పోషకశక్తిలేని ఆహారంవల్ల, కావలసిన అవసరాలు అందుబాటు కాకపోవడంవల్ల, వ్యాధులవల్ల బాధపడుతున్నారు. తమకు కల్గిన శిశువులు బ్రతికి బట్టకడతారనే ఆశలేకపోయినట్లయితే, తల్లిదండ్రులకు కుటుంబ నియంత్రణలో స్వేచ్ఛగా పాల్గొనడానికవసరమైన ఆశ, సెక్యూరిటీల ప్రథమ సోపానమే లోపిస్తుంది. ప్రసవానికిముందు, ప్రసవించిన పిదప శిశువులకు మంచి ఆరోగ్యాన్నిచ్చే ఆహారం లభ్యమయ్యేందుకు వ్యవసాయాన్ని, ఆరోగ్య వనరుల్ని బాగా అభివృద్ధి చెయ్యాలి.

(10) ఉత్పాదనకు తోడ్పడని పెద్ద సైనిక పథకాలను అమలు జరపడంకోసం భాగ్యాన్ని ఖర్చుచేయుటకు మానవతకు విరుద్ధమైన నేరం చేయడము. అంతేగాక అలా ఖర్చుచేయడం ప్రపంచ జనాభా కార్యాచరణ ప్లాను వెలువరించిన మానవావసరాలను సాధించడానికి ఆటంకమౌతుంది. వివిధదేశాల పౌరులు తమ దేశాలలోని వివిధ నిధులను వినాశన కార్యక్రమాలనుండి, జీవితాన్ని బలపర్చే కార్యక్రమాలకు మరల్చేందుకు పనిచెయ్యాలని కోరుతున్నాము.

(11) రాజకీయ చట్రాలలో మార్పు రానిదే ప్రపంచ జనాభా కార్యచరణ ప్లాను శక్తివిహీనమౌతుందని మేము భయపడుతున్నాము. పెద్దఎత్తున రాజకీయ, సాంఘిక మార్పులు మానవాళిపైన రుద్దబడేటట్లు కన్పిస్తోంది. గుడ్డిగా గమనం సాగించే దానికంటే బాధ్యతతో మన మార్పులను స్వీకరించడానికి సిద్ధపడాలి. ఈ ట్రిబ్యూన్ సమావేశంలో పాల్గొంటున్న ప్రతినిధులు జనాభా సమస్యల్ని వాస్తవిక రాజకీయ పదజాలంలో చర్చించాలని, ప్రపంచ జనాభా కాన్ఫరెన్సులో స్థూలంగా తయారుచేసిన అస్పష్టమైన సాధారణ సూత్రాలను తిరస్కరించి, క్రియాశీలంగా వ్యతిరేకించి, వాటిని దాటి నిర్ణయాలు చెయ్యాలని కోరుతున్నాము.

(12) ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలచేత యీ విలువల్ని నిర్ణయాలను అంగీకరింపజేసేందుకు వీలైనన్ని విధాల వ్యక్తిగత సంస్థాగత నిర్మాణ బాధ్యతల్ని మేము తీసుకుంటాము. మిత్రరాజ్య సమితి జనాభా కార్యాచరణల నిధితో మేమంతా సంయుక్తంగాను, విడివిడిగాను సహకరిస్తాము. ఇందుకు సంబంధించి మిత్రరాజ్య సమితి వారి యితర సంస్థలతో కూడా యిందుకు సహకరిస్తాము. ఈలక్ష్యాలను సాధించడానికి మనం చేసే ప్రయత్నాలు రానున్న తరాల జనాభా జీవితాలను మెరుగుపర్చగలవని మేము విశ్వసిస్తున్నాము. జనాభా విధానం ప్రజా సంక్షేమ విధానం కాబట్టి ప్రతివ్యక్తి తలసరి ఆదాయం పెరిగి, ఆర్థికావసరాలు తీరి, సంతృప్తి పెరిగి, సంతోషము, సుఖము, సంక్షేమము కలిగేటట్లు చెయ్యాలి.

వెలుగైపోయిన విశ్వనాథుడు

డా. బాడాల రామయ్య

ఎవ్వని యాత్మలో నిర్విశాలాంధియే ముడతలు ముడతలై ముడుచుకొనియె
ఎవ్వని యూహలో నిర్వసుంధర కీర్తి విరజాజులై దిశల్ పరిమళించె
ఎవ్వని వాక్కులో నెనలేని సత్యంబు వక్రోక్తియై పరభావమూపు;
ఎవ్వని రూపులో నిండె సహస్ర చంద్రోదయామృతధునీదుగ్ధలహరి;
ఎవని వేయిపడగలపై యీ యఖండ విశ్వ సంస్కృతి నిలిచె నా విశ్వనాథు,
సాహితీవిశ్వనాథుని సంస్కృతాంధ్ర సంస్కృతీరూపు దలతు మహ్నానమందు.

ప్రాచీ పశ్చిమ వాక్కళాకళలు పర్వంబైన మీ రూపు సాం
ప్రదాచార వ్యవహార సంస్కృతికి సంతస్సారమై నిల్చె ప్రా
పీ చాంద్రీమయ మల్లికావనల తన్మీ ప్రజ్ఞ భాసించె నా
యీ చిత్తంబున పాలపొంగు లిడికెన్ యేనాటి బాంధవ్యమో !

ఇటులనే మరికొన్ని పద్యములను సెప్టెంబరు 15వ తేదీ విజయవాడలో విశ్వనాథవారి సహస్ర చంద్ర దర్శన శాంతి పౌష్టికోత్సవమున వ్రాసి చదివితిని. వారితో గడిపిన ఆ రెండు రోజులు జీవితమున మరపురానివి. అది కృష్ణానదీతీరము. సరస్వతీ మందిరము నిరంతర వేదఘోష. పుంఖానుపుంఖములై వెలువడుతున్న ఆ పుంభావసరస్వతీ వాగమృతమున వేదములు దొరలినవి, శాస్త్రములు మెరసినవి; సంగీత సాహిత్యాది కళలు గుబాళించినవి. ఆచార్య శంకర రామానుజాదులతో పాటు బసవేశ్వరుడు నందీశ్వరుడై ప్రత్యక్షమయ్యెను. నాటి రసామృతమును గ్రోలి అట చేరినవారెల్ల చెక్కబొమ్మలైరి. అదియే కవి సామ్రాట్టుల తుది విరాట్ స్వరూపము. విడలేక విడలేక ఆ సన్నిధానమును విడిచి యెటులో మైసూరు చేరుకొంటిని. కాని వారి వాక్కులే నాలో ప్రతిధ్వనించుచుండెను. ఇంతలో అక్టోబరు 18వ తేదీ రాత్రి పిడుగువంటి వార్త వచ్చిపడెను. కూలిపోతిని. పిల్లవాడనై ఏడ్చుకొంటిని. తెరలు తెరలుగ పొరలి వచ్చిన ఆ దుఃఖమే యీ రూపమును దాల్చెను.

"ప్రాణాయామము నౌషధంబు లివి నిల్వంబెట్టె నన్న"ంచు నా
తో నీ వాడిన మాట లింకను మదిన్ దూరంబుగా వింతలో
నే, నీ పేరును చెప్పిచెప్పి నిఖిలాంధ్రీలోక మేడ్చెన్, మహా
శానేకంబులు కూలిపోయె, జగ మస్తవ్యస్తమై పోయెడిన్.

నెలనాళ్ళైనను నిండలేదు తమ వాణీ న్యసులం గోలి, పే
శల మాధ్వీక రసోదధిం బడి, శరచ్చంద్రాతపశ్రీలనే
తలగం దోచి తలంచుచుండగ, భవద్బ్రహ్మస్వరూపంబు, గుం
డెలపిండ న్వినవచ్చె, నీవు రసతంత్రీనాదమై పోవుటల్.

పాండిత్య ప్రతిభాప్రభావ మిలపై పారాడ మీ రూపులో
గుండె ల్విండి రసప్రవాహములలై ఘూర్ణిల్ల మీ వాక్సుధా
ఖండంబుల్ కలకండలై వెలువడన్ కావ్యామృతాస్వాదనా
తండంబుల్ తల లూపె నెవ్వ రిక యీ తత్త్వంబు రూపింతురో.

నన్నయ లోతు గుండెల, ఘనంబగు తిక్కన శిల్పశక్తి, సో
మన్న విచిత్ర సూక్తి, రసమంజులమౌ కవినాథు రక్తి, పూ
ర్వోన్నత కావ్యముల్, వెలుగుపోగుల ప్రోవులఁబెట్టఁ బుట్టు మా
పున్నెపు పుట యే పగిలిపోయె, తపస్సులు కృష్ణలో బడెన్

ధగధగ మండు మంటల సుధా రసధారలు చిందెనేమొ! ప
న్నగమణి కుండలు ప్రభలు నాల్గు దిశల్ బడి, వేవెలుంగులై
జగముల నిండెనో! మృదు రసాంచిత పుష్ప సమాన గుచ్ఛముల్
తెగి పడెనో! దివం బొరయు తెల్గు రసోజ్జ్వలమూర్తి వెళ్లిపోన్.

అన్నముముందు కూర్చొన, త్వదాకృతియే కనుపించు; పద్యముల్
తిన్నగ చూడ, గుండెల త్వదీయ రసోక్తి ప్రతిధ్వనించెడిన్,
సన్నని కూనిరాగముల జాల్కొన నా యెద, మీ గళంబులో
గ్రొన్నన లెత్తు రాగములె ఘూర్ణిలజేయు, నికేమి చేయుదున్.

కథయో! నాటకమో! ప్రబంధమొ! మహాకావ్యంబొ! గీతిప్రబం
ధ ధునీధారయొ! సద్విమర్శయొ! రసాద్యోతంబొ! వ్యాఖ్యానమో!
ప్రథితంబౌ నవలావిశేషమొ! మహోపన్యాసమో! మాటయో!
మధురక్షీరరసామృతంబు మరలన్ మాకెవ్వ రందింతురో!

నీవు నిల్పిన రాముని విలువ వ్యక్తి దివ్యప్రకృతికిని ప్రాణప్రతిష్ఠ;
నీవు పాడిన లయల్ నిదురించు భారతీదేవి శ్రుతికి నవజీవకరణి;
నీవు సృజించు సజీవ పాత్రల కల్మితన సృష్టి లేదని దాత వగచు;
నీవు నడచిన సాహిత్యపథము లాంధ్ర బహుముఖప్రజ్ఞకు ప్రతిఫలంబు
మూడు వందల యేండ్లు మా భూమి పడిన తవము నీ రూపులో బండె, శరతగాల
జన మిక త్వదీయ కావ్యాబ్ధి మునిగి జాతిరత్నముల దీర్చు యుగసంధ్య ప్రాప్తమయ్యె!

ఏడీ మీ కవిసమ్రాట్టీడీ యని, యెవ్వరైన నెదురై యడుగన్,
బ్రోడై దిక్కుల చూచుచు, పాడిన మీ కావ్యలక్ష్మిఁ బరికింతు మికన్.
ఆనా డట్టుల చెప్పితి, యీనాడిటు వ్రాయుచుంటి, నిదియే ఘటనం
బో! నా మది దోచదు, దేవా! నీవే కారణము భవాభవములకున్.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

గవేషణ

శ్రీ మేకా సుధాకరరావు

వసంతానికి చిహ్నమైన శిశిరం
మరో వసంతానికి మాసిన వసనం !
జీవితాన్కి అంతం అయిన మరణం
మరో జన్మకు జననం !

చక్రభ్రమణాన్విత
ప్రకృతి లీలా హేలాయుత
ఋతు జీవనంలో—సృష్ట్యాదినుండీ
తిరిగి తిరిగి వస్తూనే ఉన్నవి :
ఋతు ఋతువుకూ
ఆద్యంతాల వసంత శిశిరాలు !
జీవి జీవికీ జనన మరణాలు ! !

మనిషి మనీషిగా పెరిగి, ఎదిగి
మహాత్ముడై, మహర్షియై
ఈ జనన మరణాల చరమ పరిణామంగా
జన్మరాహిత్యం
శోధించి సాధించాడు—కాని
ఋతు నిబద్ధమైన ప్రకృతి జీవనమాత్రం
క్రమబద్ధంగా పరిక్రమిస్తూ
పరిభ్రమిస్తూనే ఉంది—
భూమ్యాది విశ్వగోళాలవలె !

ప్రకృతి ఋతు విముక్తమైనా
విశ్వగోళాలు పరిభ్రమణ విముక్తాలైనా
విశ్వసృష్టి అలక్షణమై పోవును !

అందుకే—
అతివిస్తారమైన భూగోళంలో
అల్పాతి అల్ప భాగుడైన
మానవు డొక్కడికే బుద్ధినొసగెడో యేమో ? !

ఏ వసంతం చెప్పుతుంది ?
ఈ సృష్టి రహస్యాన్ని
ఏ జననం విప్పుతుంది ?!

"బాష్పకంజాంజలి"

విద్వాన్ రమేశ్బాబు నవులూరి

విశ్వ విఖ్యాత కవినాథ విశ్వనాథ
స్వర్గ మం గతేతి దుస్సహ వార్త
సహృదయ హృదయ సుకుమార సుమముపైన
శంభ దళనిపాతమ్మగు చోద్యమయ్యె !

"ఆంధ్ర ప్రశస్తి" కవితలో వందగింప.
"ఆంధ్ర పౌరుష" గరిమము నభినుతించి,
అవల "రామాయణమ్ము"న కంజలించి;
"గిరి కుమారుని ప్రేమ గీతి" లోన,
పరగ "కిన్నెరసాని పాట" లందు,
దివ్య "శృంగార వీథుల" తిరిగి తిరిగి,

విసిగి "విశ్వేశు శతకంబు" పసగ వ్రాసి,
దురితదూరునకున్ "శశి దూత" మంపి ;

"విశ్వకవి" నేడు కలసెను విశ్వనాథు,
సు"కవిసామ్రాట్టు" జేరెను సురలనాథు,
ఆదిమ "కళాప్రపూర్ణుడు"—అరిగి వాడు.
మరపురాని కవివరుడు మనకు లేడు !!

విశ్వనాథుని సరి కవివరుడున్ను,
సత్యనారాయణుని బోలు సత్కవియును
భారతావని లేడని పౌరుషాన
పల్కు పల్కులు రిత్తను పల్కు రిత్త !!!

ఆంధ్రదేశ చరిత్రలో రాజకీయ వివాహములు

శ్రీ ఎ. విజయ దత్తాత్రేయశర్మ
శ్రీ కె. సత్యమూర్తి

మనువు మొదలయిన ధర్మశాస్త్రజ్ఞులు రాజ్యవ్యవస్థను విశదీకరించుచు రాజ్యమునకు సప్తాంగములను నుడివిరి[1] వానిలో మిత్రము ముఖ్యమయినది; అత్యంతావశ్యకమైనది. రాజకీయములందలి మైత్రి యసిధారావ్రతము వంటిది. ఆ మైత్రిని తొలుత పొసగించు టెంత సులభ సాధ్యము కాదో దానిని కడవరకు నిలుపబెట్టుట కూడ యంత అసాధ్యమే. ఆ మైత్రిని నిలువబెట్టుటలోను; పొసగించుటలోను; వృద్ధిపుచ్చుటలోను కూడ అనేకానేక రాజకీయాంశములు తోడ్పడుచుండును. అట్టివానిలో వివాహ మొకటి. సాధారణముగా సామాజికాంశమయిన ఈ వివాహము ఒక రాజ్యమును వేరు రాజ్యమును సమన్వయించుచు సహృద్వైరాది భావములను పరిశీలించునపుడు విచిత్రమయిన విధానములో రాజకీయాంశమగును. సామాజిక వ్యవస్థ పరిధినిదాటి రాజకీయాంగముగా పరిణమించినప్పుడే వివాహముయొక్క లోతుపాతులను మనము గమనింపగలము ఏ దేశ చరిత్రను సమగ్రముగా పరిశీలించినను మనము యిట్టివిధమయిన వైవాహికాది రాజకీయాంగములను చూడగలము. భారతదేశ చరిత్రకూడ నిట్టిదానికి యపవాదముకాదు. మౌర్యవంశ స్థాపకుడయిన చంద్రగుప్తుని నాటినుండి యిట్టి వివాహములు అనూచానముగా వచ్చుచున్నవి. మౌర్యచంద్రగుప్తుడు గ్రీకు రాజగు సెల్యూకస్ నికెటరు కుమార్తెను యతనిని యుద్ధమునందు పరాజితునిజేసి వరించెనని గ్రీసుదేశపు చరిత్రలవలన తెలియుచున్నది.[2] ఇందు జరిగిన యీ వివాహము కేవలము రెండు దేశముల నడిమి వైరభావమును మడియజేసి సుహృద్భావమును ప్రోత్సహించు కొఱకై జరిగినది. అట్లే భారతీయ సంస్కృతీ చరిత్రలో మకుటాయమానమయిన గుప్తరాజవంశ చరిత్రలోను వివాహమే ముఖ్యమగుట కాకతాళీయమయినను ధనికము కాదు సరికదా సాంప్రదాయానుయాయి విధానము మాత్రమే. మహారాజ ఘటోత్కచ గుప్తుల పుత్రుడు అయిన మహారాజాధి రాజ చంద్రగుప్తులవారు లిచ్ఛవీ రాకుమారియగు కుమారదేవిని పరిగ్రహించినట్లు శాసనముల, నాణెముల యాధారములవలన తెలియుచున్నది[3]. లిచ్ఛవులుత్తర భారతదేశము నందు బౌద్ధయుగమునుండి గణతంత్ర రాజ్యముగా వన్నెకెక్కి యుద్ధవీరులుగా గణుతికెక్కినవారు. వారితో వైరము రాజ్యశాంతికి యుపద్రవకరమని భావించి చంద్రగుప్తుడు కుమారదేవిని వివాహమాడి యుండవచ్చును. తత్కారణముననే యతడు తన తండ్రులవలె కాక మహారాజాధి రాజేత్యాది దివ్య రాజోచిత బిరుదాంకుడయినాడు. సముద్రగుప్తుడు కూడ లిచ్ఛవీ దౌహిత్రుడనని సగర్వముగా చాటుకొనినాడు.[4] అట్టి కారణముచేతనే చంద్రగుప్త విక్రమాదిత్యుడు పద్మావతీపుర నాగరాజ వంశీకురాలయిన కుబేర నాగను వివాహమాడుట'[5] తన పుత్రియగు ప్రభావతిని వాకాటక రాకుమారుని కొసగి వివాహమొనర్చుట.[6]

క్రీ. శ. 1336 వరకు ఆంధ్రదేశ చరిత్రను పరిశీలించినచో మనము యిట్టి రాజకీయాంశములయిన వివాహములను పెక్కులను గమనింపగలము. మౌర్యుల సామంతత్వమునుండి వెనుకబడిన పిదప యాంధ్రరాజ్యమును సాతవాహనులు పరిపాలించిరి. వీరు కాణ్వాయన గోత్రియుడయిన సుశర్మను జంపి రాజ్యమును మాగధముల పర్యంతము గల దానిని పాలించిరని పౌరాణికు లేకకంఠోక్తిగా చెప్పుచున్నారు.[7] వీరిలో శాతకర్ణియను పేరుగల రాజభార్య యయిన నాగనికాదేవి నానాఘాట్‌వద్ద యొసగిన యొకానొక శాసనములో నామె తనను అంగియకుల సంజాతగా చెప్పికొనినది[8] ఆ శాసనమున కించుక యెడముగానున్న ప్రతిమా నామములను చూచినచో వానిలో "మహారఠి తణకయిరో" నాబడిన యాతడు "మహారథి" యను రాజకీయ స్థాయిలోనున్న యధికారిగా గోచరించుచున్నాడు[9] ఈతని నాగనికాదేవి తండ్రియని సంభావించినచో యీతడు కొల్హాపురపు నిధియందు కనుపించు కుర వంశీకులయిన రాజులవలె[10] సబలురయిన సామంత కూటమికి చెందియుండెడివాడని; అట్టివానితో మైత్రి రాజ్య క్షేమకరమని భావించి నాగనికాదేవిని శాతకర్ణి వివాహమాడియుండి యుండెనని మనము సమన్వయింప వీలగును. ఈ వివాహము కేవలము శాంతికి భంగకరముకాని విధానము కొఱకే చేయబడినది. అటు కాక కార్దమక రాజ వంశస్థులయిన రుద్రదాముని గిర్నారు శాసనమును[11] పరిశీలించినచో నాతడు తన కూతురును వాసిష్ఠీపుత్ర శాతకర్ణి యను శాతవాహన రాకుమారున కొసగినట్లు తెలియుచున్నది.[12]

ఈతని శాసనములను మనము అపరాంతమునందు చూడగలము. వీని సమకాలీనుడును, దాయాదియు నయిన యజ్ఞశాతకర్ణి శాసనములు ఈ ప్రాంతమునందు వాని పదునేడవ రాజ్య సంవత్సరము

తదుపరి లేకుండుటచే చారిత్రకులు వాసిష్ఠీపుత్రుడు యజ్ఞశాతకర్ణితో కలహించి వైరము పొంతకు జనెనని ఆ కారణముననే యాతడు తన కూతురినీగా నాతడు రాంతమును చేకొని మామ యడుగులకు మడుగులొత్తుచు తొత్తయి పాలించెనని నుడువుచున్నారు. ఇదియును రాజకీయ వివాహమే యయినను ఇది చెప్పకయవాసిష్ఠీపుత్రుని దుర్నయముగూర్చి చెప్పుచున్నది.

శాతవాహన రాజన్యుల పిదప యాంధ్రప్రాంతమును వారి భృత్యులగు శ్రీ పర్వతేయులు పరిపాలించినట్లు మత్స్య, వాయ్వాది పురాణములు నుడువుచున్నవి.

"ఆంధ్రాణాన్ సంస్థితే రాజ్యేతే షాంభృత్యాన్వయస్సృపాః
సప్తైవాన్యా భవిష్యన్తి ... ..."
"ఆంధ్రాః శ్రీపర్వతే యాశ్చతే ద్విపంచాశతమ్ సమాః."[13]

నాగార్జునకొండ;[14] మొదలగు ప్రాంతములందు ఎక్కువగా కనుపించెడి శాసనములను చూచినచో "ఇఖాకువ" ఇత్యాది పదములను బట్టి వీరు ఇక్ష్వాకులను రాజవంశస్థులని తెలియుచున్నది. నాగార్జునకొండ;[15] ధరణికోట;[16] అమరావతి[17] మొదలగుచోట్ల జరిగిన త్రవ్వకముల వలన వీరు ఆంధ్రశాతవాహనుల తర్వాత యెడమెంత మాత్రము లేకుండ నాంధ్రప్రాంతమును పరిపాలించిరని తెలియు చున్నది. నాగార్జునకొండలో దొరకుచున్న వీరి శాసనములతోపాటు, చేదిశకము 30 వ వత్సరమున నిబడిన ఆ భీరవాసుసేనుని శాసనము మొదలగు వానిని పరిశీలించినచో యిక్ష్వాకు రాజవంశస్థులు పూగీయ, హిరణ్య, రాష్ట్రీయులతోను; ధణక కులస్థులతోడను; చూటుకుల రాజులయిన బనవాసిని పరిపాలించెడి రాజన్యులతోడను వైవాహిక సంబంధములను నెరపిరని తెలియుచున్నది. బృహత్పలాయన రాజ వంశస్థుడయిన జయవర్మ కొండముది తామ్రశాసనము[18] వలన వాని తండ్రియగు శ్రీవర్మ యిక్ష్వాకులతో వైవాహిక సంబంధములను గలిగి యిక్ష్వాకురాజ్య కాలమునందు హెచ్చుగు పలుకుబడిగలిగియుండెడి వాడని తెలియుచున్నది. ఈ వైవాహిక బాంధవ్యములను పరిశీలించి నచో అవి రెండు తెగలకు చెందినవని తెలియుచున్నది. ధణకులు, బృహత్పలాయనులు యీా మొదలగు వారితోడి పొత్తు రాజ్యము నందలి బలమయిన జాతులను కూడగట్టుకొనుటకై జరిగినది. అట్లే పూగీయులు, హిరణ్య రాష్ట్రీయులు, చూటుకులస్థులు వీరెల్లరు పొరుగున గల బలమైన రాజవంశస్థులగుటచే వారి సాయమెంతయైన శాంతిదోహదకారి గనుక వివాహములు జరిగినవి. కాని నాగార్జున కొండలోని ఆభీరవాసుసేనుని శాసనమందలి చూటుకులరాజన్యుల ప్రసక్తి; ఆ శాసనమును వ్యాఖ్యానించుచు నొకానొక ఆభీర దండయాత్రను సూచించుట ఈ మొదలగునవని వారు స్వతస్సిద్ధముగా క్షాత్రవకూటమికి చెందినవారని; తాత్కాలికముగా వైరము నుపశమింపజేయుట కొఱకయి యిక్ష్వాకులతోడి వివాహములు వర్తమానమయియుండెనని యూహింప వీలగును.

ఇక్ష్వాకులపిదప శాలంకాయనులు, బృహత్పలాయనులు, ఆనందులు, ప్రాకృత శాసనములందలి తొలి పల్లవులు ఆంధ్రప్రాంతమును పరిపాలించిరి. కాని మనము వారి పరిపాలనమునందు వైవాహికాంశము లను గూర్చి తెలియజాలకున్నాము. శాలంకాయనుల తర్వాత యాంధ్రమును విష్ణు కుండినులు, దుర్జయులు ప్రాక్చాళుక్య యుగమునందు అనగా క్రీ. శ 624 వరకు పరిపాలించిరి. ఈ విష్ణుకుండినులు కృత్తై కాశాశ్వమేధులు, పరిపూర్ణిత శతాధిక క్రతువులు. వీరి శాసనములో ఇమ్మడి మాధవవర్మ కుమారుడయిన ప్రథమ విక్రమేంద్ర వర్మ "విష్ణుకుండి వాకాటక వంశద్వయాలంకార జన్మ" డని చెప్ప బడినాడు.[19] దీనినిబట్టి మనము వాకాటకులకు, విష్ణుకుండినులకు వైవాహిక సంబంధము నూహింపగలను. వాకాటకరాజగు హరిసేనుని చెల్లెలయిన లక్ష్మీదేవిని ఇమ్మడి మాధవవర్మ పెట్టిబట్టెనని తత్పుత్రుడు విక్రమేంద్రవర్మయని తెలియుచున్నది[20] వాకాటకులు తొల్దొలుత తమకు సామంతులయిన విష్ణుకుండినులతోడి బాంధవ్యము రాజ్యక్షేమంకరమని యెంచి నెఱకొల్పుకొనిరి. తదనంతరము చెల్లెలికి యరణముగా నొసంగిన యాంధ్రదేశమునకీరాజన్యులేలికలయిరి. ఇది యొక విశేషమయిన యంశముగా మన మీ వైవాహిక చరిత్రలో పరిగణింపనగును

క్రీ. శ 624 నుండి 1076 వరకు ఆంధ్రదేశమును తూర్పుచాళుక్య రాజన్యులు పరిపాలించిరి. వేంగి వీరి రాజధాని. ఈ శకమునందు శాసనములను పరిశీలించినచో రాష్ట్రకూటుల తోడను; చోళులతోడను వైవాహిక సంబంధములు గోచరించును. రాష్ట్రకూటులతోడి వివాహములు అఖండిత శత్రుత్వమును తాత్కాలికముగా నుపశమింపజేయుట కొఱకై చేయబడినవిగాను, చోళులతోడి వివాహములు రాజ్యమును వైరుల బారినుండి తప్పించుటకు బలవంతుల యండ అవశ్యముగాను తోయుటచే జరుపబడినవిగాను గోచరించును. రాష్ట్రకూటులతోడి వివాహములు తూర్పు చాళుక్య రాజన్యులయొక్క స్వాతంత్ర్యమును సూచించుచుండగా చోళులతోడి వివాహములు వారి నిస్సహాయతను, బలహీనతను సూచించును.

రాష్ట్రకూట ప్రభువులగు ప్రథమ కృష్ణుడు; ధ్రువుడు; ఇమ్మడి గోవిందుడు; అమోఘవర్షుడు; ఇమ్మడి కృష్ణుడు. ముమ్మడి గోవిందుడు, ముమ్మడి కృష్ణుడు, నాల్మడి గోవిందుడు చాళుక్యుల తోడి యుద్ధము లొనర్చిరి. చాళుక్యులలో వీరికి సమకాలీనులుగా ప్రథమ విజయాదిత్యుడు; నాల్మడి విష్ణువర్ధనుడు; నరేంద్ర మృగరాజ ఇమ్మడి విజయాదిత్యుడు; పంచమ విష్ణువర్ధనుడు, గుణగ విజయాదిత్యుడు; ప్రథమ చాళుక్య భీముడు చాళుక్య రాజ్యమును పరిపాలించిరి. వీరి యుద్ధములందు రెండు వివాహములను మాత్రము చూడగలము. అవినాల్మడి విష్ణువర్ధనుడు తన కూతురగు శీలమహాదేవిని ధ్రువనిరుపమున కిచ్చి వివాహ మొనర్చుట;[21] నరేంద్ర మృగరాజ ఇమ్మడి విజయాదిత్యుడు అమోఘవర్షుని మేనమామ సువర్ణవర్షుని కూతురగు శీలమహాదేవిని తన కుమారుడగు పంచమ విష్ణువర్ధనుడు లేక కలి విష్ణువర్ధనునకిచ్చి వివాహ మొనర్చుట.[22] ఇవి రెండును తాత్కాలికముగా శాంతిని నెలకొలిగినవేగాని వైరమును రూపుమాపలేక పోయినవి. ఆ కారణముననే శీలమహాదేవి కలివిష్ణువర్ధనుల పుత్రుడైన గుణగ విజయాదిత్యుని అమోఘ వర్షుడు వింగవల్లి యుద్ధమున జయించి సామంతుని చేసికొనుట;[23] తదనంతరము గుణగు డిమ్మడి కృష్ణుని వాని బావమఱంది యగు హైహయ

శంకరగణుని తరిమి తరిమి ఓడించుట.[24] వీరి వైరము కళ్యాణి చాళుక్యుల ప్రాబల్యమువలన రాష్ట్రకూట సామ్రాజ్య మంతరించు దాకను కొద్దిగనో; గొప్పగనో మిగిలియే యున్నది.

తర్వాతి కాలములో రాష్ట్రకూటులకు రాజకీయ వారసుల వలె కళ్యాణి చాళుక్యులు రక్తసంబంధమును సహితము విస్మరించి చాళుక్యులను వారికత్యంత సంబంధీకులగు చోళులను జయింపనెంచి పెక్కు సమరములను చేయుట చాళుక్యుల చోళుల మైత్రిని కలుపుటలో నొక ప్రధానాంశమయినది.

క్రీ. శ. 972–78లో జటా చోడభీముడు వేంగినాటిని జయించి దానార్ణవుని చంపగా వాని కుమారులయిన శక్తివర్మ, విమలాదిత్యులు తమ తల్లివైపు బంధువులయిన గాంగుల పంచకు జనిరి గాని జటాచోడ భీముని ఉగ్ర ప్రభావమునకు తాళలేక చోళుల సాయ మర్థించి వారలు దక్షిణముగా వెడలిరి. చోళరాజరాజు తన కూతురగు కుందవాంబను విమలాదిత్యున కిచ్చి వివాహ మొనర్చి 1001లో తిరిగి చాళుక్య సామ్రాజ్యమును సాధించుటకై యధాశక్తి తోడ్పడెను.[25] విమలాదిత్య సూనుడయిన రాజరాజనరేంద్రుడు తన మేనమామయగు రాజేంద్రుని కూతురగు యమ్మంగదేవిని వివాహమాడి, సోదరుడైన విజయాదిత్యుడు తనపై కత్తిగట్టి వేంగి రాజ్యమును కళ్యాణి చాళుక్యుల సాయముతో పాలించినప్పుడు చోళుల సాయమును ఇతోధికముగా గొనుట.[26] రాజరాజనరేంద్రుని పుత్రుడగు కులోత్తుంగుడు తన మేనమామయగు ఇమ్మడి రాజేంద్రుని కుమార్తెయగు మధురాంతకిని వివాహమాడెను. ఈ వివాహముల ఫలితముగనే చాళుక్యులు విజయవంతమయిన పథానములో కళ్యాణి చాళుక్యుల దౌష్ట్యము నరికట్టగలిగిరి. చోళులతోడి వివాహము సప్తమ విజయాదిత్యుని యేలుబడి పిదప రాజరాజ నరేంద్రుని సూనుడును; చోళుల యిల్లరికపు టల్లుడునయిన కులోత్తుంగుని పరమయ్యెను. అదియే యాంధ్రావనియందు చోళ-చాళుక్యవంశ సముద్భూతులయిన రాజన్యుల ప్రాబల్యము బలిసి యాంధ్రభూమి పారతంత్ర్యమును పొందుట. ఈ కాలమునందు కేవలము రాజప్రతినిధులే రాజులయిన చాళుక్య చోళ రాజవంశీయులకు సామంతులయి పరిపాలించిరి. ఈ శకమంతయు తెలంగాణములోను, రాయలసీమయందును తెలుగుచోడులు; తెలుగు పల్లవులు, పొత్తపిచోడులు, రేనాటిచోడులు, బాణులు, కదంబులు; వైదుంబులు, విరియాల ప్రభువులు, తొలికాకతీయులు, రేచెర్ల రెడ్లు వివిధమయిన యనేకరాజవంశములు పరిపాలించిరి. అట్లే యాంధ్రమున కొన్ని సామంత రాజవంశములయిన కొలను వంశీయులు ఇత్యాదులు పరిపాలించిరి. చాళుక్య యుగములో పైవిధమయిన చోళ, రాష్ట్రకూట వివాహములుగాక, వారు తెలుగు పల్లవులు,[27] కళింగ గాంగులు,[28] కొలను రాజవంశీకులు [29] మొదలగు వారితోడి వియ్యమందినట్లు తెలియుచున్నది. ఇది కేవలము రాజ్యక్షేమము కొఱకు వచ్చిన పన్నుగడగాని తదితరము గాదు. చాళుక్య చోళయుగమునందు వివాహ విధానమును గూర్చి సరియయిన యాధారములు లేవు.

కాకతీయ యుగము మహమ్మదీయ దండయాత్రలకు ముందటి తుది హిందూవంశ పరిపాలనా కాలము. వీరు 1323 వరకు పరిపాలించిరి. వీరిలో రుద్రదేవుడు, మహాదేవుడు గణపతిదేవుడు, రుద్రాంబిక ప్రతాపరుద్రుడు అనువారు పేరెన్నికగన్న పాలకులు. ఈ శకమునందు వివాహము కేవలము రాజకీయమయిన పన్నుగడగా

పరిణమించుట యొక్క విశేషమయిన అంశము. ఈ కాలమునందుగల రాజులెల్లరును తరతమభేదములనువిస్మరించి కేవలము రాజ్యముయొక్క క్షేమము కొఱకై యీ వివాహవ్యవస్థను వినియోగించుకొనిరి. మీరు రేచెర్ల రెడ్లు; విరియాల ప్రభువులు; నిడదవోలు చాళుక్యులు; ఇందులూరి వంశీకులయిన కొలను ప్రభువులు ఈ మొదలగు రాజవంశీకులతోడి వివాహములను నెలకొల్పుకొనిరి. గణపతిదేవుడు ముప్పురిని వివాహమాడెను; తన యిద్దరికూతుండ్రను ఇరువురు సామంత ప్రభువంశీయుల కొసంగి వివాహమొనర్చెను. గణపతిదేవుడు తన బావమఱది యయిన జాయప నాయకుని వెలనాటి ప్రాంతములకు ప్రభువుగా నొనర్చుటయేగాక యాతని సేనాధ్యక్షునిగా నొనర్చు కొనెననియు తెలియుచున్నది. ఈ విధముగా కేవలము సామంత ప్రభువులతో వివాహములు జరుపుటవలన రెండు ప్రయోజనములు గలవు. **1.** వారు తమకు రక్తసంబంధీకులౌటచే రాజ్యపాలన క్షేమంకరముగా నుండును; 2. రాజ్యము అపాయస్థితిలో నున్నప్పుడు వీరి సాయము తప్పక లభించును.

గణపతిదేవునికి ముగ్గురు కూతుళ్లను ముగ్గురు అధిపతులకిచ్చి వివాహమొనర్చెను. రుద్రమాంబ నిడదవోలు చాళుక్య వంశీకుడు అయిన వీరభద్రుని వివాహమాడినట్లు జుత్తిగ;[30] కొలనుపాక[31] శాసనము వలన తెలియుచున్నది. ఈమెకు ముగ్గురు కూతుళ్ళు. ముమ్మడమ్మ యనునామెను కాకతివంశస్థుడయిన మహాదేవుని కొసంగి వివాహమొనర్చినట్లు డా॥ ప్రతిభా మగళిగారు తెల్పుచున్నారు.[32] ఇంకొకతెను ఇందులూరి గన్నయ కుమారుడయిన అన్నయ కొసంగి వివాహమొనర్చెను.[33] ఇవి యన్నియును కేవలము పై దృష్టాంతముతోడనే యొనర్పబడినవి కాని తదితరములుగావు.

ఈ విధముగా రాజకీయ వివాహములు ఆంధ్రదేశ చరిత్రలో నత్యంత ప్రాముఖ్యమును వహించుచున్నవి. ఈ వివాహములే వేర్వేరు రాజవంశీకుల మధ్య శాంతికి, వైరమునకు కారణమగుట చరిత్రలోని మానవాతీతమయిన యంశములలో నొకటియని నొక్కి చెప్పకతప్పదు. ఇట్టి సంఘటనలు కొల్లలుగా నుండుటచేతనే చరిత్రయనునది అదృష్టమును ఆధారభూతముగ నుండునని ప్రొఫెసర్ జె. బి. బ్యూరీ నిర్వచించిరి[34] ఇది కేవలము లౌకికమయిన దృక్పథముదాటి చరిత్రగతియుండును. ఇదియే చారిత్రక సంభావ్యత (Historical inevitability) అని అందురు. ఈ సిద్ధాంతమే ఒకే విధమయిన వివాహవ్యవస్థను వేరు వేరు కాలములలో వేర్వేరు పరిస్థితులలో చూచినచో ఎట్లు వేర్వేరుగా నుండునో తెలియబరచుచున్నది. ఈ విధమయిన చారిత్రక పరిణామమును చూపుటయే చరిత్ర పఠనమునకర్థము,

అథోజ్ఞాపికలు

1. హిస్టరీఆఫ్ ధర్మశాస్త్ర [ధర్మశాస్త్రచరిత్ర]—పి. వి. కాణే, పూనా 1946, పుటలు 216—234.
2. ఏజ్ ఆఫ్ ది నందాస్అండ్ మౌర్యాస్ [నంద—మౌర్యయుగము]—కె.ఎ. నీలకంఠశాస్త్రి, ఢిల్లీ 1967 పుటలు—137—138, చంద్రగుప్త మౌర్య అండ్ హిజ్‌టైమ్స్ [చంద్రగుప్త మౌర్యునికాలము]—డా. రాధా కుముద్‌ముఖర్జీ, మద్రాసు 1943, పుటలు—58—62.
3. కార్పస్ ఇన్స్క్రిప్షనమ్ ఇండికారమ్ [తృతీయ సంపుటము] సం. జాన్ ఫెయిత్‌ఫుల్‌ఫ్లీట్ వారణాసి—1963, పుట—8, పంక్తులు 28—, 29, దిగుప్తా గోల్డ్ కాయిన్స్ ఇండియన్ మ్యూజియం హోర్డ్స్, డా. ఎ. యస్. అల్టేకర్, పుట XV— బొంబాయి 1954.
4. కార్పస్ ఇన్స్క్రిప్షనమ్ ఇండికారమ్ [తృ.సం] పుట 8, పంక్తులు 28.29
5. ది గుప్తా గోల్డ్ కాయిన్స్ ఇండియన్ మ్యూజియం హోర్డ్స్ పుట XXVII
6. ఎర్లీ హిస్టరీఆఫ్ దక్కన్ సం. యాజ్దాని. జి ప్రథమభాగము పుటలు— 175—176—1960 బొంబాయి.
7. ది పురాణిక్ టెక్స్ట్ ఆఫ్ ది డైనాస్టీస్ఆఫ్ ది కలియేజ్— ఎస్. ఏ. పార్జిటర్, బొంబాయి 1913—పుట—38.
8. సెలెక్ట్ ఇన్స్క్రిప్షన్స్— డా. డి. సి. సర్కార్ పుటలు 186—190, కలకత్తా, 1942.
9. అదే : పుటలు 184—186.
10. జర్నల్ఆఫ్ ది న్యూమిస్మాటిక్ సొసైటీ ఆఫ్ ఇండియా, పదునేడవ సంపుటము, పుటలు 58—71.
11. సెలెక్ట్ ఇన్స్క్రిప్షన్స్—డా. డి. సి. సర్కార్—పుటలు 169—174.
12. ఇం. ముం 'ఎర్లీ హిస్టరీఆఫ్ దక్కన్' పుట—129, ప్రథమభాగము.
13. ఇం. ముం ది పురాణిక్ టెక్స్ట్ ఆఫ్ ది డైనాస్టీస్ఆఫ్ ది కలియేజ్, పుటలు 45—46.
14. ఎపిగ్రాఫియా ఇండికా—20వ సంపుటము పుటలు—1—37, ఇరువది యొకటవ సంపుటము పుటలు 61—72, జగ్గయ్యపేట, కేసనపల్లి యీ మొదలగుచోట్ల గూడ నిక్ష్వాకుల శాసనములు లభ్యములౌచున్నవి.
15. ఇండియన్ ఆర్కియాలజీ ఎ రెవ్యూ—1954—55 పుట 22—అది. 1955—56.
16. అదే—1962—63—పుట 1, అది 1963—64 పు.
17. అదే—1958—59—పుట 5.
18. ఎపిగ్రాఫియా ఇండికా సం. VI, పుట315, ఆల్సో ది సక్సెసర్స్ ఆఫ్ ది శాతవాహనాస్ ఇన్ ది లోయర్ దక్కన్ పుట 46, కలకత్తా, 1934.
19. ది తుండి గ్రాంట్ఆఫ్ విష్ణుకుండిన్ కింగ్ విక్రమేంద్రవర్మ, హైదరాబాద్ 1962, పుట—4, సెకండ్ ప్లేట్, సెకండ్ సైడ్, పంక్తులు 9—13
20. తెలుగు సంస్కృతి [వాల్యూమ్ III] తెలుగు విజ్ఞాన సర్వస్వము.
21. ఈస్టరన్ చాళుక్యాస్ఆఫ్ వేంగి, పుట—85, సీ ఆల్సో ఎపిగ్రాఫియా ఇండికా XXII, నంబరు—17, పుటలు—98—107.
22. ఈస్టరన్ చాళుక్యాస్ఆఫ్ వేంగి—పుట—90.
23. ఎపిగ్రాఫియా ఇండికా VII, నంబరు—6, పుట 43, ఈస్టరన్ చాళుక్యాస్ ఆవ్ వేంగి—పుట—104.
24. ఈస్టరన్ చాళుక్యాస్ఆవ్ వేంగి—పుటలు—120—121.
25. ఈస్టరన్ చాళుక్యాస్ఆఫ్ వేంగి, పుట—216, సీఆల్సో హోకాన్— పుట—285 అది.
26. అదే పుట—226, సీఆల్సో హోకాన్—పుట—285 అది.
27. ఈస్టరన్ చాళుక్యాస్ఆఫ్ వేంగి—పుటలు—156, మహాదేవి, వైఫ్ ఆఫ్ విజయాదిత్య IV కొల్లభిగండ.
28. అదే, పుటలు—179, చాళుక్యభీమాస్ వైఫ్ అండ్ సేమ్ అంకిదేవి అండ్ ఊర్జప
29. అదే, పుటలు—189—190, వైఫ్ఆఫ్ అమ్మ II నాజ ది డాటర్ఆఫ్ నృపకామ, సీఆల్సో ఇండియన్ ఏంటిక్వరీ, వాల్యూమ్ XIII, పుటలు 249.
30. సౌత్ఇండియన్ ఇన్స్క్రిప్షన్స్—వాల్యూమ్ X, నంబర్—360.
31. ఎ కార్పస్ఆఫ్ ఇన్స్క్రిప్షన్స్ ఇన్ ది తెలంగాణా డిస్ట్రిక్ట్స్ఆఫ్ హెచ్.ఇ. హెచ్., ది నిజామ్స్ డొమినియన్స్—పార్ట్ II, నంబరు13, పుటలు 82—88—1942 కలకత్తా.
32. కాకతీయ రుద్రదేవి—పుటలు—40—41 అది.
33. అదే, పుటలు—42—43 అది.
34. ఇ. హెచ్. కార్, వాట్ఈజ్ హిస్టరీ, పుట—100, లండన్ [వి] 2.

నవలల్లో బాపిరాజు

శ్రీ శ్రీధర్

ఆంధ్ర నవలా సాహిత్యంలో అడివి బాపిరాజుగారు మహత్తరమైన మహోన్నతమైన స్థానం ఆక్రమించారు. ఆయన నవలా రచయితగా అగ్రగణ్యత పొందిన విశిష్టత. ఆంధ్రుల చరిత్రనుండి ఇతివృత్తాలను తీసుకొని హిమబిందు, గోన గన్నారెడ్డి, అడివి శాంతిశ్రీ, అంశుమతివంటి చారిత్రాత్మక నవలలు వ్రాసిన మొట్టమొదటి ఆంధ్ర నవలాకారుడు. నారాయణరావు, కోనంగి, తుపాను, జాజిమల్లి, నరుడు అనేవి ఆయన సాంఘిక నవలలు. ఈ నవలల్లో ఆనాటి ఆంధ్రుల గుణశీలాలు, సిరిసంపత్తులు, ఆచార వ్యవహారాలు, విజ్ఞానం, అభిరుచులు, సాంఘిక వ్యవస్థలు, స్థలపురాణాలు, కొంత కొంత విదేశాల విశేషాలు, గ్రామీణ జీవితాలు, రాజ్యాంగ వ్యవస్థల వివిధ శాస్త్రాలులోనగు అనేక విషయాలు జొప్పించినారాయన. శిల్పంలో, చిత్రకళలో, సంగీతంలో, నాట్యంలో, సాహిత్యంలో, రాజకీయాల్లో, వైద్యంలో, హస్తసాముద్రికంలో, జ్యోతిషంలో, ఇంకనూ బహువిషయాలలో తనకుగల పరిజ్ఞానాన్ని, పాండిత్యాన్ని ఈ నవలల్లో చూపించారు.

ఈ నవలలని విశ్లేషణాత్మక దృష్టితో పరిశీలిస్తే, ఆ పుటలలో దాగిఉన్న ఆయన వ్యక్తిత్వం 'రొమాంటిస్ట్'గా గోచరిస్తుంది. ఐడియలిస్ట్‌గా ఆయనకి పేరుఉన్నా 'రొమాంటిస్ట్'గానే ఆయన వ్యక్తిత్వం వికాసం చెందింది.

ఆయన సూక్ష్మమనః ప్రవృత్తులను కూడా గ్రహించి విశదపరుచుటలో గొప్ప చతురుడు.

ఆయన విహరించేది ఆకాశ మార్గమునే ఆయన కాళ్ళు నేల మీదే ఉన్నా ఆయన చూపు నింగి మీదే. అందుచేత ఆయన కథలు ఇతరుల కథలవలే కన్పట్టవు. అవి ఆయన దివ్యస్వప్నాలుగా ఉంటవి. ఆయన కనే కలలనే కథలుగా చెప్పారు. ఆ స్వప్నాల్లోని సౌందర్యాన్ని గాంచి మనం ఆనందాబ్ధి నోలలాడగలం.

ఆయన తన కల్పనలద్వారా హృదయ స్పందనల నెన్నిటినో కథాత్మకం చేశారు. ఈ మాదిరిగా చేసినవారు లేరు.

ఆయన నవలలన్నీ ప్రణయాత్మకములే అనవచ్చును. ఆయన ఫణితంతా చారిత్రకమైన ప్రేమకథలు టలోనే ఇమిడి యున్నది

బాపిరాజుగారి నవలల్లో గోచరించేది మొదటిగా ఆయన రసపుష్టి గావించిన ప్రేమమూర్తులే. ప్రణయానుభూతి మనిషిని అపూర్వమైన ఊర్ధ్వలోకాలకి గొనిపోతుంది అటువంటి ప్రణయానుభూతిని ఆయన తన రచనలద్వారా చవిచూపిస్తారు.

ఫలాపేక్షనికోరే వ్యాపార సంబంధమైన తుచ్ఛ ప్రేమను చిత్రించటం ఆయన అభిమతంకాదు. స్త్రీయొక్క బాహ్యసౌందర్యానికి, అంతరంగ సౌందర్యానికి మధ్య తాదాత్మ్యత స్థాపించటమే ఆయన ప్రధాన లక్ష్యం. స్త్రీలో దైవిక తత్త్వాన్ని కనుగొనటమే ఆయన ధ్యేయం. ఆయన సృష్టించిన పురుషపాత్రలు స్త్రీలో దేవతారూపాన్ని తిలకించటానికి యత్నించి ఆ దైవస్వరూపాన్ని పవిత్రంగా ఆరాధిస్తాయి. శారీరక సంబంధాన్ని తుచ్ఛంగా భావించి ఆత్మిక సంబంధంవైపు మొగ్గు చూపుతాయి.

ప్రేమలోని ఆధ్యాత్మికతను చిత్రించటమే ఆయన కోరుకొనేది. 'తుపాను' నవలలో భగవంతునిలో పురుష భావాన్ని భక్తునిలో స్త్రీ భావనని ఆరోపిస్తూ ఆయన భక్తిగురించి ఈ విధంగా అంటారు-

"శృంగారరసం కళల్లో ప్రథమస్థానం వహిస్తుంది. సౌందర్యారాధనే శృంగార రసం. ఉత్తమ శృంగారం భక్తి. భగవంతుని అర్చించే భావను మనుష్యునిలో స్త్రీ భావము భగవంతునిలో పురుష భావము ఆరోపించుకునికదా! భక్తియొక్క వికసితభావం సృష్టించుకున్నాడు మనుష్యుడు." (తుపాను, పు 16

ప్రేమయొక్క సాత్త్వికతని ఆరాధిస్తూనే ప్రేమలో తీవ్రతవైపు కూడ ఆయన సౌంజ్ఞ చేస్తూ ఇలా అంటారు-

"ప్రేమ విషం, తక్కువ మోతాదులో పనిచేసే మందు. ఎక్కువైతే ప్రాణం తీస్తుంది విషం. అలాగే ప్రేమ ఎక్కువైతే అది విషమే." (తుపాను పు 32

"ప్రేమ అనేది మానవ జీవితంలో ఒక మహోత్తమ జన్మ స్వభావం. ఆకలి దప్పులలా ఈడు వచ్చిన స్త్రీ పురుషులకి పరస్పర వాంఛ కలుగుతుంది. ఈ వాంఛే జాతివృద్ధికై తోడ్పడేది. ఈ ధర్మానికే, వివాహ కర్మని మానవుడు నిర్మించుకున్నాడు. అది ఒక పవిత్ర యాగమైపోయింది." (అడివి శాంతిశ్రీ పు 132)

అని 'అడవి శాంతిశ్రీ' నవలలో అంటారు.

'హిమబిందు' నవలలో విషకన్యయొక్క చరిత్రను వ్రాస్తూ ఆయన ప్రేమ యొక్క వివిధ రూపాలగురించి పేర్కొంటారు.

ప్రేమించిన వానిని భర్తగా ఆకాంక్షించకపోవటం పురుషుని దైవముగ ఆరాధించటం మొదటిరకం. ఇది మహోత్తమ ప్రేమ అని అంటూ బాపిరాజుగారు ఇటువంటి ప్రేమ సాధించే మృత్యువును జయిస్తుందిఅని అంటారు. నిజంగా విషకన్య ప్రేమ మృత్యువును జయించింది.

ప్రేమించిన వానిని పతిగా కోరటం రెండవరకం. ఇదిఉత్తమ ప్రేమ లక్షణం. హిమబిందు, సువర్ణశ్రీల పరస్పర ప్రేమ రెండవ రకం. ఇది బాహ్యసౌందర్యము పై ఆధారపడి సూటిగా నడచింది.

మూడవరకం సాధారణ సాంసారిక ప్రేమ సంబంధమైనది. నాగబంధునికి, సమవర్తికి ప్రేమ ఈ కోవకు చెందినదే.

(హిమబిందు. పు. 384)

ప్రేమ, వివాహ వ్యవస్థగురించి పేర్కొంటూ బాపిరాజుగారు వివాహమైతేగాని స్త్రీకి, పురుషునికి సంబంధం ఉండకూడదని, ఇది మానవన్యాయం అని అంటారు.

(కోనంగి. పు. 82)

ప్రేమ అనేది లేకుండా కొందరు యువకులు, తల్లిదండ్రులు నిర్ణయించిన యువతులను వివాహం చేసికొని సుఖజీవనం గడుపుతారని, కాని యువకులలో ప్రేమ అనే భావం పుట్టిందా, వారు అంధకార కూపంలోపడిపోతారని, అందుచేత నవయువకులు ఈ ప్రేమకి దూరంగా ఉండాలని; 'అడవి శాంతిశ్రీ' నవలలో నేటి యువతరానికి ఒక సందేశాన్ని అందజేస్తున్నారు.

(అడవి శాంతిశ్రీ. పు. 132)

స్త్రీల విషయంలో బాపిరాజుగారికి కొన్ని ఖచ్చితమైన అభిప్రాయాలున్నాయి.

''స్త్రీ సౌందర్యమే మనుష్యుని ప్రేరేపిస్తుంది. ఆతని చేత ఎంతటి ఉత్తమ కార్యమైనా చేయిస్తుంది, హీనమైన పశువుగానూ తయారుచేస్తుంది.'' అని 'కోనంగి' నవలలో వాపోతారు.

(కోనంగి. పు. 79)

'తుపాను' నవలలో ఆయన సృష్టించిన పాత్ర 'హేమ కుసుమ సుందరి' ఆడవాళ్ళకి అధికారాలు ఇచ్చి శాసన సభికులుగా ఏర్పాటుచేస్తే దేశము యుద్ధాలలోదిగదని వాదిస్తుంది. స్త్రీలు శాంతవతులట, ఆనంద జీవికలట, రసపిపాసలట. అట్టివాళ్ళు లోకాన్ని సౌందర్యంతో నింపుతారట. వాళ్ళ మాతృ హృదయం, యుద్ధపిశాచాన్ని లోకంలో లేకుండా తరిమివేస్తుందట. స్త్రీని అనాదిగా పురుషుడు అణగిద్రొక్కి ఉంచాడని లేకపోతే స్త్రీలు యుద్ధంచేసేవారని. ఏ విషయంలో నైనా స్త్రీ పురుషులు సమానులే అని వాదిస్తుంది.

ఇది బాపిరాజుగారి భావమే అయినప్పటికి ఎవరిదోషం వారే అనుభవిస్తున్నారని, ఆడవాళ్ళు నీరసులవటంవలన మొగవారు అధికారం చెపట్టారని, పురుషుని అని లాభం లేదంటారు.

(తుపాను. పు. 81)

నవలల్లో అక్కడక్కడ స్త్రీల సంకుచిత మనస్తత్వం గురించి వర్ణిస్తూ, వేరొకచోట స్త్రీలను ఉత్సాహ పరచటంలోనూ, పురుషులతో సమానంగా జాతీయ జీవనంలో పాలుపంచుకోమని ఉద్బోధచేయటంలోనూ బాపిరాజుగారిది అందెవేసిన చెయ్యి. అందుకే 'జాజిమల్లి' నవలలో 'శ్రీపతి' అనే పాత్రద్వారా ''ఆడవాళ్ళుకూడా ముఖ్యంగా జాతీయ జీవనంలో పాలుపుచ్చుకోవాలని స్వాతంత్ర మహాయుగ ప్రారంభంలో భారతీయాంగనలు తమ మహోత్తమ కర్తవ్యం నిర్వర్తించటానికి సిద్ధంగా ఉండాలని అనిపిస్తారు.

(జాజిమల్లి. పు. 69 71)

'స్త్రీ' యెడల బాపిరాజుగారిది పూజ్యభావం. స్త్రీ ఉద్ధరణ కొరకు ఆయన నవలల్లో ఒక విశిష్ట ప్రణాళిక రూపొందించ బడింది. స్త్రీని దయనీయస్థితినుంచి ఉద్ధరించి పురుషులతో సమానమైన స్థితివరకు చేర్చటానికి ఆయన ప్రయత్నం సాగించారు. ఆయన స్త్రీ జనోద్ధరణ ఎంతవరకు వెళ్ళిందంటే– ''ఏనాటికైనా పతితుడు కాబోయే పురుషునికి స్త్రీయే చేయి అందిస్తుంది అని, స్త్రీ పట్టి బిడ్డలుకనే పశువనుకున్న ప్రతి పురుషుడు కూపాంధకారమైనటువంటి పరమ దౌర్భాగ్య కూపంలో కూలిపోతాడు.'' అని స్త్రీలను నీచంగాచూసే వాళ్ళని నిమ్నస్థితిలో ఉంచటానికి ప్రయత్నించే పురుషులని 'జాజిమల్లి' నవలలో కసితీరా శపిస్తారు.

(జాజిమల్లి. పు. 173)

బాపిరాజు గారి శైశవమంతా గోదావరీ తీరాన గడిచింది. ఆయనపై గోదావరి, పాపికొండలు, పట్టిసం ప్రాంతాల ప్రకృతి శోభల ప్రభావం లేకుండా పోలేదు. అంతేగాక అస్వాల్డు కూల్డ్రేగారు బాపిరాజు గారికి గోదావరిలో ఈదటమే గాక, ప్రకృతి యొక్క నిసర్గ సౌందర్యాన్ని ఆస్వాదించడం ఎలాగో నేర్పారు. బాపిరాజుగారిలో నిద్రాణమై ఉన్న కవిత, చిత్రకళలను గురించి మేల్కొల్పడానికి ఇవే కారణ భూతాలయాయి. వారు రసజ్ఞ చిత్రకారు లవటానికి ప్రకృతి ఎంతయో దోహదం చేసింది. అందుచేతనే ఆయన నవలల్లో ప్రకృతి రమణీయత హృద్యంగముగ చిత్రించబడింది.

ఆంధ్ర ప్రజలలో కళాతృష్ణను పెంచవలెననే తపనతో ఆయన ఎంతో శ్రమించారు. ఆయన నవలల ద్వారా కళా మహిమను గానం చేశారు. ఆధునిక సాహిత్యకారులలో ఇటువంటి బహుముఖ ప్రజ్ఞాశాలి, కళాకారుడు, సాహిత్యకారుడు, బహుశ అవతరించ లేదేమో. ఆయన కుశల చిత్రకారుడు. శిల్పకారుడు, సంగీతకారుడు అవటం వలననే కాబోలు ఆయన పాత్రలన్నిటికి కళాపిపాస అబ్బింది.

''కళలన్నీ భక్తిరూపాలని, కవిత్వం సాలోక్యమని, చిత్రమూ, శిల్పమూ సారూప్యమని, సంగీతం సామీప్యమని, నాట్యం సాయుజ్యమని'' నమ్మి ఆ కళాపోషణలో తనని తాను మరచిపోయేవారు రాజాగారు.

(జాజిమల్లి పు. 156)

సముపార్జన నిమిత్తం ఉద్భవించాయని, ఆ రకపు ఆనందం, లలితకళానందం అవి యిది పూర్తిగా మనుష్యుని సౌందర్యారాధనా గుణం పై ఆధారపడివుందని 'తుపాను' నవలలో వక్కాణిస్తారు

(తుపాను పు. 159)

"రాజా గారిది కళాహృదయం. జమీందారులు, రాజుల కాలంలో కళానేత్రుల పోషణ, కళల పోషణ జరిగింది. కాని ప్రజా ప్రభుత్వం రావటంలో ఆ రాజ్యాలు, జమీలు పోయి కళాపోషణకూడా అడుగంటి పోయింది. ఈనాడు కళలను పోషించే దాత కూడా లేకపోయాడు" అని కళలకు పట్టిన ఈ దుస్థితిని చూడలేక, సహించలేక రాజా గారు ఆ నాటి ప్రభుత్వాన్ని నిందించటానికికూడా వెనుదీయలేదు. అది ఆయన కళాప్రేమ. కళాభివృద్ధికి ప్రభుత్వం దోహదం చెయ్యాలనీ ఒక కళాకారునిగా 'జాజిమల్లి' నవలలో ప్రభుత్వాన్ని అర్థిస్తారు.

(జాజిమల్లి. పు. 74)

ఆంధ్రులన్న రాజా గారికి అమిత గౌరవం. అందుకే ఆయన 'నారాయణరావు' నవల చివరన 'ఆంధ్ర నవ కవుల కూటమి'ని ఏర్పరచి కవులను గౌరవిస్తారు. కవులన్నా, గాయకులన్నా, చిత్రకారులన్నా, ఆయనకి తగని ఆపేక్ష, అభిమానం. నాటి భారతదేశంలో ప్రముఖులైన కళాకారుల పేర్లు గౌరవంతో ఉచ్చరిస్తారు. వారిలో శాంతినికేతనానికి చెందిన నందలాలుగారు, కలకత్తాలోని అవనీంద్ర ఠాకూరు లక్నోకి చెందిన అసిత కుమార హల్దారు, రాజమండ్రికి చెందిన వరదా వెంకటరత్నంగారు, విశాఖపట్టణానికి చెందిన తలిశెట్టి రామారావు గారు మొదలగు చిత్రకారులు, ఆంధ్ర కవులయినటువంటి రాయప్రోలువారు, విశ్వనాథ వారు, తల్లావఝులవారు, కురుగంటి వారు, దేవులపల్లివారు, వేదులవారు, నండూరివారు, కాటూరి వారు, మునిమాణిక్యంగారు, మల్లంపల్లివారు మొదలగువారు ప్రముఖులు.

(నారాయణరావు పు. 279)

ఆంధ్రదేశంలో శిల్ప, చిత్రకళలు అధోగతిలో ఉన్నాయని, అవి పునరుద్ధరించటం తన ధర్మమని తలచారు రాజాగారు. దామెర్ల రామారావు ఉత్తమ పురుషుడని, ఆతను ఆంధ్ర సంప్రదాయం పునరుద్ధరింప ప్రయత్నించాడని, ఆ ప్రయత్నంలో కొంతవరకు జయం పొంది ఆంధ్రుల దురదృష్టం వలన సిద్ధి లభించకుండానే అవతారం చాలించాడని 'తుఫాను' నవలలో 'త్యాగతి' ద్వారా బాధపడతారు.

(తుఫాను. పు. 167)

అదే నవలలో ఆయన పాశ్చాత్య కళల దృష్టి కోణాన్ని కూడ ఈ విధంగా స్పష్టం చేస్తారు— "పాశ్చాత్య కళ ఎప్పుడూ నూతన మార్గాలు అనుసరిస్తూ ఉంటుంది. పాశ్చాత్యుల కళ దినదినమూ, మార్గం అధిగమించినకొలదీ వృద్ధి అవుతున్న కళ. ప్రకృతిని సరిగా అనుకరించాలన్న ప్రయత్నంతో వివిధ విధానాలు వచ్చాయి. అవే భౌతిక సత్యవాదం (రియలిజం), మూలసత్యవాదం (ఇంప్రెషనిజం) అఖండ మూలసత్యవాదం (పోస్ట్ ఇంప్రెషనిజం) అతివాస్తవికత (సర్రియలిజం) మొదలైనవి అని అంటారు.

(తుఫాను. పు. 166)

భారత చలనచిత్ర కళాచరిత్రలో ప్రథమ ఆంధ్ర కళా దర్శకులు అయినటువంటి బాపిరాజుగారికి నేటి సినీప్రపంచం గురించి భిన్నాభిప్రాయాలున్నాయి. 'కోనంగి' నవలలో ఆయన సినీకళగురించి వ్యాఖ్యానిస్తూ— "కళాప్రేమ ప్రణయసంబంధమైన భావనలలో ఉత్తమమైనది. సినిమాకళ సామాన్యమానవునికి సన్నిహితమైంది. ఆ కళ ద్వారా మనిషి ప్రగతిశీల భావనలని అర్థంచేసికోగలిగితే అతనికి మేలు జరుగుతుంది. కొన్ని విదేశీచిత్రాలు ఆనందమే జీవిత పరమావధన్న లక్ష్యంవైపు మనిషిని లాక్కువెళ్ళటానికి ప్రయత్నిస్తున్నాయి. ఈ కారణం వలననే మనిషి సర్వనాశనమయిపోతున్నాడు. అటువంటివ్యక్తి పిరికివాడయి జీవితంనుంచి పారిపోవటానికి ప్రయత్నిస్తున్నాడు. పలాయనవాది అయిపోతున్నాడు—" అని అంటారు. (కోనంగి.పు.107)

ఆధునిక యుగంలో కళలకి పట్టిన దుర్గతిని చూచి కళాభిమాని అయిన రాజాగారి హృదయం తల్లడిల్లింది. నేటి మలినమైన సామాజిక పరిస్థితిని చూచి, కళాతపస్విలకు జరుగుతున్న అన్యాయం చూచి ఓర్వలేక తన-అక్కసు అంతా 'జాజిమల్లి' నవలలో నరసింహం మేష్టారు ద్వారా వెళ్ళగక్కుతారు— "తెలుగుతనం లేని పిచ్చి పాటలు కోరే లోకానికి కళాయుక్తమై పరిపూర్ణ సౌందర్యరూపమైన తన ఆంధ్రబాణి ఎవరికి అవసరం గనుకనూ! దేశం నీచస్థితిని పొందినప్పుడు కళకూడా నీచస్థితిని పొందుతుంది. కవులు నిరసించారు, గాయకులు నిరసించారు—" అని.

కొంతకాలం సినిమారంగంలో పనిచేసి అక్కడివాతావరణంపై అసహ్యం, రోతకలిగిన బాపిరాజుగారు ఆ రంగాన్ని దుయ్యబట్టుతారు కూడా!

"ఏమిటీ సినీ ప్రపంచం? నీతినియమాలకూ. ఈ ప్రపంచానికి ఎక్కడా చుట్టరికమేలేదా? సినిమాలోకం సుడిగాలిలోకం. 'అతి' అనేది తప్ప ఇంకోటి కనపడదు. ఆ వాతావరణంలో స్త్రీ పురుష సంబంధాలకు ఒకదారీ, మార్గములేదు. ఒకహద్దూ, పద్దూ లేదు. ఈ సినిమా వాతావరణం ఇతరమైన జీవితపథాలకు కూడా ప్రసరించి, దైనందిన నిత్యజీవితాన్నికూడా కల్మషం చేస్తున్నది.—" అని అదే నవలలో వాపోతారు. (జాజిమల్లి.పు.101)

ప్రకృతిలో పరవశించిన బాపిరాజుగారికి ఆ సినీ వాతావరణం, మద్రాసుపట్టణ వాతావరణం నచ్చలేదు. నేటి పట్టణవాసంలో ఉన్న దుర్గంధతని బాపిరాజుగారు అదే నవలలో ఈ కొద్ది మాటల్లో తేటతెల్లం చేశారు— "నల్లబజారు నాయకులు, మాయా బజారు సినిమాలు, మాయారంభలైన తారలు, గారడీ వాండ్రైన గాయకులు, చాలయ్యా మదరాసు!" అని అసహ్యించుకుంటారు.

(జాజిమల్లి. పు 74.)

ప్రతి సాహిత్యకారుడు మొట్టమొదటగా సామాజిక ప్రాణి.

కల్పనామయ ప్రపంచంలో ఉండి వాస్తవాన్ని గుర్తించలేనివాడు. నిజమైన సాహిత్యస్రష్ట కానేరడు. తోటిమానవుల యెడ దయ. తోటివారిని ఉద్ధరించాలనే ఆకాంక్ష ఉన్నవ్యక్తి, సంఘంలో ఆదరణ పొందగలడు. మానవ హృదయాన్ని చూరగొనగలడు. బాపిరాజుగారు కూడా ప్రజలహృదయాలని చూరగొన్న వ్యక్తే. ఆయన సమాజం నుంచి పారిపోలేదు.

'రాజకీయాలు, సంసారం, ఉద్యోగం, పలుకుబడి, దైనందిన వ్యవహారిక విలువలు, వీటన్నింటితో నిమిత్తం ఉండాలి. కాని, వీటికి లొంగిపోకుండా, దూరంగా ఉండి మరో ప్రపంచాన్ని సృష్టించుకుని వ్యక్తిగతంగా పరిపూర్ణమైన తీక్షణమైన ఆనందాన్ని అనుభవించడం — అదీ వీరి దృక్పథం. సున్నితమైన అనుభవం, సౌందర్యం, అన్వేషణతో ముడిపడని స్వేచ్ఛ, స్వచ్ఛమైన ఆనందం, ఇవీ వీరుకల్పించుకునే మరో ప్రపంచానికి పునాదులు. ఇది పూరికే వ్యూహించుకున్న జగత్తా లేక నిజంగా యిట్లాంటి వాతావరణంలో వుండి, వ్యక్తిగతమైన విలువలని సాధించారా? అనే ప్రశ్న వస్తుంది. యిరోపా సారస్వత రంగంలో 'గెథే' సంఘాన్ని చివరిదాకా పట్టుకుని ప్రాకులాడాడు. అమెరికాలో 'వాల్ట్ విట్ మన్' దూరంగా పారిపోయాడు. బాపిరాజుగారు ప్లీడరీ వృత్తిని వొదిలేసినా, సంఘంనుంచి పారిపోలేదు. సంఘంలో ఉండే, తన నూతన కల్పనా జగత్తుని సృష్టించుకోవటంలో సఫలురయ్యారు అని 'జీవితంపట్ల బాపిరాజుగారి దృక్పథం' అన్న వ్యాసంలో బుచ్చిబాబుగారు పేర్కొంటారు.

నేటి సమాజంలోని జాతిగత సంకీర్ణత బాపిరాజుగారి మనసుని కలవరపెట్టింది. ఈ జాతి ద్వేషాన్ని రూపుమాపటానికి భిన్న జాతుల మధ్య సామూహిక పంక్తి భోజనాలే ఒక సాధనమని ఆయన తలంచారు. భిన్న జాతీయ సామూహిక భోజనపద్ధతి, తథా వివాహబంధనాల ద్వారా విభిన్న జాతులమధ్య సంబంధ బాంధవ్యాలనిస్థాపించగలమని, ఇది భావితరాల ఐక్యతకి దోహదకారి అని ఆయన నమ్మకం.
ఈ సమస్యను గురించి ఆయన నవలల్లో అనేక సందర్భాలలో చర్చించి, పలువిధాలుగా పరిష్కారమార్గాలకై అన్వేషించారు.

మనుషులంతా ఒక్కటే అని, సమాజంలో అందరికి సమాన ప్రతిపత్తులు సాధించగలిగిన నాడే సమాజ కల్యాణం సంభవమని అదే నిజమైన సోషలిజమని ఈ భావనకి రూపకల్పన 'రష్యన్ బోల్షివిజమ్' లోనే సంభవం అని ఆయన గట్టిగా నమ్మారు. రష్యాలో ప్రతి మనుష్యుడూ పైకి వెళ్ళడానికి వీలుంది. ఆ మహత్తు 'బోల్షివిజం'లోనే ఉందని ఆయన 'నరుడు' నవలలో అంటారు.

(నరుడు.పు. 32)

దేశంలోని ఆస్తి అంతటను ప్రజలందరూ సమంగా అనుభవించినప్పుడే దేశం సుభిక్షంగా ఉంటుందని ఆయన అంటూ ఉంటారు. (నారాయణరావు.పు.288)

ఆయనలో శ్రీ శ్రీ లాగ హింసావాదంతోకాక గాంధీ జాతీయ వాదంతో ఏదో నూతనయుగాన్ని భారతదేశానికి అర్పించాలని కోరిక ఉంది. కోనంగిరావు యొక్క ఈ పాటలో ఆ కోరిక స్పష్టమవుతుంది —

హే చ్యుతగ్నులకు మెచ్చని హృదయము
స్వచ్ఛ మార్గములు గడిచే యుగము,
పురుషులు స్త్రీలకు ఒకటే ఒకటని
బీదల బాధలు బిచ్చమెత్తుటలు
నాదిది, నీదది యన్న వివాదాలు
లేని యుగమ్మది అదిగో తూర్పున
వచ్చుచున్నగను విజయ గీతమును
హే ప్రస్వాయిలో ఎత్తే గొంతుక
ఎక్కడ, ఎక్కడ అన్న కాంక్షలో
ప్రపంచమందో మహా బాధమన
విపంచి తీగల మ్రోగుచున్నదే! (కోనంగి. పు 374)

అస్వస్థమై ఉన్న ఆనాటి ప్రజాప్రభుత్వంలోనున్న లోటుపాట్లను నిశిత దృష్టితో విమర్శించటంలో దిట్ట ఆయన. నాటి ప్రజాప్రభుత్వంలో పట్టి ఉన్న కులమతాల జాడ్యాన్ని దృష్టిలో ఉంచుకొని తన 'జాజిమల్లి' నవలలో రాజుగారు ఈ విధంగా విమర్శిస్తున్నారు— ''ఈ దేశంలో ప్రభుత్వం కులతత్వ ప్రభుత్వం — తక్కిన దేశోద్ధారక ప్రణాళికలన్నీ కులతత్వ రాక్షసి కడుపులో ప్రణాయా స్వాహా అయిపోతున్నాయి. ఈ ప్రజా ప్రభుత్వాలకు మాటలు జాస్తీ, చేతలు నాస్తీ'' అని. (జాజిమల్లి. పు. 73, 74)

ఆయనకి కులభేదాలంటే నచ్చదు. అందుచేతనే ఆయన అసలు కులం తేడాలేమిటని ప్రశ్నిస్తూ 'జాజిమల్లి' నవలలో ఇలా అన్నారు— ''ఏ విధంగానూ గోడలు కట్టని మూడు ముఖ్యమైన కులాలు వేదకాలంలో ఉండేవంటారు. వారి మధ్య సంబంధ బాంధవ్యాలుండేవి. కానీ సంఘర్షణల వలన కులాలు ఉద్భవించాయని ఆయన భావం''.

'నరుడు' నవలలో ఈ సమస్య గురించే చర్చిస్తూ కులతత్వం మానవజాతిలోనే ఉందని, మానవ జన్మలో భగవంతుడేర్పరచిన మెట్లు; ఇతర మనుషులో, చుట్టాలో, స్నేహితులో; దయ గలవారో ఏర్పరచిన మెట్లు, స్వయంగా తనకుతానే ఏర్పరచుకున్నమెట్లు, అని మూడు రకాల మెట్లున్నాయని ఆయన అంటారు.

(నరుడు. పు. 34)

కులమత భేద భావాలని రూపుమాపడానికి నడుం కడుతూ అదే నవలలో ఈ మాల మాదిగలకి మోక్షంలేదా ? వాల్మీకి తప్పు చేస్తే ఈలాంటి శిక్ష పడిందని వాపోతారు. ఈవిధంగా ఆ జాతి బలం తగ్గిపోవటానికి బలం గల జాతి యొక్క పొగరే దానికి కారణం అని అంటారు. (నరుడు. పు. 27)

నేటి సమాజ స్థితిని తీక్షణంగా విమర్శించటంలో దిట్ట ఆయన. వీరేశలింగంగారు ఆంధ్రదేశ నాయకమణిగా ప్రఖ్యాతి వహించి, ప్రసిద్ధమైన కార్యాలు చేశారని, అయితే ఇప్పుడేమైనా పని జరుగుతుందా అని నారాయణరావు నవలలో ప్రశ్నిస్తారు. ఆయన ఏవి తప్పులని గొడ్డలి పెట్టుకు కొట్టారో, అవన్నీ మొలకెత్తాయి. పదిరెట్లు విజృంభించాయి. ఆయన మొదలుపెట్టినవి ఆయనతోటే నశించాయి అని అంటూ నేటి ప్రముఖ సమస్య అయినటువంటి వరకట్న సమస్యను పేర్కొంటూ కట్నాలు మానిపించే మహానుభావులెవరైనా ఉన్నారా? అని గుండెధైర్యంతో ప్రశ్నించే అభ్యుదయవాది బాపిరాజుగారు. (నారాయణరావు. పు.265)

రామమోహనరాయ్, కేశవచంద్రసేను, దయానంద సరస్వతి, రామకృష్ణ పరమహంస, వివేకానంద, విద్యాసాగరుడు, నాడు గాంధీగారు- ఇది తప్పు అని ఖండిస్తూ ఉండటం, ఒకళ్ళో, ఇద్దరో అలా నడుచుకోవటం; 'అంతేగాని నేడు వాటిని ఎంతమంది ఆచరిస్తున్నారు అని అదే నవలలో నేటి ప్రజానాయకులను సవాలు చేస్తూ ఆత్మ పరిశీలన చేసుకోమని భావగర్భితంగా సందేశం ఇస్తున్నారనుకుంట. (నారాయణరావు. పు. 265)

బాపిరాజుగారిది విప్లవాత్మకమైన హృదయం. ఆయనకి భగవంతుడు అంటే నమ్మకం లేదు. భగవంతుడే ఉంటే దేశంలో ఇటువంటి ఘోరాలు ఎందుకు జరుగుతున్నాయని అంటారు. భారతీయులలో మూఢ నమ్మకాలు, కులభేదాలు, యజ్ఞోపవీతాలు, మొక్కుబళ్ళు, పూజలు, యాత్రలు తీర్థాలు, కుంభమేళాలు, పుష్కరాలు మొదలైనవి నాశనం కావాలని, వాటిని నాశనం చేయటానికి 'కెమల్ పాషా' వంటి మహానుభావుడు హిందూమతానికి కావాలని 'తుపాను'లో ఆకాంక్షిస్తారు. (తుపాను.పు.92)

భారతీయ సంస్కృతి అంటే ఆయనకి మితిలేని గౌరవం, ప్రేమ. అలాగే దేశభక్తి ఆయన నరనరాల్లో ప్రవహిస్తుంది. ఆయన నవల్లోని అత్యధిక పాత్రలు దేశభక్తి చేత ప్రేరేపించబడ్డాయి. ఆయన పాత్రలు కొన్ని విదేశాలకి కూడా వెడతాయి. అయినప్పటికి మన దేశ సంస్కృతి యొక్క గుణాలనే గానం చేస్తూ ఉంటాయి. విదేశాల నుంచి తిరిగి వస్తూ "నారాయణరావు" నవలలోని రామచంద్రుడు భారతదేశం గురించి కన్నకలలు, ఆ తల్లి యొక్క గొప్పతనము కొనియాడు విధానమే దానికి నిదర్శనం- "వందేమాతరం, సుజలాం సుఫలాం, మలయజ శీతలాం, సస్యశ్యామలాం, మాతరం, వందే మాతరం" అని ఆయన భారతావనికి ప్రణమిల్లుతారు.
(నారాయణరావు,పు.376)

పరాయిపాలనలో ఉన్న మనదేశ దౌర్భాగ్యపు స్థితికి ఆయన అల్లల్లాడిపోయే వారు. దేశబానిసత్వాన్ని రూపుమాపటానికి స్వతం

ప్రోద్యమంలో పాల్గొని గాంధీగారి అనుయాయులు అయ్యారు ఆయన గాంధీగారంటే భక్తివిశ్వాసాలు మెండు. గాంధీగారిని అపర బుద్ధావతారమంటారు ఆయన. అందుకే 'జాజిమల్లి' నవలలో తానే 'వెంకట్రావు' రూపుదాల్చి ఆ అవతార పురుషుని విగ్రహం యెదురుగా నిలిచి-"ఓ ప్రభూ! నువ్వు ప్రేమ సముద్రానివి! ఓ పరమ కరుణామూర్తి! నీ బ్రతుకే ఒక ధర్మ విశ్వం" అని ప్రణమిల్లుతారు. (జాజిమల్లి.పు 173)

ఆధ్యాత్మిక యుగపురుషుడయిన మహాత్మాగాంధీ వ్యక్తిత్వం గురించి అర్థం చేసుకోవటం బాపిరాజుగారికే కష్టమయింది. ఆయనకే కాదు, సమస్త జనతకి కూడా ఆయనని అర్థం చేసుకోవటం దుస్తరమే అని ఆయన భావం. ఇదే భావాన్ని తుపాను నవలలోని 'త్యాగతి' ద్వారా ఈ విధంగా వ్యక్తం చేస్తారు- "హిమాలయాల గురించి వాదనవస్తే ఎంతో మహాత్ముని గురించి వచ్చినా అంతే. ఆధ్యాత్మికమైన మనదేశంలో ఆధ్యాత్మిక పురుషుడైన గాంధీగారినిఅర్థం చేసుకోవటం కూడా కష్టమే" అని. (తుపాను పు.33)

గాంధీగారిని భగవంతుని రూపంగా ఎంచి 'కోనంగి' నవలానాయకుడు కాంగ్రెసు జండా గాలిలో ఎగురుతూ ఉండగా క్విట్ ఇండియా, కాంగ్రెస్ జిందాబాద్! మహాత్మాగాంధీజీకి జై అని నినాదాలు-

జయజయగాంధీ, జయజయ లోకగురూ
సత్యము ధర్మము చంపిన లోకము
నిత్యసదార్థము ఎరగని లోకము
అమృత నినాదము నీజయనాదము
ఆలకించుతూ ఆనందమయ్యె!
జయజయగాంధీ.........

అని గానం చేస్తాడు. (కోనంగి. పు. 346)

వివిధ శాస్త్రీయ, సామాజిక విషయాలలో ఆయన ప్రకాండ పండితుడు. అలోపతి, ఆయుర్వేద వైద్య శాస్త్రాల్లో, జ్యోతిష, సాముద్రిక శాస్త్రాల్లో గంటలతరబడి చర్చ చేయగల సమర్థుడాయన. 'హిమబిందు' నవలలో 'శ్వేత పన్నగి' గురించి చర్చించటానికి ఆయన జ్యోతిష శాస్త్ర గ్రంథాల విశేష అధ్యయనం చేశారు. చంద్రబాలను విషకన్యగను, విషకన్యను అమృత బాలగను మార్చడంలో ఆయన యొక్క ఆయుర్వేదశాస్త్ర జ్ఞానం, ప్రతిభ ప్రకటితమవుతాయి. 'గోన గన్నారెడ్డి' నవలలో అశ్వ హృదయాన్ని ఆయన గుర్తించిన విధంగా వేరొకరు గుర్తించలేరేమో. అదేవిధంగా యుద్ధనీతి విశారదుడు కూడా ఆయన. ప్రపంచములో, ముఖ్యముగ భారతావనిలో పలు ప్రాంతాలలో లభ్యమగు పూలు, పళ్ళు, వృక్షముల సంబంధమైన జ్ఞానం ఆయనకి అపరిమితం.

ఇన్ని రంగాలలో ప్రవీణుడు కాబట్టి, ఆయనకి మన విద్యావిధానం నచ్చలేదు నాటి క్రైస్తవ విద్యాలయాల ముఖ్యోద్దేశము కిరస్తానీ మతాన్ని విస్తృతంగా లోకంపై చల్లడమేగాని నిర్మల విద్య అక్కడ దొరకదని 'నరుడు' నవలలో అంటూ, అయినా నేడు నిర్మల విద్య ఎక్కడ దొరుకుతుంధని ప్రశ్నిస్తున్నారు. (నరుడు. పు. 7)

"మనదేశంలో నిజమైన విద్యాదీక్షకు తావు లేదని, మనదేశంలోని చదువంతా గుమాస్తాలను తయారుచేసే చదువని, దానికి తగిన విషయ ప్రణాళికే పరీక్షలకు నిర్వర్చారు" అని 'నారాయణరావు' నవలలో బాధపడతారు. (నారాయణరావు పు. 41)

ఆయన చిత్రాలు, రచనలు-వీటికంటె గొప్పవారు బాపిరాజుగారు. హృదయంగల మానవతత్వవాది. జీవితం అనుక్షణంపొందే పరిణామాన్నిచూసి ముగ్ధుడై, ఆశ్చర్యంతో వాణికిపోయి, ఆప్యాయతతో ఎవరి భుజాన్నో తట్టడానికి, తిరుగాడే యాత్రికుడు. జీవితం ముసలమ్మలా మూలుగుతుంటే అందంగా మూలగమంటారు. ప్రేమహృదయం పగిలి ముక్కలైపడితే, ఆ ముక్కల్ని ఏరి ఒక పద్ధతిలో కళానుగుణంగా పేర్చి ఆ దృశ్యాన్ని చూడమంటారు. కన్నీటి బిందువుదగ్గర చెవిపొంచి గానంకోసం ఆసక్తిగా వింటారు.

"ఆయన నిరంతరయువకుడు. ఎప్పుడూ ఆనందంతో వూహాల్లో స్వేచ్ఛగా విహరించడం, ప్రయోజనంతో ప్రమేయం లేని సౌందర్యాన్ని అన్వేషించడం, అనుభవాన్ని పంచిపెట్టడం, కష్ట సమయంలో ప్రేమతో భుజం చరచడం- ఇదీ బాపిరాజుగారు జీవితం పట్ల అలవరచుకున్న దృక్పథం. ఈ దృక్పథం సమాజానికి అవసరం. దీన్ని వ్యక్తపరచి, ప్రచారంచేసిన బాపిరాజుగారిలాంటి వ్యక్తులకి మనం కృతజ్ఞులం" అంటారుబుచ్చిబాబుగారు తమ వ్యాసంలో
(వ్యాసం పేరు-జీవితంపట్ల బాపిరాజుగారి దృక్పథం, కులపతి.)

అటువంటి మహామనీషి, మధురమూర్తి, కులపతి 1952 సం. సెప్టెంబరు 22వ తారీఖున ఆధునిక ఆంధ్రవాఙ్మయానికి తీరనిలోటు కలుగచేస్తూ దివంగతుడయినాడు. సాహిత్యవేత్త, అమృత హృదయుడు ఇకలేడు. కాని ఆయన ప్రసాదించిన సాహిత్య సంపద ఆయన్ని మన హృదయాల్లో చిరంజీవిగా నిలిపింది. ఆయన పరమపదించి నేటికి సుమారు 24 వత్సరాలు పూర్తయినాయి. ఆంధ్రులకు ఆయన ఒనర్చిన సాహిత్య కళాసేవకు తార్కాణంగా ఆయన పేరు సాహిత్య జగత్తులో చిరస్థాయిగా ఉండిపోయేటట్లు చేయటానికి స్మృతి చిహ్నంగా ఒక కళాసంస్థని నెలకొల్పడంగాని, 25 సంవత్సరాలు పూర్తయిన తరువాత నయినా అయన నామం చిరస్థాయిని చేసుకోవటానికి ప్రయత్నించడంగాని మన ఆంధ్రుల కనీసధర్మం. విజయవాడ రేడియోస్టేషన్‌కి ఒకప్పుడు ఆయన అడ్వైజరుగా పని చేశారు గనుక ఆయనపేర సాహిత్య కళాసమావేశములు ఏర్పాటు చేయటానికి వారు కృషిచేసే, అది ఎంతయో ముదావహం. అమర కళాకారుడయినటువంటి బాపిరాజుగారికి ఇవే మా నివాళులు.

తేవారం త్రయం కాలం

శ్రీ బి. జి. ఎల్. స్వామి

(గత సంచిక తరువాయి)

"బయటి" సాక్ష్యం సమీక్ష

4. 7వ శతాబ్దంలో పల్లవ, చోళ దేశాలు

పళ్ళన్ కోవిల్ తామ్రశాసనం లో—విజయసింహవర్మ (అంటే పల్లవ రాజసింహవర్మ) 6వ రాజ్యవర్షంలో వేయించబడింది; ఈ శాసనంలోని సంస్కృతభాగం అతని కొడుకు సింహవిష్ణువు—"కవేరు కుమార్తె మాలగా; వరి పొలాలు, సారవంతమయిన చెరుకు క్షేత్రాలు, తాటితోపులు, అరటి తోటలు మొదలయినవి ఒడ్డాణంగాకల చోళ దేశాన్ని జయించాడు" అని చెబుతుంది (5వ పద్యం, టి. వి. ఎస్ విస్. ఐ., 1959, పేజి 81.) ఇదే శాసనంలోని తమిళభాగం ఈ సమాచారాన్ని ఇవ్వదు, నందివర్మ II పల్లవ మల్ల 22వ రాజ్య వర్షంలో (క్రీ. శ. 753) వెలువరించబడిన కాసకుడి తామ్రశాసనంలో సింహవిష్ణువు చోళదేశాన్ని జయించటాన్ని గురించి యథాతథంగా చెప్పబడుతుంది. వేళూర్పాళయం తామ్రశాసనాలు (ఎస్. ఐ. ఐ. II నెం. 73) విజయనందివర్మ (నందివర్మ III) ఆరవ రాజ్యవరంలో చెక్కించబడినవి— వీటిలో ఇదే విజయాన్ని పేర్కొనటం జరుగుతుంది. "అతను (సింహవిష్ణువు) కవేరుడి కూతురి చేత అలంకరింపబడిన, వరి (పొలాల) అడవులు ఆభరణాలు అనతగిన చోళదేశాన్ని—ఎక్కడయితే స్నిగ్ధమయిన పోక (చెట్ల) తోపులు కలవో ఆ చోళ దేశాన్ని — జయించాడు" (ఎస్. ఐ. ఐ. II నెం. 98) ఈ రాగి రేకులలో కనిపించే దేశం వర్ణనే పళ్ళన్ కోవిల్ రేకులలోని వర్ణనకి ఇంచుమించు నకలు అని గమనించవచ్చు. దీనినిబట్టి వేళూర్పాళయం శాసనం రచయిత సమాచారం మొత్తాన్ని పళ్ళన్‌కోవిల్ రేకులనుంచి గ్రహించి ఉంటాడని అనుమానించవచ్చు. మూడు రాగి రేకులలో ఉన్న సమాచారాన్ని స్వతంత్ర సాక్ష్యంగా స్వీకరించలేమనికూడా గమనించాలి—అది ఒక ఆధారంయొక్క పునరుక్తి మాత్రమేనని గ్రహించాలి. ఈ ఆధారం పళ్ళన్ కోవిల్ దానమే.

బుద్ధవర్మ "చోళ సైన్యంపాలిటి బడబా నలం" అని వేళూర్పాళయం రేకులు చెబుతాయి. ఈ పల్లవరాజు 4, 5 శతాబ్దాల (క్రీ. శ.)లో జీవించినట్లు నమ్మబడుతోంది. ఈ [illegible]ను ఎవరో స్పష్టంగా తెలియదు, ఇంతకన్నా అతనినిగురించి సమాచారం ఏమీ తెలియదు.

తిరుచి గుహాశాసనం (ఎస్. ఎస్. ఐ., I, నెం. 33, 34) అక్కడి కొండ "చోళదేశానికి చూడామణి వంటి" దని చెబుతుంది. "భూమిమీద ఒక గుడిలో నుంచుని చోళుల గొప్పబలాన్ని కాని కావేర (కవిర) నదిని ఎలాగచూడగలను ?" అన్న ప్రశ్నకి "గుణభరరాజు ఈ పర్వతాలయాన్ని ఇచ్చాడు" అని సమాధానం చెబుతుంది.

ఈ శాసనాలని మొట్టమొదట పరిష్కరించిన హుల్‌ట్‌జ్ ఈ రాజు ఎవరో చెప్పలేదు. "రెండు స్తంభాలమీది శాసనాలూ మామల్లపురం, కాంచీపురం వాటిని గుర్తుచేస్తాయి" అని మాత్రం అంటాడు. అందువలన "బహుశ గుణభరుడు చోళదేశాన్ని ఏలిన పల్లవరాజు అయి ఉండా"లని అంటాడు. వెంకయ్య (ఎ. ఇ. III నెం 38 a) ఈ గుణభరుడే మహేంద్రవర్మ I అయి ఉండవచ్చునని సూచించాడు. ఆయన చెప్పే కారణాలు—

1. గుణభరుడి బిరుదులలో సత్యసంధ, శత్రుమల్ల, పురుషోత్తమ అన్నవి తిరుచ్చి శాసనంలో పేర్కొనబడగా గుణభర, శత్రుమల్ల బిరుదులు వల్లమ్‌శాసనం (ఎస్. ఐ. ఐ. II నెం 72) లో కూడా పేర్కొనబడుతాయి. (గుణభరుడన్న పేరు ఆరాజుకి ఉండే అవకాశం తక్కువ.)

2. పెరియ పురాణం ప్రకారం తిరుజ్ఞాన సంబంధర్ సిరత్తొండనయనార్‌ని సందర్శించుకున్నాడు కనుక వీరిద్దరూ సమకాలికులు అయిఉండాలి. తిరుజ్ఞాన సంబంధర్, తిరునావుక్కరసర్‌లు కూడా సమకాలికులు—ఇద్దరిలో తిరునావుక్కరసర్ వయస్సులో పెద్ద; తిరునావుక్కరసర్‌ని పేరు చెప్పబడని ఒక పల్లవరాజు హింస పెట్టినట్లు తోస్తుంది. ఈరాజుకి 'గుణధరు'డనే పేరు ఉన్నట్లు తోస్తుంది.

3. "గుణధర-గుణభర అనే పేరులమధ్య పెద్ద తేడా లేదు అందుచేత వల్లమ్‌శాసనంలోని మహేంద్ర పోతరాజు లేక గుణభరుడే గుణధరుడు అయిఉంటాడని మనం భావించవచ్చు. ఈ గుణధరుడే తిరునావుక్కరసర్‌ని ముందు హింస పెట్టి తరువాత పోషించాడని పెరియపురాణం చెబుతుంది. వల్లమ్ శాసనంలోని గుణభరుడూ, పెరియ పురాణంలోని గుణధరుడూ ఒకరే అని మను ప్రతిపాదిస్తున్నాను. ఈ ఇద్దరూ మహేంద్రవర్మ I అయి ఉండాలని స్పష్టం అవుతోంది."

ఈ గుర్తింపు, తిరుచ్చి గుహాశాసనం దాత మహేంద్రవర్మ అన్న వాదం యొక్క స్వీకారం ఇలాగ ఉండగా కొన్ని కుదరని అంశాలు కూడా స్ఫురిస్తాయి; పెరియపురాణం చరిత్రకి ఆధారం అవతగిన పుస్తకం కాదని తెలిసికూడా దానిని ఇంత వాడటం సమర్థనీయమా? శేక్కిళార్ కథనాన్ని వదిలివేస్తే వెంకయ్య అనుమానానికి అంత బలమయిన ఆధారం లేదని గమనించాలి. బిరుదులు రెండు ఒక రకంగా ఉన్నాయని (మనిషిని) గుర్తుపట్టటం కొంత ప్రమాదకరం అని హాల్‌ట్స్ రాయనే రాశాడు.

ఇటీవల శ్రీ సుబ్రమణ్యం (1957) 7వ శతాబ్దపు పల్లవ శాసనాలలో ఉపయోగించబడిన రెండు విధాలైన లిపులను చరిత్రకారుల దృష్టికి తెచ్చారు. వాటిలో ఒకటి తెలుగు–కన్నడ లిపి మూలంగా కలది. రెండవది తమిళ దేశంలో ప్రాచుర్యంగల గ్రంథలిపి. మొదటిది తిరుచ్చి శాసనములో ఉపయోగింపబడ్డది. రెండవది కూరం శాసనంలో కనబడుతుంది. ఇది మొదటి దానికంటే పరిణతి నందిన దశలో ఉన్నదని శ్రీ సుబ్రమణ్యం అభిప్రాయం. తిరుచ్చి శాసనంలో కొన్ని తెలుగు-కన్నడ లిపి అక్షరాలు, ఉండటం వింతఅనీ అది తమిళ దేశంలో ఉపయోగంలో ఉన్న గ్రంథలిపిలోగాక తెలుగు – కన్నడ లిపిలో వ్రాయబడిందనే విషయాన్ని ఋజువుచేస్తున్నదని సుబ్రమణ్యం వ్రాసారు. తమిళ దేశంలో ఇంత ప్రాచీన కాలంలో తెలుగు–కన్నడలిపి ఉపయోగం, మహేంద్రవర్మ బిరుదులలో కొన్నింటి వలెనే, ఆరాజు తెలుగు ప్రభావాన్ని సూచిస్తోందని సుబ్రమణ్యం వ్రాసారు.

ఈ వివరణ సహేతుకమైనదే. కాని దీనిని ఇంకొక విధంగా కూడా వివరించవచ్చు. సింహవిష్ణువు వంశానికి చెందిన పల్లవులను గురించి ఇప్పటివరకు మనకు తెలిసింది చాలావరకు తరువాతి కాలపు శాసనాల వల్లనే అని ఒప్పుకోవాలి. సింహవిష్ణువుకు పూర్వపు రాజుల గురించి మనము తెలుసుకోవలసింది చాలా ఉన్నది. తమిళనాడు పురాతత్వశాఖ వారిచే ఇటీవల (గణేశన్ 1971) కనిపెట్టబడిన శాసనాలు 6/7 శతాబ్దపు పల్లవుల చరిత్రకు సంబంధించిన విషయాలను తెలుపుతాయి. ఈ శాసనాలలోని విషయాలు విమర్శకంగా పరిశీలించబడి, సాధ్యమైన కొన్ని సిద్ధాంతాలు రూపొందించబడేవరకు, ఈ తిరుచ్చి శాసనాలలో (బహుశా వెల్లం శాసనంలోకూడ) ప్రశంసింపబడినవాడు పల్లవులతో మైత్రిఉన్న చిన్నరాజో లేక సామంతుడో అనుకోవడం సమంజసంకాదా?

7వ శతాబ్దంలో పల్లవులచేత జయించబడిన చోళదేశపు సరిహద్దులను నిర్ణయించడం ఒక పెద్ద సమస్య. అంతకు పూర్వపు సరిహద్దులను గుర్తించడం ఇంకా కష్టం–7వ శతాబ్దపు పల్లవ శాసనాల్లోనేగాక, అదేకాలపు చాళుక్య శాసనాల్లో కూడ 'చోళిక విషయము' అనే పేరుతో దీని ఉనికిని గూర్చిన ప్రశంసఉన్నది. (ఎ. ఇ. 10, నెం. 22 గద్వాల తామ్రశాసనం) పల్లవులమీద పులకేశి II గెలుపు పాండ్య, కేరళాలతోపాటు చోళదేశానికికూడా సౌభాగ్యాన్నిచ్చిందట. (ఎ. ఇ. 6 నెం 1 ఐహోలు శాసనం). ఆ శతాబ్దంలోనే భారతదేశానికి వచ్చిన యువాన్‌చ్వాంగ్ దక్షిణానికిపోయే దారిలో చూ–లి-య (చోళక?) అనే దేశం ఉన్నదని వ్రాసాడు. గంగవంశపు రాజైన శ్రీవిక్రముడు (క్రీ. శ. C644–669) ఒక చోళ రాజకుమార్తెను వివాహం చేసుకొన్నాడట, వారికి భూవిక్రముడనే కొడుకు కలిగాడు. (లక్ష్మీనారాయణరావు & పంచముఖి 1946)

వీటన్నింటినిబట్టి 7వ శతాబ్దంలో చోళదేశమనే ప్రాంతం ఉండేదంటే సందేహించ నవసరంలేదు. చోళరాజుల ప్రాచీన రాజధాని తిరుచ్చి జిల్లాలోని ఒరయూరు (నీలకంఠశాస్త్రి 1955) కాని, తంజావూరు జిల్లాలోని పళైయారై (సదాశివ పండరత్తార్ 1957) కాని అయి వుంటుందని సాధారణంగా అంటారు. కాని ఈ పట్టణాలను ఏలిన రాజుల గురించిగాని, వంశము గురించి గాని ఏమీ చెప్పబడలేదు. కొందరు చరిత్రకారులు 'సంఘవాఙ్మయము'ని పిలవబడే గ్రంథాలలో కనుపించే రాజులు వీరే అని నిరూపించడానికి ప్రయత్నించారు. కాని 'సంఘయుగము' అనే భావనే కల్పితమయినది, యథార్థము కానిది అని ఒప్పుకోవాలి. కనుక ఈ రాజులే పై పట్టణాల నేలినవారు అనడం అసంబద్ధం. చరిత్రకు తెలిసిన విజయాలయుడితో ప్రారంభమయ్యే చోళవంశముయొక్క మూలం ఇంకా పరిష్కరింపబడని సమస్య అని జ్ఞాపకముంచుకోవాలి. విజయాలయుడు శ్రీకంఠుని (పొత్తపి–చోళుని) వంశానికి చెందినవాడనే (సుబ్రమణ్యం 1955 : మహాలింగం 1969) సిద్ధాంతము జాగ్రత్తగా పరిశీలించదగినదే. ఈ పరిశీలన 9వ శతాబ్దపు పరిస్థితిని గురించి మనకు తెలియజేయవచ్చునుగాని 7వ శతాబ్దం గురించి తెలుసుకోవడానికి అంతగా ఉపయోగించదు.

అంటే మనము ఇప్పుడు వేసుకోవలసిన ప్రశ్న "7వ శతాబ్దపు శాసనాలలోని 'చోళ' ప్రసక్తి ఒక వంశాన్ని గురించా లేక ఒక దేశాన్ని గురించా అని. గుణభరుని తిరుచ్చి శాసనాలను గురించి నీలకంఠశాస్త్రిగారు (1955) ఇలా వ్రాసారు: "హుల్ట్జ్ అభిప్రాయంతో 'విభూతిమ్ చోళానామ్' అంటే 'చోళులగొప్పబలము'. కాని ఈవర్ణన సింహవిష్ణువుచేత జయింపబడిన చోళులకు తగదు. అందుచేత ఇక్కడ వర్ణింపబడినది చోళదేశము అని నేను అనుకుంటున్నాను."

యువాన్ చ్వాంగ్‌చెప్పిన చు-లి-యా దేశము సిద్ధి 1000, లేనాడు 7000 అని చాలా కాలంగా నమ్మబడుతోంది. (నీలకంఠశాస్త్రి, 1955b) ఇంకా చిందటో ఇటువంటి అభిప్రాయాన్నే వ్యక్తం చేసారు. కాని ఈ సందర్భంలో మనం యువాన్‌చ్వాంగ్ ఈ దేశపు రాజధానిగాని ఈ దేశం గాని ఎక్కడ ఉన్నదో గుర్తించడానికి తగిన ఆధారాలను వ్రాయలేదని జ్ఞాపకం ఉంచుకోవాలి.

6వ శతాబ్దపు మధ్యకాలంనుంచి 9వ శతాబ్దంవరకు దక్షిణ భారత రాజకీయరంగంలో ప్రాముఖ్యం వహించినవారు ముగ్గురు– బాదామి చాళుక్యులు, కంచి పల్లవులు, మధురకు చెందిన పాండ్యులు. తూర్పు చాళుక్యులు, పశ్చిమ గాంగులు "ఒక్కొక్క సమయంలో

ఒక్కొక్కరి పక్షం వహించేవారు. వీరి సహాయం కొన్ని సమయాలలో జయాపజయాలను నిర్ణయించగలిగేది''. (నీలకంఠశాస్త్రి 1955b)

తమిళదేశపు చోళులు దాదాపు పూర్తిగా నశించిపోయారని, తెలుగుదేశంలో ఇపుడు రాయలసీమ అని పిలవబడే ప్రాంతాన్ని పాలించే చోళవంశశాఖ ఒక్కటిమాత్రం మిగిలిందని నీలకంఠ శాస్త్రిగారు అంటారు. ఈ చోళులు ప్రాచీన రాజధానియైన ఒరయూరుకి చెందిన వారమని చెప్పుకొనేవారు. నీలకంఠశాస్త్రిగారితోసహా, దాదాపు అందరు చరిత్రకారులు తమిళదేశంలో ఈ ప్రాచీన చోళవంశస్థులు కావేరీ తీరాన అక్కడక్కడ చిన్న చిన్న రాజ్యాలను పాలించేవారని నమ్ముతున్నారు. ఇది నిజమో కాదో అసలు ప్రాచీన చోళవంశము అనేది ఒకటి ఉండేదో లేదో అన్న విషయాన్ని భావి పరిశోధనలే నిర్ణయించాలి.

కాని ముందు చెప్పినట్లు 'చోళదేశం' అనేది—తెలుగు చోళులది కాక—ఒకటి ఉండేదనేది మాత్రం ఎవరూ కాదనలేరు. ఇక్కడ మనం 6వ శతాబ్దంలో దక్షిణ భారతదేశపు మండల విభాగాన్ని గుర్తించాలి. పెన్నియార్ నదినుంచి ఉత్తరానికి బహుశా కృష్ణవరకూ ఉన్న తీర దేశం తొండైమండలం. పెన్నియార్‌నుంచి కావేరివరకు ఉన్న తీర ప్రాంతమూ, కావేరికి దక్షిణంగా తీర ప్రాంతం కొంతా, దానిని ఆనుకుని పడమటగా ఉన్న ప్రాంతం కొంతా కలిసి ముత్తరయర్‌నాడు. (ఇప్పటి తిరుచ్చి జిల్లా ఉత్తరభాగము, తంజావూరు జిల్లాలు) మంగుళూరు వరకూ ఉన్న పశ్చిమ తీరప్రాంతం చేర దేశం. చంద్రవతీ, నేత్రవతీ నదుల మధ్యప్రాంతమూ, ఇప్పటి షిమోగా, కడూరు జిల్లాల తూర్పు భాగాలు కలిసి అలూపుల దేశం. (రమేష్ 1970) దీనికి ఈశాన్యంగా కాదంబుల బాణవాసి 12,000 ఉన్నది. అలూప, కదంబ దేశాలకు తూర్పుగాను, తొండైమండలానికి పడమటగాను, రెండింటికి మధ్యనున్నది ఆంధ్రపథము. (వడుగ—వళి) ఈ దేశంమీద నుంచే పశ్చిమ చాళుక్యులు, కావేరి ప్రాంతం మీదకి దండెత్తారు. కొంగు రాష్ట్రానికి పడమట అలూప, చేర దేశాలు, ఉత్తరాన బాణవాసి 12,000, ఆంధ్రపథమూ, తూర్పున తొండైమండలమూ, ముత్తరయర్‌నాడూ, దక్షిణాన పాండ్యదేశమూ ఉన్నాయి.

ఈ మండల విభాగం ఇంచుమించు ఆ నాటి రాజ్య విభజనలో సరిపోయేది. కాని ప్రతి మండలాన్ని ఒకే వంశానికి చెందిన వేర్వేరు శాఖలో లేక రెండో అంతకు ఎక్కువో వేర్వేరు వంశాలో పాలించేవి. ఉదాహరణకు చేర దేశాన్ని ఆయ్—వేళులు, మూషికులు ఇంకా ఇతరులు పాలించేవారు. పాండ్యదేశాన్ని పరతకులు, బహుశా పాండ్యవంశానికి చెందిన భిన్నశాఖలవారూ పాలించేవారు. తొండై మండలాన్ని శాలంకాయనులు, కంచి పల్లవులు, నెల్లూరు-గుంటూరు పల్లవులు వేరు వేరు ప్రాంతాల్లో పాలించేవారు. (సుబ్రమణ్యం. 1966). ఇదేవిధంగా కొంగరాష్ట్రపు దక్షిణభాగం కొంగుణుల (వీరే తరువాత పశ్చిమ గాంగులు అని పిలువబడినవారు) అధీనంలో ఉండేది. కావేరి, కపిని నదుల మధ్యప్రాంతం పున్నాటరాజుల పాలనక్రింద ఉండేది. తగడూర్ ప్రాంతాన్ని (ఇప్పటి ధర్మపురి) అడియమాన్‌రాజులు పాలించేవారు.

7వ శతాబ్దంలో రాజ్యాలన్నింటికీ పక్కరాజ్యాలతో విడతెరపి లేకుండా జరిగే యుద్ధాలవలన వాటి సరిహద్దులు ఎప్పటికప్పుడు మారిపోతూవుండేవనే విషయాన్ని గుర్తించాలి. కొంగుణులు పున్నాట రాజులను ఓడించి ఉత్తర దిక్కున తమ రాజ్యాన్ని విస్తరించారు. అదే విధంగా తూర్పున ఇప్పటి మైసూరు, బెంగుళూరు, కోలారు జిల్లాల ప్రాంతాన్ని ఆక్రమించారు. శ్రీవిక్రముడికి తరువాతికాలంలో ఈ వంశపుశాఖ ఒకటి దక్షిణపు దిక్కుకి దండెత్తి పాండ్యరాజ్య భాగమైన కొడంబలూర్‌ను ఆక్రమించుకున్నది. గాంగులకీ పల్లవులకూ ముత్తరయర్లకీ మధ్య నిరంతరం యుద్ధాలు జరుగుతూ ఉండేవి. ఈ సమయంలోనే పశ్చిమ చాళుక్యులు పల్లవులతో యుద్ధాల మూలాన వారికి దక్షిణానఉన్న రాజ్యాలపై ఒత్తిడి తెచ్చేవారు.

అశోక, పల్లవ, పశ్చిమ చాళుక్యుల శాసనాలలో కనిపించే చోళదేశము (లేక చోళికవిషయం) పైన చెప్పబడిన రాజ్యవిభజనలకూ, రాజవంశాలకు సంబంధించిన విభజనలకూ అతీతంగా ఉండేది అయి ఉండాలి. ఈపదం ఒకే జాతికిచెంది, ఒకే సంస్కృతి కలిగి ఒకే మాండలికాన్ని మాట్లాడే ఒకజాతి ప్రజను గుర్తించేదిగా తోస్తోంది. ఈ జాతివారే దక్షిణ మైసూరు, కూర్గు, కోయంబత్తూరు, సేలం, తిరుచ్చి జిల్లాలలో సోళియార్, సోళిగార్ మొదలైన పేర్లతో పిలువబడుతూ ఇప్పుడు అక్కడక్కడా కనిపిస్తున్నారు. ఈజాతి నివసించిన దేశమే చోళదేశమని పిలవబడి ఉంటుంది. పైన చెప్పిన సందర్భాలలో కనిపించే ఈ 'చోళ' పదం చోళియార్లు నివసించే దేశాన్ని గురించి మాత్రమే చెపుతుంది. ఈ దేశం చిన్న చిన్న రాజ్యాలుగా విభజించబడి ఉండేది. వీటిని వేర్వేరు వంశాలకు చెందిన రాజులు పాలిస్తూ ఉండేవారు. పున్నాట, గాంగ, కొంగుణ, అడియమాన్ బహుశా కోలి (ఇప్పటి ఒరయూర్) వంశాలకు చెందిన రాజులు ఈ రాజ్యాలను ఏలుతూ ఉండేవారు. కనుక 7వ శతాబ్దపు శాసనాల్లో కనిపించే చోళ దేశము తిరుచ్చికిగాని ఉరయూర్‌కుగాని మాత్రమే సంబంధించినదై ఉండనక్కరలేదు. తొండైమండలానికి సమీపంలోఉన్న చోళదేశంలోని ఏ ప్రాంతానికైనా సంబంధించి ఉండవచ్చు. ముఖ్యంగా తిరుచ్చి పల్లవ శాసనాలలోని 'చోళానామ్' అన్న పదము ఈ చోళిక—విషయం గురించి చెప్పేదేకాని ఏ చోళవంశాన్ని గురించి చెప్పేదికాదు. అదే విధంగా సింహవిష్ణువు చోళ విజయం ఆ రాజు చోళిక విషయంలో ఏవో కొన్ని ప్రాంతాలను జయించడంగాని ఒరయూర్‌నుగాని వేరే ఏదైనా ప్రత్యేకమైన ప్రాంతాన్నిగాని పాలించే చోళవంశీయుల రాజ్యాన్ని జయించడం కాదు.

ముందే చెప్పినట్లు తిరుచ్చి శాసనాలలోని పల్లవ వంశీయుడయిన దాత మహేంద్రవర్మ అనటానికి చూపించబడే ఆధారాలు బలహీనమయినవి. అనుక్రమంగా వస్తున్న గాథలమీద ఆధారపడ్డవి. ఈ శాసనాలు కనిపించే గుడులు కేవలం నిర్మాణ శైలినిబట్టి

మహేంద్రవర్మ కాలంనాటివని నిర్ణయింపబడ్డాయి. కాని ఆ శైలి మహేంద్రవర్మ తరువాత చాలా కాలం వరకూ ప్రాచుర్యంలో ఉండేదని ఇప్పుడు మనకు తెలుసు. ముత్తరయర్‌నాడు తొండై మండలానికి పాండ్యనాడుకి మధ్యగా చొచ్చుకుని ఉండడంబట్టి మహేంద్రవర్మ రాజ్యం దక్షిణాన పొన్నియార్ నదినిదాటి కావేరినది వరకు విస్తరించి ఉండడం సందేహాస్పదమే. అంతేకాక మహేంద్రవర్మవే అని నిశ్చయంగా తెలిసిన శాసనాల్లోని లిపి, ఈ శాసనాల్లోని లిపికంటె భిన్నంగా ఉంటుంది. వీటన్నింటికంటె ముఖ్యమైనది మహేంద్రవర్మవిగాని, అతని కొడుకు—తరువాత రాజ్యమేలినవాడు ఐన నరసింహవర్మ I ని కాని శాసనాలేవి పొన్నియార్ తీరానఉన్న అరగాండ నల్లూర్‌కు దక్షిణాన దొరకలేదు. ఇంకొక విధంగా చెప్పాలంటే మహేంద్రవర్మ కట్టించినవి అని నిశ్చయంగా నమ్మదగిన కట్టడాలు దక్షిణాన పొన్నియార్‌కూ, ఉత్తరాన పల్లావరమ్‌కూ మధ్యనున్న ప్రాంతంలోనే దొరుకుతున్నాయి. వీటన్నింటినిబట్టి, రాతిని దొలిచి కట్టిన ఈ గుహాలయమూ, దానిలో కన్పించే పల్లవ శాసనాలూ మహేంద్రవర్మవికావు అని నిర్ణయించవచ్చు. ఆలయ నిర్మాణ శైలిని నూతన దృక్పథంతో క్షుణ్ణంగా పరిశీలించాలి. అప్పుడు శిత్తన్నవాసల్‌లోని రాతిని దొలిచి కట్టిన గుహాలయమూ, కుడిమియమలైలోని సంగీత శాసనమూ పల్లవ శైలికి సంబంధించినవి కావని నిర్ణయించబడినట్లే, ఇవీ కావని నిర్ణయింపబడవచ్చు.

5. తొండైమండలములోని 7వ శతాబ్దపు శివాలయాలు

పల్లవుల ఆలయ నిర్మాణ చరిత్రలో 7వ శతాబ్దం ఒక మహర్దశ. ఆ కాలపు ఆలయాలలో అత్యధికభాగం మొదటి మహేంద్రవర్మ (క్రీ. శ. 610-630) రాజ్యకాలంనుండి రెండవ నరసింహవర్మ (క్రీ. శ. 620/1–728/9) రాజ్యకాలం వరకు నిర్మించబడ్డాయి. ఇవి తొండైమండలమంతటా కనిపించినా ఎక్కువగా ఇప్పటి చెంగల్‌పట్టు జిల్లాలోనే కనిపిస్తాయి.

వాటిలో ఈ క్రిందవ్రాయబడినవి శివాలయాలు :

మహేంద్రవర్మ I

మండగపట్టు	దక్షిణ ఆర్కాటు
దళవనూరు	,,
శ్రీయమంగల	,,
కురంగాణిల్ ముట్టం	ఉత్తర ఆర్కాటు
పల్లావరం	చెంగల్‌పట్టు
మానండూర్	,,
వల్లం	,,

పరమేశ్వరవర్మ I

మహాబలిపురం	చెంగల్‌పట్టు
తిరుక్కళుక్కున్రమ్	
కూరం	,,
కలంబాక్కం	,,

నరసింహవర్మ II

మహాబలిపురం	,,
సాళువంకుప్పం	,,
కాంచీపురం	,,
పణమలై	ఉత్తర ఆర్కాటు

వీటిలో కొన్ని పూర్తిగా కట్టబడకుండా అసంపూర్ణంగా నిలిచిపోయాయి. మరికొన్ని పూర్తిగా నిర్మించబడి, విగ్రహ ప్రతిష్ఠ, పూజాపునస్కారాలు కలిగి ఉన్నాయి. ఈ ఆలయాలన్నీ రాతిని దొలిచి నిర్మించబడినవి కాని లేక రాతితో కట్టబడినవిగాని అని గుర్తించుకోవాలి.

తేవారం త్రయం తొండై మండలంలోని 32 గుడులలో పాడారు, అని అంటారు. వీటిలో చాలా 7వ శతాబ్దపు పల్లవ ఆలయాలకు చాలా దగ్గరలోనే ఉన్నాయి. తిరుజ్ఞాన సంబందర్ కాంచీపురంలోనే కచ్చి–నెరిక్కారైక్కాడు, కచ్చి–ఏకంపన్‌లలో పాడారని అంటారు. సుందరర్ కచ్చి–అనేక తంగాపటం, కచ్చి–ఏకంపన్, కచ్చి-మెట్రళి, ఓణకాంతన్‌తళి కాంచీపురంలో పాడారు. కాని ముందే చెప్పినట్లు మహేంద్రవర్మ Iని శైవుడిగా మార్చాడని చెప్పే తిరునావుక్కరసర్ తన శిష్యుడిచేత కట్టించబడిన ఒక్క గుడికీ వెళ్ళకపోవడం, పాడకపోవడం ఆశ్చర్యకరమైన విషయం. తిరుజ్ఞాన సంబందర్ కూడా తన తొండైమండల యాత్రలో పల్లవులచేత కట్టబడిన ఒక్క ఆలయము కూడా దర్శించలేదు. కళర్ చ్చింగన్‌ను (నరసింహవర్మ II రాజసింహునిగా గుర్తింపబడినవాడు) గొప్ప శివభక్తుడిగాపొగిడిన సుందరర్ కూడా ఈ రాజుచేత కంచిలో కట్టబడిన ఒక్క ఆలయం కూడా దర్శించలేదు — దగ్గరే ఉన్న మరికొన్ని ఆలయాలకు వెళ్ళినప్పటికీ.

తేవారంత్రయంయొక్క ఈ అనాసక్తతకి కారణం ఏమయివుంటుంది? కొంతమంది రాతితో కట్టబడిన ఆలయాలే కాని రాతిని దొలిచి కట్టిన ఆలయాలు శివుడి విగ్రహా (లేక లింగ) ప్రతిష్ఠకు గాని పూజకుగాని పనికి రావని అభిప్రాయ పడుతున్నట్లున్నారు. (ఈ విధంగా ఎవరూ ప్రచురితమైన తమ గ్రంథాలలోగాని, వ్యాసాలలోగాని వ్రాయలేదు) ఈ కారణం చేతనే తేవారం త్రయం

ఈ పల్లవ ఆలయాలను దర్శించలేదు అనివారు ఊహిస్తున్నారు. కాని ఇది కేవలం కాల్పనికమైన కారణం మాత్రమే. ఈ పల్లవ ఆలయాలలో ఎక్కువభాగం రాతిని దొలిచి కట్టినవే అయినా తిరుక్కళుక్కుణమ్ లోని వేదగిరీశ్వరాలయమూ, కూరమ్‌లోని విద్యావినీత పల్లవేశ్వరాలయమూ (పరమేశ్వరవర్మ I) కంచిలోని కైలాసనాథ ఆలయమూ (నరసింహవర్మ II) మహాబలిపురంలోని తీరస్థ ఆలయమూ (నరసింహవర్మ I) [illegible] కట్టబడినవే. వీటిలో చివరిది తిరుజ్ఞాన సంబందర్ కాలంలోనే ఉండేది. దీనితోబాటు మిగిలినవి అన్నీ సుందరర్ కాలంలో ఉండేవి.

మొదటి మహేంద్రవర్మ మండగపటు శాసనం (పటం 5) ప్రకటించబడినప్పటినుంచి అది అనేకమైన అస్పష్టమైన, సందేహమయమైన ఆలోచనలకు కారణమయింది. దీనిలో ఆ రాజు ఇటుకలుగాని, కలపగాని, లోహము గాని, మన్నుగాని ఉపయోగింపబడకుండా త్రిమూర్తులకు ఆలయం కట్టించాడనిఉంది. దీనిని చూసి కొందరు మహేంద్రుడే ఆలయాలను రాతితో కట్టించిన వారిలో మొదటివాడు అని భావించారు. కాని ఈ శాసనంలోని పై వాక్యాలకు ఇటువంటి అర్థం రాదు. రాతిని మాత్రమే ఉపయోగించి, అంటే రాతిని దొలిచి ఈ ఆలయాన్ని మహేంద్రవర్మ కట్టించాడు అని మాత్రమే ఈ శాసన వాక్యాలు చెప్తున్నాయి. తొండై మండలంలోగాని, తమిళదేశంలోగాని మొదటిసారిగా ఇటువంటి గుడి కట్టించినవాడు ఈ రాజేనని ఈ శాసనంలో లేదని కూడా మనం గమనించాలి.

ఈ శాసనాన్ని ఆధారంగా చేసుకుని చాలామంది చరిత్రకారులు మండగపట్టులు 'లక్షితాయతనమ్' నిర్మించబడక మునుపు ఆలయాలన్నీ కొయ్య, ఇటుకలు, మట్టి మొదలైన త్వరలోనే చెడిపోయే వస్తువులతో కట్టబడేవని ఊహిస్తున్నారు. వాదంకోసం దీనిని ఒప్పుకున్నా 7వ శతాబ్దంలో తమిళదేశంలో ఇన్ని (సుమారు 500) శివాలయాలు ఇటుకలు మట్టి, కొయ్య మొదలైన వాటితో కట్టబడినవి ఉండేవా అన్న ప్రశ్న ఉదయిస్తుంది. ఇంతేగాక పల్లవుల కాలానికి ముందే భారతదేశంలో అనేక ప్రాంతాల్లో రాతితో కట్టబడిన కట్టడాలు ఉండేవని మరువకూడదు. గుప్తయుగం మొదలుకొని అతి క్లిష్టమైన, సుందరమైన నిర్మాణ కౌశలంచూపే బౌద్ధస్తూపాలు, చైత్యాలు మొదలైనవి నిర్మించబడుతూ వచ్చాయి. దక్షిణదేశంలో హిందూ మతానికి సంబంధించిన రాతికట్టడాల నిర్మాణ శిల్పపు ప్రథమ దశను ఐహోలులోని ఆలయం కట్టబడిన 5వ శతాబ్దంనుంచి 7వ శతాబ్దం మధ్యవరకు చూడవచ్చు. పశ్చిమ చాళుక్యులు 6వ శతాబ్దంలో ఈ ఆలయ నిర్మాణ సాంప్రదాయాన్ని వారి రాజ్యంలో అంతటా కొనసాగించారు. వారి సామ్రాజ్యం విస్తరించిన కొద్దీ వారి నిర్మాణ రంగంకూడా విస్తరిస్తూ వచ్చింది. వారు జయించిన కొత్త ప్రాంతాలలో గుడులు కట్టబడ్డాయి. దక్షిణ దిక్కుగా వారి రాజ్య విస్తరణా, పల్లవులతో వారి యుద్ధాలు "సంస్కృతీ ప్రసరణను" కలిగించాయి. కనుక 7వ శతాబ్దానికి తొండై మండలంలో రాతితో ఆలయాలను కట్టడం చాలాకాలంగా జరుగుతున్నదే.

ఏదైనా ఒకగుడి రాతితో కట్టబడిందా లేక ఇటుకలు మొదలైన త్వరగా నశించిపోయే వస్తువులతో కట్టబడిందా అనేది ముఖ్యంగా ఆర్థిక పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. మొదటిరకపు కట్టడం రెండవదానికంటే ఎప్పుడూ ఎక్కువ ఖర్చుతో కూడుకున్నదే. సామాన్య ప్రజల ఇళ్ళు, ఇటుకలు, కొయ్య మొదలైన వాటితోనే కట్టబడును గనుక, ఈ రకం కట్టడాలు కట్టేపనివారు తేలికగా దొరుకుతారు. రాజులు, సామంతులు ఇతర ధనికులూ రాతితో ఆలయాలను కట్టించగలిగేవారు. అంత ధనవంతులు కానివారు సహజంగా ఇటుకలు మొదలైన వాటితోనే కట్టించగలిగేవారు.

అందుచేత రాతితో కట్టబడిన గుడులకంటే ఇటుకలతో కట్టబడిన గుడులు ఎప్పుడూ ప్రాచీనమైనవా అనుకోవడం అర్థంలేని ప్రశ్న. కాని 10వ శతాబ్దపు చోళ శాసనాలు అంతకు ముందు ఇటుకలతో కట్టబడిన కొన్ని గుడులను వీరు తిరిగి రాతితో కట్టించారని తెలుపుతున్నాయి. వీటి ఆధారంగా తమిళదేశంలో గుడులన్నీ ముఖ్యంగా తేవారం త్రయం దర్శించిన గుడులన్నీ—మొదట ఇటుకలతో కట్టబడినవే అని నిశ్చయం చేయబడింది. తరువాతి కాలంలో చోళులు వీటిని రాతితో పునర్నిర్మించారని నమ్మబడుతోంది. కాని చోళులు వారే కొత్తగా ఎన్నో రాతి గుడులను కట్టించారని వారి శాసనాలద్వారా మనకు తెలుస్తోంది. ఇంతేగాక తేవారం త్రయం పాటలలో వారు దర్శించిన ఆలయాలలో అనేకం శిలానిర్మితాలు (కట్టళి) అనే స్పష్టమైన సూచన ఉన్నాయి.

ఇప్పుడు స్థిరపడిన సాంప్రదాయం ప్రకారం తేవారం త్రయం తొండై మండలంలో దర్శించిన గుడులు ఈ క్రిందివి.

అచ్చిరుపాక్కమ్
ఆలంకాటు
ఆలక్కోయిల్ (తిరుక్కచ్చూర్)
ఇడైచ్చూరమ్
ఇలంబయం కోట్టూర్
ఇరుంబై మాకాళమ్
కాలత్తి
కళుక్కుణమ్
కళ్ళమ్ (తిరుకళ్ళిల్)
కాంచీపురం
కురుంగణిల్ ముట్టమ్
కూరమ్
మాకరల్

మారేయ
ము నాయల్. వన
మయిలై (మైలాపూర్)
ఒట్రియూర్
ఒట్టూర్
పాచ్చూర్
పాడి
వసణ్ కాట్టూర్
వక్కరై
వల్లమ్ (వలమ్)
వాన్మియూర్
వెణ్‌పాక్కమ్
వేరాట్టు
ఒశిందియపాట్టు (అరశిలి)
ఊఱల్ (తక్కోలమ్)

ఈ దేవాలయములలో ఏవీ కూడా పల్లవుల చేత కట్టించబడినవి కావు అనేది ముఖ్యంగా గుర్తుంచుకోవలసిన విషయం. నిర్మాణశిల్పశైలినిబట్టీ, శిల్పశైలిబట్టీ చూస్తే ఇవి చోళసామ్రాజ్య కాలానికి చెందినవి అనేది స్పష్టంగా తెలుస్తుంది. వీటిలో దొరికిన శాసనాలు కూడా ఈ విషయాన్నే ధ్రువపరుస్తున్నాయి. (బాలసుబ్రమణ్యం, 1906, 1971). 7వ శతాబ్దంలో తేవారం త్రయం వీటిని దర్శించి ఉంటే వీటిని నిర్మించినవారు ఎవరై ఉంటారు? తమిళదేశపు చోళులు ఆ కాలంలో ఎక్కడా కనుపించరు. కొంతమంది అభిప్రాయపడ్డట్లు ఒరయూర్‌లో గాని పళైయాఱైలోగాని కొన్ని బలహీనమైన చోళవంశాలు ఏలుతున్నాయనుకొన్నప్పటికీ వారు పల్లవ రాజ్యపు నడిబొడ్డులో ఈ ఆలయాలను కట్టించగలిగేవారా?

తిరుజ్ఞాన సంబందర్ "పల్లవని చ్చురమ్"లో ఆలయాన్ని గురించి ఒక దశకము "మహేంద్రపల్లి"(ఇప్పటి కోయిలని పాళయం) లోని ఆలయాన్ని గురించి 2 దశకాలు వ్రాసారు. వీటిలో మొదటిది కయ్యాడుకు ½ మైలు తూర్పుగాను, సీర్కాళికి 9 మైళ్ల ఆగ్నేయంగానూ ఉన్నది. రెండవది అచ్చాపురానికి 4 మైళ్ల ఈశాన్యంగా ఉన్నది. ఈ అచ్చాపురం కొళ్ళిడం రైలు స్టేషన్‌కి 3 మైళ్ల దూరంలో ఉన్నది. దీనినిబట్టి ఈ ఆలయాలు రెండూ 7వ శతాబ్దపు పల్లవరాజ్య దక్షిణ సరిహద్దుకు అవతలగా ఉన్నాయని స్పష్టంగా తెలుస్తోంది. ఇంతేకాకుండా వీటి పేర్లు పల్లవులకు సంబంధించినవి అని సూచించేవిగా ఉన్న వీటి నిర్మాణశైలి 7వ శతాబ్దపు పల్లవ నిర్మాణశైలికి పూర్తిగా భిన్నంగా ఉన్నది. ఇవి పల్లవులచేత కట్టబడినవనేది సందేహాస్పదమే.

6. శైవ ప్రతిమా విద్య

7వ శతాబ్దపు పల్లవ దేవాలయాలలో సోమాస్కంధ విగ్రహానికి చాలా ప్రాముఖ్యం ఉంటుంది. ఆ కాలపు శివాలయాల్లో ఈ విగ్రహము చెక్కబడిన శిలాఫలకమే గర్భగుడులలో స్థాపించబడి పూజింపబడుతూ ఉండేది. (సౌందరరాజన్ 19 ,9) తేవారం త్రయం పల్లవులచేత కట్టించబడిన ఆలయాలను దర్శించలేదు. అంతేకాక వారు తమ పాటలలో త్రిపురదహనము, బ్రహ్మశిరచ్ఛేదనము, రావణానుగ్రహము, అర్ధనారీశ్వరి, దక్షిణామూర్తి, తాండవము మొదలైన శైవమూర్తులను వర్ణించినా, పల్లవ శిల్పాల్లో అత్యంత ప్రాముఖ్యం వహించిన సోమాస్కంధమూర్తిని మాత్రం వర్ణించలేదు. ఇంకొక విధంగా చెప్పాలంటే అనేక శైవమూర్తులు పల్లవుల కాలంలోను, తరువాత చోళకాలంలోనూ ప్రాచుర్యంలో ఉన్నా, సోమాస్కంధమూర్తి మాత్రం ఏ కారణంచేతో చోళుల శైవంలో తన ప్రాముఖ్యాన్ని కోల్పోయి కేవలం ఉత్సవమూర్తులలో ఒకటిగా మిగిలిపోయింది. ఈ స్థితి తేవారం త్రయం శివాలయాల్లో సోమాస్కంధమూర్తి గర్భగుడిలో పూజలందుకునే స్థానాన్ని కోల్పోయిన తరువాతి కాలంలో జీవించిఉండాలని సూచించటంలేదా?

7వ శతాబ్దపు పల్లవ దేవాలయాల్లో ఎన్నో పురాణగాథలు విగ్రహరూపంలో కనబడుతాయి, వాటిలో అనుగ్రహమూర్తులలో పేర్కొనదగినవి-రావణానుగ్రహము, నందీశానుగ్రహము, చండేశానుగ్రహము, బ్రహ్మానుగ్రహము, ఇంద్రానుగ్రహము, విష్ణ్వనుగ్రహము, కామానుగ్రహము. సంహారమూర్తులలో ముఖ్యమైనవి-త్రిపురాంతకము, గజసంహారము, దక్షయజ్ఞభంగము, కాలసంహారము బ్రహ్మశిరచ్ఛేదనము. కిరాతార్జునీయంలోని సంఘటనలు కూడా ఈ శిల్పాలలో కనపడుతాయి. రావణానుగ్రహమూ రావణుడు కైలాస పర్వతము నెత్తడము, కాలసంహారము, బ్రహ్మశిరచ్ఛేదనము, దక్షయజ్ఞభంగమూ, త్రిపుర సంహారము, గజసంహారమువంటి కథల ప్రశంస తేవారములలో కనపడుతుంది. పల్లవ శిల్పాలలో కనపడని అంధకాసురవధ, కామదహనము, జాలంధరవధల ప్రస్తావన కూడా తేవారములలో ఉంది. దీనినిబట్టి తేవారంత్రయం కాలంనాటికి అష్టవీరతాన (శివుని అష్టవీరకృత్యములు) అనే భావం స్థిరపడ్డది. వంది, ఇంద్రుడు, విష్ణువు మొదలైన వారికి సంబంధించిన అనుగ్రహమూర్తుల ప్రసక్తి తేవారంలలో లేదనే విషయాన్ని మనం ముఖ్యంగా గమనించాలి. మార్కండేయుడి కథ, శివుడు విషము తాగిన కథ తేవారంత్రయం కాలంలో పురాణాల్లో కొత్తగా ప్రవేశించిన కథలు.

శివుడి తాండవమూర్తులలో పల్లవ శిల్పాలలో సంధ్యా (లేక ప్రదోష) తాండవమూర్తి కాక కొన్ని సంహారమూర్తులు కూడా కనపడతాయి. వీటిలో శివుడు రెండుకంటే ఎక్కువ భుజములు కలవాడు. ఒక్కొక్క చేతిలో ఒక్కొక్క రకపు ఆయుధం ధరించి ఉంటారు, రౌద్రమూర్తి. తేవారం త్రయం తాండవములలో వీటిని గురించేకాక ఆనందతాండవమును గురించికూడా వ్రాసారు. ఇది శివుని పంచకృత్యాలను వర్ణిస్తుంది. ఈ 'పంచకృత్యా'లనే భావం కాశ్మీర శైవమతానికి (ప్రత్యభిజ్ఞా దర్శనము) ప్రత్యేకమైనది. ఈ మతానికి చెందినవారు

కొందరు పరాంతకుడు I (క్రీ. శ. 907 955) కాలంలో చిదంబరంలో స్థిరపడ్డారు. తిల్లై (చిదంబరము)లో ఆనందతాండవమును తేవారం త్రయం స్పష్టంగా పేర్కొన్నారు. ఈ ప్రత్యభిజ్ఞా సిద్ధాంతము కాశ్మీరములోనే 9వ శతాబ్దపు మధ్యభాగంలో బయలుదేరింది. కనుక తేవారం త్రయం 7వ శతాబ్దంలో తిల్లై తాండవమూర్తిని గురించి పాడి ఉండరు. (స్వామి 1972d)

తేవారం త్రయం కామకోట్టంను పేర్కొన్నారు. శ్రీనివాసన్ (1960) చూపినట్లు దేవీమూర్తులకు ప్రత్యేకమైన ఆలయం కట్టడం తమిళదేశంలో అర్వాచీనమైన ఆచారం. తమిళదేశంలోని గోళకీ శైవమత చరిత్ర పరిశీలన దీనిని బాగా ధ్రువపరుస్తుంది (స్వామి, 1972d). ఈ శైవమత శాఖ, అది ఉద్భవించిన దేశంలోని శాక్తేయమతంచేత బాగా ప్రభావితమయింది. ఇప్పటివరకు మనకు దొరికిన సాక్ష్యాధారాల ప్రకారం ఈమతం తమిళదేశంలో 10వ శతాబ్దం మధ్యకాలంలో ప్రవేశించింది. రాజరాజ I కాలంలో ఈ కొత్తమతం బాగా వేళ్ళూనింది. ఇది తమిళదేశపు శైవమత చరిత్రలో ఇంకొక కొత్త ధోరణి.

శ్రీనివాసన్ (1960) పల్లవ శిల్పాలలో గణేశమూర్తి గజసింహుడి కాలంలో అంటే 7వ శతాబ్దం చివరి భాగంలో మొదటి సారిగా కనబడుతుందనే విషయాన్ని మన దృష్టికి తెచ్చారు. కనుక ఆ శతాబ్దం మొదట్లో నివసించిన వారుగా చెప్పబడే తిరునావుక్కరసర్, తిరుజ్ఞాన సంబందర్ ఈ దేవుని (విగ్రహం) గురించి వ్రాయడానికి అవకాశంలేదు. శ్రీనివాసన్ అందుచేత తిరుజ్ఞాన సంబందర్ క్రీ. శ. 730 ప్రాంతంలో జీవించి ఉండవచ్చునని సూచించారు.

దక్షిణామూర్తి, అర్ధనారి, చండేశ, లింగోద్భవ మొదలైన మూర్తులు 7/8వ శతాబ్దాల పల్లవుల ఆలయాలలో కనపడతాయి. వీటి ప్రస్తావన తేవారంలో చాలాసార్లు చేయబడింది. తేవారం త్రయం ఈ పల్లవ దేవాలయాలను దర్శించలేదు గనుక ఈ కథలను గూర్చి వ్రాయడానికి వారికి ఈ శిల్పాలుకాక వేరే ఉత్పత్తిస్థానం ఉండాలి. వారికి ఈ కథలు బాగా పరిచయమైనవి అయినా అయుండాలి లేదా చోళదేవాలయాలలోని శిల్పమూర్తులచేత ఉత్తేజితులై అయినా వ్రాసుండాలి. 10వ శతాబ్దంలో చోళులచేత కట్టబడిన ఆలయాలలో ఈ విగ్రహాలు చాలా ప్రచురంగా కనపడడం మొదలుపెట్టాయి. శ్రీనివాసన్ (1960) చూపినట్లు తిరుజ్ఞాన సంబందర్ గణేశ విగ్రహం గర్భగుడియొక్క దక్షిణపు గోడమీద ఉన్నట్లు వ్రాసారు. దీనినిబట్టి అప్పటికే కోష్ఠ విగ్రహాల స్థానాలు స్థిరపరచబడివని తెలుస్తోంది. తేవారం త్రయం దర్శించిన ఆలయాలలో చాలాభాగం నిస్సందేహంగా చోళులచేత కట్టబడినవే. దీనిని బట్టి వారు చోళులకాలంవారే అని తోచడంలేదా?

7.లింగ ఆరాధన ఆలయ పూజాకాండ

7వ శతాబ్దపు పల్లవాలయాలలో లింగప్రతిష్ఠ లేదనే విషయాన్ని మనం ఒప్పుకోవాలి. దీనిని వ్యతిరేకించే సాక్ష్యాధారాలేవీ లేవు. (సౌందరరాజన్, 1969. మహాలింగం, 1969.) కాని మహేంద్రవర్మ I కాలంలోనే లింగప్రతిష్ఠ జరిగిందని ఋజువు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. (నాగస్వామి, 1971) కాని వీటికి దృఢమైన ఆధారాలు లేవు. తిరునావుక్కరసర్ మహేంద్రవర్మ I కాలానికి చెందినవాడే అని నిరూపించడానికే ఈ ప్రయత్నాలు కొనసాగుతున్నాయి అని తెలుస్తూనే ఉంది. తరువాతి పల్లవుల దేవాలయాల్లో ప్రతిష్ఠించబడిన లింగాలు (పలకలుగా చెక్కబడినవి) ముత్తరయర్, పాండ్య, చోళ ఆలయాల్లో ప్రతిష్ఠించబడిన లింగాల (స్తంభాకారములవి) కంటే భిన్నరూపం గలవని గమనించాలి.

తేవారం త్రయంకు లింగభావం (లింగం గురించి) బాగా తెలుసునడానికి నిదర్శనంగా దీనిని గూర్చిన ప్రసక్తి వారి రచనలలో తరచుగా కనపడుతుంది. వారు శివుని విగ్రహేతర మూర్తిని 'లింగము' గానే గాక తాణు కంపం తూపరం మొదలైన పదాలతో వర్ణించారు. వారు విష్ణువు, బ్రహ్మ (కోటిలింగం–జ్యోతిర్లింగం) శివుని ఆది అంతాలను కనుక్కోవడానికి ప్రయత్నించేకథ, చండీశుని కథలను ప్రస్తావించినప్పుడు ఈ పదాలను వాడారు.

కాని ఆ ముగ్గురిలో ఏ ఒక్కరూ తాము చూసిన ఆలయాలలో ప్రతిష్ఠించబడిన లింగము గురించి వ్రాయకపోవడం వింతగా ఉంటుంది. అంతేకాక వారిలో ఎవరూ గర్భగుడిలో లింగమున్నట్లు అసందిగ్ధంగా వ్రాయలేదు. దీని మూలాన కొన్ని ప్రశ్నలు ఉదయిస్తున్నాయి: వారు దర్శించిన దేవాలయాల్లో ప్రధానదైవం ఎవరు? మానవరూపంలోఉన్న శివుడి విగ్రహమా లేక విగ్రహేతరమైన లింగమా? లింగమే ఐతే వారు ఆ పూజింపబడే దైవాన్ని 'ఈశ్వర' అని చివర చేర్చబడిన నామంతో ఎందుకు పిలువలేదు? లేదా ఇప్పటివలె శివుడి మానవ రూపాన్ని పేర్కొనే అనేకమైన పేర్లుండగా వాటినెందుకు ఉపయోగించలేదు?

తేవారం త్రయంచేత పాడబడిన దేవాలయాల్లో దాదాపు సగం చోళదేశంలో ఉన్నాయి. ఆ దేవాలయాలకు సంబంధించిన శాసనాలను జాగ్రత్తగా పరిశీలిస్తే ఏ ఆలయంలోని దేవుని పేరైనా, ఆ ఆలయంఉన్న పట్టణాన్ని బట్టిగాని గ్రామాన్నిబట్టిగాని ఏర్పడుతుందని తెలుస్తుంది. ఉదాహరణకు – ముడూక్కుణముడైయ – మహాదేవ, తిరువొట్రియూర్–మహాదేవ, తిరుపాచ్చూర్ ఉడైయర్ తిరువెణ్కాట్టు ఉడైయర్ మహాదేవ, తిరువిడై మరుదూర్ ఉడై

మస్, తిరువణ్ణామలైయుం ఉడైయర్. కేవలం మూలస్థాన ముడైయార్, తిరుక్కచ్చూరి మహాదేవర్ మొదలైన పేరు కూడా కొన్ని సమయాలలో పెట్టబడుతాయి. ఇటువంటప్పుడు ఆ ఆలయాలున్న స్థలాలకీ పేర్లకీ సంబంధముండదు. ఈ ఆచారం 18వ శతాబ్దం వరకూకూడా కొనసాగింది. లింగానికి విగ్రహనామం పెట్టడం అర్వాచీన సంప్రదాయం. ఆలయానికి స్థలవృక్షముండడమూ, దానినిబట్టి అక్కడి లింగానికి పేరు ఏర్పడటము 17వ శతాబ్దం చివర ప్రారంభమయి ఉంటుందని తరువాత ఇంకొక వ్యాసంలో చూపించబడుతుంది.

తమిళదేశంలో 10 నుంచి 15వ శతాబ్దంవరకు అనుసరించబడిన ఈ సంప్రదాయాన్నే తేవారం త్రయం అనుసరించారు. ఎన్నో తేవారంలలో ఫలానా స్థలానికి నాథుడైనవాడనే శివుడు వర్ణించబడ్డాడు. కాని ప్రత్యేకమైన పేరు ఏదీ ఉపయోగించబడలేదు. తేవారం త్రయం శివుడిని గురించి పురాణ కథలలోని సంఘటనలను వ్రాసారుగాని శివుని విగ్రహమూర్తులను గురించిగాని విగ్రహేతర మూర్తులను గురించిగాని వ్రాయలేదు. ఆలయ కుడ్యాలమీది శిల్పాల గురించి, నిర్మాణ శిల్పం గురించి వారు యథాలాపంగా వ్రాసారు కాని, వాటిమీద వారికి అంత ఆసక్తి ఉన్నట్లు కనపడదు. ఇంకొక విధంగా చెప్పాలంటే వారు ఏ ఆలయంలోని దేవుడిని గురించయినా పాడినప్పుడు, ఆదేవుడి మహిమను, లోకాలమీద ఆధిపత్యాన్ని, మోక్షాన్ని ఇవ్వగల శక్తిని కీర్తిస్తూ పాడారు. వారికి ఆలయము, దానిలో ప్రతిష్ఠించబడిన దైవమూ, ఆలయ నిర్మాణ ప్రణాళిక శిల్పాలు అన్నీ సర్వమహిమలు లక్షణాలుకల ఈశ్వరుని బహిర్చిహ్నాలు మాత్రమే.

కాని వారు ఆగమ సిద్ధాంతాలకు సంబంధించిన కొన్ని విషయాలను, పూజావిధానాలను, దేవాలయాలలోని విధులను, గర్భగుడిలోని దేవునికి చేసే 14 ఉపచారాలను, పండగలను, ఉత్సవాలను, ప్రార్థనలో, పాటలో, మంత్రపఠనంలో, నాట్యంతో దేవుని ఆరాధించడము మొదలైన విషయాలను తమ తేవారంలలో ప్రస్తావించారు. కాని మొత్తముమీద తేవార త్రయం దేవాలయ ఆగమ సంప్రదాయానికి దూరంగా ఉన్నవారు అనే భావన కలుగుతుంది వారి తేవారంను జాగ్రత్తగా పరిశీలిస్తే. వారు భక్తులు బహుశా "శరమనె యె పాడువార్" పద్ధతివారు. అందుచేత వారు ఈశ్వరుని కీర్తించినప్పుడు పురాణాలలో కనిపించే పరదైవాన్ని గురించి పాడలే కాని దేవాలయ పూజా కర్మకాండను పట్టించుకోలేదు.

కనుక తేవారం త్రయంయొక్క శుద్ధ భక్తిమార్గం ఆకాలపు శివాలయాలలో జరుపబడే పూజాకాండకంటె భిన్నమైనది. తేవారంలను జాగ్రత్తగా చదివితే ఆ కాలంలో శివాలయాలలో ఆగమవిధిలో పూజించే ప్రజలమీద ఈ ఆగమ శాస్త్రాల ప్రభావం గాఢంగా ఉండేదని తెలుస్తుంది. ఈ స్థితి ఆ కాలానికి ఈ ఆగమ సిద్ధాంతాలు క్రోడీకరించబడి ఒక సంపూర్ణ శాస్త్రంగా రూపొందాయని సూచిస్తుంది. 7వ శతాబ్దపు శాసనాలలో రెండింటిలో 'ఆగమ' ప్రసక్తి ఉన్నది. పరమేశ్వరవర్మ I శాసనమొకటి ఒక శివాలయములోని పూజా విధులను పేర్కొంటున్నది. పూజ, స్నాపన, కుసుమ, గంధం, ధూపం, దీపం, హవిస్, ఉపహారం, బలి-ఇవి అన్నీ శంఖనాదాలతో, సంగీతంతో సమర్పించబడుతాయి అని దానిలో ఉన్నది. కాని తరువాతి కాలపు ఆగమాల ప్రకారం గర్భగృహంలోని దేవునికి (లింగానికి) చేసే పూజావిధిలో 16 ఉపచారాలు ఉన్నాయి. వేరు వేరు ఆగమగ్రంథాలు ఈ 16 ఉపచారాల క్రమాన్ని, ఆ ఉపచారాల స్వభావాన్ని వేరు వేరుగా చెపుతున్నా, అవి 16 సంఖ్యలో ఉంటాయనడంలో, వాటిని షోడశోపచారాలని పేర్కొనడంలో ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నాయి. తేవారం త్రయం దాదాపు ఈ ఉపచారాలన్నింటినీ పేర్కొన్నారు. దీనినిబట్టి వీరు ఆగమ సిద్ధాంతాల క్రోడీకరణ చివరిదశలో ఉన్న కాలంలో జీవించారు అని గ్రహించవచ్చు.

తేవారంలలో ఆకాలంలో ప్రవర్తిల్లిన మతాలను గురించిన ప్రస్తావన ఉన్నది. ఇవి "అకచ్చమయం", "పుఱచ్చమయం". మొదటి పద్ధతికి చెందిన మతాలేవో తెలియదు. ఇవి శైవమతానికి సంబంధించినవని సాధారణంగా నమ్మబడుతోంది. రాజమాణిక్కం (1958) తిరుమంతిరమ్‌ను అనుసరించి ఇవి 6 శైవమతశాఖలు అని వ్రాసారు కాని వాటిపేర్లు వ్రాయలేదు. వెంకచేమి (1959) ఇవి పాశుపత, కాపాలిక, మహావ్రత, భైరవ అనే నాలుగు శైవమత శాఖలని వ్రాసారు. దొరైస్వామిపిళ్ళై (1958) వాటిలో మూడింటిని పేర్కొన్నారు—పాశుపత, కాపాలిక, మహావ్రత శాఖలు. కాని ఇలా వ్రాయటానికిగల ఆధారాలను ఎవరూ పేర్కొనలేదు. తిరునావుక్కరసర్ తన రచనాలలో శైవ, పాశుపత, కాపాలిక, మహావ్రత మతాలను గురించి ప్రస్తావించారు. మత్తవిలాస ప్రహసనము ప్రమాణానికి మహేంద్రవర్మ I* రచించినదే అని అంగీకరించినా, అందులో పై శైవశాఖలు రెండే కనపడుతాయి—పాశుపత—కాపాలిక—మతాలు.

---

* ఇది మహేంద్రవర్మ I రచనే అని సామాన్యంగా అంగీకరించబడినా దాని రచనాకాలం సందేహాస్పదమైనది. దీనిలో ముఖ్యపాత్రలు మత్తులైన కాపాలికులజంట. వారితోపాటు ఒక పాశుపతుడు కొందరు భిక్షువులు వస్తారు. ఈ ప్రహసనంలోని వారందరి ప్రవర్తన ఆయా మతాల క్షీణదశను సూచిస్తుంది. ఈ శైవమతశాఖలు 12/13 శతాబ్దాల కాలంలో ఎప్పుడో క్షీణదశను పొందాయి. కనుక 7వ శతాబ్దం ఈ నాటకం వ్రాయబడడానికి మరీ ప్రాచీన కాలం.

7/8వ శతాబ్దాలకు చెందిన పల్లవులవలంబించిన మతాలను గురించి ఎంతోమంది చరిత్రకారులు వ్రాసారు. కాని ఆకాలపు పరిస్థితిని నూతన పునర్విమర్శన పద్ధతిలో విశ్లేషణ చెయ్యడం అవసరం. ప్రస్తుతము 7వ శతాబ్దపు పల్లవుల దేవాలయాలను పరిశీలిస్తే కనిపించే ఆకాలపు శైవమత మార్గమును గమనిస్తే చాలు. ఇది 'త్రిమూర్తి' ఆరాధన. ఇందులో బ్రహ్మ, విష్ణువు, శివుడు ముగ్గురు విగ్రహ మూర్తులలో ఆరాధించబడేవారు. శివుడు సోమాస్కంధమూర్తిగా ఆరాధించబడేవాడు. ఈముగ్గురిలో శివుడికే ప్రాముఖ్యం ఉండేది. ఆకాలపు ఆలయాల్లో విష్ణువు బ్రహ్మ శిల్పాలు కనపడతాయి—తరచు శివుని సోమాస్కంధ మూర్తి ఉన్న ఫలకంమీదకాని లేక పక్కనే అమర్చిన ఫలకాలమీదకాని. పల్లవుల శైవం పాశుపత పద్ధతిది అంటారు. (మహాలింగం, 1969) ఈ మతంయొక్క పరిణామదశలో కర్మకాండలోను, సిద్ధాంతము లోను కూడా ముఖ్యమైన మార్పులు కలిగాయని గమనించాలి భాసర్వజ్ఞుని రత్నటీక (క్రీ.శ. 940-980) పాశుపత మతానుయాయులు ప్రతిదినము సూర్యోదయానికి పూర్వము రెండుగంటలకాలం బ్రహ్మ, విష్ణు మహేశ్వరులను ప్రార్థించాలి అని చెప్తుంది. ఈ పద్ధతి పాశుపతమే 7వ శతాబ్దపు తొండైమండలములో ప్రాచుర్యంలో ఉండడానికి అవకాశము ఉన్నదా ?

తేవారం త్రయం దేవాలయంలోని ప్రధాన దైవంపట్ల, పూజాకాండపట్ల అనాసక్తంగా ఉన్నా వారు పౌరాణిక కథల సందర్భంలో వచ్చే లింగమును గురించి ప్రస్తావించారని ముందే చూసాము కనుక గర్భగుడిలో పూజింపబడే విగ్రహాలరమూర్తిని గురించి వారికి తెలుసునన్నది స్పష్టం. పల్లవులకు సంబంధించినంతవరకు వారి రాజ్యంలో లింగప్రతిష్ఠ జరిగిన ఆలయాలు లేవు. తేవారం త్రయం చేత పేర్కొనబడిన చోళదేశంలోని దేవాలయాలు 7వ శతాబ్దంలో ఇంకా కట్టించబడలేదు.

తేవారం త్రయం దర్శించి పాడిన శివాలయాలు వారిచేత పేర్కొనబడిన ఇతరదేవాలయాలు (వైప్పుస్థలములు) అసంఖ్యాకం. దీనినిబట్టి వారి కాలానికి ఆగమపద్ధతి పూజావిధానం దేశంలో స్థిర పద్ధతి అని తెలుస్తోంది. ప్రజలు ఈ ఆలయాలను దర్శించి వాటిలో ప్రతిష్ఠించబడిన దైవానికి ఆగమాలు విధించిన పద్ధతిలో పూజలు జరిపేవారు. తేవారం త్రయం అపేక్ష దీనికి వ్యతిరేకంగా దేవాలయాలలోని పూజాకాండతో విధులతో ప్రత్యక్ష సంబంధంలేనిది. వారు శుద్ధమైన అక్లిష్టమైన భక్తితో శివుని మహిమను, శక్తిని కీర్తిస్తూ పాడారు. ఈ విధంగా వారు మతానికి 'భక్తి' అంశాన్ని చేర్చారు. భాస్కరాచార్యుడు (10వ శతాబ్దం) అపరార్కుడు (12వ శతాబ్దం) వారి కాలంనాటి శైవము రెండు విధాలదని చెప్పారు: (1) ఆగమిక (పూజాకాండకు ప్రాధాన్యమిచ్చేది) లేక నైయాయిక శైవం. (2) పాశుపత (భక్తి ప్రధానమైనది) లేక వైశేషిక శైవం. వీరికి చాలా తరువాతి కాలంవాడైన హరిభద్రసూరి (14వ శతాబ్దం?) 4 రకాల శైవులను గుర్తించాడు - భారతులు, భక్తులు, లైంగికులు, తాపసులు. వీరిలో మొదటి తెగకు చెందినవారు కొన్ని ప్రత్యేక వ్రతాలకు నియమాలకు బద్ధులై ఉంటారు. దేవాలయాలలో పూజలు నిర్వహిస్తారు. తక్కినవారు దూరంనించి నమస్కారం చేసారు. తేవారం త్రయం ఇటువంటివారు, ప్రత్యేకించి 'భక్తులు' అయి ఉండడం ఎక్కువ సంభావ్యంకదా ?

తిరునావుక్కరసర్ తేవారంలు శివుడు 'మంత్రము' 'తంత్రము' మూర్తీభవించినవాడని, మానవశరీరమును దేవాలయమని వర్ణించుతాయి. మానవశరీరాన్ని దేవాలయంతో పోల్చడం కన్నడదేశపు వీరశైవ సాహిత్యంలో తరచు కనపడుతూ ఉంటుంది. ఇటువంటి పోలికలు రూపొందించబడడము, ఆగమ శాస్త్రాలలో క్రోడీకరించబడడము, 7వ శతాబ్దానికి చాలా తరువాతి కాలంలో దేవాలయాలు, వాటిలో పూజాకాండ ప్రజలపై గాఢముద్ర వేసిన కాలంలో — జరిగి ఉంటుంది.

విమర్శ-2

విమర్శ 1 లోని విషయాలు చర్చిసు స్పష్టడు నేను యథార్థంగా స్వీకరించిన విషయం ఒకటే - సాంప్రదాయం చెప్తున్నట్లు తేవారం త్రయం 275 దేవాలయాలను దర్శించారు అన్నది. వీటిలో చాలావరకు తమిళదేశం అంతటా వివిధ రాజ్యాల్లో ఉన్నాయి. కొన్ని మాత్రం తమిళదేశానికి బయటఉన్నాయి. వీటిలో తిరుక్కోనమలై, తిరుక్కేతీశ్వరమ్ (శ్రీలంకలోను, తిరుపరుప్పొదం, (శ్రీశైలం) ఇంద్రనీలపర్వతం అనేక తంగపటం, తిరుక్కేదారం, నొడిత్తాన్ మలై (కైలాస్) తమిళదేశానికి ఉత్తర దిక్కులోను ఉన్నాయి. వీటిలో కొన్ని హిమాలయ ప్రాంతాల్లో ఉన్నాయి. తేవారం త్రయం ముగ్గురూ కాని వీరిలో ఏ ఒక్కరుకాని ఈ ఆలయాలన్నింటిని, వారి కార్యకలాపాలకు ఇంతదూరంలోఉండే వీటన్నింటిని స్వయంగా (నిజంగా) దర్శించి ఉంటారా అనే ప్రశ్న సహజంగా ఉదయిస్తుంది.

ఈ సందేహం ఇంతకు పూర్వమే చాలామందికి కలిగి ఉంటుంది. తిరునావుక్కరసర్‌కు సంబంధించి. ఈ సందేహ నివృత్తి కోసం ఒక కథ కల్పించబడింది. ఆయన వృద్ధాప్యంలో కైలాస పర్వతానికి వెళుతూండగా, శరీర దార్ఢ్యం తగ్గిపోవటంవలన, దోవలో ఒకచోట అలసటతో క్రిందపడిపోయారనీ, ఈశ్వరుడు ఈ సంగతి

తెలిసి తానే అక్కడకువచ్చి తిరునావుక్కరసర్‌కు ప్రత్యక్షమయాడని ఈ కథ చెప్తుంది. ఈ కథ శ్రీలంకలోని హిమాలయాల్లోని ఆలయాలకు సంబంధించినంతవరకు తక్కిన ఇతరాలకికూడా సమానంగా వర్తిస్తుందేమో. తక్కిన వాటికి, కనీసం కొన్నింటికైనా, వారు వెళ్ళి ఉండగలరు.

తేవారం త్రయం దర్శించిన ఆలయాలనుగూర్చేకాక, వారి దశకాలలో, వీటి సంఖ్యకంటె కొద్దిగ అధికమైన ఇతర సమకాలిన ఆలయాల (వైప్పుస్థలాలు) ప్రసక్తి కూడా ఉన్నది. వీటిలో చాలా ఆలయాలు ఉన్న స్థలాల గుర్తింపు, స్థాన నిర్ణయము ఇంతవరకు చేయబడకపోయినా, 7వ శతాబ్దంలో తమిళనాడులో 500కు పైగా దేవాలయాలుండడం విస్మయం కలిగించే విషయం. కాని, ఈ ఆలయాలలో చాలాభాగం 10వ శతాబ్దంలో విజయాలయుడి వంశం పాలించిన చోళదేశంలో ఉండేవి.

పల్లవ వంశపు మొదటి రాజుల కాలంలో, రాజకీయంగా గుర్తించదగిన చోళవంశముగాని, వారికి చెందిన దేశంగాని లేదని మనము ముందే చూసాము. 7వ శతాబ్దపు పల్లవ చాళుక్య శాసనాలలో కనిపించే చోళదేశము "చోళమార్గ" దేశమనుకుంటే ఆదేశము చుట్టూ అన్నివైపులా ఇతర వంశీయులు పాలిస్తూ ఉండేవారు. 'చోళిక విషయం' చిన్నచిన్న రాజ్యాలుగా విభజించబడి, కొంగుళ్, పు[illegible]టు, ఆడియమాన్ మొదలైన వంశాలకు చెందిన చిన్నరాజుల చేత పాలించబడేది. తేవారం త్రయం చోళనాడులో మొత్తం 190 ఆలయాలను దర్శించారని చెప్పబడుతోంది. వీటిలో రెండు తప్పితే మిగిలినవన్నీ 'చోళిక విషయా'నికి అవతల తూర్పు దిక్కున ఉండేవి. ఈ తూర్పునఉన్న ప్రాంతాన్ని ఉత్తరంనుంచి దక్షిణంవరకు క్రమంగా పల్లవులు, ముత్తరయర్లు, పాండ్యులు పాలించేవారు. ఈ చివరి రెండు వంశాలు 7వ శతాబ్దంలో ఈ ప్రాంతంలో కట్టించిన ఆలయాలను గురించి మనకు తెలుసు. తేవారం త్రయం పాండ్యనాడులో 14 ఆలయాలను దర్శించారని అంటారు. కాని ఇవన్నీ మధురకి దక్షిణంగా ఉన్నాయి. అంతేకాక ఈ ఆలయాలు 7వ శతాబ్దంలో ఉండేవనడానికి ఎటువంటి ఆధారము లేదు.

ఇటువంటి పరిస్థితులలో 7వ శతాబ్దపు తమిళదేశంలో 500 శివాలయాలుండడం చాలా విభ్రమము కలిగించే విషయం. వాటిని కట్టించిన వారిని గుర్తించడము ఇంకా క్లేశమైన కార్యము. అయితే వీరు దర్శించారని చెప్పబడే ఆలయాలు స్థానవిస్తృతినిబట్టి నిర్మాణశైలినిబట్టి, ఒక ఆధారము కనపడుతోంది. ఈ ఆలయాలు కావేరి ఉభయ తీరాలలోను తిరుచ్చి నాగపట్నం మధ్య ప్రాంతంలో విస్తరించి కనబడతాయి. నిర్మాణశైలినిబట్టి, శిల్పశైలినిబట్టి ఇవి ఒకేపద్ధతికి చెందినవి. ఈ స్థితి ఈ ఆలయాలన్నీ ఒక ప్రత్యేక చారిత్రిక కాలానికి చెంది, ఒక పద్ధతి నిర్మాణ, శిల్ప శైలులకు చెందినవి అయి వుండకూడదా అనే ప్రశ్నను లేవెత్తుతున్నది.

ఈసందర్భంలో మనం ఇంకా అనేకతగిన అంశాలు తేవారం త్రయం కాలం 7వ శతాబ్దానికి చాలా తరువాతిది అవే సూచిస్తున్నాయని జ్ఞాపకముంచుకోవాలి. బాహ్య సాక్ష్యాలుకూడా దీనిని ధ్రువపరచడము చూసాము. పైన చేసిన విశ్లేషణ వలన తేలిన విశేషాలలో ముఖ్యమైనదొకటి శైవమతము అనేకమైన భిన్న శాఖలుగాను, భిన్నవర్గాలుగాను తేవారం త్రయం కాలంలో చీలి ఉండడం. వీటిలో ప్రముఖమైనది దేవాలయాలు కేంద్రంగా ఉండి, ఆగమ శాస్త్రాలకు విధేయమై, క్రియాకాండకు ప్రాధాన్యమిచ్చే 'లింగ' ఆరాధన. ఈ సన్నివేశంలోకి తేవారం త్రయం యొక్క పురాణచోదితమైన, ప్రేమపూరితమైన, కీర్తన ముఖ్యమైన భక్తి మార్గము ప్రవేశించింది.

/ ఇంకా వుంది /

గమనిక : మరొకభాగంతో ఈ రచన పూర్తి అవుతుంది. సా స్వామి తమ రచనతో ఇచ్చిన చిత్రపటాలు చివరి భాగంతోపాటు వేస్తాము [సం]

కలగూరగంప

"సాహిత్యంలో సృజన" - ఒక చర్చ

నవంబర్ 1976 భారతి సంచికలో శ్రీ తిరుమలరావుగారు 'సాహిత్యంలో సృజన' అనే వ్యాసంమీద చేసిన వ్యాఖ్యానాన్ని, 'చర్చ'గా సంపాదకులు ప్రకటించడంవల్ల, **అందులో పాల్గొనే అవకాశం లభించినందుకు పత్రికా సంపాదకులకు కృతజ్ఞతలు.**

వ్యాసకర్త అయిన శ్రీ సుదర్శనంగారు తానుచెప్పే విషయాన్ని ఒక పద్ధతి నిర్వచనాలతో (ఇప్పుడు వాడుకలో ఉన్నవే) వివరించడం ప్రారంభిస్తే, అసలా ఏర్పాటే నచ్చడం లేదంటూ తి.రా. గారు ప్రతిమాటకూ వాక్యానికీ అడ్డు తగిలిన ధోరణి చూస్తే సహృదయత లోపించినట్లు కనిపిస్తూన్నది. ఇంతకూ తి. రా. గారు **ఏందులో మౌలికంగా విభేదిస్తున్నారో బోధపడలేదు!**

1) సాహిత్యం, కవిత్వం, కథ, నవల-వీటి అన్నింటికీ ఒకే పేరు చాలునంటారా తి. రా. గారు? మరి ఇన్ని ఎందుకున్నాయో? మన పెద్దలు పూర్వం పిల్లలందరికి రామయ్య అని ఒకేపేరు పెట్టడం, తర్వాత పెద్ద రామయ్య, చిన్న రామయ్య అని పిలవడం చూచేకదా ఇప్పుడు మనం ప్రత్యేకమైన పేర్లు ఒక్కొక్కరికీ పెట్టుకోవడం! పేర్లు పెట్టడంలో "తార్కికత" మాటకువస్తే, తిరుమలరావుగారిని వేంకటేశ్వరరావుగారుగా ఎందుకు వ్యవహరించకూడదని తర్కిస్తే? పైగా 'తిరుమల' కొండపేరుగదా, దేవుని పేరైన వేంకటేశ్వరుని నామం పెట్టుకోవాలిగాని కొండపేరేమిటి మనిషికి? అంటూ తర్కాన్ని లేవదీస్తే ఎంతసబబుగా ఉంటుంది! సాహిత్యం—కవిత్వం—సృజన అన్నీ ఒకటే అయితే, ఇక విమర్శ ఎందుకు, విడదీయడ మెందుకు అన్న తి. రా. గారి వాదంలో సబబు కనిపించదు! "కవిత్వం అంతా సృజనే...సృజనకాని కవిత్వంలేదు", అన్న తి. రా. అభిప్రాయం ఎలా అంగీకరించేది? తన అంగట్లోవి అన్నీ వంకాయలే అంటాడు కొట్టువాడు, కాని కొనేవాడు చచ్చువీ పుచ్చువీ, పొడుగువీ పొట్టివీ అంటూ విభేదం చేసికదా కొంటాడు! కవిత్వంలో కూడా 'సృజన' అనే లక్షణం ఉన్నది. అది ఏది, ఎక్కడ అని విమర్శ చెయ్యడం తప్పకుండా అవసరమే! దాన్ని నిర్దేశించేందుకు క్లుప్తంగా ఆర్. ఎస్. గారు చేసిన ప్రయత్నం ఎన్నదగినదిగానే ఉన్నది. వివరాల్ని ఇంకా విపులంగా ఉంటే బాగుండేదేమో !

2) ఆర్. ఎస్. గారు మాటలకందేదాన్ని (ఇది కాకి, అది కడవ వగైరా) సృజన కాదంటూ, "మాటలకందని సంశ్లిష్టమైన అనుభూతిని మాటలద్వారా అందజేసే ప్రయత్నాన్ని" సృజన అంటూ నిర్వచించారు. ఇక్కడ 'ప్రయత్నం' **అనడంలో, ఫలితం పాఠకుల** సహృదయత, అభినివేశం వగైరామీదనే ఆధారపడుతుందని గ్రాహ్యం. 'ధ్వని' లక్షణమే ఇది. అందువల్ల ఆర్. ఎస్. గారు ధ్వని సిద్ధాంతాన్నే ప్రాతిపదికగా తీసికొని "సృజన"ని వివరించే ప్రయత్నం చేసినట్లు తోస్తుంది. కళ, సృజన ఆయన దృష్టిలో ఒకటే అని వ్యాసం చెబుతూంది. "కళ" అంటే తి. రా గారు అనుకున్నట్లు టెక్నిక్ (శిల్పం)కాదు. బాపిరాజుగాని, పెద్దనగాని ఎక్కడ వాచ్యంగా వర్ణిస్తున్నారో అక్కడ టెక్నిక్ ఉండవచ్చుగాని అది 'సృజన' అనిపించుకోదు, అలా అని పెద్దన కావ్యం మొత్తంలో సృజనలేదనీ అర్థంకాదు. పాత్రపోషణలో 'ఉన్మీలన పద్ధతి' అని తి. రా. గారు దేన్ని అంటున్నారో దాన్నే ఆర్. ఎస్. గారు సృజనఅని గుర్తిస్తున్నారు. ఇది స్పష్టమే. సాహిత్యంలో 'కళ' (Art and not technique) సృజనాత్మకమని బోధపడుతూనే ఉంది. అది కథలో, నవలలో కేవలం వాచ్యమైన పాత్రవర్ణన కాదనీ, రసాత్మకమూ ధ్వనిపూర్వకమూ అయిన పాత్రోన్మీలనమని ఉదాహరణ ఇచ్చారు. పాత్రోన్మీలనం కళ. అందులో సృజన ఉన్నది. ఎందుకంటే ఆ పాత్రను పదిమంది పదిరకాలుగా అర్థం చేసికోవడానికి వీలుంటుంది (ఉ: హేమ్లెట్) ఇదే 'మాటలకందని' అనుభూతి, కాని మాటలద్వారానే అభివ్యక్తమైనది కూడా.

3) వీణనుచూచి కోటి రత్నాలవీణ అంటే అది వర్ణనాత్మకమైన కవిత్వం కావచ్చుగాని సృజనాత్మకమైన కవిత్వంకాదు. 'తెలంగాణ'నూ, 'కోటిరత్నాల వీణనూ' కలపడంవల్ల "సృజన" అయింది. ఇది కేవలం ఉపమ కాదు. ఉపమలో ప్రత్యక్షంగా గుర్తింపదగిన లక్షణాలు రెండింటా ఉంటాయి. తెలంగాణకూ రత్నాల వీణకూ అటువంటివేమీ లేవు. ఇక్కడ పాఠకుని భావుకత, అతని అనుభూతి, ఆలోచన. అవసరం అవుతూ ఉన్నాయి. ఉపమ ఇక్కడ "ప్రతిమ" (Image)గా, 'ప్రతీక' (Symbol)గా మార్పు చెందడంలో, అంతదాకా అనూహ్యంగా ఉన్నదేదో క్రొత్తగా సంభావ్యం కావడంలో, దాని బహుళ వ్యంజకత్వంలో, 'సృజన' ఉన్నది.

4) "ఆర్.ఎస్.గారు సృజనను రసానికీ ధ్వనికీ దిగజార్చిరి." అంటారు తి. రా. గారు. ఇందులో 'దిగజార్చడ'మేమిటో బోధపడలేదు. "రససిద్ధాంతం వంటుఇంటినుండీ, ధ్వనీ, వక్రోక్తి పగటివేషగాళ్ళనుండీ, విదూషకులనుండీ దిగుమతి అయిందని" చెబుతున్న తి. రా. గారి వైదుష్యాన్ని గూర్చి మనం చర్చించనక్కరలేదు! కవిత్వంలో 'అంతుచిక్కని కిటుకు' అంటూ దాన్నిగూర్చి ఆనందవర్ధనుడుగాని, మరెవ్వరుగాని, చర్చించడానికి వీల్లేదు. అదే దృష్టితో తి. రా. గారు వ్రాస్తున్నారు. పైగా ఆ 'కిటుకు'ని ఎవరైనా కనిపెట్టగలరా అని సవాలుకూడా చేస్తున్నారు. "మీరు చెప్పేది వినను. ఖండిస్తాను. నేను చెప్పేందుకు ఏమీలేదు." అన్న తి. రా. గారి ధోరణి ఎవరికీ అంతుపట్టేదికాదు. దీన్ని సాహిత్య విమర్శలో 'నిహిలిజం' అనవచ్చునేమో !

5) ఆర్. ఎస్. గారి వ్యాసం రెండవ భాగంలో 'రచయిత దృక్పథం' నుంచీ "సృజన"ను విచారించే ప్రయత్నం జరిగింది. 'రచయిత దృక్పథం' నుంచీ అంటే రచయితపట్ల సానుభూతితో

అతని రచనను చూడడం అని తి. రా. గారు అర్థంచేసుకోవడం కాదిక్కడ! రచయిత దృక్పథంనుంచి అంటే, వ్యక్తిగా రచయితకు అతని సమకాలీన సమాజానికిగల సంబంధంలో రచయితపొందే అనుభూతీ, సంఘర్షణా, ఏ విధంగా కొత్త రకం సాహిత్యానికి లేక కవిత్వోద్యమానికీ దారితీస్తుందో సూత్రీకరించే ప్రయత్నం చేశారు ఆర్. ఎస్. గారు. ఈ సూత్రీకరణతో అందరూ ఏకీభవించకపోవచ్చు. కాని ఆర్. ఎస్. గారు ఏమి చెబుతున్నారో తెలుసుకునే ప్రయత్నం చేయాలికదా! ఒక కవి సృజనాత్మక కవిత్వం వ్రాసినంత మాత్రాన ఉద్యమకర్త కాకపోవచ్చు. కాని ఆ కవిలోని వైయక్తిక చేతనకూ యుగ చేతనకూ బింబ ప్రతిబింబ సంబంధం కుదిరినపుడు ఆ కవి ఉద్యమకర్త కావడం తటస్థిస్తుంది. అందుకే శ్రీశ్రీ బాధ లోకం బాధ ఒకటయ్యాయనే చలం వాక్యాన్ని ఉదహరించడం జరిగింది. ఇక్కడ కవికి లోకంమీద సానుభూతి ఉండడం ఒక్కటేకాదు ప్రధానం. 'లోకంబాధ' అంటే ఆనాటి సామాజిక చైతన్యం అని అన్వయం. "కృష్ణశాస్త్రి 'కృష్ణపక్షం'లో అభివ్యక్తమైన అనుభూతికి ఆనాటి సాంఘిక పరిస్థితులకు ఎలాటి సంబంధం కన్పించదు." అంటారు తి. రా. గారు. సాంఘిక పరిస్థితులు వేరు. సామాజిక చైతన్య స్వరూపం వేరు. సాహిత్యంలో దాని అభివ్యక్తి ఎలా ఉంటుందో ఆర్. ఎస్. గారి మరో వ్యాసం "తెలుగు సాహిత్యంలో సామాజిక చైతన్యం" (సమాజము సాహిత్యము గ్రంథంలో) చూస్తే బోధపడుతుంది. "నవ్య సాహిత్యంలో ప్రతిఫలించిన చైతన్యంయొక్క స్వరూపం" ఏమిటి అని ప్రశ్నిస్తే మనకు ముఖ్యంగా కనిపించే విశేషం, మానసికమైన సంకెళ్ళు విడిపోవడం.. అందులో మొదటిది ...పెండ్లితో నిమిత్తం లేకుండా ప్రేమించడం... ఇది ఒక స్వేచ్ఛ ఒక సాహసం...ఈ ప్రేమ అనంతమైన నిస్పృహ, నిర్వేదమే కావచ్చుగాక; ఇది ఉదాత్తమైన, సవ్యమైన, నవ్యమైన అనుభూతి ..." (సమాజము-సాహిత్యము, 14వ పేజి). కృష్ణశాస్త్రి అలా 'భావ కవిత్వా'నికి ఉద్యమకర్త అయ్యారు. ఏమంటే రాయప్రోలు, గురజాడ వ్రాసింది 'నవ్యకవిత'గాని 'భావ కవిత' గాదు! "శ్రీశ్రీ లో మార్క్సిస్టు వీచికలు వచ్చేప్పటికి, 1930 లు పరిశీలిస్తే దేశం దుర్భిక్షంగా ఉండేదని తెలుస్తుంది" అంటారు తి. రా. గారు. ఆర్థిక మాంద్యం రావడం, నిరుద్యోగం ప్రబలడం ఆరోజుల్లోనే అని వారు విస్మరించారు. "సమాజంలో నిద్రాణమై ఉన్న వర్గం రాజకీయ చైతన్యంద్వారా క్రమంగా మేల్కొనడం ప్రారంభమయింది." (సమాజము-సాహిత్యము, 18 పే.) దీన్ని ప్రతిఫలించిన కవిత్వం శ్రీశ్రీ వ్రాయడమే 'సృజన'. అయితే కవుల పరంగా 'సృజన'ను గూర్చి ఇలా వ్యాఖ్యానించడంలో ఆర్. ఎస్. గారు తమ వ్యాసంలో పూర్వార్ధంలోనూ ఉత్తరార్ధంలోనూ "సృజన"కు ఒకే అర్థం ఇస్తున్నట్లుగ తోచదు! మొదటి భాగంలో 'సృజన' అంటే 'ధ్వని'. రెండవ భాగంలో 'సృజన' అంటే రచయిత చైతన్యంద్వారా సామాజిక చైతన్యం అభివ్యక్తి కావడమూ, అందులోనూ మార్గనిర్దేశం ప్రథమంగా చెయ్యడమూ అయినట్లు ఆర్. ఎస్. గారు వివరించారు 'సృజన' అనేదాన్ని సాహిత్యంలో ఒక విశిష్ట లక్షణంగాను, మళ్ళీ దాన్నే కవి చైతన్యంలో ఒకానొక దేశ కాల-నిబద్ధమైన అభివ్యక్తిగాను, రెండు విధాల వర్ణించడం గుణమో దోషమో, ఆ రెండింటికీ సమన్వయం ఉన్నదో లేదో, విజ్ఞులే నిర్ణయించాలి. ఆర్. ఎస్. గారు వివరించాలి.

— శ్రీ జి సత్యనారాయణమూర్తి

'సాహిత్యంలో సృజన' పై చర్చ

ఆగస్టు భారతిలో 'సాహిత్యంలో సృజన' అన్న వ్యాసం వచ్చింది. సాహిత్యంలో సృజన అంటే ఏమిటో వివరించి అది రచయితలోనూ, రచనలోనూ, పాఠకునిలోనూ—మూడు సందర్భాల్లోనూ ఎలా వ్యక్తం అవుతుందో టూకీగా అయినా చక్కగా స్పష్టంగా చెప్పారు శ్రీ సుదర్శనంగారు.

రచనా వ్యాసంగం యావత్తూ సాహిత్యమనీ; భావయిత్రీశక్తి ఉపయోగించాల్సిన దానిని సృజనాత్మక సాహిత్యము లేక కళ అనవచ్చుననీ, కవిత్వం, కథ, నవల, నాటకం అనే ప్రక్రియలూ యీ కోవలోనివనీ విభజించారు.

ఈ వ్యాసంపై నవంబరు భారతిలో శ్రీ సర్వేశాయి తిరుమలరావుగారు చర్చ లేవదీస్తూ, శాస్త్రాన్ని సాహిత్యం అనకూడదన్నారు. బాగానేవుంది. కాని సాహిత్యమంతా కవిత్వమనీ, కవిత్వమంతా సృజన అనీ, కాబట్టి సృజనాత్మక సాహిత్యం అనేది అర్థంలేని మాట అని అనటం విచిత్రంగా వున్నది కథనూ, నవలనూ, నాటకాన్నీ కవిత్వం అని యిప్పుడెవరూ ఒప్పుకోరు. పైగా కవిత్వం అనే పదానికి ఒక ప్రత్యేకార్థం రూఢమై వున్నది. వీరు యిలా అనటం హాస్యాస్పదంగా వున్నది. (కవిత్వం!) సాహిత్యమంతా సృజన ఎలా అవుతుంది! పాఠకుల మనస్సులో ఒక భావాన్ని సృష్టించలేనిది సృజనాత్మకం ఎలా అవుతుంది? ఇప్పుడు వస్తున్న అపారమైన చచ్చుకవిత్వం, కథలూ, నవలలూ అన్నీ సృజనాత్మక సాహిత్యమంటారా? లేక అది సాహిత్యమే కాదనుకుంటారా? అప్పుడు దాని నేమంటారు?

మాటల కతీతమైన అనుభూతిని మాటలద్వారా అందించటమే సాహిత్యంలో సృజన అనీ, అది 'రసము' 'ధ్వని' అన్న రూపంలో వుంటుందనీ సోదాహరణంగా వివరించారు వ్యాసకర్త. దానిని ఉపమ అతిశయోక్తి అని స. తి. రా. గారు ఎలా అర్థం చేసుకున్నారో! ఆఖరికి వీరేం తేల్చారూ అంటే సృజన రహస్యాన్ని గూర్చి ఎవరూ చెప్పే ప్రయత్నంకూడా చెయ్యకూడదని!

ఆ కాలంలోవుండే శృంఖలాల్ని త్రెంచుకోవడం, ముందడుగు వెయ్యటం అనేది వ్యక్తిలోని సృజనాత్మకతకు చిహ్నాలు. వాటికి 'నవీనత'కి సంబంధంలేదు. నవీనత అంతా సృజన కాలేదు. నేటి క్రొత్త రేపటికి ప్రాతబడుతుంది గనుక క్రొత్త అనేదే లేదని వాదించటం కుతర్కం.

పరప్రభావాల ఛాయలు లేకుండా, పూర్తిగా తనదైన వ్యక్తిత్వపు తొణుకులుంచే రచయితయొక్క సృజన వస్తుందనీ; అటువంటి సమగ్రమైన వ్యక్తిత్వానికీ సృజనకూ అవినాభావ సంబంధం వుంటుందనీ వ్యాసకర్త చక్కగా చెప్పారు. దాన్ని అర్థంచేసుకోకుండా స.తి.రా. గారు 'మౌలికత' అన్న పదాన్ని పట్టుకుని పీకులాట ప్రారంభించారు. సృజనకు సమగ్రమైన వ్యక్తిత్వం అనవసరం అంటారా వీరు? కోయిల కూత కవి ఆనందానుభవంనుంచీ, ఏ సమగ్రమైన వ్యక్తిత్వంనుంచీ వస్తుందో వీరికి అర్థం కావేకాదు!

కొండవీటి చాంతాడులాంటి వీరి చర్చ చదివితే, వీరికి సాహిత్యంలో సృజన అనే గుణం ఎలా వుంటుందో తెలియక తికమక పడుతున్నట్టు అనిపిస్తున్నది శ్రీ సుదర్శనంగారి వ్యాసాన్నే ఒకటికి పదిసార్లు చదివి మననం చేసుకుంటే ఫలితం కనిపించవచ్చు.

—"సాహిత్య విద్యార్థి"

లేఖలు

శ్రీ సోమసుందర్, శేషేంద్రజాలంపై శ్రీ రామాచంద్రమౌళిగారి విమర్శ చదివాను. ఆమూలాగ్రం సోమసుందర్ అభిప్రాయాలను ఖండించడానికే చంద్రమౌళిగారు ప్రయత్నించారు. ఇరవయ్యొకటో శతాబ్దానికి ఉపస్తారగా శేషేంద్ర కవితను సోమసుందర్ ఎందుకన్నారో విమర్శకులు కొంతైనా గ్రహించివుంటే బాగుండేది. శేషేంద్రజాలం నిష్పక్షిక విమర్శ అని ఎవరైనా అంగీకరిస్తారు. శేషేంద్ర కవితకు సో. సు. మనసిచ్చుకున్నట్టు అందుకే కవితను ఆకాశాని కెత్తినట్టు విమర్శకులనడం సబబుగా లేదు. ఆ గ్రంథంలో చాలచోట్ల శేషేంద్ర కవితలోని లోపాలను కూడా రచయిత సోదాహరణంగా పేర్కొన్నారు. పక్షులు, కవితా గానం బాసురాలే కాని చాలా సామాన్యాలు, (శేషేంద్రజాలం 42 పేజీ)

"సూర్యుడు ఈ శుభదినాన్ని మోసం చేయనివ్వను, అన్నచోట ఇది ఒక కవితా వాక్యంగా రమణీయంగానే ఉంది. కాని పూర్వ కవితారంగానికీ, దాని ప్రాదుర్భావానికీ ఒక సమన్వయం(Congruence) సంధించబడలేదు. (శే. జా. 81 పేజీ,) ఇట్లాంటివి పుస్తకంలో కొల్లలు. పరిశీలనం మొదటి వాక్యాలలో సోమసుందర్ శేషేంద్ర కవితా లక్షణాలనూ, ఆ కవిత్వతత్వాలనూ ఎన్నో వాగాలరహస్యాలతో భూతద్దం క్రింద పెట్టి చూపించారు, అన్నారు విమర్శకులు. తుదివాక్యాలలో వారికి నచ్చినవాటినిమెచ్చుకుంటూ, శ్లాఘిస్తూ అంబరవీధుల్లోకివెళ్ళిపోయారు అంటూ ప్రఖ్యాత విమర్శకుడు I. A. Richards మాటల నుల్లేఖించారు. ఇది స్వవచన వ్యాఘాతం కాదా! తెలుగునకున్న వ్యాకరణ దీపము చిన్నది అని చెళ్ళపిళ్ళ వారన్నట్లుగా తెలుగునకున్న విమర్శా దీపముకూడా చిన్నదే. ఇంకా తెలుగు సాహిత్యంలో విమర్శా ప్రక్రియ వృద్ధి కావలసి వున్నది. ఈనాడు వెలువడుతున్న, వస్తున్న విమర్శలు సమదృష్టిని ప్రతిబింబించలేకపోతున్నవి. ఏవో సిద్ధాంతాలు, రాజకీయాలు తూకపురాళ్ళుగా సాహితీ విమర్శ కొనసాగుతున్నది. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత ఇస్మాయిల్ అన్న మాటలను మనం గుర్తించాలి.

"శ్రీ శ్రీ గురించి నిష్పక్షికమైన కేవల సాహిత్యాత్మకమైన Assessment ఇంతవరకూ రాలేదు. దీనికి అనుకూలమైన [illegible] మైన వాతావరణం తెలుగు విమర్శలో ప్రస్తుతం లేదు. [illegible] రాజకీయ కలాపాల్లో కూచుని బెకబెకలాడుతున్నారు మన [illegible]లు.

హర్షుని నైషధముముందు శృంగార నైషధము తీసికట్టు అనే మహాకవులూ వ్యాసుని కవిత సూర్యకాంతే, తిక్కన కవిత చిన్ని దీపమనే పండితులూ ఉన్నట్టే శేషేంద్రశర్మను కవిగా గుర్తించలేను, అనే గోరాశాస్త్రులుకూడా ఉన్నారు. శృంగార నైషధము మహాకావ్యం కాలేదా? తిక్కనది కైతవ్యాసుని దిద్దినాడు, అని కవి బ్రహ్మ గౌరవింపబడటంలేదా? శేషేంద్ర కవితక్కూడా వేడెక్కిగుండెలును కరిగించడంలేదూ! ఆయన కవితనిండా ఎన్నో పదాలు కొత్త రూపాల్ని సంతరించుకున్నాయి. పాత పదజాలాన్ని త్రోసివైచి మృదుమధుర పద ప్రయోగాలను తెలుగు కవితకు కైసేసినవారు మహాకవి దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు. ఆయన తర్వాత సరికొత్త ప్రయోగాలు దండిగా చేస్తున్న కవి శేషేంద్రశర్మ ఒక ప్రతిభావంతుడైన కవి చూపిన కవితామార్గంలో అనేకమంది కవులు పయనించడం సాహిత్య చరిత్రలో కొత్త కాదు శ్రీ శ్రీ రీతినీ, పదజాలాన్నీ ఎంతమంది అనుకరించలేదు? శేషేంద్ర ప్రభావం ఫలానా వారి కవితలలో కన్పిస్తుందని గ్రంథ రచయిత అంటె విమర్శకులకెందుకంత కినుక!

మాటల కందని సంశ్లిష్టమైన అనుభూతిని మాటలద్వారా అందజేసే ప్రయత్నమే సాహిత్యంలో సృజన. సాహిత్యంలో సృజనకు వ్యక్తిలో నిత్యనూతనత్వం అవసరం. ఇదే సాహిత్యంలో నవనవోన్మేషిత్వం - ఆర్. యస్. సుదర్శనం. ఈ దృష్టితో చూస్తే శేషేంద్ర కవిత ఎంత ఆహ్వానింపదగిందో రసజ్ఞులకు తెలియనిదికాదు. ప్రఖ్యాత కవి టి యస్. ఇలియట్ 'Novelty is better than repetation' అన్నట్టుగా కవిత్వంలో కొత్త ప్రయోగాలు జరగాలి. విమర్శకుల దృక్పథాలలో సైతం మార్పు రావాలి. మరుపూరు వారన్నట్టు మన విమర్శకులు పిడుగులనుమా తం కురిపించి సాహిత్యలోకంలో క్రొత్త త్రోవలను చూపడం మరచిపోతే ప్రయోజనం నాస్తి.

శ్రీ రామాచంద్రమౌళి పరిశీలనాత్మక విమర్శవల్ల అటు కవికీ ఇటు శేషేంద్రశర్మ కవితా పరామర్శచేసిన సోమసుందర్‌కూ న్యాయం జరుగలేదు. పరిశీలనం పాక్షికంగా సాగడమే అందుకు కారణం. దోషాల నెత్తి చూపుతూ, గుణాలనూ పేర్కొనడం ఉత్తమ విమర్శకుని లక్షణం కాబట్టి ముందుముందు విమర్శలైనా పరపత్యయనేయబుద్ధిని ప్రతిబింబించకుండా వెలువడాలనే ఆకాంక్షతో ఈ నాలుగు వాక్యాలు వ్రాస్తున్నాను.

తిరునగరి

కులాలుడు - రజకుడు

'కుండలు చేయువానిని కులాలుడు అందురు. రజకుడు దుస్తులు తెచ్చెను.' ఈ రెండు వాక్యాలూ మన ప్రభుత్వంవారి రెండవ తరగతి తెలుగు పుస్తకంలోనివి. మేమంతా కుమ్మరి చాకలి అంటాము. ఈ పుస్తకం వ్రాసిన పండితులు కులాలుడు, రజకుడు అంటారు కాబోలు. మన ప్రభుత్వము వారు ఏదో ఆలోచించి కొమ్ములు తిరిగిన పండితులను పాఠ్యపుస్తకాలు వ్రాయమని నియమిస్తే, అయ్యవారిని చేయబోతే కోతి అయినట్లు తయారయినాయి. ఇకనైనా ఈ పండితుల బారినుంచి పసిపిల్లలను కాపాడవలసినదిగా ప్రభుత్వానికి నా విజ్ఞప్తి.

— శ్రీ తి. మోహనరావు
హిందూపురం.

అక్టోబర్ నెల భారతిలో శ్రీ బండి నాగరాజు మరుపూరి కోదండరామరెడ్డిగారి సమీక్షపై చేసిన విమర్శ తగిన స్థాయిలో లేదని చెప్పవలసి వస్తుంది.

ముందు శ్రీ నాగరాజుగారు "తోటి" 'తోడి' శబ్దాలపై చేసిన కూలంకష చర్చకు అభినందనలు తెల్పాలి. ఈ రెండు పర్యాయ పదాలవంటివని వారు వ్రాక్కుచ్చారు. ఈ రెండు శబ్దాలు వేర్వేరు అర్థాలిస్తాయనడంలో మరుపూరిగారు బహుశా పొరబడి వుండవచ్చు. అయినప్పటికి అవి తప్పే. కాని రెండు శబ్దాలు ఒకే అర్థాన్నిచ్చినా, ఈ పదం బదులు మరోపదం వాడివుంటే కవిత మరింత సొగసుగా వుండేదనో, ఈ పదంవల్ల కవిత్వం తగినంత గాంభీర్యం రాలేదనో చెప్పే 'హక్కు' విమర్శకునికుంది. కాని శ్రీ నాగరాజుగారు దీన్ని త్రోసి రాజంటున్నారు. నిలకడగా తమ లేఖ చదివితే వారికీ విషయం అవగతం కావొచ్చు.

శ్రీ నాగరాజువారు, కేవలం 'తోటి' 'తోడి' శబ్దాలపై చర్చ చేసారు కాని, విమర్శకు ఉదహరించిన, ఇతర పదాలపై వ్యాఖ్యానించలేదు. 'కడుపునిండా...పాట నిండా' వంటి ప్రయోగాలు అర్థశూన్యమని, అవి కవి భావ శూన్యతకు దర్పణంవంటివని అందరకూ గోచరమవుతుంది. శ్రీ నాగరాజువారు, తమకు అనుకూలం కానిచోట లౌక్యంగా తప్పుకొన్నారు. ఇది వారి చిత్త శుద్ధిని శంకింపజేస్తుంది.

మరుపూరివారు తమకు సామెతలు ఎక్కువ తెలుసన్నారు. ఇది 'స్వకుచ మర్దనంకాదు'. "నా పొట్ట సామెతలపుట్ట" అనకుండా వారు "నేను ఆధునికాంధ్ర సాహిత్య మూలస్తంభము"నో మరోటో అనిఉంటే వారికి ఈ విమర్శ అన్వయించేది. అర్థం ఒక్కటే అయినా చెప్పే భాషలో భేదముండాలి.

ఒక్కమాట. విమర్శకుడు వేరు. కవి వేరు. ఇరువురను ఒకే త్రాసులో తూచరాదు. విమర్శకునిలో కొంత అహంకారం పొడచూపినా నష్టం లేదుకాని, కవి అహంకారియైతే అటు కవిత్వానికి, ఇటు సాహిత్యానికి తీరని లోటు.

— డా. ఎసం శ్రీధర్



గ్రంథ విమర్శలు

అలక

[(కథా సంపుటి) పుటలు: 60 వెల రు 2-50. రచన: కసిరెడ్డి కస్తూరి, ప్రచురణ: హితసాహితి, కామారెడ్డి, నిజామాబాదుజిల్లా.]

నేటి కథా సాహిత్యం ప్రతి వారిలోనూ తాముా కథలు వ్రాయా లనిపించేటంత ఆరాటాన్ని, ఆలోచనను కలిగించేంతగా విస్తరిస్తోంది. ఆ ప్రభావంతో, అస్పష్ట భావాలతో కలం పడుతున్నవారు అసంఖ్యాకంగా కనిపిస్తారు. దీనివల్ల కథా ప్రపంచం పెరుగుతోందేకాని, రచయితల్లో ప్రతిభా వ్యుత్పత్త్యభ్యాసాలు పెరగటంలేదు. లోకంలో ఏవో ఎక్కడో జరిగిందన్న భావనలో మనల్ని కళ్ళు తెరచి చూడమని హెచ్చరిస్తూ ఈ రచయిత్రి వాటిని కాయితాలమీద పెట్టి ఈ అలకను రూపొందించారు. వీనిలో చాలవరకు అసమగ్ర వర్ణచిత్రాలుగానే భాసిస్తున్నాయని చెప్పక తప్పడంలేదు.

రచయిత్రి చిత్తశుద్ధికి ప్రతీకలుగా ఇతివృత్తాలువుండి, అస్పష్ట భావ రేఖాల పదాలతో పొదగబడ్డ ఈ కథలు కొందరికి మాత్రమే ఆనందాన్నిస్తాయి. ఉదాహరణకు కథల్లో వీరి తెలంగాణ పలుకుబళ్ళు విస్తారంగావుండి సార్వజనీనతా లోపానికి గురియవుతాయి. ఆకలి, పశువులు, భిక్షుకి వంటి కథల్లో రచయిత్రి లక్ష్యం స్పష్టంగా గోచరిస్తుంది. "ప్రథమ కబళే మక్షికాపాతః" అన్నట్టు మొదటి కథలోనే తను వింతయైన శైలితో పాఠకుని గందరగోళ పరుస్తారు. "కుక్కతోక" అన్న కథ అత్యవసర పరిస్థితికి సంబంధించిన కథవంగా కన్పిస్తుంది. "ఇది కథకాదు" అన్న కథలోని ముగింపు చాల అర్థవంతంగావుంది. అకారణ కార్పణ్యాలకు, కులజాతరలకు విలయమైన పల్లెటూళ్ళ జీవనాలకిది తొలిపలుకే. 'సువ్వాల చెన్నా' కథ నేటి లోకానికి చక్కని సెట్టైరు. పెద్దోళ్ళ వినాదాలకు మోసపోయిన బడుగు జీవుల ఉదంతం, ఎన్నికల కలలు కల్లలుకాగా తిరిగి కులవృత్తిని చేపట్టిన యెల్లని కథ రసవంతంగా వుంది.

"వాళ్ళకున్నంత ఆకలి మనకే వుంటే యీ భూమి యిలాగే వుండేదికాదు" లాంటి అందమైన భావాలు చెప్పగల రచయిత్రి శైలీ విన్యాసం ప్రారంభ కథల్లోకన్న పోను పోను పరిణతమై కన్పిస్తుంది. అన్నిటిలోకి "గురితప్పింది" కథ ఉత్తమమైనది. ఇందులో రచయిత్రి చూపిన వేర్పు కూర్పులు నిసర్గ సుందరంగావున్నాయి. కథల యితివృత్తాలను అందంగా చిత్రీకరించిన ముఖచిత్రం మెచ్చగావుంది. కొన్ని ముద్రారాక్షసాలు యిందులో దారుణంగా వున్నాయి. గులయిపోయె, పూర్తై యింది, బుద్ధి భావమేంటి? డొక్కరిల్లు, ఉండుంది, అడుగాలేం – ఇత్యాదులూ చిత్తకార్తి కుక్కల మొరుగుళ్ళు వంటి ప్రయోగాలు రచయిత్రి నోటరాదగ్గవికావు.

సాధనాబలంచేత, మరింత సంయమన ... తేత. సంపాదిత భాషాధికారంతో రచయిత్రి ఉ... ... వెలవరించా లనే భావం ఈ గ్రంథపఠనం కలిగిస్తుంది ... కవ రమైన భావనాబలం, లోకజ్ఞత రచయిత్రికి పుష్కలంగా ఉన్నదనుటంలో సందేహంలేదు.

తంగేడుపూలు

[(వచనకవితా సంపుటి) పుటలు: 64 వెల: రు. 3-00 రచన: ఎన్. గోపి. ప్రచురణ: చైతన్య ప్రచురణలు, హైదరాబాదు. ప్రాప్తిస్థానం: నవయుగ బుక్‌హౌస్, సుల్తాన్ బజారు, హైదరాబాదు ఆం. ప్ర.]

కారాలూ, మిరియాలూ నూరే విప్లవ వాదుల కవితల్నీ, వెన్నతట్టి బుజ్జగించే సమరస వాదుల కవితలూ వచన గంగాలహరులై నేడు సామాన్యులను తడుపుతూ, ధీమాన్యుల సుక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఏది అనుభూతిదాయకమో, ఏది ఆలోచనాత్మకమో, ఏది అసమగ్ర చిత్రమో అనేది పాఠకులు నిర్ణయించుకోవాలిన ప్రశ్న. నేటి కవితల్లో చాలవరకి ప్రశ్నలకు ప్రత్యుత్తరం యివ్వలేని స్థితిలో వున్నాయి. ఏం చెప్పాం అన్న దానికన్న మిన్నగా ఎలా చెప్పాం? అనే దానికి ప్రతిపత్తి పెరగటం కవిత్వంలో సందేశాత్మకతకు, సమగ్రతకు అంతరాయంగా వుంటోంది. ఈ అంతరాయాన్ని అధిగమించి నదీ 'తంగేడుపూలు' కవితా సంపుటి.

యువభావుకులైన గోపిగారు యీ మువ్వదిపూల సుగంధాన్నందించటానికి "స్వతంత్రతా వర్మీకాన్ని బద్దలు కొట్టుకొని" వచ్చారు. "తంగేడుపూలు అంటే ఒక్కకోను, బంగారుపూలు" అని కవి ఖండికలో భంగ్యంతరంగా తన కావ్యాన్ని ప్రస్తుతించుకున్నారు. అవునని అంగీకరిస్తున్నారిందులో. ధ్వని వైభవాన్ని మెచ్చుకున్న అచ్చమైన వచన కవితాపితామహులు కుందుర్తి వారు.

"కత్తికీ మిత్తికీ కలహం రావాలి. కత్తి కొత్త సిద్ధాంతాన్ని వెలిగించే వత్తిగా మారాలి" అంటూ ఆశావాదాన్ని లనలో జీర్ణింప జేసుకున్న రచయిత హృదయ స్ఫూర్తిగా చాల కవితలు కనిపిస్తాయి. అయితే "ఎవ్వరైతేనేం మా బువ్వ తిననిస్తే చాలు" అనే నిర్లిప్త వైఖరి నొకచోట అనుసరిస్తూ అందులోన చివరిగా "రెక్కలచాటున పడుకున్న నిప్పును లేపకండి" అనటం స్వవచో వ్యాఘాతంగా వున్నా, రచయిత సందిగ్ధ మనస్తత్వాన్ని, అందుండిన క్రమహీనాన్ని గోచరింప జేస్తుంది. అయితే "తన కాయుష్యంతన కార్యోం" అనే పద్ధతి యీ కవి ప్రవృత్తి కాబోలు అని భ్రమపడే ప్రమాదం యీ ఖండికలో వుంది.

"శోకోపహతుని వేగతం" కవి ప్రతిభా సంపన్నతకు ప్రతీక. "రాలు పులకించగా పాడాలని సాగిపోయే" ఆశావాదమే యీ ... వచన కవితా కర్తల కూపిరి. జడత్వంలోంచి, యుగభానుడు కవితలు కవి ఆత్మీయతకు, అతని యెదిగిన యెదను పట్టిచూపుతాయి "చినుకుల చిరుసంగీతంతో చిగురు పెడదను సుస్మితంగా మీటింది"లాంటి భావకవనాలు ఈ కావ్యంలో కోకొల్లలు.

"సమాజపు బజార్లో దయాధాన్యం దొరకదు, తుపాసులో మత్తీ కీడల్ని పట్టుకున్నావు అని కాలసర్పాలై కాటువేశాయి"లాంటి ఆలోచనాత్మక, పరిహాసాత్మక ధోరణులు సరసంగా వున్నాయి. నీలో సంస్కరణ, ఇంకెక్కడి కలలు అనుభూతి నొనగలేని ఉత్త కవితలు వచ్చు రత్నాల ప్రక్కనే రాళ్ళుండటం సహజం. "హ్యాపీ న్యూ యియర్" అన్న కవిత సమకాలిక సమాజానికి చురక. "పంచలులేని మీకు ఫ్లాట్ ఫారాలున్నాయిగద?" అని ప్రశ్నించిన వైఖరి కవి ధ్వని వైభవానికొక ప్రతీక. మంచి తిండి, పచ్చిబతుకు శాంతమ్మ కేవలం భాషారమ్యతగల మామూలు కవితలు. "ధ్వనులెక్కువ లేకున్నా ధ్వని మంతమ్మ పద్యం, వ్యాకరణం బెడదలేదు" అనే సంప్రదాయ కవి తప్ప విసుర్లు హర్షణీయం కానివి.

"ఎవరేమన్నా అనుకున్నా కులానికి జై అదిచ్చే బలానికి జై" అని కులవ్యవస్థను వ్యంగ్యంగా తెగిడుతూ, పరిష్కారంగా 'బయోడేటా'ను రూపొందించిన కవి ప్రజ్ఞ అభినందనీయం. ఈ సంపుటిలో యిది ఉత్తమ కవిత ప్రాంతీయ కులమత భేదాల కతీతంగా సమతా మమతల సమాజపు కలల రూపును చూపుతున్న కవి చిత్తశుద్ధి ప్రాతః స్మరణీయం.

పీఠికలో కుందుర్తివారు చెప్పినట్లుగా చంద్రుపంత కవిత్వపు పీటు తమ కవితా కౌముదులతో యువకులకు మోదాన్ని, పెద్దల కామోదాన్ని కలిగిస్తూ వచన కవితా సామ్రాజ్యానికి సంరక్షకులుగా వుండగలిగిన భవిష్యత్ సూర్యాలుగల భావుకు లనటానికి సందేహించను. కనుకనె 'సినారె' వంటి లబ్ధప్రతిష్ఠులీ ఖండికలను చేపట్టి, వీటిని కృతార్థం చేశారు.

ది వి టి

[(మినీకవితా సంకలనం) పుటలు : 30 వెల : రు 1-00. సంకలనం : త్రిమూర్తులు, ప్రతులకు : కె. బాలరాజు (పి. ఒ) రావురూకుల, సిద్దిపేట (తాలూకా)]

విస్తారమైన కవితలను ఆస్వాదించి, ఆకళింపుకునే ఓర్పు, నేర్పులినాటి పాఠకుల కంతకంతకూ లోపిస్తోందని కాబోలు రచయితలు గూడ ఫ్లాష్‌లాంటి మినీకవితలతో మనుషుల మనసులకు మిరుమిట్లు గొల్పుతున్నారిప్పుడు. సంక్షిప్త పాదువు జీవితాలకు పర్యాయపదమైన ... మినీ కవితా సంకలనాలు కూడా మిగిలానే వుంటున్నాయి. మినీ కవిత సూక్తిప్రాయమా? కాదా అనేది రచయిత ప్రతిభనుబట్టి వుంటుంది కాని పరిమాణంబట్టి కాదని "వాక్యం రసాత్మకమ్ కావ్యమ్" అన్న పూర్వుల పలుకులను బట్టికూడ భావించుకోవచ్చు. దీనిలో అయిదుగురు వర్ధమాన రచయితలు తమ స్నేహతైలంతో యీ దివిటీని వెలిగించారు. హృదయ పీఠికపేరుతో పరిచయకర్తలు ఇవి మినీ కవితలు కావు భవితవ్యానికి సోపానాలు అంటున్నారు. ఈ కవుల భవితవ్యానికివి సోపానాలుగానే కనబడతాయి. రచయితలు భాషలో, భావనల్లో ఎంతో యెదగాల్సిన ఆవశ్యకత యెంతో వున్నట్లు ఈ కవితల గమనం గోచరిస్తుంది.

ఈ కవితలను ముద్రించిన వైఖరులలో, శీర్షికలుంచిన ధోరణులలో గమ్మత్తులున్నాయి. మరి మినీకవితలలో పాఠకుడు వాటికోసం చాలా సేపు ఆలోచించాల్సిన స్థితి కల్పించటం మినీకవితల లక్ష్యానికి విఘాతంకదా! "చేయి+చెయి మన వేదనకు ప్రతీకారం" అన్నప్పుడు గిలిగే సద్యస్ఫూర్తి అన్నిటిలో కలగాలి. "ప్రథమ కబళే మక్షికాపాతః" అన్నట్లుగా నందినిగారి మొదటి కవితాస్వరూపం యేమిటో అస్మదాదుల కంతుబట్టలేదు అంబుక్కల్లో, మనేచ్చి, యివి యే భాషపదాలో తెలిస్తే అర్థమయ్యేవేమో!

ఉన్నవాటిలో రాబందు ఆటబందు, వేమునిజం, నినాదాలు కొంత రసవంతంగా వున్నాయి. "ఆడా, మగా మేలుకలయిక. చీకటి పసూతి, ప్రతి అణువునుండి కాకిమూక సృష్టి. ఎండే మానవతా మోడుపై అనావృష్టి"—ఎంతో భావగర్భితంగావున్న కవిత: దివ్వెలు కవితలోని భావంకన్నా భాష రమణీయంగా వున్నది హ్యామ నిజం కవితలోని నిజం,చెప్పినతీరు చాలా కటువుగా, ఇన్ హ్యామ నిజంగా వున్నది.

విషపు చూపుల్లో అమృతం నింపమంటూ, విప్లవనావ తీరం మార్చి పయనిస్తుందనే సందేశాన్నిస్తున్న ఈ యువకుల ఆవేశం ఆలోచనకన్న మిన్న కావటంలో ఈ కవితల్లో ఆలోచనామృతం కొరవడింది రచనా వైఖరులలో మరింత స్థాయి సంపాదించవలసిన అవసరం యెక్కువగా వున్నది. అంతవరకు వీరుచేసే "డైక్సిన్" డ్రైగానే వుంటుంది. ఆ పనిచేసి, సమాజంలో సమతను సాధించాలనే వీరి 'వ్యక్తిని' మాత్రమే అభినందించాలి.

కాంతి రేఖలు - 2

[(యువభారతిలోని రచనల ద్వితీయ సంపుటి) సంకలనం : మన్నవ గిరిధరరావు, ఎం. ఏ., పుటలు : 128. మూల్యం : రు. 4-00. ప్రచురణ:— యువభారతి ఎడ్యుకేషనల్ సొసైటీ, కృష్ణానగర్, గుంటూరు. ఆం. ప్ర.]

"శీలేన శోభతే విద్యా" అన్నట్టి సల్లక్ష్యంతో యువతరానికి గుంటూరు యువభారతి వారందిస్తున్న యువభారతి పత్రికల్లోంచి యేర్చికూర్చిన విద్యావైజ్ఞానిక విషయాలనేకంతో నిండియున్న యీ పుస్తకం వారి ద్వితీయ ప్రచురణగా వెలుగులోకి వచ్చింది. చిరస్థాయిగల నైతిక విలువలనందించటంలో యిది అద్వితీయంగా వుంటుంది పిస్తుంది ప్రతి పాఠకునికీ.

"కాంతిరేఖలు కావ్యంకాదు; నాటకంకాదు; కథకాదు; నవల కాదు మరేమిటి? చైతన్యాన్ని ప్రసాదించే సుందర సువర్ణ సుప్రభాతం" అంటున్న కమనీయమైన కరుణశ్రీగారి కవితాశ్రీ యీ పుస్తకానికి పూవుకు తావిలా వుంది. మానసిక విషణ్ణతతో కర్తవ్య విమూఢులవుతున్న నేటి నాగరిక ప్రపంచానికి కనువిప్పు కలిగించే విజ్ఞాన జిజ్ఞాసాత్మకమైన యీ గ్రంథం అనటం సహజోక్తి అవుతుంది. ముఖ్యంగా మన విద్యాలయాలలో అవశ్య పఠనీయంగా వుంచాల్సిన అర్హతాధికారాలీ గ్రంథంలో లెక్కకు మిక్కిలిగా వున్నాయి.

ఇందులో వైజ్ఞానిక మనస్వి, విద్యావేత్త అయిన గిరిధర రావు గారితోపాటు సుప్రసిద్ధ రచయితలచే కూర్చబడిన అనేకాంశాలు నలుబదియైదు వరకూ వున్నాయి. పఠితల సౌకర్యంకోసం చివరగా వారి పరిచయాలతోపాటు విద్య, మాటా–మంతీ, చిన్నకథల పెద్ద సందేశం, ప్రాణంకంటె దేశం ముఖ్యం, చరిత్రనుండి గుణపాఠాలు, ఏంపరో మహనీయులు అనే విభాగాలుకూడ చేయబడ్డాయి. అనేకాంశాల్లో ఆస్వాదయోగ్యతకోసం కూర్చిన చిన్నకథలన్నీ ఎక్కువ మక్కువ గొలిపే రీతినవున్నాయి. ఈ వృత్తాంతాలు విశ్వజనీనమైన భారతీయ సంస్కృతికే పరిమితంకాక విదేశీయ విశిష్టతలను చాటి చెప్పే దృష్టాంతాలుగ వుండటంకూడ హర్షణీయంగావుంది. ఎడనెడ ప్రాచ్య, పాశ్చాత్య విపశ్చిద్వర్యుల ఉత్తమ నిర్వచనాలుత్తమ స్థాయిలో సంగ్రహింపబడ్డాయి. మచ్చుకు కొన్ని ఆస్వాదిద్దాం.

"పొగడ్త, స్త్రీలోలత – ఈ రెండూ వ్యక్తిని వలలోవేసే రెండు ఎరలు."

"దేశంయొక్క సర్వతోముఖ వికాసానికి విద్య."

"తేనెటీగ పుష్పంనుండి మధువును దొంగిలిస్తుంది; కాని ఆపువ్వును ఫలవంతంచేస్తుంది".

"జన్మనిచ్చిన తల్లిదండ్రులకూ, బాగా జీవించటం నేర్పిన ఉపాధ్యాయులకూ ఋణపడివున్నారు",

"విధేయురాలైన భార్య భర్తను ఆజ్ఞాపిస్తుంది" "ప్రేమ ఇస్తుందేకాని ఇమ్మని కోరదు" అయితే "కలకంఠి కంట కన్నీరొలికిన సిరియింట నిలువ నొల్లదు," "దొంగను దొంగే పట్టాలి" వంటి కాలదోషంపట్టిన నానుడులు నేటి హేతువాద జగత్తుకు నవ్వు.

చివరగా చెప్పబడిన 'చదివే పద్ధతి' అన్న వ్యాసం గ్రంథానికి మకుటాయమానంగావుండి ప్రతి విద్యార్థి పదేపదే చదువవలసిన పద్ధతి గలది. అసభ్య సాహిత్య, చలనచిత్ర ధోరణులు పెచ్చుమీరిన నేటి అజ్ఞాన తిమిరంలోకానికీ పుస్తకం సదాలోచనల ప్రేరకంగాను, సంసానుభూతుల సాధనంగాను సదా వుంటుందనటంలో విప్రతిపత్తి లేదు.

నిర్దుష్టంగా, నిర్దిష్టంగా ముద్రించి, ప్రచురింపబడ్డ కాంతిరేఖలు రెండవభాగం ప్రతి పూనిక, తూనిక గల పాఠకునికి ముచ్చటగా మ్రాడోదానికోసం వేచివుండే తీయని శిక్ష' నిస్తుంది. ఇంతటి ఉదాత్త రీతిలో గంథాన్ని వెలువరించిన రూపకర్తల ప్రయత్నాన్ని ప్రచురణ కర్తలను ప్రస్తుతిస్తాం.

— "సుచంద్ర"

వేదనాలహరి

[రచయిత: శ్రీ గొట్టిముక్కల కృష్ణమూర్తి. కౌను 16+4 పేజీలు. వెల రూ 2. ప్రతులకు: శ్రీ గొట్టిముక్కల కృష్ణమూర్తి. బురుజుపేట, గద్వాల, మహబూబ్‌నగరుజిల్లా, ఆంధ్రప్రదేశ్.]

'రాజకీయాలంటే నిస్స్వార్థ ప్రజాసేవ' అని అనుకునే రోజుల్లో రాజకీయాల్లో ప్రవేశించి, తమ సర్వస్వమూ కోల్పోయి, ఎన్నో కష్టాలుపడి, స్వాతంత్ర్యం లభించిన తర్వాత విస్మృత్యం చేయబడిన త్యాగమూర్తులలో రచయిత ఒకరు. అప్పట్లో ఊరూ, పేరూ లేని వారంతా ఇప్పుడు ఉన్నత పదవులకి వచ్చి, స్వార్థపరులైన తమ వారికే మేలు కలిగిస్తున్నారన్నది యీయన తెలిపిన నగ్న సత్యం.

"రత్నముల కిక్క యనుకొని రాజకీయ
సాగరమునందు దూకితి జాల్ముడనయి,
దరికిఁ జేరిచినారు ధీవరులు; కాని
బ్రతుకు తెరువేది! యంటి దుర్భావాని !!"

అనే పద్యం వీరి పరితాపాన్ని వెల్లడిస్తుంది.

ఇప్పుడు దేశంలో అన్ని రంగాల్లోనూ జరుగుతూఉన్న దురన్యాయాలూ, మోసాలూ, అవినీతులూ, స్వార్థ పరతలూ ఈయనకు ఎన్నో విధాల వేదనలను కలిగించాయి. వాటిని ఎవరికి తెలిపితే ఏమి లాభం? ఎవరు వింటారు? దీనిని తెలుసుకునే యీయన పరాశక్తి భగవతి కాత్యాయనికి మొర పెట్టుకుంటున్నారు.

సంస్థానాలు మహావైభవంగాఉండి కవులనూ, పండితులనూ పోషిస్తున్న కాలంలో గద్వాల సంస్థానాస్థాన కవుల్లో ప్రధానులైన శతావధాని గాడేపల్లి–వీరరాఘవశాస్త్రిగారికి ఈ రచయిత శిష్యులు, ఆయనవద్ద సంస్కృతాంధ్రాధ్యయనం చేసి, కవితాభ్యాసం గడించారు. తమకు స్ఫురించిన భావాలను సూటిగా తగిన పదాలతో చక్కని శైలిలో చెప్పగల సామర్థ్యం వీరికి ఉన్నది. ఈ ఖండకావ్యంలోని పద్యాలన్నిటిలోనూ అవి అడుగడుగునా ప్రత్యక్షమవుతూ ఉంటాయి. శైలి కొక ఉదాహరణం–

'అరయన్ సోదరరక్తమాంసచయ భు
క్త్యాయాసులౌ వారికే
ధర మాహేం దవదంబు లివేద. . . నీ
దాక్షిణ్యమే సర్వదా
శరణంబంను భజించు . . . న్
రక్షించుటల్ మాని; యి

క్ష్మరాన్ సాగిన దిక్కు మొక్కు గలదె
కాత్యాయనీ! మా కిలన్' (పుట 22)

ఇలాంటి పద్యాల్లో ఎక్కడో ఒకచోట తప్పులు కానవచ్చినా శైలిలో అవి కానరాకుండా తోసుకొని పోతాయి. 'ఈ నా వేదన లాలకింపు మికనేనిన్' అనే తొలిపద్యంలో కూడా యతి తప్పినా, కవిత్వధారలో అది కరిగిపోతుంది.

ప్రసిద్ధ విద్వాంసులు మల్లాది-సూర్యనారాయణమూర్తిగారు కవినీ, రచననూ పరిచయం చేశారు, గడియారం-రామకృష్ణశర్మగారు కావ్యాన్ని గురించీ, కవిని గురించి రెండు మాటల్లో చెప్పవలసినది చెప్పారు. కేశవపంతులు — నరసింహశాస్త్రిగారు చక్కని అభిప్రాయం ఇచ్చారు. రచయిత తమ 'నివేదనం'లో తన రచనను గురించీ, తన్ను గురించీ సవినయంగా విన్నవిస్తూ గ్రంథముద్రణకు కారకులయిన వారికి కృతజ్ఞతలను తెలియజేశారు.

ఇప్పుడు వస్తూవున్న ఖండకృతులలో ఇది మంచి స్థానాన్నే ఆక్రమించగలదని భావిస్తున్నాను.

"అంగీరస"

ఎనిమిది నాటికలు

[రచన : శ్రీ అంగర సూర్యారావు, రంగశాల ప్రచురణ, డెమ్మి 243 పేజీలు. వెల రూ. 10. ప్రతులకు - రంగశాల. 22-67-5 చోపుదారుగల్లీ, విశాఖపట్నం-530001.

ఈ నాటికలను రచించిన సూర్యారావుగారు తెలుగు, ఇంగ్లీషు సాహిత్యాలలో వివిధ ప్రక్రియలు అధ్యయనం చేసి, మంచి అనుభవం గడించారు. నవలకంటెను, కథకంటెను నాటికా, నాటకాలే ప్రజా హృదయాలలో బాగుగా హత్తుకుంటాయనే నమ్మకం ఈయనది. అందువల్ల నాటకకళలో ఎంతో కృషిచేసి, స్వయంగా రచనలు సాగించి వాటిని ప్రదర్శించి కృతకృత్యులైనారు. ఈయన యింతవరకూ ఆరు నాటకాలు, ముప్పయి అయిదింటికి పైగా నాటికలూ వ్రాశారట! రంగశాల అనే నాటక సమాజం స్థాపించి, దానికి అధ్యక్షులయి నాటక ప్రదర్శనకు బహువిధాల పాటుపడుతున్నారు. వీరి రచనలు ప్రసిద్ధాలయిన పత్రికలలో ప్రకటితాలయినవి. ఆంధ్రదేశంలోనూ, ఇతరతా పలుచోట్ల ప్రదర్శించబడి ప్రేక్షకుల మన్ననల నందు కొన్నవి కొన్ని గ్రంథరూపంలో వచ్చాయి.

వీరి రచనలలో చాలావరకూ సాంఘికాలే. కొన్నింటిలో చరిత్రాంశాలు ఉన్నా, వాటిలోనూ స్వాతంత్ర్యమే అధికంగా కానవస్తుంది. పురిపండావారు చెప్పినట్లు 'నిశితమైన వ్యంగ్యం ప్రయోగించి, ఎదుటివాణ్ణి చకితపరచడమూ, సున్నితమైన హాస్యంతో నవ్వించడమూ, తప్పుచేసి తప్పుకునే తగుమనిషిని నిలువునా నిలదీయడమూ, వీరి రచనల్లో బాగా కనిపిస్తాయి. జనసామాన్యంలో ఉండే పరప్రతారణ, వంకుచితబుద్ధి స్వార్థపరతా స్పష్టంగా గోచరిస్తాయి.

ఈ సంపుటంలోని ఎనిమిది నాటికలలోనూ ఒక్క 'తాంతియా తోపే' తప్ప తక్కినవన్నీ సాంఘిక నాటికలు. అది మాత్రం సిపాయీల పితూరీనాటి చరిత్రకు సంబంధించినది.

మొదటి నాటిక 'ఇల్లు కూలింది'లో ఆఫీసులోని గుమాస్తాలు అమాయకులైన పల్లెటూరి బడిపంతుళ్ళను ఎలా బాధ పెడుతున్నదీ, లంచంతిని ప్రయివేటు స్కూళ్ళ మానేజరులతో ఎలా లాలోచీ పడుతున్నదీ ప్రదర్శించబడింది. ఉపాధ్యాయుల పాత్ర చిత్రణలో స్వభావంకంటె కొంత అతిశయంగా వర్ణన ఉన్నదేమో అని అనిపిస్తుంది.

'స్త్రీలకు ప్రత్యేకం' అనే రెండో నాటికలో స్త్రీలకు పురుషులపై ఎలాటి అక్కసు ఉన్నదీ. వారు పురుషులను ఎంత హీనంగా చూస్తున్నదీ బాగా కనబడుతుంది. ఇది ఎంతో వినోదాన్ని కలిగిస్తుంది.

'రాత్రించరులు' అనే తృతీయనాటికలో రాత్రి ఒక సత్రంలో చేరిన వేరు వేరు వ్యక్తుల స్వభావాలు కళ్ళకు కట్టినట్లు ఉన్నాయి. కొందరువ్యక్తుల ప్రవర్తన నిజంగా రాత్రించరులదే అంటే రాక్షసులదే అనిపిస్తుంది. ఇతరులను మోసంచేసే ప్లానులో మగవారికి వనితలు ఏమాత్రం తీసిపోరని తారపాత్ర బోధిస్తుంది.

"ఎవరో పిలిచారు"అనే నాలుగోదానిలో రఘుపతి దౌర్జన్య ప్రవర్తన, యమున తొందరపాటు,బలహీనత, చంద్రయ్య సేవకధర్మం పరమావధిని చెందినట్లు ప్రదర్శింపబడింది.చివరకు ఇదంతా పాడు కల అని ఒక్కమాటలో విచిత్రంగా తేల్చివేశారు సూర్యారావుగారు.

'నాగరికులు'అనే అయిదో నాటికలో ఇంటిని వాటాలు వేసుకుని అందులోనే ఉంటూ పరస్పరం విరోధిస్తున్న సోదరులు సింహాచలం నరసయ్యల కలహం,అద్దెయింటికోసం వచ్చిన రెండు పార్టీల దగ్గర అడ్వాన్సులు తీసుకుని వాళ్ళు పెట్టే చిక్కులు, అద్దెకు వచ్చిన వాళ్ళ ఆందోళన, శానిటరీ ఇన్‌స్పెక్టర్ను చూచి పోలీసు ఇన్‌స్పెక్టరనే భ్రాంతీ బాగా చూపబడ్డాయి. సంభాషణ చమత్కృతి విస్పష్టంగా కానవస్తుంది. అద్దె కొంపల గొడవ చక్కగా చిత్రించబడింది.

తర్వాతి నాటిక 'తాంతియాతోపె'లో తాంతియాతోపె అనే విప్లవ వీరుణ్ణి మోసగించి మేజర్ రాక్‌కు అప్పగించిన సర్దార్ మానసింగు ద్రోహం వెల్లడించబడింది. మేజర్ కంటె అతని కింద పని చేస్తున్న సోల్జర్ రాబర్ట్సే మంచి తెలివి తేటలు కలిగి ఉన్నట్లు కానవస్తుంది. అది ఆ పాత్రకు లోపంగానే తోస్తుంది.

'చిత్రవధ'అనే ఆ తర్వాతి నాటికలో సరోజను వివాహమాడ దానికయి చంద్రం చేసిన మోసాలూ రామ్మూర్తి ధనకాంక్షా, రాజా చేసిన తంత్రం చక్కగా అమరి నాటకప్రదర్శనను రసవంతంగా మార్చాయి.

చివరి 'ఒక గంట సంసారం'లో అద్దెకొంప సంపాదించడానికి సాహెరావు ఎలాటి ఎత్తులువేసి శివరామయ్యను బుట్టలోవేసి తన మిత్రుడు కామరాజుకు యిల్లు సంపాదించిపెట్టినదీ, అందుకై నటి రాజేశ్వరి ఏవిధంగా కామరాజు భార్యగా నటించినదీ ఇంపుగా ప్రద

ర్శించబడింది. ఈ అర్థ కొంపల పంగతి 'స్త్రీలకు ప్రత్యేకం'తో సహా మూడునాటికలలో ఉండడంవల్ల వీటినిగురించి రచయిత ఆసక్తి వ్యక్తమవుతున్నది. వెనుక ఎప్పుడో వేసుజాక్కా గ్రంథమాలలో దేవరాజు-వెంకట కృష్ణారావుగారు వ్రాసిప్రకటించిన డిటెక్టివ్ నవల 'వాడీ పీడు, నేనే, కాయూరాయి'లను రచయిత 'చి లవధ'లో రాజాహిత మూలంగా మనకు జ్ఞప్తికి తెస్తున్నారు (పుట197) ఇది కృష్ణారావుగారిపట్ల కృతజ్ఞత చూపినట్లు తోస్తున్నది.

ఈ పుస్తకంలోని ఎనిమిది నాటికలూ ఎన్నదగినవి. వీటిని ప్రదర్శించినపుడు సామాజికులకు నవ్వుతో పాటు ఆనందమూ కలుగుతుంది. వీటికి మంచి ప్రచారం కలగగలదని నా ఆశ.

కళాప్రపూర్ణ పురిపండా-అప్పలస్వామిగారి 'పీఠిక' నాటకాలను గురించిన పెక్కు విషయాలనూ, రచయిత విశిష్టతనూ వివరిస్తూ ఈ గ్రంథానికి విలువను ఇనుమడిస్తున్నది.

—శ్రీ బులుసు వెంకటరమణయ్య

కవితా లత

[అంతర్జాతీయ మహిళా సంవత్సర సందర్భంగా యువభారతి వనితా విభాగం జరిపిన పోటీలో ఎన్నికైన కవితల సంపుటి; ఫూల్స్ క్యాప్ 1/8-32 పేరటలు; వెల రు. 1/- యువభారతి కార్యాలయము, ఆంధ్ర సారస్వత భవనములు, తిలక్‌రోడ్, హైదరాబాదు 500 001.]

కవయిత్రులు వ్రాసిన వాటిలో ఆణిముత్యాలను ఏరి ప్రచురించిన గేయ-వచన రచనల సంపుటి ఇది. పుస్తకం చాలా చిన్నది కాని గుణాన చాలా గొప్పది. డాక్టర్ జి. వి. సుబ్రహ్మణ్యం—రసయిత్రులేగాని కవయిత్రులు తక్కువ అంటారు. మగవారి తప్పెటగుళ్ళకరాళ్ళలో ఈ గిప్పెడు మణులు చాలవా ఏమి? చదువరికి ఇవి కొంత హాయిని ఇస్తున్నవి. వీరే—"పుష్పలత"తో కవిత్వ స్వరూపాన్ని, నిజ ఆచార్యత్వం మెరసేటట్లు వివరించినారు.

వనితా మణులకే గదా దోహద క్రియలు చేయగలిగిన శక్తి ఉండేది? కాబట్టే ఈ లత వారి చేతిలాకులు పేలనే (కాలితన్నులు లేకుండానే) ప్రఫుల్ల ధవళ సురభిళ సుమాలను పూచినది:- (స్వరాజ్యపు రైలుబండి, వంగలరుక్మిణి) రైలుపట్ల పలుపురి తలలో పుట్టిన భావ వైవిధ్యం చెప్పి "అత్తవారిలా సాధిస్తారు." అనడంలో అనుకోకుండానే తన స్త్రీత్వాన్ని బయటబెట్టుతున్నది. ఇట్లనే ఇందులోని ప్రతి శీర్షికలో ఆడుదనాన్ని హృదయాల నుండి పిండి గందపు గిన్నెలలో పట్టుతున్నారు. (స్త్రీ, ఇంద్రగంటి జానకీబాల)— "నువ్వు మరో అయ్య కోసం పుట్టినప్పుడు...అమ్మ, చాటుచాటుగా కళ్ళు తుడుచుకుంటే" ఈ జాలిబండె మగవాడిని తెచ్చిపెట్టుకొన్నట్లుంటుంది. "అమ్మాయీ, ఎద జాగ్రత్త, పయ్యెద జాగ్రత్త" స్త్రీజాతి మానం కాపాడుకొనేదానికి హూనా. తిక్కన స్త్రీపర్వంలో—"మగవారిని చిత్రంలో చూడగానే పైట సవరించుకొనే రాణివాసపు స్త్రీలు ఇప్పుడు హాలి కలనులో ఒళ్ళు తెలియకుండా విలపిస్తున్నారు-" అంటాడు. ఇలా ఈ రచయిత "మనువు జాగ్రత్త, మనసుడ జాగ్రత్త" అనడం మునిపత్నుల హిత వాక్యంగా ఉన్నది. పెండ్లిలో తల్లి సన్నికలరాయి తొక్కించి కూతురుకు చెప్పేమాటలు యిట్టివే.

(అర్తగీతం-దుర్గాదేవి) భావం భాష భాసించేటట్లు "కన్నీళ్ళను పిండి ఆరవేసిన బతుకు వస్త్రం" అంటున్నది. Life is a bundle of fears అన్నారు—వివేకానందస్వాములవారు. (ఆకాంక్ష—దుర్గాదేవి) "నెలరాయని దరహాసపు తెలివెన్నెలజాలులో కల్హారమునై" అన్న కోరికలు నెలరాయని వలెనే చల్లదనమును "భారతీదేవి చరణ మంజీరమునై మంజుల మోహనసరళి' కావాలనుకోవడం ఎంతటి సహజన్యాదుల మనోజ్ఞ వనితా జనకాంక్ష! (డియర్ కృష్ణా - గురజాడ సత్యకుమారి) "బాధలకు మడుగు లొత్తారే"—మడుగులు ఉలికి చలువ చేసిన శుభ్ర వస్త్రము, ఇవి వేసి నడిపించి ఎత్తి మరల ముందు పరచి పెద్దలను పేరంటాళ్ళను నడిపిస్తారు, కాబట్టి ఇది ఎత్తడంగాని త్రొక్కడంకాదు— "గోరుముద్దలు తినిపించలేరు"-బొటన వ్రేలితో ఎత్తి, చిన్నబిడ్డలకు తినిపించే చిన్న-ముద్దలు-అన్నప్పుడు ఈ అమ్మ ఆ యశోద అవుతున్నది. "ఇప్పుడు ఏవయ్యా నీ గారడీలు?" అని నిందాస్తుతి చేస్తున్నది. ఈ వ్రాతకత్తెచే పౌఢ వణితి (గుండె నూర్పిడి రాజపుష్ప) ఇందు ఎక్కువ ఇంగ్లీషు ముక్కలు; ఎందుకో?

ప్రతి ఖండికలో స్త్రీత్వం, దానికి అనువైన భాష రసవత్తరంగా కుదిరి ఉన్నవి; అయినా మానవతా ప్రర్శ కలిగి ఉండడం చేత సర్వజన రంజకం కావడమే వీటి గుణ విశేషం. (సమాజానికి దర్పణం-శాంతి) "అచ్ఛాదనలేని వక్షోభాగం ఆమె జీవితానికి అద్దంలా ఉన్నది" ఇవి చిన్నమాటలే అయినా బారెడు- వ్యాఖ్యానం చెప్పకోవచ్చు. ఆ వక్షోజాలు కాఠిన్యముక్తములూ, [illegible]ముక్తములూ అని ఆమె శీలాన్ని బయట పెట్టగలిగి, వాటి [illegible] బెల్లించిన సంఘాన్ని విమర్శించే కళాపైపుణ్యం గల వ్యక్తి. 'అకలి వేసిన ముసుగులో ఎప్పుడూ చూడలేని ఆమె సగం చెడి జాషువంతను ఎంతో అప్యాయంగా తింటోంది" అన్నవి - ఆకలి ఆకలిఅన్నను లోపింపచేయువన్న దారుణ సత్యాన్ని చెపుతున్నవి. [ఈ "తింటోంది"

వర్తమానమో, భవిష్యత్తో తెలియక మా ప్రాంతం వారిని కొంత తికమక పెడుతుంది] ఇందు ఆ పేరాలు దైన్యపు ముద్దగా మన కండ్ల ఎదుట నిలబడుతున్నది. ఈ శీర్షికలు అన్నిటిలో నుడికారపు సొంపు, ప్రాణము కదులు తున్నవని, పిష్టపేషణమైనా చెప్పవలసి వస్తున్నది. (మార్పుకో నీ మార్గం–సుమిత్రాదేవి) "పగలంతా నిద తోటి (తోటి గాదు తోడి) స్నేహం చేస్తావెందుకు?" "గొంతెమ్మ కోరికలను కొడుకు కొంకు కోరుతావు" అని, మాతృహృదయాన్ని చవిచూపుతూ "కాలం ప్రవాహం నీకై ఆగిపోదు" అని తత్త్వోపదేశ చేస్తున్నది– ఈ పరిణత మనస్సు.

(ఊహల ఉయ్యలు–విజయలక్ష్మి) నిజం, నీ ఊహలే నీకు ఉయ్యలు; మంచి పదబంధం! "తమస్సు తనపైట చెరుగుతో ఉషస్సును దాచిపెట్టి"– ఎంతటి నోరూరించే నుడికారం! మగ మహాకవికి ఈ పైట సహజంగా నోటనుండి బయటకు రాని మాట; ఒక వేళ యిట్లాటివి చెప్పినా అనుభూతిలో మగ నర్సు బిడ్డకు పాలు త్రాగించినట్లుంటుంది.

చదివిన ఆనంద తన్మయతలో యీ పాకెట్ బుక్కులో చాలా ఉదాహరించిరా రసహృదయులు మన్నిస్తారని నాకు బాగాతెలుసు ఇట్టివి ఛందోబద్ధమై ఉండే సూక్తి రత్నాలు కావా? –ఏంచేస్తాం? ఇది గద్యపు పిలుపు వెర్రి కాలంగదా! ఇట్లాటి చిన్న పుస్తకాలు విసుగు లేకుండా పఠనాసక్తిని కలిగిస్తవి. ఇవి రుములారే ఏటి చలమలు.

శ్రీ మరుపూరు కోదండరామరెడ్డి

శ్రీ శంకర విజయగాథ (మొదటి భాగము)

[ప్రకాశకులు : శ్రీ శంకరకృప నెం. 11, హనుమాన్ కోవిలవీధి, మద్రాసు-600033. వెల : 3–00.]

సుమారు 1200 సంవత్సరముల కితం భారతదేశములో అజ్ఞానము, అనాచారము, అవిశ్వాసము ప్రబలినపుడు శివావతారులై జన్మించిన మహనీయులు ఆదిశంకరులు. దేశమంతటా పర్యటించి అనన్య మేధాపటిమతో వివిధ మతీయులతో వాదమొనర్చి అద్వైత సిద్ధాంత ప్రచారమునకై చతురామ్నాయ పీఠములను నెలకొల్పిన జగద్గురువులు శ్రీ శంకరులు.

ఆదిశంకరుల జీవిత చరిత్రను పలువురు పలురీతులలో రచించినారు. కాని ప్రస్తుతం శ్రీ శృంగేరి జగద్గురు చరణుల ఆదేశము మేరకు ప్రచురింపిన 'శ్రీ శంకర విజయగాథ' అపూర్వమైనది.

శృంగేరి మఠాధిపతుల ఆశీస్సులతో వెలువడుచున్న శ్రీ శంకరకృప మాసపత్రికలో "శ్రీ శంకర విజయగాథ" ధారావాహికంగా వెలువడుచున్నది. ఇదివరలో ప్రకటితమైన భాగములనుండి నలువది చిత్రములతో శంకరుల జీవిత కథను ప్రచురించుట అభినందనీయము.

ఈ పుస్తకములోని చిత్రములను విఖ్యాత చిత్రకారులు శ్రీ తేజోమూర్తుల కేశవరావుగారు అత్యంత మనోజ్ఞంగా చిత్రించినారు. బొమ్మలతోపాటు శంకరుల జీవిత కథను సరళమైన శైలిలో రచించినారు. ఈ రచన చిన్న పిల్లలను మిక్కిలిగా అలరింపగలదు.

బాలశంకరుల భక్తితత్పరత, తల్లి అనుమతితో సన్యాసము స్వీకరించుట, బీద యిల్లాలిని కనికరించి కనకామలక వర్షము కురిపించుట, తల్లి కోరిక మేరకు పూర్ణానదీ ప్రవాహమును తమ యింటి చెంతకు మళ్ళింపచేయుట మొ॥ శంకరుల జీవిత మందలి తొలిదశలోని ఘట్టములు చాల చక్కగా చిత్రింపబడినవి. శంకర, గోవింద భగవత్పాదుల సమాగమము, కాశిలో చండాలునికి శంకరునికి జరిగిన సంవాదము, చండాలరూపంలోవున్న పరమేశ్వరుడు ప్రత్యక్షమై వేదమతోద్ధరణ కావించమని ఆదేశించుట మొదలగు ఘట్టములు రమ్యముగా చిత్రింపబడినవి. పద్మపాదుల వృత్తాంతము, వ్యాసభగవానుల ప్రత్యక్షము, కుమారిల భట్టుతో సంవాదము మొదలగు ఘట్టము లున్నవి.

మండన మిశ్రునితో సంవాదము, ఉభయ భారతి వృత్తాంతము, శంకరుల కామశాస్త్ర రహస్యముల నాకళించుకొని ఉభయ భారతి మన్నన లందుకొన్న తీరు అద్భుతంగా సయుక్తికంగా చిత్రింపబడినవి. శంకరులు వివిధ క్షేత్రములను దర్శించి శ్రీశైలములో కాపాలికులతోను, పాశుపతులతోను వాదించుట, పద్మపాదులు నృసింహావేశులై కాపాలికుని సంహరించుట, నృసింహస్వామి ప్రసన్నుడౌట ఘట్టముతో ఈ పుస్తకముయొక్క ప్రథమ భాగము పూర్తిచేసినారు.

శ్రీ భగవత్పాదుల చరిత్రను అత్యంతాకర్షణీయముగా అందజేసిన శ్రీ శంకరకృప సంపాదకులు, శ్రీ తుమ్మలపల్లి రామలింగేశ్వరరావుగారు, శ్రీ బోడపాటి రాజన్నగారు అభినందనీయులు.

బాలబాలికలేకాక భారతీయ సంస్కృతియందు జాతీయత యందు గౌరవమున్న వారందరూ తప్పక చదవవలసిన పుస్తకమిది.

—శ్రీ జానమద్ది హనుమచ్ఛాస్త్రి

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor S. Radhakrishna, Vijayawada. Phones : 75667 & 75226.